సత్యమేవ జయతే

# సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 143

మంగళవారం 7-2-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



**ఆసియా అథ్లెటిక్స్‌కు జ్యోతి**

25 మందితో కూడిన భారత జట్టులో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ - 12లో



**సెన్సెక్స్ ర్యాలీకి బ్రేక్**

335 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్ నిఫ్టీకి 89 పాయింట్లు నష్టం - 13లో




**'అదానీ'పై అదే దుమారం**

అదానీ గ్రూప్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై జేపీసీతో దర్యాప్తు చేయించాలన్న ప్రతిపక్షాల ఆందోళనలతో ఉభయసభలు స్తంభించాయి.

వివరాలు 6లో ▸



**ఐదుగురు జడ్జీలతో ప్రమాణం**

సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ కొత్తగా నియమితులైన ఐదుగురు జడ్జీలతో ప్రమాణం చేయించారు. దీంతో జడ్జీల సంఖ్య 32కు చేరింది.

వివరాలు 6లో ▸



**వాట్సాప్‌తో ఫుడ్ ఆర్డర్ చేయెచ్చు**

వాట్సాప్ నంబర్‌తో కావాల్సిన ఆహారపదార్థాలను ఆర్డర్ చేసే సౌకర్యం రైలు ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది.

వివరాలు 6లో ▸



**నవరాగాల తేజం**

ముచ్చటగా మూడోసారి గ్రామీ అవార్డు గెలుచుకున్న.. బెంగళూరుకు చెందిన రిక్కీ కేజ్‌పై ప్రత్యేక కథనం..

వివరాలు 6లో ▸

## న్యూస్‌రీల్

### అమ్మ పాలకూ బ్యాంక్



తల్లి పాలను సైతం ఇక నుంచి దానం చేయొచ్చు. తల్లి పాలకు దూరమైన బిడ్డలను ఆదుకోవచ్చు. రక్తదానం మాదిరిగా అమ్మ పాలను దానంగా స్వీకరించి నిల్వ చేసేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో 'మదర్ మిల్క్ బ్యాంక్' సిద్ధమవుతోంది. ఈ నెల 13న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వివరాలు 2 ▸

### ఏయూ విద్యార్థినికి రూ.84.5 లక్షల వేతనం



ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థిని రేపాక ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో అట్లాషియన్ సంస్థలో ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్న ఆమెను వీసీ ప్రసాదరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వివరాలు 14 ▸

### బాధితుడికి టీడీపీ నేత బెదిరింపులు




'యువగళం మనకోసం' వాట్సాప్ గ్రూప్ ద్వారా లోన్ పేరుతో డబ్బులు కాజేసిన టీడీపీ నేత మనోహర్‌చౌదరి.. తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడిపై బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు.

వివరాలు 3 ▸



భూకంపం ధాటికి సిరియాలోని బెస్నియాలో నేలమట్టమైన భవనాలు

# భూ విలయం..

## వణికిన టర్కీ, సిరియా సరిహద్దులు

## 2,500 మందికి పైగా దుర్మరణం

- 7.8 తీవ్రతతో కంపించిన భూమి
- తెల్లవారుజాము కావడంతో భారీగా నష్టం
- కొద్ది గంటల్లోనే 7.6తో మరో భూకంపం
- తర్వాత పదుల్లో శక్తిమంతమైన ప్రకంపనలు
- లెబనాన్ నుంచి ఈజిప్టు దాకా ప్రభావం
- టర్కీలో 1,600, సిరియాలో 900కుపైగా మరణాలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- భారత్ ప్రధాని మోదీ దిగ్భ్రాంతి.. దేశం తరఫున ఆపన్న హస్తం.. ఎన్డీఆర్ఎఫ్, వైద్య బృందాలు తరలింపు

6లో

కొళ్ల కింద నేల కంపించిపోయింది. నిలువెత్తు భవనాలు మట్టిదిబ్బల్లా మారిపోయాయి. ఎక్కడ చూసినా శిథిలాలు.. వాటి కింద చిక్కుకున్న బాధితుల ఆర్తనాదాలు.. వరుస భూప్రకంపనలతో టర్కీ, సిరియా చిగురుటాకుల్లా వణికిపోయాయి. సోమవారం తెల్లవారుజామున 7.8 తీవ్రతతో విరుచుకుపడ్డ భారీ భూకంపం ఇరు దేశాల్లో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టానికి దారితీసింది. తర్వాత కొద్ది గంటల్లోనే 7.6 తీవ్రతతో ఒకసారి, అనంతరం పదుల కొద్దీ శక్తిమంతమైన ప్రకంపనలు మధ్యప్రాచ్యాన్ని వణికించాయి. టర్కీలో 1,600 మంది, సిరియాలో 900 మందికిపైగా దుర్మరణం పాలయ్యారు.



సిరియాలోని జాండరీస్ పట్టణంలో తీవ్రంగా గాయపడిన చిన్నారిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

# శరవేగంగా.. పారదర్శకంగా

## ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వ విధానం ఇదీ

- ఆరోపణలకు ఆస్కారం లేకుండా సజావుగా ప్రక్రియ
- రెండు వారాల్లోనే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలు
- ఇక మెయిన్స్ నిర్వహణకు సన్నద్ధం
- అదే రీతిలోఎస్సై పోస్టుల భర్తీ ప్రక్రియ.. పారదర్శకంగా 1.35 లక్షల గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల భర్తీ
- అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే సమర్థత చాటిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం





- వైద్య, ఆరోగ్య శాఖలో ఏకంగా 48 వేలకుపైగా పోస్టుల భర్తీ
- టీడీపీ హయాంలో అంతా అక్రమాలు.. న్యాయ పోరాటాలే

2లో

# ఆలయాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులు

- దేవదాయ శాఖ పరిధిలో 610 దేవాలయాల్లో అవకాశం
- ఆర్డినెన్స్ జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- బీసీలకిచ్చిన మరో హామీని నిలబెట్టుకున్న సీఎం జగన్



సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాల్లో నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ద్వారా ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. అనాదిగా ఆలయాల వ్యవస్థలో అర్చకులతో పాటు నాయీ బ్రాహ్మణులకు విడదీయరాని

మిగతా 2వ పేజీలో ▸

# విశాఖలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం

- ఇటీవలే విశాఖలో పలు ప్రాంతాలు సందర్శించిన ఆర్‌బీఐ బృందం
- 500 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు మొదలు పెట్టేందుకు సన్నాహాలు



సాక్షి, విశాఖపట్నం: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తన ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలన్నీ హైదరాబాద్‌లోని రిజర్వ్ బ్యాంక్ కార్యాలయం నుంచే కొనసాగించింది. రాష్ట్ర విభజన అనంతరం కూడా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు సంబంధించిన లావాదేవీలన్నీ అక్కడి నుంచే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ నిర్వహించే సమావేశాలకు హైదరాబాద్ నుంచే అధికారులు విజయవాడకు వస్తున్నారు. దీనివల్ల పరిపాలన సౌలభ్యం కష్టసాధ్యమవుతుందని.. రాష్ట్రంలోనే ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఆర్‌బీఐ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో విశాఖలో ఆర్‌బీఐ బృందం ఇటీవల పర్యటించింది. జిల్లా అధికారులతో చర్చించి పలు భవనాలను పరిశీలించింది. 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు వేగవంతం చేసింది.

### నిర్మాణం పూర్తయిన భవనం వైపే మొగ్గు..

ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు దాదాపు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న భవనం అవసరమని ఆర్‌బీఐ భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ బృందం జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జునతో సంప్రదింపులు జరిపింది. 500 మంది ఉద్యోగులతో ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వానికి ఇప్పటికే వివరించినట్లు ఆర్‌బీఐ ప్రతినిధులు తెలిపారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నంలో మధురవాడ, రుషికొండ, ఆరిలోవ, కొమ్మాది, భీమిలి, హనుమంతువాక, కైలాసగిరి, సాగర్‌నగర్ పరిధిలోని పలు భవనాల్ని పరిశీలించారు. కార్యాలయ నిర్మాణానికి ఏపీఐఐసీకి చెందిన స్థలం సిద్ధంగా ఉందని జిల్లా అధికార యంత్రాంగం సూచించింది. అయితే వెంటనే కార్యకలాపాలు ప్రారంభించడానికి నిర్మాణం పూర్తయిన భవనమైతే అనుకూలంగా ఉంటుందని ఆర్‌బీఐ అధికారులు తెలిపారు. దీంతో భవనాల పరిశీలనలో కొందరు ఉద్యోగులు నిమగ్నమైనట్లు కలెక్టరేట్ వర్గాలు వెల్లడించాయి. తాము అనుకున్న విధంగా భవనం లభిస్తే నెల వ్యవధిలోపే కార్యకలాపాలు ప్రారంభిస్తామని ఆర్‌బీఐ అధికారులు ప్రభుత్వానికి తెలిపారు.



**చెస్ క్రీడాకారిణి మీనాక్షికి సీఎం అభినందన**

2లో

కెరీర్‌ను కొనసాగించేందుకు కార్పస్‌గా రూ.కోటి నిధిని ప్రకటించిన సీఎం జగన్



**మహిళల భద్రత దిశగా 'ఆశా' యాత్ర**

- ప్రముఖ పర్వతారోహకురాలు ఆశ మాలవీయ
- దేశానికే ఏపీ ఆదర్శంగా నిలుస్తోందని ప్రశంస

11లో

## ఇదీ ఇ-ఫార్ములా..

- రేసింగ్ పోటీలకు సిద్ధమైన హైదరాబాద్
- ఈ నెల 11న ప్రధాన రేసు

12లో





## రూ.2.90 లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్

- రైతు సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి రూ.60 వేల కోట్లు
- రుణమాఫీకి రూ.6,380 కోట్లు.. రైతుబంధుకు రూ.15,075 కోట్లు
- శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి హరీష్ రావు

10లో

### ఇదంజాతక్




వీళ్లతో ఓటేయించుకోవాలంటే మనకు ఎన్ని రూ.కోట్లు కావాలో?

# కోవిడ్‌లో దున్నేసింది!



## దేశవ్యాప్తంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో 20.75% వృద్ధి

- 2020-21లో రూ.3.05 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి
- తొలిసారిగా నాలుగో స్థానం సాధించిన ఆంధ్రప్రదేశ్
- ఏపీ సహా ఏడు రాష్ట్రాల నుంచే 88 శాతం ఎగుమతులు
- మన ఉత్పత్తులకు అతిపెద్ద మార్కెట్లు అమెరికా, చైనా, బంగ్లాదేశ్, వియత్నాం, ఇరాన్, మలేషియా

**నాబార్డు అధ్యయన నివేదికలో వెల్లడి**

సాక్షి, అమరావతి: కోవిడ్ మహమ్మారిని అధిగమించి మరీ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారీ వృద్ధి నమోదైంది. దేశవ్యాప్తంగా 2019–20తో పోల్చితే 2020–21లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో భారీగా 20.75 శాతం మేర వృద్ధి నమోదైనట్లు నాబార్డు నివేదిక వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ గతంలో ఎన్నడూ లేనివిధంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో దేశంలో నాలుగో స్థానంలో నిలిచిందని తెలిపింది. ఏపీ నుంచి 2020–21లో భారీగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి జరిగినట్లు పేర్కొంది. గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ తరువాత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏపీ నాలుగో స్థానంలో నిలిచింది. కోవిడ్ విసిరిన సవాళ్ల మధ్య కూడా 2020–21లో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో అత్యధిక వృద్ధి నమోదు కావటాన్ని నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. 2019–20లో దేశంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు

మిగతా 2వ పేజీలో ▸

### జేఈఈ మెయిన్ తొలిసెషన్ ఫలితాలు నేడు!



- పేపర్–1కి 8.6 లక్షల మంది, పేపర్–2కి 46 వేలమంది హాజరు
- తొలిసారి జేఈఈ మెయిన్‌కు 95 శాతం మంది హాజరు
- జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు జరిగిన పరీక్షలు
- మెయిన్ 2వ సెషన్ రిజిస్ట్రేషన్లకు నేటినుంచి అవకాశం
- మార్చి 7 వరకు గడువు
- 2వ సెషన్ పరీక్షలు ఏప్రిల్ 6 నుంచి 12 వరకు
- రెండోవిడత అనంతరం మెయిన్ తుది ఫలితాలు, ర్యాంకులు

10లో

## క్లుప్తంగా...

### చెస్ క్రీడాకారిణి మీనాక్షికి సీఎం అభినందన

**కెరీర్‌ను కొనసాగించేందుకు కార్పస్‌గా రూ.కోటి నిధిని ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్**

**సాక్షి, అమరావతి:** అంతర్జాతీయ స్థాయిలో ఏపీ పేరు ప్రఖ్యాతలు నిలబెట్టేలా విశాఖకు చెందిన చెస్ క్రీడాకారిణి కోలగట్ల మీనాక్షి మరింతగా రాణించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆకాంక్షించారు. జాతీయ, అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లలో పలు పతకాలు సాధించిన మీనాక్షి.. ఇటీవల ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్–2023ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌ను మీనాక్షి, ఆమె తల్లిదండ్రులు మధు, అపర్ణ కలిశారు. ఈ సందర్భంగా మీనాక్షిని ముఖ్యమంత్రి అభినందించారు. క్రీడాకారులకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే విశాఖలో వెయ్యి చదరపు గజాల ఇంటి స్థలం, చెస్‌లో కెరీర్‌ను కొనసాగించేందుకు కార్పస్‌గా రూ.కోటి నిధిని ప్రకటించారు.

### పలు కంపెనీల ప్రతిపాదనలపై ఎస్‌ఐపీసీ సమీక్ష



**సాక్షి, అమరావతి:** పలు పరిశ్రమల కంపెనీల ప్రతిపాదనలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ (ఎస్‌ఐపీసీ) సమీక్షించింది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ కమిటీ సమావేశం సోమవారం రాష్ట్ర సచివాలయంలోని సీఎస్ సమావేశ మందిరంలో జరిగింది. ప్రధానంగా రాష్ట్రంలో పరిశ్రమలు, కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన వివిధ కంపెనీలకు ప్రభుత్వపరంగా సమకూర్చాల్సిన భూములు, వివిధ రాయితీలు, ఇతర ప్రోత్సాహకాల కల్పన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా పరిశ్రమల శాఖలో ప్రత్యేక ప్యాకేజీ ఇన్సెంటివ్‌లకు సంబంధించి ఎనిమిది అజెండా అంశాలతో పాటు విధాన నిర్ణయాలకు చెందిన అంశాలపైనా కమిటీ సమీక్షించింది. అలాగే ఐటి అండ్ సి శాఖకు సంబంధించి ఎనిమిది అజెండా అంశాలు, ఇంధన శాఖకు సంబంధించిన అజెండా అంశాలపైన సమావేశంలో చర్చించి విధాన పరమైన నిర్ణయాలు తీసుకున్నారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు కరికాల వలవన్, కె.ప్రవీణ్ కుమార్, ఎస్ఎస్ రావత్, ఐటి శాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్, ఎంఏయుడి కమిషనర్ ప్రవీణ్ కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్ సృజన, ఏపీ మారిటైమ్ బోర్డు సీఈవో షన్మోహన్ హాజరుకాగా.. దృశ్య మాధ్యమం ద్వారా ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పాల్గొన్నారు.

### సీఎస్‌పై నిందలు.. భావ్యం కాదు

**అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు**



**సాక్షి, అమరావతి:** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డిపై కొన్ని పత్రికలు తొందరపాటుగా నిందలు వేయడం సరికాదని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ దామోదర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఈ నెల 3వ తేదీన వైఎస్సార్ జిల్లాలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న తర్వాత సీఎం ఓఎస్డీ క్రిష్ణమోహన్‌రెడ్డిని తీసుకెళ్లారని వార్తలు రాయడం, వాటిని ఆయన ఖండించినట్లు పత్రికల్లో వార్త రావడం చూసి తమ ఉద్యోగులందరికీ చాలా బాధకలిగిందని పేర్కొన్నారు. జవహర్‌రెడ్డి ఇంతవరకు ఏ విభాగం ఉన్నతాధికారిగా పని చేసినా, ఏ ప్రభుత్వంలో పనిచేసినా మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రభుత్వ ఉద్యోగులకు దళపతిగా ఉన్న ఒక అత్యున్నత స్థాయి అధికారిపై వాస్తవాలు తెలుసుకోకుండా తొందరపాటుగా నిందలు వేయడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మనోభావాలు దెబ్బతినేలా వార్తలు రాయడాన్ని తమ సంఘం రాష్ట్ర కమిటీ తరఫున ఖండిస్తున్నట్లు తెలిపారు.

### మోడల్ స్కూల్స్ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసు పెంపునకు ఓకే

**సీఎం ఆమోదం తెలిపారని ఏపీజీఈఎఫ్ వెల్లడి**



**సాక్షి, అమరావతి:** మోడల్ స్కూల్స్, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలోని ఎడ్యుకేషన్ సొసైటీ (ఏపీఆర్ఈఐఎస్) ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలిపారని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఏపీజీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశాన్ని త్వరలో జరగనున్న క్యాబినెట్ అజెండాలో చేర్చాలని విద్యా శాఖను సీఎం ఆదేశించారని పేర్కొన్నారు. ఈ ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచేందుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఫెడరేషన్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు.

# అమ్మ పాలకూ బ్యాంక్

**చనుబాలకు దూరమయ్యే బిడ్డలకు సాంత్వన**

- శిశువుల మరణాల నివారణ.. వారి ఆరోగ్య రక్షణే లక్ష్యం
- ఇందుకోసం కాకినాడ జీజీహెచ్‌లో 'మదర్ మిల్క్ బ్యాంక్'
- రూ.కోటి వ్యయం.. 8 గదులతో నిర్మాణం
- రాష్ట్రంలో తొలి బ్యాంక్ ఇదే.. దేశంలో 8వ బ్యాంక్‌గా రికార్డు
- బిడ్డకు ఇవ్వగా మిగిలిన పాలను బ్యాంక్‌లో నిల్వ చేసేలా ఏర్పాట్లు
- రాష్ట్ర ప్రభుత్వంతో 'సుశేణ' హెల్త్ ఫౌండేషన్ ఎంవోయూ
- ఈ నెల 13న ప్రారంభించేందుకు ఏర్పాట్లు

అమ్మ పాలు అమృతం కంటే విలువైనవి. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు అద్భుతమైన ఔషధంలా పని చేస్తాయి. మరో విషయం ఏమంటే.. బిడ్డకు పాలివ్వడం తల్లి ఆరోగ్యానికి సైతం ఎంతో మేలు కలుగుతుంది. తల్లి పాల నుంచి బిడ్డకు విటమిన్లు, ప్రొటీన్లు లభించడమే కాకుండా.. తల్లి స్పర్శ, వాత్సల్యపూరిత ఆలింగనం వల్ల బిడ్డ మానసిక ఆరోగ్యానికి కూడా ఎంతో భరోసా కలుగుతుంది. అంత గొప్ప విశిష్టత కలిగిన తల్లి పాలకు కొందరు బిడ్డలు దూరం కావాల్సి వస్తోంది. తల్లి పాలు దొరక్క నవజాత శిశువులు అక్కడక్కడ మరణిస్తున్న సందర్భాలూ లేకపోలేదు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు కాకినాడ జీజీహెచ్‌లో తల్లి పాల బ్యాంక్ ఏర్పాటు కాబోతోంది.



కాకినాడ జీజీహెచ్‌లో సిద్ధమవుతున్న మదర్ మిల్క్ బ్యాంక్

**సాక్షి ప్రతినిధి, కాకినాడ:** దానాల్లోకెల్లా అన్నదానం గొప్పదంటారు. ఇప్పుడు అంతకంటే గొప్ప దానం మరొకటి రాబోతోంది. అదే తల్లి పాల దానం చేయవచ్చు. తల్లి పాలు దానం చేయడమేమిటని ఆశ్చర్యపోతున్నారా! ఔను.. తల్లి పాలను సైతం ఇకనుంచి దానం చేయొచ్చు. తల్లి పాలకు దూరమైన బిడ్డలకు ప్రాణ భిక్ష, ఆరోగ్య భిక్ష కల్పించవచ్చు. రక్తదానం మాదిరిగా అమ్మ పాలను దానంగా స్వీకరించి నిల్వ చేసేందుకు రాష్ట్రంలోనే తొలిసారిగా కాకినాడలో 'మదర్ మిల్క్ బ్యాంక్' సిద్ధమవుతోంది. ప్రభుత్వ సామాన్య ఆస్పత్రి (జీజీహెచ్) పీడియాట్రిక్ విభాగం పైఅంతస్తులో 8 గదులతో ప్రత్యేక బ్లాక్ ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న 'సుశేణ హెల్త్ ఫౌండేషన్' మధ్య ఇందుకు సంబంధించి ఇటీవల ఒప్పందం కుదిరింది. ఆ సంస్థ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ సంతోష్‌కుమార్ దేశంలోనే 8వ మదర్



తల్లి నుంచి పాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

మిల్క్ బ్యాంక్‌ను ఈ నెల 13న ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఫౌండేషన్ రూ.కోటితో మూడు విడతల్లో దీని నిర్మాణం చేపడుతోంది. తల్లి పాలు బిడ్డ ఎదుగుదల, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో కీలకం. వీటి ప్రాధాన్యత తెలియకపోవడం వల్ల కొందరు.. శరీరాకృతి



తల్లి నుంచి పాలుసేకరించే మిషన్

మారిపోతుందనే అపోహతో మరికొందరు.. తల్లి పాలు రాక ఇంకొందరు పిల్లలు చనుబాలకు దూరమవుతున్నారు. ప్రత్యామ్నాయంగా పోత పాలతో బిడ్డ ఆకలి తీరుస్తుండటం వల్ల బిడ్డల ఆరోగ్యం దెబ్బతింటోంది. ఆరోగ్యాన్ని పరోక్షంగా దెబ్బ తీస్తున్నాయి.

#### బిడ్డకు ఇవ్వగా మిగిలిన పాలను..

రాష్ట్రంలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఎక్కువగా ప్రసవాలు జరిగే టాప్–5లో ఉన్న కాకినాడ జీజీహెచ్‌ను 'సుశేణ' హెల్త్ ఫౌండేషన్ ఎంపిక చేసుకుంది. నవజాత శిశువు నుంచి రెండేళ్ల బిడ్డ వరకు ఈ బ్యాంక్‌లో పాలు ఇస్తారు. తల్లి బిడ్డకు ఇవ్వగా మిగులు పాలను సేకరించి అవసరమైన పిల్లలకు అందిస్తారు. హెచ్ఐవీ, వీడీఆర్ఎల్ (వెనెరియల్ డిసీజ్ రీసెర్చ్ లేబొరేటరీ టెస్ట్), హెపటైటిస్ పరీక్షల్లో నెగిటివ్ వస్తేనే తల్లి పాలు తీసుకుంటారు. కాగా, ఇక్కడ తల్లుల చనుబాల పరిమాణం పెంచేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ విధానాలపై అవగాహన కల్పిస్తారు. మసాజ్ థెరపీ, న్యూట్రిషనల్ ట్రీట్‌మెంట్ (పోషకాలతో కూడిన వైద్యం), మదర్‌కేర్ (బిడ్డను హత్తుకుని పాలిచ్చే) తరహాలో తల్లులకు బిడ్డలను కనీసం గంటపాటు హత్తుకుని ఉండేటట్టు ఈ బ్యాంక్‌లోని ప్రత్యేక వార్డులో నిపుణుల పర్యవేక్షణలో ఉంచుతారు. ఇలా ఈ బ్యాంక్‌లో రెండు, మూడు రోజులు ఉంచి తల్లులకు అవగాహన వచ్చాక ఇంటి వద్ద ఇదే విధానాన్ని అనుసరించాలని సూచించి పంపేస్తారు. స్వచ్ఛంద దాతలు జీజీహెచ్ మిల్క్ బ్యాంక్‌కు వచ్చి పాలు దానం చేయవచ్చు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా ఉచితం. తొలి దశలో సేకరించిన పాలను నిల్వ చేయకుండా వెంటనే అవసరమైన శిశువులకు పట్టిస్తారు. రెండో దశలో పాలను నిల్వ చేస్తారు. కనీసం 6 నెలల నుంచి గరిష్టంగా ఏడాది పాటు వాటిని పాడవకుండా భద్రపరుస్తారు. ఇందుకు ప్రత్యేక యంత్రాలు జీజీహెచ్‌లో సిద్ధమయ్యాయి. తొలి దశ ప్రారంభమైన నెల రోజుల వ్యవధిలో మిల్క్ పాశ్చరైజేషన్ జరిగేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

#### ఏపీలో తొలి బ్యాంక్



సామాజిక బాధ్యతలో భాగంగా నవజాత శిశువుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత తీసుకున్నాం. రాష్ట్రంలోనే తొలిసారి కాకినాడ జీజీహెచ్‌లో ఈ ప్రాజెక్టుకు శ్రీకారం చుడుతున్నాం. ప్రభుత్వంతో ఇటీవలనే ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఇది సాధ్యమవుతోంది.
– రమేష్ లక్కర్సు, కన్సల్టెంట్ ప్రోగ్రాం మేనేజర్, సుశేణ హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధి

#### విస్తృతం చేస్తాం



ఈ సేవలను విస్తృతం చేసేందుకు నెట్‌వర్క్ ఆస్పత్రులతో అనుసంధానం చేసే ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించాం. మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటుకు అనువైన పరిస్థితులు జీజీహెచ్‌లో పరిస్థితులు ఉండటంతో సుశేణ ఫౌండేషన్ ముందుకొచ్చింది.
– డాక్టర్ హేమలతాదేవి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కాకినాడ

#### శిశువుల ప్రాణాలకు రక్ష



కాకినాడ జీజీహెచ్‌లో ప్రతి నెలా 700 నుంచి 800 ప్రసవాలు జరుగుతున్నాయి. రెండున్నర కేజీల కంటే తక్కువ బరువుతో పుడుతున్న నవజాత శిశువుల సంఖ్య 75 నుంచి 85 మధ్య ఉంటుంది. కిలో కంటే తక్కువ బరువుతో పుడుతున్న వారు 10 మంది ఉంటున్నారు. ఈ బ్యాంక్ శిశువుల ప్రాణ రక్షణకు తోడ్పడుతుంది.
– ఎంఎస్ రాజు, హెచ్‌వోడీ, పీడియాట్రిక్, జీజీహెచ్, కాకినాడ

# శరవేగంగా.. పారదర్శకంగా

**ఉద్యోగాల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వ విధానం ఇదీ**

**సాక్షి, అమరావతి:** అన్నం ఉడికిందో లేదో తెలియాలంటే ఒక్క మెతుకు చాలు! ఉద్యోగాల భర్తీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిబద్ధత గ్రామ, వార్డు సచివాలయాల్లో ఒకేసారి లక్షల ఉద్యోగాల భర్తీతోనే రుజువైంది. అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఒకేదఫాలో 1.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను సక్రమంగా భర్తీ చేసి దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఉద్యోగాల భర్తీ ఎంత ప్రధానమో పారదర్శకంగా చేపట్టి అర్హులకు న్యాయం చేయడం అంతకంటే ముఖ్యమన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు అనుగుణంగా ప్రభుత్వ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్య ఆరోగ్య శాఖలో 48 వేలకుపైగా ఉద్యోగాలను శరవేగంగా రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది. తాజాగా కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించిన ప్రిలిమినరీ పరీక్షా ఫలితాలను రెండు వారాల్లోనే వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకుంది. టీడీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంటేనే అక్రమాలు, అవకతవకలు, నిబంధనల ఉల్లంఘన అని పలు సందర్భాల్లో రుజువు కాగా కోర్టు కేసులు, ఏళ్ల తరబడి సుదీర్ఘ భర్తీ ప్రక్రియతో నిరుద్యోగుల్లో నైరాశ్యం ఆవహించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అందుకు భిన్నంగా సక్రమం.. సత్వరం.. పూర్తి పారదర్శక విధానాలతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియను కొనసాగిస్తోంది.

#### రెండు వారాల్లోనే ప్రిలిమినరీ ఫలితాలు

పోలీసు ఉద్యోగార్థుల కలలను నిజం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ ప్రక్రియ చేపట్టింది. ఏటా కనీసం 6 వేల పోలీసు ఉద్యోగాలను భర్తీ చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారు. అందుకు అనుగుణంగా ఈ ఏడాది 6,100 కానిస్టేబుల్, 411 ఎస్సై పోస్టులతో మొత్తం 6,511 పోలీసు ఉద్యోగాల భర్తీని రాష్ట్ర పోలీసు నియామక మండలి చేపట్టింది. కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి జనవరి 22న ప్రిలిమినరీ పరీక్షను 997 కేంద్రాల్లో నిర్వహించింది. 6,100 పోస్టులకు 5.03 లక్షల మంది దరఖాస్తు చేయగా ప్రిలిమినరీకి 4,59,182 మంది హాజరయ్యారు. అంత భారీగా అభ్యర్థులు ఉన్నప్పటికీ రాత పరీక్ష ఫలితాలను కేవలం రెండు



**ఓకేసారి 1.35 లక్షల సచివాలయాల పోస్టుల భర్తీ**

ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధి, పారదర్శకతకు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ నిదర్శనం. పరిపాలనను ప్రజల ముంగిటకు తీసుకొస్తూ ప్రవేశపెట్టిన ఈ వ్యవస్థ దేశానికే ఆదర్శప్రాయంగా నిలుస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఏకంగా 1.35 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను ఒకేసారి భర్తీ చేయడం ద్వారా యువత పట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన నిబద్ధతను చాటుకున్నారు. అదీ అధికారం చేపట్టిన మూడు నెలల్లోనే భర్తీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒకేసారి ఇంత భారీస్థాయిలో ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం దేశంలోనే తొలిసారి కావడం విశేషం. 1.35 లక్షల ఉద్యోగాలకు ఏకంగా 21 లక్షల మంది దరఖాస్తు చేయగా 2019 సెప్టెంబరు 1–9వ తేదీల మధ్య నిర్వహించిన ఎంపిక పరీక్షకు 19.5 లక్షల మంది హాజరయ్యారు. అయినప్పటికీ పరీక్ష ఫలితాలను 11 రోజుల్లోనే వెల్లడించి ఆపై రెండు వారాల్లోనే ఎంపికైన అభ్యర్థులు విధుల్లో చేరేలా చర్యలు తీసుకున్నారు. రెండేళ్ల ప్రొబేషన్ పూర్తి అయిన తరువాత నిబంధనల మేరకు ఉద్యోగాలను క్రమబద్ధీకరించారు. అంత భారీగా ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ఎక్కడా ఎలాంటి అక్రమాలు, అవకతవకలు లేకుండా నిర్వహించడం సర్వత్రా ప్రశంసలు అందుకుంది. త్వరలో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న మరో 14 వేల పోస్టులను కూడా అదే రీతిలో భర్తీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

వారాల్లోనే ప్రకటించడం విశేషం. ప్రాథమిక 'కీ' కూడా ప్రకటించి అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం కల్పించారు. వాటిని పరిశీలించి మూడు ప్రశ్నలకు సమాధానాలను సరి చేసి తుది 'కీ' విడుదల చేశారు. ప్రిలిమినరీ పరీక్షలో 95,208 మంది అర్హత సాధించారు. మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించేందుకు కటాఫ్ మార్కును కూడా పోలీసు నియామక మండలి హేతుబద్ధంగా నిర్ణయించింది. మొత్తం 200 మార్కుల పరీక్షలో జనరల్ అభ్యర్థులకు 40 శాతం అంటే 80 మార్కులను కటాఫ్‌గా ఖరారు చేసింది. బీసీ అభ్యర్థులకు 35 శాతం అంటే 70 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, మాజీ సైనికుల కేటగిరీ అభ్యర్థులకు 30 శాతం అంటే 60 మార్కులు కటాఫ్‌గా నిర్ణయించారు. ఇక అభ్యర్థుల్లో ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రిలిమినరీ పరీక్ష ఓఎంఆర్ షీట్లను కూడా అందుబాటులోకి తేవడం గమనార్హం. అభ్యర్థులు తమ ఓఎంఆర్ షీట్లను డౌన్‌లోడ్ చేసుకుని 'కీ'తో సరిచూసుకునేందుకు మూడు రోజులపాటు అవకాశం కల్పించారు. పోలీస్ పోస్టుల భర్తీ ప్రక్రియను ఇంత పారదర్శకంగా, నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సకాలంలో నిర్వహిస్తుండటం పట్ల అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మెయిన్ పరీక్షకు, అనంతరం దేహదారుఢ్య పరీక్షలకు ఉత్సాహంగా సన్నద్ధమవుతున్నామని చెబుతున్నారు. 411 ఎస్సై పోస్టుల భర్తీకి ప్రిలిమినరీ పరీక్షను ఫిబ్రవరి 19న నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

#### వైద్య, ఆరోగ్యశాఖలో 48 వేల పోస్టుల భర్తీ

సీఎం జగన్ అత్యధిక ప్రాధాన్యమిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాల భర్తీని నిరంతర ప్రక్రియగా ప్రభుత్వం కొనసాగిస్తోంది. ఈ మూడున్నరేళ్లలో వైద్య శాఖలోని వివిధ విభాగాల్లో ఇప్పటి వరకు ఏకంగా 48 వేల ఉద్యోగాలను భర్తీ చేశారు. పత్రికల్లో నోటిఫికేషన్ జారీ చేసి షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం పోస్టులను పారదర్శకంగా భర్తీ చేస్తున్నారు. ఏ ఒక్క పోస్టు భర్తీపైనా ఎలాంటి ఆరోపణలుగానీ ఫిర్యాదులుగానీ రాకపోవడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా నిలుస్తోంది.

#### నాడు అంతా అక్రమాలు.. కోర్టు కేసులే

టీడీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంటేనే పెద్ద ప్రహసనం. రాత పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో... ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారో అంతుబట్టక అభ్యర్థులు అల్లాడేవారు. నిబంధనలు, అర్హతలు, రిజర్వేషన్ల అమలుకు రోస్టర్ పాయింట్ల ఖరారు... ఇలా అన్ని స్థాయిల్లోనూ అక్రమాలే చోటు చేసుకోవడంతో అభ్యర్థులు తరచూ న్యాయ పోరాటాలకు దిగాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. రాత పరీక్ష 'కీ'పై అభ్యంతరాలను కనీసం పట్టించుకునేవారే కాదు. ఓఎంఆర్ షీట్లను పరిశీలించేందుకు సులభంగా అనుమతించేవారు కూడా కాదు. రాత పరీక్ష నిర్వహణ, ఫలితాలపై అభ్యర్థుల సందేహాలకు ప్రభుత్వం నుంచి సరైన సమాధానమే ఉండేది కాదు. అందుకు భిన్నంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో ఉద్యోగాలను భర్తీ చేస్తుండటం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విధానానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్దిష్ట ప్రక్రియను సృష్టించిందని నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# విద్యార్థుల కోసం ఆధార్ క్యాంపులు

- జూనియర్ కాలేజీల్లో నేటి నుంచి 4 రోజులపాటు నిర్వహణ
- గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ప్రతినెలా క్యాంపులు
- 10 రకాల ఆధార్ సేవలకు వీలు

**సాక్షి, అమరావతి:** ఇంటర్మీడియెట్ విద్యార్థులు ఆధార్ కార్డుల్లో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నుంచి 4రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా 1,485 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కాలేజీలలో ప్రత్యేక ఆధార్ క్యాంపుల నుంచి నిర్వహించనుంది. కనీసం పదేళ్ల వ్యవధిలో ఒక్కసారైనా ఆధార్ కార్డులో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని యూఐడీఏఐ నిబంధన తీసుకొచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో పదేళ్ల వ్యవధిలో ఒక్కసారి కూడా తమ ఆధార్ కార్డులో బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోనివారు దాదాపు 80 లక్షల మంది ఉన్నట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో ప్రతినెలా ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. 7 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వయస్సు వారికి ప్రభుత్వం పూర్తి ఉచితంగా బయోమెట్రిక్ వివరాలను అప్‌డేట్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ఇప్పటివరకు గ్రామ, వార్డు సచివాలయాలశాఖ 15 ఏళ్లలోపు వయసు కలిగిన విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తూ వచ్చింది. ఈ నెలలో 15నుంచి 17 ఏళ్ల వయసులోపు విద్యార్థులకు జూనియర్ కాలేజీల్లో క్యాంపులు నిర్వహిస్తోంది. సచివాలయాల్లో నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపుల్లో ఆధార్ కార్డులో బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలను ఉచితంగా అందజేయడంతో పాటు నిర్ణీత రుసుంతో అదనంగా మరో 10 రకాల ఆధార్ సేవలను పొందే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. బయోమెట్రిక్ (ఫొటో, ఐరిస్, ఫింగర్ ప్రింట్) అప్‌డేట్, పేరు మార్పు, పుట్టిన తేదీ వివరాల మార్పు, జెండర్, చిరునామా మార్పు సేవలతో పాటు కొత్తగా ఆధార్ వివరాల నమోదు, ఆధార్ కార్డు డౌన్‌లోడ్ సేవలను కూడా ఆ క్యాంపుల్లో పొందవచ్చు.

# కోవిడ్‌లో దున్నేసింది!

▶ మొదటి పేజీ తరువాయి

రూ.2.53 లక్షల కోట్లు ఉండగా కోవిడ్ మహమ్మారిని అధిగమించి 2020–21లో రూ.3.05 లక్షల కోట్ల మేర ఎగుమతులు జరిగాయి.

**పది దేశాలకే అత్యధికం**

భారత్ నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు అమెరికా, చైనా, బంగ్లాదేశ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వియత్నాం, సౌదీ ఆరేబియా, ఇండోనేషియా, నేపాల్, ఇరాన్, మలేషియా అది పెద్ద మార్కెట్‌గా నిలిచాయని, మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఈ దేశాలదే 52.2 శాతం వాటా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. 2020–21లో దేశం నుంచి వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో బాస్మతి, నాన్ బాస్మతి బియ్యం ఎగుమతుల వాటా 21.4 శాతంగా ఉంది. తరువాత సముద్ర ఉత్పత్తులు 14.5 శాతం, సుగంధ ద్రవ్యాలు 9.7 శాతం, గేదె మాంసం 7.7 శాతం, చక్కెర 6.8 శాతంగా ఉంది. ప్రధానంగా ఈ ఐదు ఎగుమతుల వాటా 60.10 శాతంగా ఉన్నట్లు నివేదిక విశ్లేషించింది.

**తొలిసారిగా రాష్ట్రానికి 4వ స్థానం**

వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్ తొలిసారిగా నాలుగో స్థానంలో నిలిచింది. రాష్ట్ర విభజన అనంతరం 2020–21లో రూ.23,505.2 కోట్ల విలువైన ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు జరిగాయి. అయితే గత సర్కారు హయాంలో ఏ ఒక్క ఆర్థిక ఏడాదిలోనూ రూ.9,000 కోట్ల మేర కూడా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు జరగలేదు. టీడీపీ హయాంలో 2028–19లో ఏపీ నుంచి రూ.8,929.5 కోట్ల విలువైన వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే ఎగుమతి అయినట్లు నివేదిక పేర్కొంది. ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్లో ఏడు రాష్ట్రాల వాటా 88 శాతం ఉన్నట్లు తెలిపింది.

**2021-22లో ప్రధాన వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు**

| రాష్ట్రం | ఎగుమతుల విలువ రూ.కోట్లలో |
|---|---|
| గుజరాత్ | 70,757.30 |
| మహారాష్ట్ర | 49,199.20 |
| ఉత్తరప్రదేశ్ | 32,209.00 |
| ఆంధ్రప్రదేశ్ | 23,505.20 |
| పశ్చిమ బెంగాల్ | 22,420.00 |
| హరియాణా | 21,308.30 |
| తమిళనాడు | 15,293.60 |

**2020-21లో భారత్ నుంచి విదేశాలకు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు**

| దేశం | ఎగుమతుల శాతం | దేశం | ఎగుమతుల శాతం |
|---|---|---|---|
| అమెరికా | 11.5 | వియత్నాం | 3.9 |
| చైనా | 9.0 | సౌదీ అరేబియా | 3.9 |
| బంగ్లాదేశ్ | 6.80 | ఇండోనేషియా | 3.7 |
| యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ | 4.7 | నేపాల్ | 3.1 |
| | | ఇరాన్ | 2.9 |
| | | మలేసియా | 2.8 |
| | | ఇతర దేశాలు | 47.8 |

## విపత్తుల స్పందన విభాగం పునర్వ్యవస్థీకరణ

**నాలుగు రీజియన్లుగా రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక విభాగం**

**సాక్షి, అమరావతి:** రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక విభాగాన్ని ప్రభుత్వం సోమవారం పునర్వ్యవస్థీకరించింది. కీలకమైన ఈ విభాగాన్ని వ్యవస్థాగతంగా మరింత పటిష్టపరిచేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న రెండు రీజియన్లను నాలుగుకు పెంచింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్‌కుమార్ గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు విశాఖలో రీజియన్–1 ఏర్పాటు చేసింది. రాజమహేంద్రవరం కేంద్రంగా ఏర్పాటు చేసిన రీజియన్–2 పరిధిలోకి తూర్పు గోదావరి, కాకినాడ, అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలను చేర్చింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో గుంటూరు కేంద్రంగా రీజియన్–3ని ఏర్పాటు చేసింది. కర్నూలు కేంద్రంగా ఉన్న రీజియన్–4 పరిధిలో కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలను చేర్చింది. తదనుగుణంగా రీజనల్ ఫైర్ ఆఫీసర్లు, ఇతర పోస్టులను గుర్తించింది. విపత్తుల స్పందన, అగ్నిమాపకశాఖలోని అధికారులు జి.శ్రీనివాసులు, ఆర్.జ్ఞాన సుందరం, టి.ఉదయ్ కుమార్‌లను పదోన్నతిపై అదనపు డైరెక్టర్లుగా నియమించారు.

# ఆలయాల బోర్డుల్లో నాయీ బ్రాహ్మణులు

▶ మొదటి పేజీ తరువాయి

బంధం ఉందని దేవదాయ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. ఆలయాల్లో భజంత్రీలుగా, క్షురకులుగా, ప్రత్యేక ఉత్సవాల సమయంలో స్వామి వారి ఊరేగింపు పల్లకీ సేవల్లో నాయీ బ్రాహ్మణులు పాలు పంచుకుంటున్నారని గుర్తు చేస్తున్నారు. ఆలయాల్లో పలు కార్యక్రమాల్లో సేవలందించే తమకు పాలక వర్గాల్లో చోటు కల్పించాలని నాయీ బ్రాహ్మణులు చాలా ఏళ్లుగా కోరుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్ర సమయంలో దీనిపై సానుకూల హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నిర్వహించిన బీసీ గర్జన సభలలోనూ దీనిపై ప్రత్యేకంగా చర్చ జరిగింది. ఇప్పుడు ఆ హామీని నెరవేరుస్తూ దేవదాయ శాఖ చట్టానికి సవరణ తెచ్చి ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసింది.

**610 ఆలయాలకు త్వరలో నియామకం!**

హైకోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ప్రకారం దేవదాయ శాఖ పరిధిలో ఐదు లక్షలకు పైబడి ఆదాయం సమకూరే ఆలయాల్లో మాత్రమే దేవదాయ శాఖ ట్రస్టు బోర్డులను నియమించే అవకాశం ఉంది. రాష్ట్రంలో దేవదాయ శాఖ పరిధిలో ఏడాదికి రూ.ఐదు లక్షల పైబడి వార్షికాదాయం ఉన్న ఆలయాలు 1,234 వరకు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే ట్రస్టు బోర్డు నియామకాలు పూర్తైన వాటిని మినహాయిస్తే మరో 610 ఆలయాలకు కొద్ది రోజుల్లో కొత్తగా ట్రస్టు బోర్డులను నియమించేందుకు కసరత్తు జరుగుతోంది. వీటిల్లో ప్రతి ఆలయానికి ఒకరి చొప్పున నాయీ బ్రాహ్మణులకు ట్రస్టు బోర్డులో స్థానం కల్పించే అవకాశం ఉంది.

**నాడు అవమానం.. నేడు సముచిత స్థానం**

ఆలయాల ట్రస్టు బోర్డు నియామకాల్లో తమకు చోటు కల్పిస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయడంపై నాయీ బ్రాహ్మణ సంఘాలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ హయాంలో తాము అవమానాలు ఎదుర్కొనగా ఇప్పుడు సముచితం స్థానం దక్కిందని ఆయా సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఆలయాల నిర్వహణలో తమకు తగిన స్థానం కల్పించాలని కోరిన నాయీ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులను అధికారంలో ఉండగా చంద్రబాబు తీవ్రంగా అవమానించారని గుర్తు చేస్తున్నారు. నాడు సచివాలయంలో తనను కలసి సమస్యలు వినిపించిన సంఘాల నేతలనుద్దేశించి 'తోకలు కత్తిరిస్తా.. ఆలయాల మెట్లు కూడా ఎక్కకుండా చేస్తా' అంటూ చంద్రబాబు తీవ్ర స్వరంతో హెచ్చరించారు.

#### దేశ చరిత్రలోనే అరుదు

దేశ చరిత్రలో నాయీ బ్రాహ్మణులకు అరుదైన గౌరవం దక్కింది. మా వినతిని ఆలకించి ఆర్డినెన్స్ జారీ చేసిన గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, ముఖ్యమంత్రి జగన్, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణుల ఆత్మ గౌరవాన్ని మరో మెట్టు ఎక్కించింది. సీఎం జగన్‌కు నాయీ బ్రాహ్మణ జాతి రుణపడి ఉంటుంది.
– సిద్దవటం యానాదయ్య, (ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్),
– గుంటుపల్లి రామదాసు, (కేశ ఖండనశాల నాయీ బ్రాహ్మణ జేఏసీ అధ్యక్షుడు)

క్లుప్తంగా...

## టీబీ రోగులకు ఎస్‌బీఐ రూ.37 లక్షల సాయం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన 'కనెక్ట్ టూ ఆంధ్ర' ద్వారా ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం కింద వెయ్యి మంది టీబీ రోగులను భారతీయ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) దత్తత తీసుకుంది. ఎస్‌బీఐ అమరావతి సర్కిల్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో వెయ్యి మంది రోగులకు పోషకాహారం అందించేందుకు రూ.37.29 లక్షల చెక్కును రాష్ట్ర వైద్య శాఖ ప్రతినిధులకు ఎస్‌బీఐ చైర్మన్ దినేష్‌కుమార్ ఖారా అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం నవీన్ చంద్ర ఝా, కనెక్ట్ టూ ఆంధ్రా సీనియర్ కన్సల్టెంట్ కె.బి.ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోటంరెడ్డితో ప్రాణహాని ఉంది

### కార్పొరేటర్ విజయభాస్కర్‌రెడ్డి



నెల్లూరు రూరల్: ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వల్ల తనకు ప్రాణహాని ఉందని నెల్లూరు 22వ డివిజన్ కార్పొరేటర్ మూలే విజయభాస్కర్ రెడ్డి ఆరోపించారు. నెల్లూరు నగరంలోని ఆదాల ప్రభాకర్‌రెడ్డి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని చెప్పడంతో తన ఇంటికి వచ్చి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తనను కిడ్నాప్ చేసేందుకు యత్నించారని చెప్పారు. కొత్త వ్యక్తులు తన కార్యాలయం, ఇంటి వద్ద తిరుగుతున్నారని, దీంతో తనకు రక్షణ కల్పించాల్సిందిగా కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వం వైపే తాను, తన డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు ఉంటారని స్పష్టం చేశారు.

## నర్సులపై చేసిన వ్యాఖ్యలకు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా

### సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

సాక్షి, అమరావతి: ఆహా ఓటీటీలో ప్రసారం అవుతున్న అన్‌స్టాపబుల్ షోలో ఓ నర్సు గురించి తాను చేసిన అనుచిత వ్యాఖ్యలపై సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పశ్చాత్తాపం వ్యక్తంచేశారు. తన వ్యాఖ్యల వల్ల నర్సుల మనోభావాలు దెబ్బతిని ఉంటే పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నానని సోమవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. నర్సులను తాను కించపరిచినట్లు కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, తన మాటల్ని వక్రీకరించారని పేర్కొన్నారు. రోగులకు సేవలందించే సోదరీమణులంటే తనకెంతో గౌరవమని, బసవతారకం కేన్సర్ ఆస్పత్రిలో నర్సుల సేవలను ప్రత్యక్షంగా చూశానని తెలిపారు. రాత్రింబవళ్లు రోగులకు సపర్యలు చేసి ప్రాణాలు నిలిపే సోదరీమణులంటే తనకు గౌరవమని, వారికి ఎన్నిసార్లు కృతజ్ఞతలు చెప్పినా తక్కువేనని పేర్కొన్నారు. ఎంతోమంది నర్సులు నిద్రాహారాలు మానేసి కరోనా రోగులకు సేవలందించారని తెలిపారు. అటువంటి నర్సులను మెచ్చుకుని తీరాలని పేర్కొన్నారు.

## చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు అమలుచేయాలి

### మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మాట్లాడుతున్న వెంకయ్యనాయుడు

కొమ్మాది: పార్లమెంట్, అసెంబ్లీలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. రుషికొండలో నిర్వహిస్తున్న జెండర్ రెస్పాన్స్ వర్క్‌షాప్‌లో భాగంగా 'షి ఈజ్ ఎ చేంజ్ మేకర్' మహిళా ప్రజాప్రతినిధుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. అన్ని పార్టీలు మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడుతున్నాయే తప్ప.. చట్టం తీసుకురావడంలో విఫలమవుతున్నాయన్నారు. అధికార, విపక్షాలు కలసి చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని, రాజకీయాల్లో మహిళల శాతం అనేది పూర్తిస్థాయిలో లేదని తెలిపారు. భారత రాజ్యాంగం అధినేతగా ఒక మహిళ ఉన్నా చట్టాలు తీసుకురావడంలో విఫలమవుతున్నామని చెప్పారు. నేషనల్ జెండర్ అండ్ చైల్డ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దిశపన్ను తదితరులు పాల్గొన్నారు.


## ఎస్సీల సంక్షేమ పథకాలను చంపేశారు: లోకేశ్

చిత్తూరు అర్బన్: టీడీపీ అధికారంలో ఉండగా ఎస్సీల కోసం పెట్టిన సంక్షేమ పథకాలను, కార్పొరేషన్ల ద్వారా ఇచ్చే రుణాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక చంపేశారని టీడీపీ నేత, ఎమ్మెల్సీ నారా లోకేశ్ ఆరోపించారు. లోకేశ్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సోమవారం చిత్తూరు నగరానికి చేరుకుంది. టీడీపీ ఎస్సీ విభాగం కార్యకర్తలతో లోకేశ్ మాటమంతి నిర్వహించారు. గత మూడున్నరేళ్లలో ఎస్సీల కోసం ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టలేదని, ఉన్న పథకాలను కూడా చంపేశారన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఎస్సీ సబ్‌ప్లాన్‌ను కొనసాగిస్తామని, ఎస్సీలకు కార్పొరేషన్ల ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. ఈ సమావేశం అనంతరం బీసీలతో సదస్సు ఉండగా, దాన్ని రద్దు చేసుకుని రాత్రి బస కేంద్రంలోకి వెళ్లిపోయారు.

# కిడ్నీలకు రక్షణ కవచాలు

చమురు చేపలుగా పిలిచే సముద్ర చేపల్ని ఆహారంగా తీసుకుంటే దీర్ఘకాలిక రోగాలు దరిచేరవని ఇప్పటికే శాస్త్రీయంగా రుజువైంది. క్రమం తప్పకుండా చేపలు తినే వారిలో క్యాన్సర్, గుండెపోటు, మధుమేహం వంటి రోగాల బారినపడే ప్రమాదం తక్కువని తేలింది. కాగా, తీవ్రమైన కిడ్నీ రోగాల బారిన పడినవారు సముద్ర చేపల్ని తింటే 8 నుంచి 10 శాతం రిస్క్ తగ్గుతుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ఆస్ట్రేలియాలోని న్యూ సౌత్ వేల్స్‌కు చెందిన జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ యూనివర్సిటీ ఈ విషయాన్ని వెల్లడించింది.

### సముద్ర చేపల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అధికం





సాక్షి, అమరావతి: ప్రపంచ జనాభాలో 10 శాతం (80 కోట్ల) మంది తీవ్రమైన మూత్రపిండాల వ్యాధుల (క్రానిక్ కిడ్నీ డిసీజెస్)తో బాధపడుతున్నారు. మూత్రపిండాల వైఫల్యం మనుషుల మరణానికి కూడా దారి తీస్తోంది. ఇలాంటి వారికి సముద్ర చేపలు రిస్క్ తగ్గిస్తున్నాయని తేలింది. సముద్ర చేపల్లో అధికంగా ఉండే ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్స్ మూత్రపిండాల సమస్యల నుంచి ఉపశమనం ఇస్తున్నాయని తాజా అధ్యయనం వెల్లడించింది. మొక్కల నుంచి వచ్చే ఒమెగా–3 ఫ్యాటీ యాసిడ్స్ కంటే సముద్ర చేపల్లో ఉండే యాసిడ్స్ ఎక్కువగా ప్రభావితం చూపిస్తున్నాయని ఆస్ట్రేలియాకు చెందిన జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ యూనివర్సిటీ పరిశోధనల్లో తేలింది. సముద్రంలో దొరికే కవ్వలు, కానాగంతలు (కన్నంగదాత), పాలస, మాగ వంటి వందకు పైగా చమురు చేపలు, సముద్రపు మంచి పీతలు తిన్న వారిపై జార్జ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్ యూనివర్సిటీ పరిశోధనలు జరిపింది. ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే సముద్ర చేపల్ని తినడం వల్ల మూత్రనాళాలు శుభ్రపడతాయని, వాటిలో పేరుకుపోయే రాళ్లు, కొవ్వు పదార్థాలు బయటకు పోతాయని గుర్తించారు. 12 దేశాలకు చెందిన 25 వేల మందికి పైగా కిడ్నీ రోగాల బాధితులపై జరిపిన 19 రకాల అధ్యయనాల ఫలితాలను వర్సిటీ వెల్లడించింది. కచ్చితంగా ఏ చేపలు ఎక్కువగా మూత్రపిండాల వ్యాధుల రిస్కును తగ్గిస్తున్నాయో చెప్పలేకపోయినప్పటికీ.. వాటిలో ఉండే ఫ్యాటీ యాసిడ్స్ రక్తం స్థాయిలను పెంచడంలో ప్రభావం చూపిస్తున్నాయని గుర్తించారు.

### వారానికి రెండుసార్లు తింటే..

తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడిన 49 నుంచి 77 ఏళ్ల వయసు వారిపై ఈ పరిశోధనలు జరిపారు. శరీరం బరువు, ధూమపానం, మద్యపానం అలవాటు ఉన్నవారితో పాటు శారీరక దైనందిన కార్యకలాపాలు, గుండె జబ్బులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. అధిక మోతాదులో సముద్ర చేపలు తిన్న వారిపై వివిధ రూపాల్లో పరిశోధనలు జరిపారు. ఈ చేపల్లో ఉండే ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ప్రభావం మూత్రపిండాల వ్యాధుల తీవ్రతను 8నుంచి 10 శాతం వరకు తగ్గించిందని గుర్తించారు. వారానికి కనీసం రెండుసార్లు సముద్ర చేపలు తింటే రోజుకు 250 మిల్లీ గ్రాముల కన్నా ఎక్కువగా ఒమేగా–3 ఫ్యాటీ యాసిడ్స్ సమకూరుతున్నట్టు తేల్చారు. అవి కిడ్నీ వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేస్తాయని.. ఒకవేళ కిడ్నీ వ్యాధులతో బాధపడుతుంటే రిస్క్ శాతం తగ్గుతోందని పరిశోధనల్లో వెల్లడైనట్టు శాస్త్రవేత్త డాక్టర్ మట్టిమార్క్ లుండ్ వెల్లడించారు. చమురు చేపలు/సముద్ర చేపలు ఆరోగ్యకరమైన ఆహారంగా సిఫార్సు చేస్తున్నట్టు ఇటీవల వర్సిటీ విడుదల చేసిన జర్నల్‌లో ఆయన పేర్కొన్నారు.

# సాంకేతికతతో 'పవర్'ఫుల్‌గా ప్రసారం

- మరింత మెరుగ్గా విద్యుత్ ప్రసారానికి 'సాంకేతిక' సాయం
- ప్రసార నష్టాలను 2.8 శాతంలోపు తగ్గించేందుకు చర్యలు
- దేశంలోనే తొలిసారిగా సొంతంగా ఎనర్జీ ఫోర్ కాస్టింగ్ అభివృద్ధి
- దీని ద్వారా భవిష్యత్ విద్యుత్ అవసరాల అంచనా
- ఈ సాంకేతికత కోసం పలు రాష్ట్రాల నుంచి అభ్యర్థనలు




సాక్షి, అమరావతి: ఏపీ ట్రాన్స్‌కో సొంతంగా ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటూ.. నిర్వహణను సులభతరంగా మార్చుకుంటోంది. భవిష్యత్ విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా రాష్ట్రంలో ప్రసార వ్యవస్థ(ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్)ను మరింత బలోపేతం చేస్తోంది. నెట్‌వర్క్ మెయింటెనెన్స్, మానిటరింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌ను సులభతరం చేసేందుకు జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)ను అమలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేసింది. ఈ జీఐఎస్‌కు 63,000 టవర్లు, 30,010 సర్క్యూట్ కిలోమీటర్ల పొడవు లైన్లు, 358 ఎక్స్‌ట్రా హైటెన్షన్ సబ్‌స్టేషన్ల నెట్‌వర్క్‌ను అనుసంధానించింది. దీంతో మొత్తం నెట్‌వర్క్ నిర్వహణ సులభతరంగా మారింది. క్షేత్రస్థాయి అధికారుల విధులతో పాటు నెట్‌వర్క్ సమాచారాన్ని భౌగోళికంగా ఒకే ప్లాట్‌ఫాంపై మ్యాపింగ్ చేసింది. ఈ మ్యాపింగ్‌లను ఉపయోగించి డేటాను యాక్సెస్ చేయడం ద్వారా నిర్వహణ కార్యకలాపాలకు రూపకల్పన జరుగుతోంది. అలాగే జీఐఎస్ వల్ల ఫీల్డ్ ఇంజనీర్లకు ప్రాథమిక సర్వే నిర్వహించడం సులభంగా మారింది. మరోవైపు తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేయడానికి సహాయపడేలా ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అంతర్గత డిమాండ్ అంచనా నమూనా(ఇన్ హౌస్ ఎనర్జీ ఫోర్ కాస్టింగ్ మోడల్)ను కూడా అభివృద్ధి చేసింది. ఇది దాదాపు 99 శాతం కచ్చితత్వాన్ని కలిగి ఉంది. దీన్ని ఉపయోగించి విద్యుత్ అవసరాలను ముందే అంచనా వేస్తున్నారు. దీని ద్వారా విద్యుత్ సంస్థలు.. తమ కొనుగోళ్లలో కొన్ని రూ.కోట్లను పొదుపు చేసే అవకాశం ఉంది. ఏపీలో అభివృద్ధి చేసిన ఈ ఫోర్ కాస్టింగ్ మోడల్ దేశవ్యాప్తంగా ఉన్న విద్యుత్ సంస్థల్లోనే మొదటిది. దీంతో అనేక రాష్ట్రాలు ఈ మోడల్‌ను తమకూ ఇవ్వాలని ఏపీని కోరుతున్నాయి.

**సీఎం ఆశయానికి అనుగుణంగా..**

**- బి.శ్రీధర్, సీఎండీ, ఏపీ ట్రాన్స్‌కో**


ఇటీవలే రెండు జాతీయ స్థాయి అవార్డులను గెల్చుకున్నాం. భవిష్యత్‌లోనూ విద్యుత్ ప్రసార నష్టాలను 2.8 శాతంలోపు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రాష్ట్రంలోని అన్ని కుటుంబాలకు నిరంతరం నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలనే సీఎం వైఎస్ జగన్ ఆశయానికి అనుగుణంగా ఏపీ ట్రాన్స్‌కో ఉత్తమ సాంకేతిక విధానాలను అమలు చేస్తోంది. డిస్కంలకు ఇవి సహాయపడతాయి. ఏపీ ట్రాన్స్‌కో విధానాలను తమకూ చెప్పాలని తమిళనాడు, రాజస్తాన్ తదితర రాష్ట్రాలు కోరాయి.

# బాధితుడికి టీడీపీ నేత బెదిరింపులు

- 'యువగళం మనకోసం' వాట్సాప్ గ్రూప్‌లో లోన్ పేరుతో మోసం చేసిన మనోహర్‌చౌదరి
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు
- దీంతో 'అంతు చూస్తానంటూ' టీడీపీ నేత బెదిరింపు కాల్స్
- రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించిన బాధితుడు
- మరోవైపు ఒంగోలులోనూ బయటపడిన మనోహర్‌చౌదరి మోసం




టీడీపీ 2024 టార్గెట్ వాట్సాప్ గ్రూప్




బాధితుడు డబ్బులు చెల్లించిన ఫోన్‌పే స్క్రీన్ షాట్

చంద్రగిరి(తిరుపతి జిల్లా)/ఒంగోలు టౌన్: తనపై పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడిపై టీడీపీ నేత బెదిరింపులకు పాల్పడ్డాడు. 'నువ్వు ఎవరి దగ్గరకు వెళ్లినా నన్నేమీ చేయలేవు.. నీ అంతు చూస్తా' అంటూ తీవ్ర పదజాలంతో బెదిరించాడు. దీంతో తనకు రక్షణ కల్పించాలంటూ బాధితుడు సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. కాకినాడకు చెందిన టీడీపీ నేత మనోహర్‌చౌదరి 'యువగళం మనకోసం' అనే వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశాడు. అందులో రుణాలు ఇస్తానని నమ్మబలికి.. తిరుపతి జిల్లా పనపాకం పంచాయతీకి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.1.43 లక్షలు కాజేశాడు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న మనోహర్‌చౌదరి తనకు సోమవారం ఫోన్ చేసి 'నీ ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలు నావద్దే ఉన్నాయి. నాతో పెట్టుకుంటే ఎలా ఉంటుందో చూపిస్తా. పోలీసు అధికారులు నా చేతిలో ఉన్నారు. నా మనుషులు నీ గ్రామానికే వచ్చి అంతు చూస్తారు. నీకు జీతం రాకుండా అడ్డుకుంటా.. ఈనెల 10లోపు నోటీసులు కూడా పంపిస్తా. ఏ నాయకుడు కూడా నన్ను ఏమీ చెయ్యలేడు. నా నెట్‌వర్క్ ఎలా ఉంటుందో చూపిస్తా' అంటూ బెదిరించాడని బాధితుడు వాపోయాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తును వేగవంతం చేశారు. మనోహర్‌చౌదరికి చెందిన రెండు బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేశారు.

**'టీడీపీ 2024 టార్గెట్' పేరుతో ఒంగోలులో కుచ్చుటోపీ**

వాట్సాప్ గ్రూప్‌లు క్రియేట్ చేసి మనోహర్ చౌదరి చేసిన మోసాలు ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. 'టీడీపీ 2024 టార్గెట్' అనే పేరుతో మరో వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేసిన మనోహర్ చౌదరి.. రూ.5 లక్షల వరకు రుణాలిస్తామంటూ ఆశపెట్టి పలువురిని మోసం చేశాడు. ఒంగోలులోని వేంకటేశ్వర కాలనీకి చెందిన ఎంఏ సాలార్ 'టీడీపీ 2024 టార్గెట్' అనే వాట్సాప్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉన్నాడు. ఆ గ్రూప్ అడ్మిన్ అయిన మనోహర్‌చౌదరి శ్రీసాయి మైక్రోఫైనాన్స్ పేరుతో రూ.5 లక్షల వరకు రుణాలిస్తానని గ్రూప్‌లో మెసేజ్ పెట్టాడు. దీంతో సాలార్.. మనోహర్‌ను సంప్రదించాడు. అతని నుంచి ఆధార్, పాన్ కార్డు, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకున్న మనోహర్‌చౌదరి.. వివిధ ఫీజుల పేర్లతో రూ.43వేలకు పైగా వసూలు చేశాడు. మరో రూ.30 వేలు అడగడంతో అనుమానం వచ్చిన బాధితుడు తన డబ్బులు ఇచ్చేయాలని మనోహర్‌చౌదరిని నిలదీశాడు. దీంతో సాలార్‌ను వాట్సాప్ గ్రూప్ నుంచి తొలగించాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు ఇటీవల ఒంగోలు తాలూకా సీఐకి ఫిర్యాదు చేశాడు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# హామీలను అమలు చేయాలని రాజకీయ పార్టీలను ఆదేశించలేం

- కాపు రిజర్వేషన్లపై సీఎం జగన్‌ను ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు అభ్యంతరం
- జోగయ్య పిటిషన్‌పై నేడు విచారణకు నిర్ణయం

సాక్షి, అమరావతి: రాజకీయ పార్టీలు మేనిఫెస్టోలలో ప్రకటించిన హామీలను అమలు చేయాలని తాము ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటూ మేనిఫెస్టోలో పేర్కొన్న వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ హామీని నెరవేర్చడం లేదని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యుడిగా పేర్కొంటూ ఆయనను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. ముఖ్యమంత్రిని ప్రతివాదిగా తొలగించాలని పిటిషనర్ చేగొండి హరిరామజోగయ్యను ఆదేశించింది. అందుకు ఆయన తరపు న్యాయవాది పోలిశెట్టి రాధాకృష్ణ అంగీకరించడంతో ఈ వ్యాజ్యానికి నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నత వర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) విద్య, ఉపాధి అవకాశాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం తెచ్చిన చట్టానికి అనుగుణంగా రాష్ట్రంలో కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గతంలో చేసిన చట్టాన్ని అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ కాపు సంక్షేమ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ మంత్రి చేగొండి హరిరామజోగయ్య హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శితో పాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చారు. ముఖ్యమంత్రిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తింది. నంబర్ కేటాయించేందుకు నిరాకరించింది. రిజిస్ట్రీ అభ్యంతరంపై ఈ వ్యాజ్యం సోమవారం జస్టిస్ రఘునందన్‌రావు ముందు విచారణకు వచ్చింది. హరిరామజోగయ్య తరపు న్యాయవాది రాధాకృష్ణ వాదనలు వినిపిస్తూ.. కాపులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని వైఎస్సార్‌సీపీ తమ మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని నెరవేర్చడం లేదన్నారు. జీవో జారీ చేసి చేతులు దులుపుకుందన్నారు. అందుకే ముఖ్యమంత్రిని బాధ్యుడిగా చేస్తూ ప్రతివాదిగా చేర్చామని తెలిపారు. దీనిపై న్యాయమూర్తి అభ్యంతరం తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాజకీయ పార్టీలను తాము ఆదేశించలేమన్నారు. సీఎంను ప్రతివాదిగా చేర్చడం సరికాదన్నారు. ప్రతివాదుల జాబితా నుంచి సీఎం పేరును తొలగించాలని స్పష్టం చేశారు. ఇందుకు న్యాయవాది రాధాకృష్ణ అంగీకరించడంతో వ్యాజ్యానికి నంబర్ కేటాయించాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం జస్టిస్ రఘునందన్‌రావు విచారణ జరపనున్నారు.

### అన్ని ప్రాంతాల అభివృద్ధే

# జగనన్న లక్ష్యం

**862వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు**



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమరావతితో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, ఆ దిశగా అడుగులు వేస్తున్న జగనన్నకు రాష్ట్ర ప్రజల ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం 862వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ ఐదేళ్ల అధికారమిస్తే నాలుగు తాత్కాలిక భవనాలు నిర్మించలేని చంద్రబాబు... ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తానని చెప్పి భూసేకరణ పేరుతో రైతుల వద్ద నుంచి 33 వేల ఎకరాలను లాక్కున్నాడన్నారు. మూడు పంటలు పండే భూములను నాశనం చేసి కాంక్రీట్ జంగిల్ చేశాడని మండిపడ్డారు. నేడు రైతులతోపాటు రైతు కూలీలు ఈ ప్రాంతంలో పనుల్లేక పక్క గ్రామాలకు వలస వెళ్లే దుస్థితికి కారణం చంద్రబాబు కాదా అని ప్రశ్నించారు. కేవలం బాబు ఆయన బినామీలు, సామాజిక వర్గం స్వలాభం కోసమే బాబు నిర్మింప తలపెట్టిన అమరావతి రాజధాని అన్నారు. రాష్ట్రంలో బహుజనుల అభివృద్ధిని ఓర్వలేని బాబు అండ్ కో ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని తప్పుడు కేసులు వేసి అడుగడుగునా అడ్డు తగులుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో ఎస్సీ సదస్సు

- సీఎం జగన్ చేకూరుస్తున్న మేలును వివరిస్తాం: మంత్రి నాగార్జున
- చురుకైన కార్యకర్తలు, నేతలను ప్రోత్సహిస్తాం



సమావేశంలో సజ్జల, నాగార్జున తదితరులు

సాక్షి, అమరావతి: దళితుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ నిరంతరం కృషి చేస్తున్నారని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. దళితులకు సంక్షేమ పథకాల అమలుపై తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం సమీక్ష జరిగింది. పార్టీ ఎస్సీ విభాగాన్ని మరింత పటిష్టం చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకునేలా చైతన్యం చేయడంపై చర్చించారు. దళితుల్లో నాయకత్వాన్ని పెంపొందించేలా చురుకైన కార్యకర్తలు, నేతలను గుర్తించి ప్రోత్సహించాలని నిర్ణయించారు. సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, ఎంపీ నందిగం సురేష్, ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి నాగార్జున మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ ప్రభుత్వంలో దళితులకు జరుగుతున్న మేలు, చేకూరుతున్న ప్రయోజనాలను వివరిస్తూ త్వరలో రాష్ట్రస్థాయి ఎస్సీ సదస్సు నిర్వహిస్తామని ప్రకటించారు. దళితులను మోసగించేందుకు టీడీపీ పన్నుతున్న కుట్రలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ సూచించారు. చంద్రబాబు హయాంలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఎంపీ నందిగం సురేష్ పేర్కొన్నారు. ఎస్సీ విభాగానికి సంబంధించి అన్ని కమిటీలను బలోపేతం చేస్తామని సామాజిక న్యాయ సలహాదారుడు జూపూడి ప్రభాకరరావు తెలిపారు. సీఎం జగన్ అమలు చేస్తున్న కార్యక్రమాలను జగనన్న సందేశం పేరుతో ఇంటింటికీ తీసుకు వెళ్తామని చెప్పారు.

# హైరిస్క్ వర్గాలకు హెపటైటిస్-బి టీకా

**రాష్ట్రవ్యాప్తంగా పంపిణీ ప్రారంభించిన వైద్యశాఖ**

సాక్షి, అమరావతి: హెపటైటిస్ వ్యాధి నియంత్రణ, నివారణ చర్యలపై వైద్య, ఆరోగ్యశాఖ ప్రత్యేకదృష్టి సారించింది. హైరిస్క్ వర్గాలకు హెపటైటిస్–బి టీకా పంపిణీని సోమవారం ప్రారంభించింది. 55 యాంటి రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాల్లో టీకాను అందుబాటులో ఉంచారు. హైరిస్క్ వ్యక్తులకు స్క్రీనింగ్ నిర్వహించి హెపటైటిస్–బి నెగిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి టీకా వేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో హైరిస్క్ వర్గాల్లో మహిళ సెక్స్ వర్కర్లు 1.03లక్షల మంది, ట్రాన్స్‌జెండర్‌లు 3,186 మంది, పురుష స్వలింగ సంపర్కులు 19,499మంది ఉన్నారు. వీరందరికీ రోజుల్లో టీకా వేస్తారు. తొలి డోసు వేసుకున్న నెలకు రెండో డోసు, తరువాత రెండు నెలలకు మూడో డోసు టీకా వేస్తారు. మూడు డోసులు వేసుకుంటే టీకా ప్రక్రియ పూర్తయినట్టు లెక్క. వైద్యులు, వైద్యసిబ్బందికి వ్యాధి నుంచి రక్షణ కల్పించడంలో భాగంగా ఆ శాఖలో ఇప్పటికే వందశాతం టీకా పంపిణీ చేశారు. కొత్తగా విధుల్లో చేరుతున్న వారికి ఎప్పటికప్పుడు టీకా వేస్తున్నారు. వైద్యశాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.3 శాతం జనాభా హెపటైటిస్–బి, 0.3 శాతం హెపటైటిస్–సితో బాధపడుతున్నారు. శృంగారం, రక్తమార్పిడి, సిరంజులు, టూత్‌బ్రెష్, రేజర్లు వంటి వివిధ రూపాల్లో హెపటైటిస్–బి ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది. ముందస్తుగా టీకా తీసుకోవడం ద్వారా రక్షణ పొందవచ్చు. ఈ క్రమంలో హైరిస్క్ ప్రవర్తన కలిగిన అందరికీ టీకా పంపిణీ చేపట్టారు.

# పోలీసులపై టీడీపీ నేత కొల్లు రవీంద్ర జులుం

- ఎస్‌ఐపై చెయ్యి చేసుకున్న మాజీ మంత్రి
- మహిళా కానిస్టేబుళ్లపైనా దౌర్జన్యం చేసిన టీడీపీ శ్రేణులు
- పోలీస్ యాక్ట్ సెక్షన్ 30ని ఉల్లంఘించి నడిరోడ్డుపై టీడీపీ నేతల వీరంగం



పోలీసులపై దౌర్జన్యం చేస్తున్న కొల్లు రవీంద్ర

సాక్షి ప్రతినిధి, విజయవాడ: టీడీపీ నేత, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర రెచ్చిపోయారు. సెక్షన్ 30 అమల్లో ఉందని, నిబంధనలు పాటించాలని కోరిన పోలీసులపై జులుం ప్రదర్శించారు. తాను తప్పు చేసి కూడా పోలీసులపై దాడికి పాల్పడ్డారు. నడిరోడ్డులో ఎస్‌ఐపై చెయ్యి చేసుకున్నారు. దీంతో కొల్లు రవీంద్రతో పాటు, మరో 15 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

**జరిగిందిదీ..**

కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉంది. ఇక్కడ పోలీసుల ముందస్తు అనుమతితోనే ఎవరైనా ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు చేపట్టాలి. అయితే మచిలీపట్నంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయ నిర్మాణం ప్రభుత్వ భూమిలో జరుగుతుందని, దానిని అడ్డుకొంటామని నినదిస్తూ 150 మంది టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం లక్ష్మీ టాకీస్ సెంటర్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు బయలుదేరారు. వీరంతా 30 పోలీస్ యాక్ట్‌ను ఉల్లంఘించారు. ఎక్కువ రద్దీ ఉండే ప్రాంతం కావడం, ప్రజారవాణాకు అంతరాయం కలగడంతో, పోలీసులు కొల్లు రవీంద్రకు, టీడీపీ నేతలకు ధర్నాకు అనుమతి లేదని, ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని చెప్పి వెనక్కి వెళ్లిపోవాలని సూచించారు. దీంతో రెచ్చిపోయిన కొల్లు రవీంద్ర, అతని అనుచరులు పోలీసులను నెట్టుకుంటూ దుర్భాషలాడారు. ఈ క్రమంలో ఎస్‌ఐ శంకర ప్రసాద్‌పై కొల్లు రవీంద్ర చెయ్యి చేసుకున్నారు. మహిళ కానిస్టేబుళ్లపైనా టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ఎస్‌ఐ శంకర ప్రసాద్ చిలకపూడి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు 188, 341, 283, 353, రెడ్‌విత్ 34, సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 ఉల్లంఘనపైనా మరో కేసు నమోదు చేశారు. కొల్లు రవీంద్రను అరెస్ట్ చేసి గూడూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించగా అక్కడ కూడా గేట్లు తోసి, టీడీపీ నేతలు రభస చేశారు. తరువాత వారిని పోలీసులు కోర్టులో హాజరుపరచగా.. వ్యక్తిగత పూచీకత్తుపై న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు.

**పోలీస్ అధికారుల సంఘం ఖండన**

విధుల్లో ఉన్న ఎస్‌ఐపై దౌర్జన్యానికి పాల్పడి, పోలీసుల మనోభావాలను దెబ్బ తీసేందుకు ప్రయత్నించిన కొల్లు రవీంద్ర చర్యలను జిల్లా పోలీస్ అధికారుల సంఘం ఖండించింది. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జైపాల్, రాష్ట్ర పోలీసు అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ మస్తాన్ ఖాన్‌లు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.

# అక్రమ నిర్మాణాలపై హైకోర్టు కన్నెర్ర

సాక్షి, అమరావతి: అక్రమ నిర్మాణాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని హైకోర్టు స్పష్టం చేసింది. విజయవాడలో తమ ఆదేశాలకు విరుద్ధంగా ఓ భవనంపై నిర్మించిన మూడో అంతస్తుతో పాటు వాటర్ ట్యాంక్ నిర్మాణాన్ని కూల్చేయాలని పురపాలక శాఖ అధికారులను ఆదేశించింది. అవసరమైతే పోలీసుల సాయం తీసుకోవచ్చని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. విజయవాడ ఇస్లాంపేటలోని సయ్యద్ గులాబ్ వీధిలో తాము చేపట్టిన భవన నిర్మాణాన్ని కూల్చివేసేందుకు మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారని, వాటిని రద్దు చేయాలని కోరుతూ మీనాకుమారి జైన్, మోనికా సోలంకి 2020లో హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. యథాతథ స్థితి కొనసాగించాలని కోర్టు ఆదేశించింది. భవన నిర్మాణం విషయంలో పిటిషనర్లు నిబంధనల్ని ఉల్లంఘించారని మునిసిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది మనోహర్‌రెడ్డి కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కోర్టు నిజనిర్ధారణ కోసం అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించగా.. నిబంధనల ఉల్లంఘన నిజమేనని నివేదిక ఇచ్చారు. ఈ వ్యాజ్యాలు మరోసారి విచారణకు రాగా, ఈ వ్యాజ్యాల్లో ఇంప్లీడ్ పిటిషనర్ కనిశెట్టి లక్ష్మణరావు తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ కోర్టు యథాతథస్థితి ఆదేశాలిచ్చినా పిటిషనర్లు నిర్మాణాలను కొనసాగించారని తెలిపారు. దీంతో కోర్టు మరో అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించింది. భవనాన్ని పరిశీలించిన ఆయన అదనంగా మూడో అంతస్తు, దానిపై వాటర్ ట్యాంక్ నిర్మించారని నివేదిక ఇచ్చారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ తిల్హరీ పిటిషనర్ల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మూడో అంతస్తు, వాటర్ ట్యాంక్‌ను కూల్చివేయాలని ఆదేశించారు. ఆ ఆదేశాల అమలు తర్వాత 2020లో అధికారులిచ్చిన నోటీసులపై విచారణ చేస్తామన్నారు.



మూర్ఖులుండేది తెలివైనవాళ్ల లాభం కోసమే.
– ఫ్యోదర్ దోస్తోవ్‌స్కీ



సాక్షి

మంగళవారం, ఫిబ్రవరి, 7

# ఆ పాలన నేర్పిన పాఠాలెన్నో!

అధికారాంతమున చూడవలె ఆ అయ్య సౌభాగ్యముల్ అని నానుడి. పాకిస్తాన్ సైనిక నాయకుడిగా, ఆ పైన పాలకుడిగా చక్రం తిప్పిన జనరల్ పర్వేజ్ ముషారఫ్‌కు ఇది అక్షరాలా వర్తిస్తుంది. అధికారం పోయాక పరాయి దేశానికి పలాయనమై, ఆఖరికి అరుదైన వ్యాధితో ఆదివారం నిస్సహాయంగా కన్నుమూయాల్సి వచ్చింది. సైనిక దిగ్గజాలు అయూబ్, జియాల బాటలో నడిచి, పాకిస్తాన్‌ను నేరుగా పాలించే స్థాయికి ఎదిగిన ఈ జనరల్ మూటగట్టుకున్న అప్రతిష్ఠ అపారం. ఆ దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియ హఠాత్తుగా స్తంభించింది ఆయన వల్లే. 1999 నాటి కుట్రలో ప్రధాని నవాజ్ షరీఫ్ నుంచి అధికారం హస్తగతం చేసుకొని, 'ఛీఫ్ ఎగ్జిక్యూటివ్'గా, ఆ పైన సైనికాధ్యక్షుడిగా, చివరకు పౌర అధ్యక్షుడిగా తొమ్మిదేళ్ళ కాలం దేశాన్ని గుప్పెట్లో పెట్టుకొన్నారు. ఆఖరికి మెడ మీద అభిశంసన కత్తితో 2008లో అంత శక్తిమంతమైన అధినేత కూడా గద్దె దిగారు.

అనేక వివాదాలు ముసిరిన ముషారఫ్ పాలన చిత్రమైన పరస్పర వైరుధ్యాల గాథ. అవిభజిత భారతావనిలో ఢిల్లీలో పుట్టిన ఈ జనరల్ సైనికకుట్రకు పాల్పడినప్పుడు ప్రజా ప్రభుత్వాల అవినీతితో విసిగిన పాక్ పౌరసమాజం సంతోషించింది. ఆ సంతోషం తొందరలోనే ఆవిరైంది. పాక్ భద్రతా పరిస్థితిని చిక్కుల్లో పడేసిన పాపం ముషారఫ్‌దే. తీవ్రవాదంపై పోరులో ఆయన ద్వంద్వ నీతి ఆ దేశాన్ని నిప్పుల కుంపటి చేస్తే, ఆ రాజకీయ దుశ్చర్యలో తానే దగ్ధమైన దుఃస్థితి. దాయాది దేశంలో మరణశిక్ష పడ్డ ఏకైక సైనిక పాలకుడనే దుష్కీర్తి ఆయనదే. 2007లో రెండోసారి ఎమర్జెన్సీ విధించి, రాజద్రోహానికి పాల్పడ్డారన్న కారణంపై మరణశిక్ష పడింది. వైద్యచికిత్సకంటూ 2016లో దేశం విడిచి దుబాయ్ చేరి, అక్కడే స్వీయప్రవాసంలో తిరిగిరాని లోకాలకు తరలిపోయారు.

ముషారఫ్ వ్యవహారమంతా ఓ నిగూఢ ప్రహేళిక. నిరంకుశ పాలన సాగిస్తూనే, ఉదారవాద సంస్కరణలూ తెచ్చారు. మీడియా వర్ధిల్లడానికి వీలు కల్పించిందీ ఆయనే. ఆనక అవి తనకు అడ్డం తిరిగాక వాటి నోరు మూయించేందుకు ప్రయత్నించి, భంగపడ్డదీ ఆయనే. 1999 మేలో సైనిక ప్రధానాధికారిగా దుందుడుకుగా కార్గిల్ యుద్ధానికి కారణమై, పాక్ పరువు తీసిందీ ఆయనే. అదే అక్టోబర్‌లో కరాచీలో తన విమానం దిగనివ్వని ప్రధాని నవాజ్ షరీఫ్‌ను సాగనంపి, ఎమర్జెన్సీ విధించి పగ్గాలు చేపట్టి, ఆనక 2001లో ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ నుంచి దేశాధ్యక్షుడై, భారత్‌తో శాంతి ప్రయత్నాలు చేసిందీ ఆయనే. ఆ మాటకొస్తే ఆయన హయాంలోనే అయిదేళ్ళు భారత్, పాక్‌ల మధ్య శాంతి నెలకొంది. చిత్రంగా ఈ సైనిక నియంత ఏలుబడిలోనే 2003–04ల్లో సియాచిన్, కశ్మీర్ వివాదం దాదాపు పరిష్కారమయ్యే దాకా వెళ్ళింది. ఆఖరున ఆ అవకాశం చేజారింది.

1999 నుంచి తొమ్మిదేళ్ళు పాక్‌ను పాలించిన శక్తిమంతమైన దేశాధినేత ముషారఫ్. అధ్యక్షుడైన కొద్దినెలలకే 'తీవ్రవాదంపై పోరు' అంటూ దోస్తీ చేసిన అమెరికాని సైతం బురిడీ కొట్టించిన తంత్రం ఆయనది. అల్‌ఖాయిదా అధినేత ఒసామా బిన్ లాడెన్ ఆచూకీ కోసం అగ్రరాజ్యం జల్లెడ పడుతుంటే, అతణ్ణి పెరట్లోనే పెట్టుకొని కాలక్షేపం చేయగలిగారు. అలా ఇటు తీవ్రవాద విషనాగుతో, అటు 9/11 ఘటనతో తీవ్రవాదంపై శివాలెత్తుతున్న అమెరికాతో ఏకకాలంలో నెయ్యం నెరిపారు. ఈ కత్తి మీద సాము వికటించి, పాలు పోసిన పామే కాటేసింది. దేశాన్ని అమెరికాకు అమ్మేస్తున్నాడంటూ తీవ్రవాద బృందాలు రెండుసార్లు ఆయన ప్రాణాలు తీసేందుకు ప్రయత్నించాయి.

దేశంలో రాజ్యాంగ వ్యవస్థను పట్టాలు తప్పేలా చేయడం సహా ఆయన ఘోర తప్పిదాలు అనేకం. రాజకీయ మనుగడ కోసం వివిధ మతతత్త్వ పార్టీలతోనూ జట్టు కట్టారు. ఆఖరికి 2006లో బలూచ్ నేత అక్బర్ ఖాన్ బుగ్తీని హతమార్చడంతో బలూచిస్తాన్‌లో దిగజారిన పరిస్థితి ఇప్పటికీ సాధారణ స్థితికి రానే లేదు. బుగ్తీ హత్యతో ఆరంభమైన ముషారఫ్ పతనం దేశ ప్రధాన న్యాయమూర్తిని పక్కకు తప్పించాలన్న విఫలయత్నంతో వేగవంతమైంది. 2008లో కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ అభిశంసనకు సిద్ధమవడంతో అవమానకరమైన రీతిలో ముందుగానే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. మరో మూడు నెలలకు 26/11 ముంబయ్ దాడులతో భారత్ కూడా పాఠం నేర్చుకుంది. సైనిక నియంతతోనో, సైన్యాధ్యక్షుడితోనో మాట్లాడినంత మాత్రాన దాయాదితో సంబంధాలు మెరుగవడానికి అన్ని వర్గాలూ కలిసొస్తాయనుకుంటే అంతకన్నా అవివేకం లేదన్న చేదు నిజం తెలిసొచ్చింది.

ఇక, 2010లో ముషారఫ్ పెట్టిన 'ఆల్ పాకిస్తాన్ ముస్లిమ్ లీగ్' సైతం అనేక ఇతర ఏకవ్యక్తి రాజకీయ పార్టీల లానే అచిరకాలంలోనే తెర మరుగైంది. దేశ సమస్యల్ని పరిష్కరించగల సత్తా సైన్యానికే ఉందని గుడ్డిగా నమ్మిన పాక్ సైనిక నేతల్లో కడగొట్టువాడైన ముషారఫ్ కష్టాలు కొనితెచ్చారు. ఇస్లామాబాద్‌లో అధికార కేంద్రంగా ఆనాటి నుంచి సైన్యం సాగిస్తున్న ఆటకు ఇప్పటికీ తెరపడనే లేదు. ఆయన హయాంలో జరిగిన అనేక నిర్ణయాలే ఇవాళ్టికీ పాక్ రాజకీయ, ఆర్థిక, భద్రతా రంగాల ముఖచిత్రం ఇలా మిగలడానికి కారణం. నేడు రాజకీయ అనిశ్చితి, తీవ్రవాదుల ఎదురుదాడి మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్తానీ పాలక శిష్టవర్గం, పౌరులు, సైన్యం ముషారఫ్ శకం నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు అనేకం. ఆయన తప్పొప్పులు పాకిస్తానే కాదు... పొరుగుదేశమైన మనతో సహా ప్రపంచం ఎప్పటికీ మర్చిపోదు. ఎక్కడైనా, ఎప్పుడైనా రాజకీయాల్లో సైనిక జోక్యం దుష్పరిణామాలు అంత తొందరగా ఆగవు.

## గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.విదియ రా.3.03 వరకు, తదుపరి తదియ, **నక్షత్రం:** మఖ సా.4.55 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.1.34 నుండి 3.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు తదుపరి రా.10.58 నుండి 11.50 వరకు, **అమృతఘడియలు:** లేవు

**సూర్యోదయం :** 6.36
**సూర్యాస్తమయం:** 5.54
**రాహుకాలం :** ప.3.00 నుండి 4.30 వరకు
**యమగండం :** ఉ.9.00 నుండి 10.30 వరకు

# ఏనాడో గాడితప్పిన కేంద్ర బడ్జెట్లు!



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు


2023 సంవత్సర కేంద్ర బడ్జెట్ తీరుతెన్నుల్ని పరిశీలిస్తే– 'అన్నం మెతుకునీ/ ఆగర్భ శ్రీమంతుణ్ణీ వేరు చేస్తే/ శ్రమ విలువేదో తేలిపోదూ?' అని కవి అలిశెట్టి ప్రభాకర్ అంటించిన చురక జ్ఞాపకం వచ్చింది. దేశ ప్రజాబాహుళ్యం స్థితిగతుల్ని పాలకులు పరిశీలించకపోబట్టే శ్రమ విలువను 75 ఏళ్లుగా గణించలేకపోయారు. ప్రణాళికలకూ, ఆచరణలో అమలు చేయని అతిశయోక్తులకూ మాత్రం తక్కువేమీ లేదు! భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దేశీయ ప్రైవేటు సంస్థల పరం చేసి, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను 'శంకరగిరి మాన్యాలు' పట్టించడానికి అన్ని రకాలా సిద్ధమయింది పాలకవర్గం! ఇదే అదునుగా గాంధీజీ పేరిట ప్రారంభించిన 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' కాస్తా నీరు కార్చడానికి పాలకులు నడుం కట్టారు.

దేశ తొలి ప్రధానమంత్రి పదవిలోకి రాక ముందు, దేశానికి స్వాతంత్య్రమనేది ఏ పరిస్థితుల్లో 'నామమాత్రపు స్వాతంత్య్రం కూడా కాదో' ఇలా స్పష్టం చేశారు: ''ప్రత్యేక హక్కులనూ, స్వార్థ ప్రయోజనాలనూ అనుభవిస్తున్న ఏ ప్రత్యేక సంపన్న వర్గమూ తమ హక్కుల్ని తాముగా వదులుకున్నట్టు చరిత్రకు దాఖలాల్లేవు. సాంఘిక మార్పులు రావాలంటే ఒత్తిడి, లేదా బల ప్రయోగం అవసరం. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించడమంటే అర్థం, ఈ స్వార్థ ప్రయోజనాలకు భరతవాక్యం పలకడమనే. విదేశీ ప్రభుత్వ పాలన తొలగి దాని స్థానంలో స్వదేశీ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఈ స్వార్థ ప్రయోజనాలను ముట్టకుండా అలాగే అట్టిపెడితే ఇక అది నామమాత్రపు స్వాతంత్య్రం కూడా కాదు''.

ఇంతకన్నా మరో గొప్ప సత్యాన్ని 1992లో సుప్రసిద్ధ అమెరికన్ పత్రిక 'టైమ్' ప్రకటించింది: ''కమ్యూనిజం పతనం కావొచ్చు. కానీ క్యాపిటలిజమూ, ప్రజాస్వామ్యమూ శాశ్వతంగానూ, ప్రపంచ వ్యాప్తంగానూ జయప్రదం కాగలగవన్న గ్యారంటీ ఏమీ లేదు''! ఎందుకంటే మొదటి ప్రపంచ యుద్ధం నాటికి పెరిగి పెద్ద మహమ్మారి రూపం దాల్చిన అమెరికా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని 'చిట్కా వైద్యాల'తో ఉపశమింప జేసుకోవడమే గానీ ఆ సంక్షోభ లక్షణాలు ఈ రోజుకీ సమసిపోలేదు. కనుకనే అమెరికా ఆశీర్వాదాలతోనే నెలకొన్న ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థలలో అత్యున్నత స్థాయి అధికారిగా, సలహాదారుగా ఈ సంస్థలను విశ్వసించి రంగంలోకి దిగి ఎలాంటి దారుణానుభవం చూడవలసి వచ్చిందో వివరించారు డేవిసన్ బుధూ. ఇప్పటికీ అమెరికా, ప్రపంచబ్యాంకు సంస్థలను నమ్ముతున్న భారత నాయకులు డేవిసన్ బుధూ అనుభవాల నుంచి గుణపాఠం తీసుకోలేక పోతున్నారు. చివరికి ఆంగ్లో – అమెరికన్ సంస్థలే భారత ఆర్థిక వ్యవస్థను పాలకులు నిర్వహిస్తున్న తీరుపై వ్యంగ్యాస్త్రాలు వదులు తున్నా 'మనసూ, చర్మం' మందబారిపోయి దులిపేసుకునే దశలో ఉన్నారు.

ఆసియా, ఆఫ్రికాలలో తన దారుణానుభవాలను డేవిసన్ ఇలా గుండె బరువుతో ప్రపంచం కళ్లముందుంచారు (బుధూ 1988లో అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ అప్పటి మేనేజింగ్ డైరెక్టర్ మైకెల్ కామ్డెసెస్‌కు రాసిన సుదీర్ఘ రాజీనామా): ''మీరు లాటిన్ అమెరికా, కరేబియన్, ఆఫ్రికా దేశాల ప్రభుత్వాలకూ, ప్రజలకూ అందించమని నా చేతికి అందించిన వరల్డ్ బ్యాంక్ – ఐ.ఎం.ఎఫ్ సంస్కరణల ఔషధాన్నీ, రకరకాల చిట్కాలనూ (బ్యాగ్ ఆఫ్ ట్రిక్స్) సంవత్సరాల తరబడిగా అందజేస్తూనే వచ్చాను. కానీ ఏళ్ల తరబడిగా ఈ దేశాల్లో గడించిన అనుభవం దృష్ట్యా నా పదవికి రాజీనామా చేస్తున్నాను. ఎందుకంటే, ఆకలితో అలమటిస్తున్న కోటానుకోట్ల సామాన్య ప్రజల రక్తంతో నా చేతులు రక్తసిక్తమయ్యాయి. మలినమై పోయిన ఈ నా చేతుల్ని కడుక్కోవడానికి నేను తీసుకున్న మంచి నిర్ణయమే ఈ రాజీనామా. అయ్యా! కామ్డెసెస్ గారూ! ఈ దేశాల్లో మనం చేస్తున్న పనుల వల్ల పేదల రక్తం నదులై పారుతోంది. ఒక్కోసారి నాలో నేననుకుంటాను – ఐఎంఎఫ్ బ్యాంకుల తరపున మీ పేరిట, మీకు ముందు పని చేసిన అధిపతుల పేరిట లేదా మీ అధికార ముద్రల చాటున నేను చేయవలసి వచ్చిన పాపాలను కడిగేసుకోవడానికి మొత్తం ప్రపంచంలో దొరికే సబ్బులు కూడా ఏ మూలకూ చాలవని.'' (ఎనఫ్ ఈజ్ ఎనఫ్: 1988).

## రెండో మాట





ఆర్.కె. లక్ష్మణ్ పాత కార్టూన్

కాగా, కడిగి పారేసిన ఆ 'సబ్బుల్ని' ఇండియాలో మొదటగా పీవీ నరసింహారావు హయాంలో అందుకుంటే, వాటిని ఆంధ్రప్రదేశ్‌లో వాడి ప్రజలకు 'టోపీ' పెట్టడానికి ప్రయత్నించినవాడు ప్రపంచ బ్యాంక్ 'పెంపుడు బిడ్డ' చంద్రబాబు! ఇక భారత ఆర్థిక వ్యవస్థను పూర్తిగా దేశీయ ప్రైవేటు సంస్థల పరం చేసి, లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను 'శంకరగిరి మాన్యాలు' పట్టించడానికి అన్ని రకాలా సిద్ధమయింది బీజేపీ పాలకవర్గం! ఇదే అదునుగా గాంధీజీ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని' నీరు కార్చడానికి పాలకులు నడుం కట్టారు. ఆ పథకం కింద కేటాయింపులన్నీ దారి మళ్లుతున్నాయి. పైగా 2023 బడ్జెట్ ఏడాది కాలపరిమితికి మించకపోయినా, దేశ స్వాతంత్య్రం వందేళ్లు పూర్తి చేసుకునే సమయానికి అంటే 2047 నాటి 'లక్ష్యాల దిశగా ఈ బడ్జెట్ ఉంద'ని స్వయంగా ప్రధానమంత్రి 'కోత' కోయడాన్ని ఏమనాలో అర్థం కావడం లేదు.

ఇండియా లాంటి వర్ధమాన దేశాలలోని కారుచౌక కూలీరేట్ల ఫలితంగా విదేశీ కంపెనీలు పోటీ మీద ఇండియాలో ప్రవేశించి, ఉద్యోగుల్ని తొలగించడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితిని అదుపు చేయకపోగా ఆ విధానాలనే ప్రభుత్వ సంస్థల ఉద్యోగులకు ఎసరు పెట్టడంలో పాలకులు అనుసరిస్తూ, ప్రైవేటు వారికి 'ఆదర్శం'గా నిలుస్తున్నారు. దీన్ని ఎవరో కాదు, స్వయానా 'అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఇంటర్నేషనల్ ఎకనామిక్స్' డైరెక్టర్ సి.ఫ్రెడ్ బెర్గ్‌స్టెన్ ఎదురు తన్నిన ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్ బ్యాక్‌లాష్) అని వర్ణించాల్సి వచ్చింది. 'వ్యవస్థాగతమైన సర్దుబాట్లు అంటే, 'ఖర్చులు తగ్గించుకుని ఉద్యోగాల నుంచి పౌరుల్ని తొలగించేయడమే'నని బెర్గ్‌స్టెన్ స్పష్టం చేశాడు. స్విస్ బ్యాంకులు, తదితర విదేశీ బ్యాంకుల్లోకి దొంగ చాటుగా ప్రవేశించిన డబ్బును తిరిగి దేశంలోకి తెచ్చి దేశ ప్రజలకు కుటుంబం ఒక్కింటికి రూ. 15 లక్షల చొప్పున పంచుతామన్న పాలకులు ఆచరణలో మొండి చేయి చూపించడం మరపురాని అనుభవంగా మిగిలి పోయింది. 'కోవిడ్' వల్ల ప్రజా బాహుళ్యానికి కలిగిన నష్టం కన్నా దాని పేరిట జరిగిన మిలాఖత్ వ్యాపార లావాదేవీల వల్ల ప్రజలకు వాటిల్లిన నష్టం ఎక్కువ.

పోతన భాగవత కథల్లో 'రహూగణుడ'నే ఒక అహంకారి ఉంటాడు. అతడెక్కిన పల్లకీ ఈ దేహమే. కానీ, దాన్ని మోసే బోయీలు 'ఓంకారాన్ని' వల్లిస్తూ నడుస్తారు, అలసట తెలియకుండా ఉండటం కోసం. పల్లకీలో కూర్చున్నవాడి ప్రయాణం మాత్రం సుఖంగానే సాగుతుంది. నేడు మన దేశ ప్రజల్ని పాలకులు పల్లకీ బోయీలుగా మార్చారు. నేటి దేశ వ్యవసాయ సంక్షోభానికి పాలకుల విధానాలు ఎలా దోహదం చేస్తున్నాయో ఆంత్రోపాలజిస్ట్ గ్లెన్ డేవిస్‌స్టోన్ వెల్లడించాడు: ''పాలకులు వ్యవసాయం పేరిట వెచ్చిస్తున్న డబ్బంతా రైతాంగ శ్రేయస్సుకు కాదు, వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుతున్న పారిశ్రామిక వేత్తల శ్రేయస్సు కోసం''.

క్రీ.పూ. 2100 సంవత్సరంలోనే సుమేరియా ఏలికలు ఆర్థిక వ్యవస్థను ప్రజాపరం చేసి ఎలా ప్రజా బాహుళ్యాన్ని కరువు కాటకాలు లేకుండా కాపాడుతూ వచ్చిందీ చరిత్ర నమోదు చేసింది. బాబిలోనియా, ఈజిప్టులలో సహితం రాచరిక పాలనల్లోనూ ప్రజలు సుఖంగా జీవించారన్న చరిత్ర దాఖలాలు ఉన్నాయి. కానీ ఇప్పటికీ భారత ప్రజలకు మసకబారని ఉషోదయాన్ని 75 ఏళ్ల స్వాతంత్య్రం తరువాత కూడా పాలకులు ప్రసాదించగల స్థితిలో లేకపోవడం విషాదకరం.

కరెన్సీ సంక్షోభం వల్లనే దేశ పరిస్థితులు ఒడుదొడుకుల్లో పడ్డాయని పాలకులు చెప్పే మాటలు విని సుప్రసిద్ధ వ్యంగ్య చిత్రకారుడు ఆర్.కె. లక్ష్మణ్ గతంలో ఓ కార్టూన్ వేశాడు. ఆ కార్టూన్‌లో ఉన్న పేదలంతా పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ 'ఇది మనం పుట్టినప్పటి నుంచీ నోరు మూసుకుని అనుభవిస్తున్నదే కదరా' అనుకుంటారు. ఆ తంతే 75 ఏళ్ల స్వతంత్ర భారతంలోనూ కొనసాగుతూండటం సిగ్గుచేటు.

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



## సోషల్ మీడియా

### మెరుగుపరచాలి



ఈ 'మైక్రోసాఫ్ట్ టీమ్స్' అనవసరంగా సంక్లిష్టంగా ఉంది. అదే గూగుల్ మీట్స్, జూమ్ లాంటివి వాడుకోవడానికి చాలా సరళంగా ఉన్నాయి.
– నిఖిల్ కామత్, ఆంట్రప్రెన్యూర్

### భారమైన గుండె



టర్కీ, సిరియా, లెబనాన్, ఇంకా భూకంప ప్రభావిత ప్రదేశాలన్నీ గుండెను భారం చేశాయి. చనిపోయినవారి మీద అల్లాహ్ దయ ఉండనీ, బతికి ఉన్నవారికి సాంత్వన ఇవ్వనీ. ఆమీన్.
– ఒమర్ సులేమాన్, ఇమామ్

### మూడో ముచ్చట



భారతీయ సంగీత దర్శకుడు రిక్కీ కేజ్ తన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కుగానూ తన కెరీర్‌లో మూడో గ్రామీ అవార్డు గెలుచుకున్న సందర్భంగా అభినందనలు. మన పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన చైతన్యాన్ని మీరు మీ సంగీతం ద్వారా వ్యాపింపజేస్తారని ఆశిస్తాను.
– నవీన్ పట్నాయక్, ఒడిశా ముఖ్యమంత్రి

### చెప్పేందుకే నీతులా?



కేంద్ర బడ్జెట్ 2023–24 ప్రకారం, కేంద్ర ప్రభుత్వం రోజుకు రూ. 4,227 కోట్లు అప్పు తెస్తుంది. రూ.2,958 కోట్లు వడ్డీగా చెల్లిస్తుంది. అయినప్పటికీ, అది అప్పులు తేవడం గురించి రాష్ట్రాలకు ప్రబోధిస్తోంది. నీతులు చెప్పే ముందు ఆచరించాలి.
– కె. నాగేశ్వర్, మాజీ ఎంఎల్‌సీ, ప్రొఫెసర్

### శాస్త్రీయ జోస్యం?



భారీ భూకంపం వల్ల బాధితులైన మధ్య టర్కీలోని ప్రతి ఒక్కరి పట్లా నాకు దుఃఖం కలుగుతోంది. నేను ఇంతకుముందు చెప్పినట్టు, క్రీ.శ. 115, 526 సంవత్సరాల మాదిరిగానే ఇది సంభవించింది. ఫిబ్రవరి 4– 5లలో ఏర్పడ్డ సంక్లిష్ట గ్రహాల జ్యామితిని అనుసరించే ఈ భూకంపాలు ఎప్పుడూ వస్తాయి.
– ఫ్రాంక్ హూగర్‌బీట్స్, నెదర్లాండ్స్ పరిశోధకుడు

### మీరెలా మాట్లాడుతారు?



ఉమ్మడి పౌర స్మృతి అప్రజాస్వామికం అన్న ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఎంపీఎల్‌బీ) వ్యాఖ్యలను 'పస్మాందా ఆందోళన్' ఖండిస్తోంది. ముస్లింలలో 90 శాతంగా ఉన్న పస్మాందా జనాభాకు ఈ బోర్డులో ఏ ప్రాతినిధ్యమూ లేదు. అందరు ముస్లింల తరఫున మాట్లాడే నైతిక హక్కు ఎంపీఎల్‌బీకి లేదు.
– ఫయ్యాజ్ అహ్మద్ ఫైజీ, పస్మాందా యాక్టివిస్ట్

### బాగుపడలేం



ప్రతీ ఎన్నికైన ప్రతినిధి, ప్రభుత్వ అధికారి, తనను తాను వీఐపీ అని చెప్పుకొనే వ్యక్తి ఎప్పటివరకు ప్రత్యేక గౌరవం అందుకుంటూ, అన్ని నియమాలను ఉల్లంఘిస్తుంటారో– అప్పటివరకూ మన భారతీయులకు అద్భుతమైన మౌలిక సదుపాయాలు ఉండవు. అవాంతరాలు లేని ప్రజా సేవలు లభించవు– వాటికోసం మనం భారీ మూల్యం చెల్లిస్తున్నప్పటికీ!
– సుచేతా దలాల్, జర్నలిస్ట్

## ఇన్‌బాక్స్

### ప్రజ్ఞాశాలి వేటూరి ప్రభాకరశాస్త్రి

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో ప్రముఖ కవిగా, భాషా పరిశోధకుడిగా, సుప్రసిద్ధ చరిత్రకారుడిగా, ప్రసిద్ధ పీఠికా రచయితగా వేటూరి ప్రభాకరశాస్త్రి బహుముఖ ప్రజ్ఞాశాలి. తెలుగులో తొలి పదం అమరావతి శిలాఫలకంపై ఉన్న 'నాగబు'ను గుర్తించిన పరిశోధకుడు. తెలుగుభాషా చారిత్రక సాహిత్య నిర్మాణానికి అవిరళ కృషి చేసిన అవిశ్రాంత పండితుడు. ఆయన 'పీఠికలు సాహితీ సుగంధ వాటికలు' అని విమర్శకులు ప్రశంసించారు. ప్రభాకరశాస్త్రి 1888 ఫిబ్రవరి 7వ తేదీన కృష్ణాజిల్లా పెదకళ్లేపల్లిలో జన్మించారు. 16 ఏళ్ల వయసులో బందరులో చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి... ఉన్నత పాఠశాలలో తెలుగు పండితుడిగా ఉన్నారని తెలిసి తన సహాధ్యాయులతో కలసి వేంకటశాస్త్రి దగ్గర చదువుకొనేందుకు వెళ్లారు. 19వ ఏట మద్రాసు వెస్లీ మిషన్ హైస్కూల్‌లో రెండేళ్లు తెలుగు పండితుడిగా పనిచేశారు. ఆ సమయంలో ప్రాచ్యలిఖిత భాండాగారానికి వెళ్లి గ్రంథాలు చదువుతుండే వారు.

కవిగా కడుపుతీపు, కపోతకథ వంటి ఖండకావ్యాలు రాశారు. శృంగార శ్రీనాథం, క్రీడాభిరామం, బసవ పురాణం, రంగనాథ రామాయణం, తంజావూరు రాజుల చరిత్ర వంటి గ్రంథాలను పరిష్కరించి ప్రచురించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, రెడ్డి రాజులు వంటి చారిత్రక గ్రంథాలను ప్రామాణికంగా రచించారు. ప్రసిద్ధ సంస్కృత రూపకాలైన ప్రతిమ (1910), కర్ణభారం, మధ్యమవ్యాయోగం (1913), నాగానందం (1914) వంటివి అనువదించారు. ప్రభాకర శాస్త్రి చాటుచర్య, ఉద్భటారాధ్య చరిత్ర, బసవ పురాణం, సుగ్రీవ విజయం వంటి 40 గ్రంథాలను పరిష్కరించి విపులమైన పీఠికలతో ప్రచురించిన ప్రజ్ఞాశాలి. తెలుగులో క్రీ.శ. నాలుగో శతాబ్ది నుంచి 12వ శతాబ్ది వరకు శాసనాలను సేకరించి సముచిత వ్యాఖ్యానంతో 'శాసన సంకలం'గా ప్రచురించిన శాసన పరిశోధకుడు. తెలుగువారికి వారు చిరస్మరణీయులు.

– డా॥ పీవీ సుబ్బారావు, చిలకలూరి పేట
(నేడు వేటూరి ప్రభాకర శాస్త్రి జయంతి)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

# 'ప్రజా బంధు' రాజకీయాల్లో...

## అభిప్రాయం



డా॥ కాలువ మల్లయ్య

మూడువేల ఆరువందల నలభై ఎనిమిది కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల కష్టసుఖాలను, తెలుసుకున్న జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే వాటిని అమలు చేసే కార్యక్రమంలో మునిగిపోయారు. ప్రజాసేవను ఆదర్శంగా తీసుకొని కమిట్‌మెంట్ రాజకీయాలను జీర్ణించుకొని తన మ్యానిఫెస్టోని అమలు చేయడంలో నూటికి తొంబ్బైతొమ్మిది పాళ్లు విజయం సాధించారనడంలో సందేహం లేదు. జగన్ కంటే ముందు రాష్ట్రాన్ని పాలించిన నాయకులకు రాజ కీయాల్లో కమిట్‌మెంట్ అసలే నచ్చదు. అందుకే వైసీపీ ప్రభుత్వం తీసుకున్న, తీసుకుంటున్న ఏ విప్లవాత్మక చర్యనైనా వ్యతిరేకించడమే విధానంగా పెట్టుకున్నారు. దీనిలో భాగంగానే రాష్ట్రంలోని వెనుకబడిన కులాలూ, అణగారిన జాతులూ, పేదలూ... మొత్తంగా బహుజనవర్గాలు లబ్ధి పొందే పథకాలు ప్రవేశపెట్టడం, అమలు చేయడాన్ని వీరు విమర్శిస్తున్నారు.

ఈ మూడున్నరేళ్లలో ఆంధ్ర ప్రజలకు జగన్ పాతికేళ్ళ భరోసా నిచ్చారు. వ్యవసాయం దండుగనీ, బీసీల తోకలు కత్తిరిస్తాననీ అన్న బాబు ఈ వర్గాలను ఓటుబ్యాంక్ గానే చూశారు. కానీ వైసీపీ ప్రభుత్వం వీరిని దేశ వెన్నెముకగా చూస్తోంది. వ్యవసాయం దండగన్న స్థితి నుంచి వ్యవసాయాన్ని పండుగను చేసే దిశగా వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఈ దేశ నాగరికతకు పట్టుగొమ్మలు మాత్రమే కాదు సర్వ సంపదల సృష్టికర్తలూ బీసీ లేనని జగన్ చెప్పడం ఆ వర్గాల పట్ల ఆయనకున్న ప్రేమకు నిదర్శనం. శ్రమ జీవులూ, సర్వ సంపదల సృష్టికర్తలూ అయిన బీసీలకు రాజ్యాధికారంలోనూ తగిన ప్రాతినిధ్యమివ్వాలని భావించి... వార్డ్ మెంబర్ నుండి మంత్రి పదవుల వరకూ దాదాపు 85 వేలమందికి వివిధ హోదా లున్న పదవులు ఇచ్చిన ఏకైక నాయకుడు జగన్.



విద్యారంగంలో అందరికీ విద్య, నాణ్యమైన విద్య, వారు కోరుకున్న విద్యను ఉచితంగా అందజేయడం కోసం జగన్ మూడున్నర సంవత్సరాలలో తీసుకున్న చర్యలు తెలుగుజాతి ఎన్నటికీ మరిచి పోలేనివి. ఆరోగ్యశ్రీని మరిన్ని జబ్బులకు విస్తరింపజేయడమే కాకుండా... ప్రభుత్వ వైద్యశాలలను అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్ది ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ మంచి వైద్యం కూడా అందిస్తోంది వైసీపీ ప్రభుత్వం. కాన్షీరామ్ చెప్పినట్లు... మనీ, మాఫియా, మీడియాలను ఉపయోగించుకొని రాజకీయాలను నడపాలని అనుకుంటున్న వారికి వైసీపీ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు నచ్చక పోవడం విడ్డూరమేమీ కాదు.

ఉద్యోగాలు కల్పించలేదని విమర్శ చేయడం మరో అన్యాయమైన నింద. ప్రైవేటీకరణ దిక్కుకు పయనిస్తున్న ఏపీఎస్ఆర్టీసీని కాపాడి 54 వేల మంది ఉద్యోగలను రెగ్యులరైజ్ చేసింది వైసీపీ ప్రభుత్వం. ఆరోగ్య రంగంలో 46 వేల ఉద్యోగాలిచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలుగా లక్ష ఖాళీలు నింపారు. లక్షలాది మంది గ్రామ వలంటీర్లను నియమించారు. ఇవన్నీ ఉద్యోగాలు కావా? ఎవరెన్ని అవరోధాలు కల్పించినా... సామాన్య ప్రజలు, బహుజన ప్రజలు, పేదల సుఖమయజీవనం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టారు సీఎం జగన్. కానీ ఆ సంక్షేమ పథకాలకు ఉచితాలు అంటూ గేలి చేస్తూ పేదల కడుపు నింపే చర్యలను అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారు ప్రతి పక్షాల వారు. జగన్ మూడున్నరేళ్ళలోనే ఆంధ్ర ప్రజలకు పాతికేళ్ళ భరోసాను చూపితే... పాలనా కాలం పూర్తయ్యే సరికి ఏ పార్టీకీ పుట్టగతులుండని పరిస్థితులు రావడం ఖాయం. అందుకే పాద యాత్రలు, అనైతిక పొత్తులు, అబద్ధపు ప్రచారాలు!

వ్యాసకర్త కథా, నవలా రచయిత
మొబైల్: 91829 18567

# సుఖం వెంటే దుఃఖం!

ప్రాపంచిక సుఖాలు ప్రధానంగా నాలుగు కారణాల వల్ల కలుగుతాయి. ధన కనక వస్తు వాహనాల లాంటి భౌతిక సాధనాల ద్వారా, సాటి వారికంటే ఏదో విషయంలో ఎంతో కొంత ఉన్నత స్థాయి సాధించడం ద్వారా, మనం ప్రేమించే వారితో సాన్నిహిత్యం ద్వారా; అసలు సజీవంగా, స్వేచ్ఛగా ఉండటం అనే స్థితి మాత్రం ద్వారా. కానీ ఈ నాలుగు విధాల సుఖాలలోనూ దుఃఖ బీజాలు నిక్షిప్తమయ్యే ఉంటాయి.

రామాయణంలో, వనవాసంలో ఉన్న రాముడిని భరతుడు కలిసినప్పుడు, ఆ సోదరుల మధ్య జరిగిన చర్చ అద్భుతంగా వివరించాడు ఆదికవి.

జ్యోతిర్మయం

ఆ చర్చలో సుఖ సాధనాల గురించి శ్రీరాముడు చెప్పిన ఒక చక్కని సూక్తి ఉంది: సర్వే క్షయాంతాః నిచయాః, పతనాంతాః సముచ్ఛ్రయాః/సంయోగాః విప్రయోగాంతాః, మరణాంతం హి జీవితమ్.

మనం పోగుచేసుకొనే సుఖ సాధనాల రాశులన్నీ (నిచయాః) క్రమంగా క్షయించి తరిగిపోయేవే. వాటి వలన మనకు కలిగే సుఖం మరింత త్వరగా క్షయించిపోతుంది. సాటివారికంటే మనం ఎక్కువ 'గొప్ప'తనాలు (సముచ్ఛ్రయాః) సాధించినా, అవి చిరకాలం ఉండవు. పదవీచ్యుతి, పదవీ విరమణ లాంటి అనేక కారణాలవల్ల ఉన్నత స్థానాలనుండి ఎప్పటికో ఒకప్పటికి పతనం తప్పనిసరి. అందాల రాణి కలకాలం అందాల రాణిగా ఉండదు. మహాబలశాలి మహాబలశాలిగానే ఉండిపోడు. తాడి తన్నే ఉన్నతుడి తలదన్నే మరింత ఉన్నతుడు పుట్టుకురావడం ప్రకృతి ధర్మం. ప్రేమించిన వారి సాన్నిహిత్యం ఆహ్లాదకరమే. కానీ, అక్కడా అదే చిక్కు. యావజ్జన్మమూ ఏక రీతిగా సాగే బంధాలు ఎక్కడుంటాయి? సంయోగాః విప్రయోగాంతాః. అన్ని కలయికలకూ, విడిపోవడం కూడా తప్పనిసరి.

అసలు అన్ని సుఖానుభవాలకూ ఆధారమైన శరీరమూ, ప్రాణమూ అనేవే అశాశ్వతాలు. అందుకే, సుఖ దుఃఖాలు తాత్కాలికాలని మరచి పోకుండా, వాటిని తామరాకు మీద నీటిబొట్టులా, వైరాగ్య భావంతో అనుభవిస్తూ, శాశ్వతమైన ఆనందం కోసం యత్నించమని శాస్త్రాలు చెప్తాయి.

– ఎం. మారుతిశాస్త్రి

## క్లుప్తంగా...

### శ్రీసిటీలో బ్లూస్టార్ క్లైమెటిక్ ఆటోమేటెడ్ స్మార్ట్ ఫ్యాక్టరీ ఉత్పత్తులు ప్రారంభం

- అందుబాటులోకి నూతన శ్రేణి రూము ఏసీలు



మాట్లాడుతున్న బ్లూస్టార్ ఎండీ బి.త్యాగరాజన్

**వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా):** శ్రీసిటీ సెజ్‌లో ఏర్పాటైన బ్లూస్టార్ పరిశ్రమ రూ.350 కోట్ల వ్యయంతో తొలిదశ ఉత్పత్తులను ప్రారంభించినట్లు క్లైమెటిక్ ఆటోమేటెడ్ స్మార్ట్ ఫ్యాక్టరీ ఎండీ బి.త్యాగరాజన్ తెలిపారు. సోమవారం శ్రీసిటీ బ్లూస్టార్ పరిశ్రమలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌ను గట్టిగా అనుసరించే బ్లూస్టార్ క్లైమెటిక్ లిమిటెడ్ శ్రీసిటీలో అత్యాధునిక కర్మాగారాన్ని నెలకొల్పి ఈ ఏడాది జనవరిలో వాణిజ్యపరమైన ఉత్పత్తులను ప్రారంభించిందన్నారు. దశల వారీగా రూ. 500కోట్ల పెట్టుబడి పెట్టేందుకు నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. మొదటి ఏడాది 3లక్షల యూనిట్ల ఉత్పత్తులు తయారు చేస్తామని, క్రమంగా ఈ ఉత్పత్తిని 12 లక్షల యూనిట్లకు పెంచుతామన్నారు. రూము ఏసీ సెగ్మెంట్‌లో మరింత పెరుగుదలను వేగవంతం చేయడానికి టైర్-1తో పాటు టైర్-2,3,4,5 మార్కెట్లపై బ్లూస్టార్ దృష్టి సారించినట్లు ఆయన స్పష్టం చేశారు. నూతన శ్రేణిలో త్రీస్టార్, ఫోర్‌స్టార్, ఫైవ్‌స్టార్ ఇన్వర్టర్, స్ప్లిట్ ఎయిర్ కండిషనర్లు, 0.8 టీఆర్ నుంచి 2టీఆర్ వరకు వివిధ కూలింగ్ సామర్థ్యం కలిగినవి అందుబాటులో ఉన్నాయని ఎండీ బి. త్యాగరాజన్ వివరించారు. ఈ కంపెనీ ఏసీలు హాట్ అండ్ కోల్డ్ టెక్నాలజీ ద్వారా అత్యల్ప ఉష్ణోగ్రతలతో కూడా పనిచేస్తాయని ఆయన అన్నారు.

### రెడీమేడ్ దుస్తుల తయారీదారులకు ఆప్కో ఆహ్వానం

**సాక్షి, అమరావతి:** రెడీమేడ్ దుస్తులు కుట్టించేందుకు ఆసక్తి కలిగిన ఏజెన్సీల నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత పారిశ్రామికుల సహకార సంఘం లిమిటెడ్ (ఆప్కో) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎంఎం నాయక్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రెడీమేడ్ దుస్తుల తయారీదార్లు తమ సంస్థ పూర్తి వివరాలతో ఆప్కో కేంద్ర కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పిల్లల నుంచి పెద్దల వరకు అన్నిరకాల రెడీమేడ్ వస్త్రాలను ఆప్కో సిద్ధం చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11వతేదీ లోపు విజయవాడ ఏలూరు రోడ్డు రామమందిరం సమీపంలోని కేంద్రకార్యాలయానికి దరఖాస్తులు చేరాలని తెలిపారు. మరింత సమాచారం కోసం ఆఫీసు పనివేళల్లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

### 11 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



**శ్రీశైలం టెంపుల్:** శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. భూకైలాసంగా ప్రసిద్ధి చెందిన ఈ దివ్యక్షేత్రంలో 11 రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిపేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. 11న ప్రత్యేక పూజలతో ఉత్సవాలను ప్రారంభిస్తారు. సాయంత్రం అంకురార్పణ అనంతరం శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తారు. 12న స్వామి, అమ్మవార్లకు భృంగి వాహనసేవ, 13న హంస వాహన సేవ, దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాల సమర్పణ, 14న మయూర వాహన సేవ, టీటీడీ తరఫున పట్టు వస్త్రాల సమర్పణ ఉంటుంది. అలాగే 15న రావణ వాహనసేవ, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాల సమర్పణ, 16న పుష్పపల్లకి సేవ, 17న గజ వాహనసేవ, 18న మహాశివరాత్రి సాయంత్రం ప్రభోత్సవం, రాత్రి ఏడు గంటలకు నందివాహన సేవ, రాత్రి 10 గంటలకు లింగోద్భవకాల మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పాగాలంకరణ, రాత్రి 12 గంటలకు స్వామి, అమ్మవార్లకు కళ్యాణోత్సవం జరుగుతుంది. 19న సాయంత్రం స్వామి, అమ్మవార్ల రథోత్సవం, తెప్పోత్సవం, 20న పూర్ణాహుతి, రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణ, 21న అశ్వవాహన సేవ, రాత్రి ఎనిమిది గంటలకు పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో 10 కంపార్టుమెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 78,340 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 27,063 మంది తలనీలాలు సమర్పించారు. హుండీలో రూ.4.30 కోట్లు వేశారు. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

# శ్రీవారి సేవలో ఏపీటీడీసీ!

## తిరుమలకు వచ్చే భక్తులకు సౌకర్యవంతమైన దర్శనం

- టీటీడీ కోటా టికెట్లు పొందే వివిధ రాష్ట్రాల పర్యాటక సంస్థలకు బ్యాకెండ్ సేవలు
- ప్రతి 25 మంది భక్తులకు ఒక గైడ్ ఏర్పాటు




**సాక్షి, అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా తిరుమల వెంకన్న దర్శనంలో భక్తులకు ప్రత్యేక సేవలందించనుంది. ఏపీఎస్ ఆర్టీసీతో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకాభివృద్ధి సంస్థలు, ఐఆర్‌సీటీసీల ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న వారికి బ్యాకెండ్ సౌకర్యాలు కల్పించనుంది. భక్తులు గంటల కొద్దీ నిరీక్షణ, కంపార్టుమెంట్లలో వేచి చూసే ఇబ్బందులు లేకుండా వెంకన్నను దర్శించుకోవడంలో కీలక పాత్ర పోషించనుంది. ప్రతి నెలా ఆయా కార్పొరేషన్లకు టీటీడీ స్పెషల్ కోటా టికెట్లను విడుదల చేస్తోంది. ఇందులో చాలా సంస్థలు భక్తులకు టికెట్ల విక్రయంతోనే చేతులు దులుపుకుంటున్నాయి. దీంతో తిరుపతి చేరుకున్న భక్తులు కొండపైకి వెళ్లడానికి, బసకు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కొన్నిసార్లు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో దోపిడీకి గురవుతున్నారు. దీనిని అరికట్టేందుకు టీటీడీ.. ఏపీటీడీసీ (ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) సేవలను అందుబాటులోకి తెస్తోంది.

**గైడ్ సాయంతో దర్శనం..**

ఏపీటీడీసీ తిరుమల స్వామి దర్శనానికి ప్యాకేజీ టూర్లను నిర్వహిస్తోంది. సొంత బస్సులతో పాటు ఏజెంట్ల ద్వారా చెన్నై, బెంగళూరు, కుంభకోణం, ఉడిపి, బళ్లారి, హైదరాబాద్ నుంచి తిరుమలకు టూర్లు నడుపుతోంది. పూర్తి రవాణా సౌకర్యంతో పాటు ప్రతి 25 మంది భక్తులకు ఒక గైడ్ సాయంతో దగ్గరుండి దర్శనం చేయిస్తోంది. తిరుపతి నుంచి తిరుమలకు ప్రత్యేక బస్సుల్లో ప్రయాణికులను తరలించి వసతి, ఆతిథ్యం కల్పిస్తోంది. ఇదే విధానాన్ని అన్ని కార్పొరేషన్లు కచ్చితంగా అమలు చేయాలని టీటీడీ ఆదేశించింది. ఈ నేపథ్యంలోనే బ్యాకెండ్ సేవల బాధ్యతలను ఏపీటీడీసీకి అప్పగించింది. త్వరలోనే టీటీడీ టికెట్లు పొందే కార్పొరేషన్లు ఏపీటీడీసీతో ఒప్పందం చేసుకోనున్నాయి. దీంతో భక్తులకు మెరుగైన సేవలు అందడంతో పాటు ఏపీటీడీసీకి ఆదరణ పెరగనుంది. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన విశాఖ-తిరుపతి, విజయవాడ-తిరుపతి ప్యాకేజీలను ఏపీటీడీసీ త్వరలో పునరుద్ధరించనుంది.

### టికెట్లు విడుదల ఇలా..

టీటీడీ స్పెషల్ కోటా కింద ప్రతి నెలా పది కార్పొరేషన్లకు సుమారు 5,400 టికెట్లను విడుదల చేస్తోంది. ఇందులో దాదాపు 80 శాతం ఆక్యుపెన్సీ రేటు ఉంటోంది. శని, ఆదివారాల్లో అయితే 90శాతం పైగా టికెట్లు బుక్ అవుతున్నాయి. ఏపీటీడీసీ, ఆర్టీసీకి వెయ్యి చొప్పున, టీఎస్ఆర్టీసీకి వెయ్యి, టీఎస్‌టీడీసీకి 350, ఐఆర్‌సీటీసీకి 250, తమిళనాడు పర్యాటకాభివృద్ధి సంస్థకు వెయ్యి, కర్ణాటకకు 500, గోవా, పాండిచ్చేరి, ఇండియన్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్లకు 100 చొప్పున టికెట్లు కేటాయిస్తోంది. త్వరలో ఈ టికెట్లను ఒకే వేదికగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకునేలా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనుంది. తద్వారా ఒకచోట టికెట్లు లేకుంటే మరో సంస్థ కోటా నుంచి టికెట్ బుక్ చేసుకోవచ్చు. మరోవైపు తిరుమల కొండపై ఏపీటీడీసీకి ప్రత్యేక గదులను సైతం టీటీడీ కేటాయించనుంది.

### సులభ దర్శనం..



ఇకపై తిరుమల స్వామి దర్శనంలో ఏపీటీడీసీ కీలకంగా మారనుంది. మేము అమలు చేస్తున్న దర్శన విధానం మెరుగైన ఫలితాలు ఇస్తోంది. మా దగ్గర టికెట్ బుక్ చేసుకున్న భక్తులు ఎక్కడా ఇబ్బంది పడకుండా దర్శనం చేసుకుంటున్నారు. అందుకే ఏపీటీడీసీ బ్యాకెండ్ సేవలకు ఒప్పుకుంటేనే టికెట్‌లు విడుదల చేస్తామని టీటీడీ ఇతర రాష్ట్రాల కార్పొరేషన్లకు తేల్చిచెప్పింది. ఒప్పందాలు పూర్తయితే ఐఆర్‌సీటీసీ, ఇతర కార్పొరేషన్ల ద్వారా వచ్చే భక్తులు నేరుగా మేము తిరుపతిలో రిసీవ్ చేసుకుని.. దర్శనం చేయించి పంపిస్తాం.

– కె.కన్నబాబు, ఎండీ, పర్యాటకాభివృద్ధి సంస్థ




### నాసా శాస్త్రవేత్తతో ఐలవరం విద్యార్థుల వర్చువల్ ముచ్చట

- సందేహాలు నివృత్తి చేసిన జేమ్స్ ఆడమ్స్



జేమ్స్ ఆడమ్స్‌తో మాట్లాడుతున్న విద్యార్థిని బట్టు లోహిత గిరిజ

**ఐలవరం(భట్టిప్రోలు):** నాసా శాస్త్రవేత్త, ఏరో స్పేస్ టెక్నాలజిస్ట్ జేమ్స్ ఆడమ్స్‌తో బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు సోమవారం ఇంట్రాక్ట్ అయ్యారు. నాలుగు నెలల కిందట శ్రీలంకలో పనిచేస్తున్న హెంగ్రీ ట్రూప్ అనే శాస్త్రవేత్త ద్వారా నాసా శాస్త్రవేత్త జేమ్స్ ఆడమ్స్‌ను ఆన్‌లైన్ ద్వారా సంప్రదించి విద్యార్థులకు స్పేస్‌పై అవగాహన కల్పించి వారి సందేహాలను నివృత్తి చేసేందుకు కోరగా ఆయన అంగీకరించారు. ఇందులో భాగంగా ఐలవరం హైస్కూల్‌లో వర్చువల్ మీటింగ్ జరిగింది. 20 మంది విద్యార్థులు సుమారు రెండు గంటల పాటు తమ సందేహాలను వెలిబుచ్చగా ఆయన సమాధానాలను వివరణాత్మకంగా ఇచ్చారు. యూఎస్ఏ కాలమానం ప్రకారం రాత్రి 11 నుంచి ఒంటి గంట వరకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 9:30 నుంచి 11:30 గంటలకు) ఈ మీటింగ్ జరిగింది. ఈ వర్చువల్ మీటింగ్‌లో ఏపీ, తెలంగాణ, కేరళ రాష్ట్రంలోని విద్యావేత్తలు పాల్గొన్నారు.

**మరువలేని విషయం**



నాసా గురించి కేవలం పుస్తకాల్లో చదువుకున్నాం. కొన్ని వీడియోలు కూడా చూశా. నాసా శాస్త్రవేత్త, టెక్నాలజిస్ట్ జేమ్స్ ఆడమ్స్‌తో నేరుగా మాట్లాడటం జీవితంలో మరచిపోలేని విషయం.

– బట్టు లోహిత గిరిజ, 9వ తరగతి విద్యార్థిని(ఐలవరం జెడ్పీ హైస్కూల్)

**త్వరలో భారత్ పర్యటనకు వస్తా**



అతి త్వరలో భారతదేశం వస్తా. ఏపీలోని బాపట్ల జిల్లా ఐలవరం హైస్కూల్‌కు విచ్చేస్తా. మానవ నివాసానికి ప్లానెట్ అయినటువంటి ఎక్సోప్లానెట్ గురించి విద్యార్థులకు తెలియజేశాను. తాను ఇప్పటికి 30 స్పేస్ లాంచ్ ప్రోగ్రామ్‌లలో పాల్గొన్నాను.

– జేమ్స్ ఆడమ్స్, నాసా శాస్త్రవేత్త

## వెంకటగిరి మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

- పట్టణ ప్రణాళికా విభాగంపై ఫిర్యాదు మేరకు తనిఖీలు
- సిబ్బంది వద్ద అనధికారిక నగదు రూ.45వేలు గుర్తింపు



మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్యను వివరాలు అడుగుతున్న ఏసీబీ అడిషన్ ఎస్పీ దేవప్రసాద్

**వెంకటగిరి(తిరుపతి జిల్లా):** వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రణాళిక, రెవెన్యూ వంటి పలు విభాగాల్లో సోమవారం ఏసీబీ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, డీఎస్పీ జనార్దన్ నాయుడు నేతృత్వంలో ఐదుగురు సీఐలు, 15 మంది సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఏసీబీ బృందం మున్సిపల్ కార్యాలయంలో అడుగుపెట్టింది. పట్టణ ప్రణాళిక, రెవెన్యూ సెక్షన్లలో రికార్డులను అధికారులు తనిఖీ చేశారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందిని పూర్తి స్థాయిలో విచారించారు. తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇతరులను ఎవరినీ లోపలికి అనుమతించలేదు. రాత్రి పొద్దుపోయే వరకూ తనిఖీ చేశారు. మంగళవారం కూడా తనిఖీలు కొనసాగించాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.

**14400 కు ఫిర్యాదుతోనే తనిఖీలు..**

వెంకటగిరి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ (పట్టణ ప్రణాళిక ) విభాగంపై 14400, వెబ్‌సైట్‌లో వచ్చిన ఫిర్యాదు ఆధారంగా తాము తనిఖీలు నిర్వహించినట్లు తిరుపతి ఏసీబీ అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్ తెలిపారు. ఆదరణ పథకం లబ్ధిదారుల వద్ద కట్టించుకున్న నగదులో రికార్డ్ అసిస్టెంట్ పెంచలయ్య వద్ద రూ.14,000 తక్కువగా ఉన్నట్లు, పన్నులు వసూళ్లకు సంబంధించి ఉండాల్సిన నగదులో రూ.25,000 తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. పలు విభాగాల్లోని అధికారుల వద్ద అనధికారికంగా మరో రూ.45,000 నగదు ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ రికార్డులను పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని వివరించారు.

### ఏనుగుల దాడిలో ట్రాకర్ మృతి

**భామిని:** పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం పసుకుడి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి ఏనుగుల గుంపు దాడిలో ట్రాకర్ లోకొండ లక్ష్మీనారాయణ (25) మృతి చెందాడు. గ్రామస్తులతో కలిసి ఏనుగులను అటవీ ప్రాంతంలోకి తరలించే ప్రయత్నాల్లో ఒక్కసారిగా ఏనుగులు తిరగబడటంతో అందరూ పరుగుతీశారు. ఆ సమయంలో కిందపడిపోయిన ట్రాకర్‌ను ఏనుగులు తొక్కి చంపాయి. చాలా సమయం వరకు మృతుడి వద్దకు ఎవరినీ ఏనుగులు చేరనీయలేదు. 108 వాహనం అక్కడికి చేరుకున్నా ఫలితం లేకపోయింది. గ్రామస్తులందరూ కలిసి ఓ గంటపాటు ప్రయత్నిస్తే ఏనుగులు కాస్త దూరం వెళ్లాయి. దీంతో అటవీశాఖ అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి వెళ్లారు. కాగా, లక్ష్మీనారాయణ నాలుగేళ్లుగా ఎలిఫెంట్ ట్రాకర్‌గా పనిచేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు చెప్పారు.

### కోడిగుడ్డు 'కమింగ్ రేటు'ను నిషేధించాలి

- ఏపీ పౌల్ట్రీస్ ఫెడరేషన్ విజ్ఞప్తి




నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీ పౌల్ట్రీ యజమానులు

**దేవరపల్లి:** కోడిగుడ్డు కమింగ్ రేటు (రైతుల నుంచి వ్యాపారులు ముందుగా గుడ్లు తీసుకువెళ్లి నాలుగు రోజుల తర్వాత రేటు చెప్పడం) వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ పౌల్ట్రీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు కేవీ ముకుంద రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. కమింగ్ రేటు చట్ట విరుద్ధమని, ఇలా అడిగే వర్తకులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లిలోని హైవే జంక్షన్ వద్ద సోమవారం ఏపీ పౌల్ట్రీస్ ఫెడరేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముకుందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 2,200 చిన్నా, పెద్ద పౌల్ట్రీలు ఉన్నాయని, రోజూ ఆరు కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయని తెలిపారు. తణుకు, హైదరాబాద్, కోల్‌కతా, పంజాబ్ ప్రాంతాల్లోని వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి, చట్టబద్ధత లేని కమింగ్ రేటును ఆసరాగా చేసుకుని ధర చెప్పకుండా రైతుల నుంచి ముందుగా కోడిగుడ్లు తీసుకువెళ్లి లాభాలకు అమ్ముకుంటున్నారని తెలిపారు. రైతులకు మాత్రం తక్కువ రేటు చెల్లిస్తున్నారని చెప్పారు. కోవిడ్ అనంతరం కోడిగుడ్ల వినియోగం పెరిగినా, ధర తగ్గిందన్నారు. శీతాకాలంలో కోడిగుడ్డుకు డిమాండ్ ఉన్నప్పటికీ ధర రూ.1.25 తగ్గిందన్నారు. ఎగ్ బోర్డు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రేషన్ దుకాణాల్లో కోడిగుడ్లు కూడా విక్రయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కొద్దిసేపు ఫెడరేషన్ నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పడాల సుబ్బారెడ్డి, నాయకులు జి.గంగాధరరావు, డి.కుటుంబరావు, గన్నమని హరికృష్ణ, పౌల్ట్రీ యజమానులు పాల్గొన్నారు.

# 'డిజి యాత్ర' రెడీ!

- విజయవాడ ఎయిర్‌పోర్టులో బయోమెట్రిక్ బోర్డింగ్ సిస్టం సిద్ధం
- సెక్యూరిటీ చెక్, బోర్డింగ్ పాయింట్‌ల వద్ద ఇక వెయిటింగ్ ఉండదు
- దేశీయ ప్రయాణికులు నేరుగా టెర్మినల్ లోపలికి వెళ్లే అవకాశం
- కొనసాగుతున్న ట్రయల్ రన్



టెర్మినల్ వద్ద ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కియోస్క్‌లు

**విమానాశ్రయం(గన్నవరం):** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం) నుంచి ప్రయాణం మరింత సులభతరం కానుంది. దేశీయ ప్రయాణాల కోసం ఇక టెర్మినల్‌లోని సెక్యూరిటీ చెక్, బోర్డింగ్ పాయింట్‌ల వద్ద వేచి చూడాల్సిన అవసరం ఉండదు. తమ ఫోన్ నుంచే బోర్డింగ్ పాస్‌ను స్కాన్ చేసి నేరుగా విమానాశ్రయంలోకి ప్రవేశించవచ్చు. ఇందుకోసం ఎయిర్‌పోర్టు ఆవరణలో కేంద్ర పౌర విమానయాన శాఖ 'డిజి యాత్ర' పేరుతో రూపొందించిన బయోమెట్రిక్ బోర్డింగ్ సిస్టం సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ తరహా సేవలు ఇప్పటికే న్యూఢిల్లీ, బెంగళూరు, వారణాసి విమానాశ్రయాల్లో వినియోగంలో ఉన్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి విజయవాడతో పాటు హైదరాబాద్, కోల్‌కతా, పూణే విమానాశ్రయాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇప్పటికే విజయవాడ విమానాశ్రయంలో డిజి యాత్ర కోసం నాలుగు కియోస్క్‌లను ఏర్పాటు చేసి ట్రయల్ రన్ కూడా ప్రారంభించారు.

**డిజి యాత్ర యాప్‌లో నమోదు... సేవలు ఇలా...**

- డిజి యాత్ర యాప్‌ను ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగదారులు ప్లే స్టోర్ నుంచి, ఐఫోన్ యూజర్లు యాప్ స్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆ యాప్‌లో వినియోగదారులు తమ పేరు, మొబైల్ నంబర్, ఈ-మెయిల్, చిరునామా, ఫొటో, ఆధార్ ఆధారిత ధ్రువీకరణపత్రం అప్‌లోడ్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వినియోగదారునికి డిజి యాత్ర ఐడీ వస్తుంది. దానిని వినియోగదారులు నమోదు చేసుకోవాలి.
- విమాన టికెట్ బుకింగ్ సమయంలో డిజి యాత్ర ఐడీని తప్పనిసరిగా నమోదు చేయాలి. విమాన ప్రయాణానికి సంబంధించి బోర్డింగ్ పాస్‌ను కూడా యాప్‌లో స్కాన్ చేయాలి. దీంతో ప్రయాణికుడి వివరాలు సదరు విమానాశ్రయానికి చేరుతాయి.
- ప్రయాణికులు విమానాశ్రయానికి వెళ్లిన తర్వాత టెర్మినల్ బయట ఈ-గేట్ వద్ద డిజి యాత్ర యాప్‌ను ఉపయోగించి బోర్డింగ్ పాస్ బార్‌కోడ్‌ను స్కాన్‌చేసి, ఫేషియల్ రికగ్నిజేషన్ చేయించుకోవాలి. దీంతో విమానాశ్రయం నుంచి ప్రయాణికుల వ్యక్తిగత, ప్రయాణ వివరాలు సంబంధిత ఎయిర్‌లైన్స్ ఆన్‌లైన్‌లో ధ్రువీకరించుకుంటుంది. దీనివల్ల ప్రయాణికులు సెక్యూరిటీ చెక్ వద్ద గుర్తింపు కార్డు చూపించకుండానే, బోర్డింగ్ పాయింట్‌ల వద్ద నిరీక్షించకుండా సులభంగా ఎయిర్‌పోర్ట్ టెర్మినల్‌లోకి ప్రవేశించవచ్చు.

**ట్రయల్ రన్ దశలో...**

ప్రస్తుతం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో డిజి యాత్ర బయోమెట్రిక్ బోర్డింగ్ సిస్టం ట్రయల్ రన్ దశలో ఉంది. బెంగళూరు వెళ్లే ప్రయాణికులకు సంబంధించి డిజి యాత్రలో నమోదైనవారి వివరాలతో ఈ సిస్టం పనితీరును పర్యవేక్షిస్తున్నారు. దీనిపై ప్రయాణికులకు మరింత అవగాహన కలిగించేందుకు టెర్మినల్ ఆవరణలో డిజి యాత్ర యాప్‌కు సంబంధించిన స్కానర్లను కూడా ఏర్పాటు చేశారు. మార్చి నెల నుంచి పూర్తిస్థాయిలో డిజి యాత్రను వినియోగంలోకి తీసుకువచ్చేందుకు ఎయిర్‌పోర్ట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

### తిరుమలలో 9 అతిథి గృహాల పునర్నిర్మాణానికి ముగిసిన టెండర్లు

**తిరుమల:** తిరుమలలో 9 అతిథి గృహాల పునర్నిర్మాణానికి దాతల నుంచి టీటీడీ విరాళాలను ఆహ్వానించింది. ఇందులో భాగంగా హెచ్వీడీసీ నం.493, 496 అతిథిగృహాలకు రూ.5 కోట్లు, టీబీసీలోని 52, 55, 57, 59, 63, 65, 67 అతిథిగృహాలకు రూ.3 కోట్లు, రూ.2.50 కోట్లు, రూ.2 కోట్లు కనీస విరాళం చెల్లించేలా టెండర్లను పిలిచింది. సోమవారం తిరుమలలోని రెవెన్యూ కార్యాలయంలో టెండర్లను తెరవగా హెచ్‌వీడీసీ లోని నం.496 అతిథిగృహం పునర్నిర్మాణానికి బోర్డు సభ్యుడు జీవన్ రెడ్డి భారీగా రూ.21 కోట్లు విరాళంగా అందించేలా టెండర్ వేశారు. హెచ్‌వీడీసీకి నం.493కు రూ.13 కోట్లు విరాళం అందించేలా కోట్ చేశారు. టీబీసీకి రూ.5 కోట్ల నుంచి రూ.13 కోట్లు విరాళంగా అందించేందుకు పలువురు దాతలు టెండర్లు వేశారు. టెండర్లలో అత్యధికంగా విరాళం అందించిన దాతలు అతిథిగృహాలను తమ సొంత ఖర్చులతో నిర్మించి టీటీడీకి అందించాల్సి ఉంటుంది. అందులో ఒక గదిని దాతకు టీటీడీ అందిస్తుంది. వాటి నిర్వహణను దాతలే చేపట్టాలి. కంపెనీ పేరు మీద టెండర్‌ను పొందిన దాతలకు 20 ఏళ్లు, వ్యక్తిగతంగా టెండర్ పొందిన దాతలకు జీవితాంతం ఒక గదిని టీటీడీ కేటాయిస్తుంది.

## ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరు మహిళా కూలీల దుర్మరణం

- మరో 11 మందికి గాయాలు
- పశ్చిమ గోదావరి జిల్లా మాధవరంలో ఘటన
- మృతులకు రూ.5 లక్షల చొప్పున బీమా పరిహారం: మంత్రి కొట్టు

**తాడేపల్లిగూడెం రూరల్:** ట్రాక్టర్ బోల్తా పడి ఇద్దరు మహిళా కూలీలు మృతి చెందారు.. మరో పది మంది కూలీలు, డ్రైవర్ గాయపడిన ఘటన పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం మాధవరంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... మండలంలోని అప్పారావుపేట గ్రామానికి చెందిన మాచర్ల రామారావు మాధవరం కోతిగుంట సమీపంలోని బాడవా పొలాల్లో కలుపు తీత కోసం అదే గ్రామానికి చెందిన 12 మంది కూలీలను తన ట్రాక్టర్‌పై తీసుకెళ్లాడు. మధ్యాహ్నం పనులు ముగించుకుని తిరిగి వారిని అప్పారావుపేట తీసుకెళ్తుండగా కోతిగుంట చెరువు గట్టు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో మహిళా కూలీలు ఆకుమర్తి సుజాత (46), పాకా భారతి (35) మృతి చెందారు. డ్రైవర్ మాచర్ల రామారావు, కూలీలు కోట సింహాచలం, షేక్ మస్తాన్ బీబీ, జొన్నాడ శివపార్వతి, పెరుమళ్ల నాగలక్ష్మి, పెరుమళ్ల కోట సత్తెమ్మ, కోయిల నాగజ్యోతి, పెరుమళ్ల రామలక్ష్మి, తానేటి వరలక్ష్మి, మడిపల్లి సుబ్రహ్మణ్యం, మిద్దే పద్మ గాయపడ్డారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ వైకేవీ అప్పారావు, తాడేపల్లిగూడెం పట్టణ సీఐ నాగరాజు, పెంటపాడు సీఐ జి.సత్యనారాయణ ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను మాధవరం పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తాడేపల్లిగూడెంలోని ట్రినిటీ ఆస్పత్రికి పంపించారు. ట్రాక్టర్ డ్రైవర్ రామారావును సాయిసంజీవని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ప్రభుత్వాస్పత్రికి చేర్చారు. ప్రమాద ఘటనతో మాధవరం, అప్పారావుపేట గ్రామాల్లో విషాదం నెలకొంది.

**క్షతగాత్రులకు ఉప ముఖ్యమంత్రి పరామర్శ**

ట్రినిటీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. మృతులు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు చొప్పున బీమా రూపేణా పరిహారం అందిస్తామని ప్రకటించారు.

### కాలేజీ భవనం నుంచి దూకిన విద్యార్థిని

**అనంతపురం నారాయణ కళాశాలలో ఘటన**



**అనంతపురం (శ్రీకంఠం సర్కిల్):** అనంతపురంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న భవ్యశ్రీ సోమవారం మధ్యాహ్నం కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించింది. వన్‌టౌన్ సీఐ రవిశంకరరెడ్డి కథనం ప్రకారం.. కదిరి పట్టణానికి చెందిన జ్యోతి, సాంబశివుడు దంపతుల కుమార్తె భవ్యశ్రీ అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. తల్లిదండ్రుల మధ్య విభేదాలు ఉండటంతో భవ్యశ్రీ స్థానిక అంబార్ వీధిలో అమ్మమ్మ వద్ద ఉంటూ కళాశాలకు వెళ్లి వస్తోంది. ఒంటరినైపోయానన్న ఆవేదన కొద్దిరోజులుగా భవ్యశ్రీలో నాటుకుపోయింది. మరోవైపు ఫీజుల విషయమై కళాశాల యాజమాన్యం భవ్యశ్రీని మందలించినట్లు తెలిసింది. ఫీజు డబ్బు మొత్తం కడితేనే రికార్డులు ఇస్తామని బెదిరించింది. ఈ నేపథ్యంలో ఉదయాన్నే ఆ విద్యార్థిని కళాశాల భవనంపైకి చేరుకుంది. మధ్యాహ్నం వరకు ఆమెను ఎవరూ గుర్తించలేదు. మధ్యాహ్నం 12.30 గంటలకు భవనంపై నుంచి కిందకు దూకింది. అది చూసిన విద్యార్థులు హుటాహుటిన 108 వాహనంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నేతలు కళాశాలకు చేరుకుని యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. ఫర్నిచర్ ధ్వంసం చేశారు. విద్యార్థి సంఘం నేత ఆకుల రాఘవేంద్రతో పాటు పలువుర్ని పోలీసులు అరెస్ట్ చేశారు.

### నేత్ర పర్వంగా నరసన్న కల్యాణ తెప్పోత్సవం

**సఖినేటిపల్లి:** అంతర్వేదిలో శ్రీలక్ష్మీనసింహస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా చివరిరోజు సోమవారం స్థానిక మంచినీటి చెరువులో హంస వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం నేత్ర పర్వంగా సాగింది. తొలుత ఆలయం వద్ద నుంచి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పకవాహనంపై ఊరేగింపుగా చెరువు వద్దకు అర్చకులు, భక్తులు తోడ్కొని వచ్చారు. తెప్పోత్సవానికి ముందు ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు చెరువు వద్ద గంగపూజ నిర్వహించారు. పుష్పక వాహనంపై కొలువుదీరిన స్వామిని అర్చకుల వేదమంత్రాలతో, భక్తుల గోవిందనామస్మరణలతో విద్యుద్దీపాలంకరణలతో ఉన్న తెప్పపైకి అధిరోహింపచేశారు. అర్చకులు, అధికారులు, ప్రముఖులు కొబ్బరికాయలు కొట్టి తెప్పోత్సవాన్ని ప్రారంభించారు. మూడు పర్యాయాలు చెరువు చుట్టూ బాణసంచా కాల్పుల మధ్య జరిగిన శ్రీస్వామివారి తెప్పోత్సవం భక్తులను అలరించింది. అమలాపురం ఆర్డీవో వసంతరాయుడు, రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాలరాజా బహద్దూర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఏర్పాట్లు చేశారు.

**ద్రాక్షారామలో భీమనాథునికి..**

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ క్షేత్రంలో మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 6వ రోజు సోమవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో గల సప్త గోదావరి నదిలో తెప్పోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. రంగురంగుల విద్యుత్ దీపాలంకరణ కాంతుల నడుమ తెప్పోత్సవాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు.

## అన్నివిధాలా ఆదుకుంటాం

టర్కీ, సిరియాలను అన్నివిధాలా ఆదుకుంటామని భారత్ ప్రకటించింది. భూకంపం గురించి తెలియగానే ప్రధాని నరేంద్ర మోదీ తక్షణం స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ప్రధాని ముఖ్య కార్యదర్శి పి.కె.మిశ్రా సారథ్యంలో ఉన్నత స్థాయి భేటీ జరిగింది. కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి తదితరులు ఇందులో పాల్గొన్నారు. తక్షణం 100 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని, శిథిలాల కింద చిక్కుబడ్డ బాధితులను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన శునకాలను, అవసరమైన ఔషధాలతో వైద్య బృందాలను కూడా పంపాలని నిర్ణయించారు. విడతలవారీగా సహాయ సామగ్రిని కూడా పంపనున్నారు.



మరణించిన తన చిన్నారిని పట్టుకుని హృదయవిదారకంగా రోదిస్తున్న తండ్రి




క్షేమంగా బయటపడ్డ బాలుడు



భూకంపానికి బలైన తండ్రీకొడుకులు


టర్కీలోని దియార్బకీర్ వద్ద శిథిలాల కింద మృతదేహాల కోసం వెదుకులాట



టర్కీ, సిరియా సరిహద్దుల్లో భూకంప కేంద్రం (సర్కిల్లో)


సిరియాలోని జాండరీస్ సిటీలో కుప్పకూలిన ఇళ్లు

# టర్కీ, సిరియా సరిహద్దుల్లో... భారీ భూకంపం

**2,600 మందికి పైగా దుర్మరణం**
- వరుసగా మూడు భారీ భూకంపాలు
- 80 పైగా శక్తిమంతమైన ప్రకంపనలు
- మృతులు బాగా పెరిగే ప్రమాదం

**అజ్మరీన్ (సిరియా):** ప్రకృతి ప్రకోపానికి టర్కీ, సిరియా అల్లాడిపోయాయి. సోమవారం తెల్లవారుజామున సరిహద్దు సమీపంలో 7.8 తీవ్రతతో విరుచుకుపడ్డ భారీ భూకంపం ఇరు దేశాల్లో విపరీతమైన ప్రాణ, ఆస్తి నష్టానికి దారి తీసింది. తర్వాత కొద్ది గంటల్లోనే 7.6, 6 తీవ్రతతో మరో రెండు భూకంపాలు సంభవించడంతో నష్ట తీవ్రత మరింత పెరిగింది. అంతకుముందు, ఆ తర్వాత కూడా 80కి పైగా శక్తిమంతమైన ప్రకంపనలు మధ్యప్రాచ్యాన్ని వణికించాయి. ఇప్పటిదాకా కనీసం 2,600 మందికి పైగా దుర్మరణం పాలైనట్టు తేలింది. 10,000 మందికి పైగా గాయపడ్డారు. వేల సంఖ్యలో భవనాలు తదితర నిర్మాణాలు కళ్లముందే కుప్పకూలాయి. ఎటు చూసినా శిథిలాలు, శవాలతో పలు నగరాలు మరుభూమిని తలపిస్తున్నాయి. శిథిలాల కింద చాలామంది ఉన్నట్టు చెబుతున్నారు. దాంతో ప్రాణనష్టం మరింత భారీగా ఉంటుందని భావిస్తున్నారు. దిబ్బలను తొలగించి ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు సిబ్బంది నిర్విరామంగా శ్రమిస్తున్నారు. మృతుల సంఖ్య ఎంతకు పెరుగుతుందో శిథిలాలన్నింటినీ పూర్తిగా తొలగిస్తే గానీ తేలదంటూ టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్దోగన్ ఆవేదన వెలిబుచ్చారు. ఈ దుర్ఘటన పట్ల ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. ఇరు దేశాలకు ఆపన్న హస్తం అందించారు. హుటాహుటిన విపత్తు స్పందన దళాలను (ఎన్డీఆర్ఎఫ్), వైద్య బృందాలను, సహాయ సామగ్రిని పంపారు. అన్నివిధాలా ఆదుకుంటామని ప్రకటించారు. నాటో, ఈయూ కూటములతో పాటు ప్రపంచ దేశాలన్నీ సాయానికి పెద్ద ఎత్తున ముందుకొస్తున్నాయి.


టర్కీలోని అదానా సిటీలో నేలమట్టమైన భవంతులు

**ఎటుచూసినా శవాలు, క్షతగాత్రులే**
శక్తిమంతమైన తొలి భూకంపం టర్కీ, సిరియా సరిహద్దు సమీపంలో సోమవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో సంభవించింది. దీని కేంద్రం ఆగ్నేయ టర్కీలోని కహ్రమాన్మరాస్ ప్రావిన్సులో గాజియాన్‌తెప్‌కు 35 కిలోమీటర్ల దూరంలో భూమికి 18 కిలోమీటర్ల దిగువన ఉన్నట్టు గుర్తించారు. భూకంపం తాలూకు ప్రకంపనలు ఏకంగా అటు ఈజిప్టు రాజధాని కైరో దాకా, ఇటు లెబనాన్ రాజధాని బీరూట్ దాకా పాకాయి! దీని ధాటికి దక్షిణ టర్కీలోని పది ప్రావిన్సులతో పాటు ఉత్తర సిరియాలోని పలు ప్రాంతాలు తీవ్ర నష్టాన్ని చవిచూశాయి. డెమాస్కస్‌తో పాటు టర్కీ, సిరియాల్లోని పలు నగరాల్లో జనం హాహాకారాలు చేస్తూ ఒక్క ఉదుటున వీధుల్లోకి పరుగులు తీశారు. గంటల వ్యవధిలోనే 100 కిలోమీటర్ల దూరంలో 7.5 తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దాంతో నష్ట తీవ్రత మరింత పెరిగింది. సిరియాలోని అలెప్పో, హమా మొదలుకుని టర్కీలోని దియార్బకీర్ నగరం దాకా 330 కిలోమీటర్ల పై చిలుకు ప్రాంతం తీవ్రంగా దెబ్బ తిన్నది. టర్కీలో ఇప్పటిదాకా కనీసం 1,600 మందికి పైగా మరణించారు. అంతర్యుద్ధంతో అట్టుడుకుతున్న సిరియాలో ప్రభుత్వ అధీనంలోని ప్రాంతాలు, విపక్ష రెబెల్స్ ప్రాబల్య ప్రాంతాల్లో కలిపి 900 మందికి పైగా దుర్మరణం పాలయ్యారు. సిరియాలో ఆస్పత్రులన్నీ క్షతగాత్రులతో నిండిపోయి కన్పిస్తున్నాయి. అరకొర సౌకర్యాల నడుమే వారికి చికిత్స అందిస్తున్నారు. భూ ప్రకంపనలు ఇంగ్లండ్ దాకా కొనసాగాయి.

### అయ్యో సిరియన్లు...



సిరియాలో భూకంప ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల గోస కన్నీరు పెట్టిస్తోంది. దశాబ్దానికి పైగా కొనసాగుతున్న అంతర్యుద్ధంతో వాయవ్య సిరియా అట్టుడుకుతోంది. కొన్ని ప్రాంతాలు ప్రభుత్వ అధీనంలో, పలు ప్రాంతాలు విపక్ష గెరిల్లాల చేతుల్లో ఉన్నాయి. దాడులు, ప్రతి దాడులు నిత్యకృత్యం కావడంతో ఇక్కడ మౌలిక సదుపాయాలు కూడా మృగ్యంగా మారాయి. కాల్పుల్లో తూట్లు పడి బీటలువారిన ఇళ్లే జనాలకు ఆవాసం. ఈ స్థితిలో పులిమీద పుట్రలా వచ్చిపడ్డ భూకంపంతో జనం పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. అప్పటికే బలహీనంగా ఉన్న నివాసాలు ఉన్న పళాన కూలి చాలామందిని బలి తీసుకున్నాయి. శిథిలాల నుంచి మృతదేహాలను, క్షతగాత్రులను వెలికితీయడం వంటి సహాయ చర్యలు మందకొడిగా సాగుతున్నాయి.

వరుస ప్రకంపనలతో టర్కీవాసులు బెంబేలెత్తుతున్నారు. భారీ సంఖ్యలో మూటాముల్లే సర్దుకుని సురక్షిత ప్రాంతాలకు బయల్దేరుతుండటంతో దేశంలో చాలాచోట్ల ట్రాఫిక్ జామ్‌లు కన్పిస్తున్నాయి. దాంతో ఎమర్జెన్సీ, సహాయ బృందాలు ప్రభావిత ప్రాంతాలకు చేరడం కష్టంగా మారుతోంది. ప్రజలు రోడ్లపైకి రావద్దని ప్రభుత్వ వర్గాలు విజ్ఞప్తి చేయాల్సి వస్తోంది.
- శిథిలాల కింద వేలాది కుటుంబాలు చిక్కుబడ్డాయి! వాటి నుంచి బాధితుల ఆక్రందనలు హృదయ విదారకంగా విన్పిస్తున్నాయి.
- వణికించే చలి సహాయక చర్యలకు అడ్డంకిగా మారుతోంది.
- మసీదులు తదితరాల్లో నిర్వాసితులకు ఆశ్రయం కల్పిస్తున్నారు.
- యంత్రాల సాయంతో శిథిలాలను హుటాహుటిన తొలగించేందుకు సిబ్బంది పెద్ద ఎత్తున శ్రమిస్తున్నారు.

**వలసలతో ట్రాఫిక్ జామ్**
- టర్కీలోని ప్రసిద్ధ చారిత్రక, వారసత్వ భవనాలు, కట్టడాలు కూడా భూకంపం వల్ల దెబ్బ తిన్నాయి.
- వాయవ్య సిరియాలో ఇద్లిబ్ ప్రావిన్సు తదితరాలు కొన్నేళ్లుగా విపక్ష రెబెల్స్ అధీనంలో ఉండటం అక్కడ సహాయ చర్యలకు అడ్డంకిగా మారింది.
- ప్రపంచంలోనే భూకంప రిస్కు తీవ్రత అత్యంత ఎక్కువగా ఉన్న దేశాల్లో టర్కీ ఒకటి.
- 1999లో వాయవ్య టర్కీని అతలాకుతలం చేసిన శక్తిమంతమైన భూకంపం 18 వేల మందికి పైగా బలి తీసుకుంది.


టర్కీలోని అదానా వద్ద రోదిస్తున్న మహిళలు

## ఇంధన రంగంలో అపార అవకాశాలు

- పారిశ్రామికవేత్తలూ.. విస్తృతంగా పెట్టుబడులు పెట్టండి
- బెంగళూరులో ఇంధన వారోత్సవాల్లో ప్రధాని మోదీ

**సాక్షి, బెంగళూరు:** దేశంలో ఇంధన రంగం వేగంగా అభివృద్ధి చెందుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడించారు. ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని, విస్తృతంగా పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సోమవారం బెంగళూరులో భారత ఇంధన వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. 21వ శతాబ్దంలో ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించడంలో ఇంధన రంగానిది కీలక పాత్ర అన్నారు.



కార్యక్రమంలో భాగంగా సాకర్ ప్లేయర్ మెస్సీ జెర్సీని అందుకుంటున్న మోదీ

**చమురు శుద్ధి సామర్థ్యంలో నాలుగో స్థానం**
భారత్‌లో సుస్థిర ప్రభుత్వం, నిరంతర సంస్కరణలు, సామాజిక, ఆర్థిక సాధికారత పలు ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనేందుకు తోడ్పడ్డాయని మోదీ ఉద్ఘాటించారు. ''తొమ్మిదేళ్లలో ఇంటర్నెట్ అనుసంధానం మూడు రెట్లు పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లోనూ వేగవంతమైన ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తోంది. పెట్రోలియం ఉత్పత్తుల డిమాండ్ 5 శాతం మేర పెరిగిందన్నారు. ప్రపంచంలో అత్యధిక చమురు శుద్ధి సామర్థ్యం కలిగిన దేశాల్లో భారత్ నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. 2030 నాటికి 4 ఎంఎంటీల మేర గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేస్తామన్నారు. ఇందుకోసం రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని పేర్కొన్నారు.


**ఇక ఈ–20 ఇంధనం**
ఈ–20 ఫ్యూయల్ (పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్)ను మోదీ అధికారికంగా ప్రారంభించారు. ఈ–20ని తొలుత 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అందుబాటులోకి తెస్తారు. రెండేళ్ల తర్వాత దేశవ్యాప్తంగా విస్తరింపజేస్తారు. ఈ–20 ఇంధన వినియోగంతో ముడిచమురు దిగుమతుల భారం తగ్గనుంది. తుమకూరు జిల్లా గుబ్బీ తాలూకాలో హెచ్ఏఎల్ ఆధ్వర్యంలో హెలికాప్టర్ తయారీ ఫ్యాక్టరీని మోదీ ప్రారంభించారు.

# ఎందుకీ భూ ప్రకోపం?

**భూకంప ముప్పు అత్యధికంగా ఉన్న జోన్లో టర్కీ ● టెక్టానిక్ ప్లేట్లు ఢీకొనడం వల్లే తాజా భూకంపం!**

టర్కీ, సిరియాలో శక్తివంతమైన భూకంపం ధాటికి వేలాది మంది ప్రాణాలు కోల్పోయారు. భారీ భవనాలు నేటమట్టమయ్యాయి. 456 కిలోమీటర్ల దూరంలోని సైప్రస్, 874 కిలోమీటర్ల దూరంలో ఉన్న లెబనాన్, 1,381 కిలోమీటర్ల దూరంలోని ఇజ్రాయెల్, 1,411 కిలోమీటర్ల దూరంలోని ఈజిప్ట్‌లో సైతం భూప్రకంపనలు నమోదయ్యాయి. దక్షిణ–మధ్య టర్కీలోని గాజియాన్‌టెప్ సిటీకి 33 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. భూ ఉపరితలం నుంచి 18 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు మొదలైనట్లు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. టర్కీలో గత 100 ఏళ్లలో ఇదే అత్యంత శక్తివంతమైన భూకంపమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

**95 శాతం భూభాగం భూకంప ప్రభావితమే**
భౌగోళికంగా 'అనటోలియన్ టెక్టానిక్ ప్లేట్' ప్రాంతంలో ఉన్న టర్కీలో భూప్రకంపనలు సర్వసాధారణంగా మారాయి. 2020లో 33,000 భూకంపాలు నమోదయ్యాయి. వీటిలో 332 భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై దాదాపు 4.0గా రికార్డయ్యింది. భూమి పై పొరను టెక్టానిక్‌గా వ్యవహరిస్తారు. ఇందులో 15 భారీ టెక్టానిక్ ప్లేట్లు (రాతి పొరలు) ఉంటాయి. రెండు పొరల సరిహద్దుల నడుమ ఖాళీ ప్రదేశం ఉంటుంది. కొన్నిచోట్ల ప్లేట్ల మధ్య పగుళ్లు ఉంటాయి. భూ అంతర్భాగంలో సర్దుబాట్ల వల్ల రెండు టెక్టానిక్ ప్లేట్లు బలంగా ఢీకొన్నప్పుడు భారీ భూకంపం సంభవిస్తుందని బ్రిటిష్ ఆర్కియాలాజికల్ సర్వే వెల్లడించింది. యూరేసియన్, ఆఫ్రికన్ ప్లేట్ల చీలిక భాగంలో టర్కీ భూభాగం ఉంది. యూరేసియన్, అనటోలియన్ టెక్టానిక్ ప్లేట్ల నడుమ నార్త్ అనటోలియన్ ఫాల్ట్(ఎన్ఏఎఫ్) లైన్ అనే చీలిక ఉంది. రెండు ప్లేట్లు ఢీకొనడంతో ఇక్కడే భూకంపం ప్రారంభమైనట్లు భావిస్తున్నారు. ఎన్ఏఎఫ్ చీలిక దక్షిణ ఇస్తాంబుల్ నుంచి ఈశాన్య టర్కీ దాకా విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. 1999, 2011లోనూ ఈ ప్రాంతం నుంచే భూకంపాలు విస్తరించినట్లు పరిశోధకులు వెల్లడించారు. 1999 నాటి భూకంపంలో 18,000 మంది, 2011 నాటి భూకంపంలో 500 మందికిపైగా జనం మృతిచెందారు. టర్కీలో ఏకంగా 95 శాతం భూభాగం భూకంప ప్రభావిత ప్రాంతమే కావడం గమనార్హం. పెద్ద నగరాలైన ఇస్తాంబుల్, ఇజ్మీర్‌తోపాటు ఈస్ట్ అనటోలియా కూడా భూకంపం ముప్పును ఎదుర్కొంటున్నాయి. – సాక్షి, నేషనల్ డెస్క్




**3 రోజుల క్రితమే చెప్పేశాడు**
**తాజా భూకంపంపై ముందే చెప్పిన ఫ్రాంక్ త్వరలో భారత్‌కూ రావచ్చని హెచ్చరికలు**

**ఆమ్‌స్టర్‌డ్యామ్:** టర్కీ, సిరియాలో వేలాది మందిని బలితీసుకున్న భూకంపం గురించి నెదర్లాండ్స్‌కు చెందిన ఫ్రాంక్ హూగర్‌బీట్స్ అనే పరిశోధకుడు ముందే హెచ్చరించారు. దక్షిణ మధ్య టర్కీ, జోర్డాన్, సిరియా, లెబనాన్ ప్రాంతంలో భారీ భూకంపం సంభవించనుందని, ఇది రిక్టర్ స్కేల్‌పై 7.5గా నమోదవుతుందని ఈ నెల 3న ఆయన ట్వీట్ చేశారు. ఆయన జోస్యం నిజమేనని మూడు రోజుల తర్వాత తేలింది. మొదటి భూకంపం తర్వాత కొన్ని గంటలు గడిచాక రెండో భూకంపం సంభవిస్తుందంటూ తన సంస్థ చేసిన ట్వీట్‌ను ఆయన షేర్ చేశారు. అది కూడా నిజమేనని తేటతెల్లమయ్యింది. త్వరలో భారత్‌తో పాటు పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లకు కూడా భూకంపం రావచ్చని హెచ్చరిస్తున్నారు. హూగర్‌బీట్స్ 'సోలార్ సిస్టమ్ జియోమెట్రీ సర్వే' అనే సంస్థలో పరిశోధకుడిగా పనిచేస్తున్నారు. ఈ సంస్థ భూకంపాలపై అధ్యయనం చేస్తోంది. అయితే, హూగర్‌బీట్స్ నకిలీ సైంటిస్టు అని పలువురు ట్విట్టర్‌లో విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా, తాను చెప్పింది వాస్తవరూపం దాల్చడం పట్ల హూగర్‌బీట్స్ విచారం వ్యక్తం చేశారు.

## ఐదుగురు న్యాయమూర్తుల ప్రమాణం


జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో ప్రమాణంచేయిస్తున్న సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టుకు కొత్తగా నియమితులైన ఐదుగురు న్యాయమూర్తులతో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ సోమవారం ప్రమాణస్వీకారం చేయించారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ పులిగోరు వెంకట సంజయ్ కుమార్, జస్టిస్ అహ్సానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ మనోజ్ మిశ్రాలు పదవీ ప్రమాణం చేశారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా అలహాబాద్, గుజరాత్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ అరవింద్ కుమార్ పేర్లను జనవరి 31న కొలీజియం సిఫారసు చేసింది. వీటికి ఆమోదం లభిస్తే మొత్తం 34 మంది జడ్జీలతో సుప్రీంకోర్టు పూర్తి స్థాయిలో పనిచేయనుంది.

**3 హైకోర్టులకు 13 మంది అదనపు న్యాయమూర్తుల నియామకం**
అలహాబాద్, కర్నాటక, మద్రాస్ హైకోర్టుల్లో 13 మంది అదనపు జడ్జీలు నియమితులయ్యారు. వీరిలో 11 మంది లాయర్లు కాగా ఇద్దరు న్యాయాధికారులు. వీరి పేర్లను సుప్రీంకోర్టు కొలీజియం జనవరిలో సిఫార్సు చేసింది. వీరిలో మద్రాస్ హైకోర్టు న్యాయవాది లక్ష్మణ చంద్ర విక్టోరియా గౌరీకి బీజేపీతో సంబంధాలున్నాయనే ఆరోపణ వివాదం రేపింది. ఈమె పేరును సిఫార్సు చేయడాన్ని మద్రాస్ హైకోర్టు బార్ అసోసియేషన్ వ్యతిరేకించింది. బార్‌కు చెందిన 21 మంది లాయర్లు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ రాశారు. సుప్రీంకోర్టులో పిటిషన్ కూడా వేశారు. ''తాను బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శినంటూ గౌరీ అంగీకరించారు. మైనారిటీలపై విద్వేష వ్యాఖ్యలు చేశారు. మత ఛాందస భావాలున్న ఆమె న్యాయమూర్తిగా అనర్హురాలు'' అని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ఫిబ్రవరి 10న విచారణ జరగాల్సి ఉంది. దానిపై మంగళవారమే విచారణ చేపడతామని సీజేఐ ధర్మాసనం తెలిపింది. పార్టీలతో సంబంధాలున్న వారూ జడ్జీలు కావచ్చని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరెన్ రిజిజు అనడం తెలిసిందే.

# 'అదానీ'పై అదే దుమారం




**విపక్షాల 'జేపీసీ'డిమాండ్‌తో స్తంభించిన ఉభయసభలు ● అదానీ వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసు: రాహుల్**

**సాక్షి, న్యూఢిల్లీ:** పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ప్రారంభించాలని భావించిన ప్రభుత్వానికి మళ్లీ చుక్కెదురైంది. సోమవారం కూడా 'అదానీ'అంశం పార్లమెంట్‌ను కుదిపేసింది. అదానీ గ్రూప్‌పై అవినీతి ఆరోపణలపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)తో దర్యాప్తు చేయించాలన్న ప్రతిపక్ష సభ్యుల ఆందోళనలతో ఉభయసభల కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. ఈ నెల ఒకటో తేదీన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాక అదానీ అంశంపై విపక్ష సభ్యులు పట్టువీడకపోవడంతో ఉభయ సభల్లోనూ మరే ఇతర కార్యకలాపాలకు అవకాశం దొరకలేదు. ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సాధారణంగా ప్రధాని మోదీ ఉభయ సభల్లో బదులివ్వాల్సి ఉంటుంది. సోమవారం లోక్‌సభ ప్రారంభం కాగానే కాంగ్రెస్ సహా ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి 'అదానీ సర్కార్ షేమ్ షేమ్' అంటూ నినాదాలు చేశారు. జేపీసీతో విచారణకు పట్టుబట్టారు. స్పీకర్ ఓం బిర్లా వారిని తమతమ స్థానాల్లో కూర్చుని, చర్చలో పాల్గొనాలని కోరారు. వినిపించుకోక పోవడంతో తన చాంబర్‌కు వచ్చి డిమాండ్లపై చర్చించాలని సూచించారు. ఫలితం లేకపోవడంతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల వాయిదా తీర్మానాన్ని తోసిపుచ్చారు. సభ తిరిగి ప్రారంభమయ్యాకా నినాదాలు కొనసాగడంతో సభ మంగళవారానికి వాయిదాపడింది. అనంతరం విపక్ష నేతలు పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసనకు దిగారు. అంతకుముందు ప్రతిపక్షాల నేతలు కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే చాంబర్‌లో భేటీ అయ్యారు. పార్లమెంట్‌లో అదానీ అంశంపై చర్చ జరిగి మోదీ బదులివ్వాల్సిందేనని ఖర్గే చెప్పారు.

**ఎగువసభలోనూ నిరసనల పర్వం**
రాజ్యసభ ఉదయం ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన అబ్దుల్ సమద్ సిద్దిఖీకి నివాళులర్పించింది. అనంతరం ప్రతిపక్ష పార్టీల నేతలిచ్చిన 10 నోటీసులను సభాధ్యక్షుడు జగ్‌దీప్ ధన్‌ఖడ్ అంగీకరించలేదు. కాంగ్రెస్ నేతలు ఖర్గే, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హి, ప్రమోద్ తివారీ నోటీసులు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నాయని పేర్కొన్నారు. నిర్ణయించిన ప్రకారమే కార్యకలాపాలు జరుగుతాయని స్పష్టం చేశారు. అదానీ గ్రూప్‌లో అవినీతి ఆరోపణలపై చర్చ జరగాలంటూ ప్రతిపక్ష సభ్యులంతా ఏకమై పట్టుబట్టారు. వారి డిమాండ్‌ను చైర్మన్ తోసిపుచ్చారు. అంతరాయాల కారణంగానే ప్రతిపక్ష సభ్యులు అందుబాటులో ఉన్న అవకాశాలన్నీ కోల్పోయాయన్నారు. ఆందోళనలు కొనసాగడంతో మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా పడింది. ప్రతిపక్షాల నిరసనలు ఆగకపోవడంతో మంగళవారానికి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

**అదానీ కోసం మోదీ ఏమైనా చేస్తారు: రాహుల్**
పార్లమెంట్‌లో అదానీ అంశం చర్చకు రాకుండా పక్కదారి పట్టించేందుకు ప్రధాని మోదీ చేయగలిగిందంతా చేస్తారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. 'అదానీపై చర్చకు ప్రభుత్వం భయపడుతోంది. బిలియనీర్ వ్యాపారవేత్త అదానీ వెనుక ఉన్న శక్తి ఎవరో దేశప్రజలకు తెలుసు. పార్లమెంట్‌లో అదానీ గ్రూప్‌పై చర్చ జరిగితేనే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయి. దీనిపై చర్చకు ప్రభుత్వం అవకాశం ఇవ్వాలి' అని రాహుల్ మీడియాతో అన్నారు.

**ఆర్‌బీఐ, ఎల్ఐసీ కార్యాలయాల వద్ద నిరసన**
కాంగ్రెస్ శ్రేణులు ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ), భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) కార్యాలయాల వద్ద ప్రదర్శనలు చేపట్టారు. అదానీ దేశం విడిచిపోకుండా ఆయన పాస్‌పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పాస్‌పోర్టులను సీజ్ చేయకపోవడం వల్లే గతంలో వ్యాపారవేత్తలు విజయ్ మాల్యా, నీరవ్ మోదీలు దేశం విడిచి పారిపోయారని చెప్పారు. మధ్య ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్‌లోనూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు జరిగాయి.

## వాట్సాప్‌తో ఫుడ్ ఆర్డర్ చేయొచ్చు

**త్వరలో రైలు ప్రయాణికులకు ఐఆర్‌సీటీసీ సౌకర్యం**

**న్యూఢిల్లీ:** వాట్సాప్ నంబర్‌తో కావాల్సిన ఆహారపదార్థాలను ఆర్డర్ చేసే సౌకర్యం రైలు ప్రయాణికులకు త్వరలో అందుబాటులోకి రానుంది. కృత్రిమ మేధతో పనిచేసే చాట్‌బోట్ ప్రయాణికులకు మీల్స్‌ను బుక్ చేస్తుంది. ఈ కేటరింగ్ సేవల కోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన వెబ్‌సైట్ www.catering.irctc.co.inతోపాటు ఈ–కేటరింగ్ యాప్ 'ఫుడ్ ఆన్ ట్రాక్'ను అందుబాటులోకి తెచ్చిందని తెలిపింది. ఇ–టికెట్ బుక్ చేసుకుని, ఇ–కేటరింగ్ సేవలకు ఆప్షన్ ఇచ్చిన ప్రయాణికులకు వాట్సాప్ నంబర్ నుంచి మెసేజీ వెళ్తుంది. దాని ద్వారా ఆ మార్గంలోని స్టేషన్లలో నచ్చిన రెస్టారెంట్లలో మీల్స్ బుక్ చేసుకోవచ్చు.


సోమవారం స్విట్జర్లాండ్‌లో లీస్ జుమెలెస్ జంట శిఖరాల నడుమ దేదీప్యమానంగా వెలిగిపోతున్న చందమామ

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం | 7 | ఫిబ్రవరి | 2023

## బెళగావిలో మహిళా భేరి

బెళగావి నగర పాలకులుగా ఇద్దరూ అతివలే ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికలో మేయర్‌గా శోభా సోమనాచె, ఉప మేయర్‌గా రేష్మ పాటిల్‌కు పగ్గాలు దక్కాయి. ఇద్దరూ బీజేపీ కార్పొరేటర్లే కావడం విశేషం



# 8 ఏళ్లలో చేసి చూపించాం



వక్కల పేటా, హారంతో ప్రధాని మోదీ

- దిగుమతులను తగ్గించి, దేశీయ తయారీకి పెద్దపీట
- ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి
- తుమకూరు జిల్లాలో హెలికాప్టర్ల ఫ్యాక్టరీ ప్రారంభం



సోమవారం బెంగళూరులో ఆరంభమైన ఇంధన సదస్సులో ఈ సైకిళ్లతో ప్రధాని మోదీ



**తుమకూరు:** డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏమీ సాధించలేదు. ఇప్పటివరకు చేసింది సున్నా అని ప్రతిపక్షాలు చెబుతున్నాయి. వారికి తుమకూరు జిల్లా గుబ్బి తాలూకాలోని హెచ్‌ఏఎల్ హెలికాప్టర్ల కర్మాగారం ప్రారంభం, ప్రతి ఇంటికీ పరిశుభ్రమైన తాగునీటిని అందించే జల జీవన్ మిషన్, తుమకూరు పారిశ్రామిక టౌన్‌షిప్ పథకానికి శంకుస్థాపనలే సమాధానం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సోమవారం సాయంత్రం గుబ్బి తాలూకాలో నిట్టూరు హోబ్లిలో కేంద్ర రక్షణ శాఖ నిర్మించిన హెచ్‌ఏఎల్ లఘు హెలికాప్టర్ల ఫ్యాక్టరీని మోదీ, కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రారంభించారు.

**బడ్జెట్లో అందరికీ సంక్షేమం**

ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మోదీ ప్రసంగిస్తూ 70 సంవత్సరాల పాటు పరిపాలన చేసిన కాంగ్రెస్ పార్టీ చేయలేని అభివృద్ధిని తాము 8 సంవత్సరాలలో చేసి చూపిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలకు తగిన బడ్జెట్‌ను ఈసారి సమర్పించామన్నారు. ఇందులో దళితులు, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి అవకాశం కల్పించామన్నారు. ఏడాదికి రూ. 7 లక్షల వరకు ఆదాయం ఉన్నా పన్ను లేకుండా చేశామని, వృద్ధులకు డిపాజిట్లపై వడ్డీ రేటును పెంచామని తెలిపారు. రైతులు, చిన్నకారు రైతులు లబ్ధి కోసం శ్రీ అన్న యోజన తెచ్చామని, ఈ పథకం ద్వారా చిరుధాన్యాలైన రాగి, కొర్ర తదితరాలను సాగుచేసేవారికి ప్రోత్సాహం లభిస్తుందని చెప్పారు. తద్వారా తుమకూరు జిల్లాతో పాటు రాష్ట్రంలో ఉన్న రైతులకు చేయూత అందుతుందన్నారు.

**దిగుమతులను తగ్గించాం**

ఇప్పటివరకు భారత రక్షణ రంగంలో అనేక మార్పులు వచ్చాయి, ప్రతి వస్తువును విదేశాల నుంచి దిగుమతి చేసుకొని, దానిని ఇక్కడ రూపొందించేవారు, గత 8 ఏళ్లలో దిగుమతులను తగ్గించి ఎగుమతిని పెంచామని చెప్పారు. 60 శాతానికి పైగా వస్తువులను మనదేశంలోనే తయారు చేస్తున్నామని, గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం బసవరాజ బొమ్మై, కేంద్ర మంత్రి ఎ.నారాయణ స్వామి, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. జిల్లా కళాకారులు తయారు చేసిన వక్క పేటా, వక్కల హారాన్ని మోదీ ధరించారు.

**ఇంధన సదస్సుకు మోదీ**

ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు చేరున్నారు. మొదట నగరంలో జరిగిన ఇంధన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. కాలుష్య రహిత ఇంధనాల ఆవశ్యకతను వివరించారు. అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్లో తుమకూరు హెచ్‌ఏఎల్‌కు చేరుకున్నారు. మళ్లీ అదే హెలికాప్టర్లో బెంగళూరుకు వచ్చారు. అనంతరం విమానంలో ఢిల్లీకి బయల్దేరారు.



తుమకూరు హెచ్‌ఏఎల్ ఫ్యాక్టరీలో మోదీ, రాజ్‌నాథ్‌సింగ్

## ఫ్లెక్సీలు కడితే క్రిమినల్ కేసులు

- పాలికె కమిషనర్

**బనశంకరి:** సిలికాన్ సిటీ బెంగళూరులో ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టేవారిపై క్రిమినల్ కేసులు పెడతామని బీబీఎంపీ హెచ్చరించింది. వీటిని హైకోర్టు నిషేధించినప్పటికీ నగరంలో రోజు రోజుకూ ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం విచ్చలవిడిగా సాగుతోంది. పాలికె హెచ్చరికలను ఎవరూ పట్టించుకోవడం లేదు. స్థానిక సార్వజనిక స్థలాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లను అమరుస్తున్నారు. ఇప్పటినుంచి ఎవరైనా వీటిని కడితే, ఆయా వలయ అధికారులు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అసిస్టెంట్ కమిషనర్లకు ఆదేశించారు. సోమవారం కేంద్ర కార్యాలయంలో విలేకరులతో బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ మాట్లాడుతూ అతిక్రమించేవారిపై కనీసం వలయాల వారీగా 10 క్రిమినల్ కేసుల్ని నమోదు చేయాలని సూచించామన్నారు. దీంతో బ్యానర్లు కట్టే వారికి హెచ్చరిక లాగా ఉంటుందన్నారు.

## మైసూరు శివార్లలో చిరుత బందీ



**మైసూరు:** మైసూరు నగర శివార్లలో ఆర్‌బీఐ వెనుక భాగంలో శ్యాదనహళ్లి చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కంటికి నిద్ర లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు బోనులోకి చిక్కింది. 15 రోజుల నుంచి చిరుత తిరుగుతుండడంతో ప్రజల్లో భయం పట్టుకుంది. అటవీ సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో బోనులు పెట్టారు. ఆదివారం రాత్రి అటువైపుగా వచ్చిన చిరుత బోనులో పడడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇది మూడేళ్ల వయసున్న మగ చిరుతగా గుర్తించారు. అటవీ సిబ్బంది దానిని తరలించారు. జిల్లాలో గత రెండు వారాల్లో నాలుగు చిరుతలను బంధించారు.

## మరాఠా మూలాలున్న వ్యక్తిని సీఎం చేస్తారన్నా: కుమార

**బనశంకరి:** మరాఠా పేష్వా డీఎన్‌ఏ కలిగిన వ్యక్తిని కర్ణాటక ముఖ్యమంత్రి చేయడానికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధమయ్యారని అన్నాను తప్ప బ్రాహ్మణ సముదాయాన్ని నిందించలేదని జేడీఎస్ మాజీ సీఎం హెచ్‌డీ.కుమారస్వామి అన్నారు. సోమవారం యశవంతపురలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. విలేకరులతో కుమార మాట్లాడుతూ తాను బ్రాహ్మణులను కించపరిచానని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని, కానీ నేను ప్రస్తావించిన విషయం పట్ల చర్చించలేదన్నారు. మరాఠా పేశ్వా మూలాలున్న వ్యక్తిని సీఎం చేయడానికి బీజేపీ ప్లాన్ చేసిందని చెప్పానన్నారు. బ్రాహ్మణులంటే తనకు ఎంతో గౌరవముందని అన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద జోషీపై ఆయన చేసిన ఆరోపణలు వివాదాస్పదం కావడంతో ఈ వివరణ ఇచ్చారు.

## న్యూస్‌రీల్

### రింగ్‌రోడ్డుకు నేడు పునీత్ పేరు

**బనశంకరి:** నగరంలో నాయండహళ్లి జంక్షన్ నుంచి బన్నేరుఘట్ట రోడ్డు వేగా సిటీ మాల్ వరకు రింగ్ రోడ్డుకు కర్ణాటక రత్న పునీత్‌రాజ్‌కుమార్ పేరు పెట్టనున్నారు. రెవెన్యూ మంత్రి ఆర్.అశోక్ సోమవారం కర్ణాటక చలనచిత్ర వాణిజ్యమండలి ఆఫీసులో మాట్లాడుతూ నేడు మంగళవారం పాలికె నిర్వహించే ఈ కార్యక్రమంలో సీఎం బొమ్మై, నటులు శివరాజ్‌కుమార్, రాఘవేంద్ర రాజ్‌కుమార్, పునీత్ సతీమణి అశ్విని పాల్గొంటారని తెలిపారు.
అలాగే మార్చిలో జరిగే 14వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవ బ్రోచర్‌ను సీఎం ఆవిష్కరిస్తారని తెలిపారు. చిత్రోత్సవం కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.4 కోట్లు నిధులు విడుదల చేసిందని, ప్రముఖ నటులు రేఖా, చిరంజీవి ప్రారంభిస్తారని తెలిపారు.

### ఏనుగు దాడిలో కూలీ మృతి

**మైసూరు:** అడవి ఏనుగు దాడిలో వ్యవసాయ కూలీ దుర్మరణం చెందాడు. జిల్లాలోని కొడ్లిపేట దగ్గర శాంతపుర గ్రామం హేమావతి నీటి కాలువ వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. సోమవారం ఉదయం వరినాట్ల పనికి కూలీ కుమార (40) వెళ్లాడు. ఈ సమయంలో కరకేరి దొడ్డి అడవి నుంచి ఆహారం కోసం వచ్చిన ఏనుగు కుమార పైన దాడి చేసి తొక్కడంతో మరణించాడు. అతనితో పాటు ఉన్న దొడ్డయ్య పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివార సంతె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

### బీఎంటీసీలో గుజరీ గోల్‌మాల్

- మూడో కంటికి తెలియకుండా అమ్మేశారు !

**యశవంతపుర:** బీఎంటీసీలో భారీ అవినీతి జరిగింది. మండలి ఆవరణలో ఉన్న గుజరీ వస్తువులను అధికారులు ఎవరికీ తెలియకుండా అమ్మేసిన విషయం తాజాగా వెలుగులోకి వచ్చింది. కండక్టర్, డ్రైవర్లు చిన్న తప్పు చేస్తే కఠినంగా వ్యవహరించే అధికారులపై ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటారని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. గుజరీ వస్తువులు అమ్మే సమయంలో వీడియో తీయాలనే నిబంధనలు ఉన్నాయి. సీసీ కెమెరాలను ఆఫ్ చేసి లక్షల విలువైన గుజరీ సరుకును గుట్టుగా అమ్మేశారు. తప్పు చేసిన అధికారులకు నోటీసులిచ్చి ఉన్నతాధికారులు చేతులు దులుపుకొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గుజరీ వస్తువులను అమ్మిన విషయంపై సాక్ష్యాలతో ఫిర్యాదు చేసిన ఎందుకు చర్యలు తీసుకోవడాన్ని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### వర్సిటీలో అగ్ని ప్రమాదం

- బూడిదైన ఆట సామగ్రి



**తుమకూరు:** తుమకూరు విశ్వ విద్యాలయంలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో మంటలు అంటుకొని క్రీడా సామగ్రి కాలిపోయింది. సోమవారం సాయంత్రం కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి బెడ్‌లు, బ్యాట్లు, హాకీ స్టిక్స్, బంతులు వంటివి బుగ్గి అయ్యాయి. అక్కడే ఉన్న జనరేటర్ వల్ల మంటలు పుట్టి ఉంటాయని అనుమానిస్తున్నారు. ఓ మోస్తరుగా ఆస్తినష్టం సంభవించింది. నగర పోలీసులు కేసు నమోదు చేశారు.

### కొత్త విద్యా విధానంతో గణనీయ మార్పు



పట్టాలు అందుకున్న విద్యార్థులతో దేశికేంద్ర స్వామి, దత్తాత్రేయ హొసబాళె

**మైసూరు:** కేంద్ర ప్రభుత్వం కొత్తగా అమలులోకి తీసుకు వచ్చిన జాతీయ నూతన విద్యా విధానం వల్ల మనదేశం ప్రపంచంలో ఒక మహాశక్తిగా ఎదుగుతుందని ఆర్‌ఎస్‌ఎస్ సీనియర్ నేత దత్తాత్రేయ హొసబాళె అన్నారు. సోమవారం మైసూరు బన్ని మంటప వద్దనున్న జేఎస్‌ఎస్ ఉన్నత విద్యా, పరిశోధన అకాడమీలో ఆడిటోరియంలో 13వ స్నాతకోత్సవం ఘనంగా జరిగింది. దత్తాత్రేయ పాల్గొని పట్టభద్రులకు పట్టాలు, బంగారు పతకాలను అందజేశారు. నూతన జాతీయ విద్యా విధానం గణనీయమైన మార్పు తెస్తుందని అన్నారు. ఇది జాతీయ విద్యా రంగంలో అనేక మార్పులు తీసుకు వస్తుందని అన్నారు.

## చాంతాడంత చలానాలు పెండింగ్



- మూడు రోజుల్లో రూ. 25 కోట్ల వసూళ్లు

వాహనదారుడి బకాయి చూపిస్తున్న పోలీసులు

**బనశంకరి:** ఈనెల 11 లోపు ట్రాఫిక్ బకాయిలు చెల్లిస్తే 50 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో ఊహించని విధంగా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈనెల 3న రాయితీ అమల్లోకి రావడంతో మొదటి రోజే రూ. 5.61 కోట్లు, రెండో రోజు రూ. 6.80 కోట్లు, మూడో రోజు ఆదివారం రూ. 6.31 కోట్లకు పైగా వసూలైంది. సోమవారం కూడా భారీగా జరిమానాలు చెల్లించారు. సాయంత్రానికి మొత్తంగా రూ. 25 కోట్లు వసూలైంది. నగరంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లలోనే కాకుండా ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులోని ట్రాఫిక్ నిర్వహణ కేంద్రంలో కౌంటర్ తెరిచి జరిమానా చెల్లించడానికి అవకాశం కల్పించారు. హైకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయసేవల ప్రాధికార అధ్యక్షుడు న్యాయమూర్తి బీ.వీరప్ప అధ్యక్షతన గత నెల 27న నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర రవాణాశాఖ అధికారులతో చర్చించి జరిమానా బకాయిలపై రాయితీ ఇవ్వాలని నిర్ణయించారు. దీనికి రాష్ట్ర రవాణా రోడ్డు భద్రతా కమిషనర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

### లంచగొండ్ల పట్టివేత

**మైసూరు:** రుణం విడుదల కోసం ఓ మహిళ వద్ద లంచం తీసుకుంటూ ఇద్దరు ఉద్యోగులు లోకాయుక్తకు చిక్కారు. ఈ ఘటన మైసూరు నగరంలో చోటుచేసుకుంది. వివరాలు... నగరానికి చెందిన విజయలక్ష్మీ అనే మహిళకు అంబేడ్కర్ అభివృద్ధి కార్పొరేషన్ నుంచి సబ్సిడీతో రుణం మంజూరైంది. దీనికి సంబంధించి చెక్కు ఇవ్వడానికి కార్పొరేషన్ మడికేరి కార్యాలయంలో పనిచేస్తున్న చంద్రశేఖర్, చెలువాంబ అనే ఇద్దరు అధికారులు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. సోమవారం కార్పొరేషన్ సిబ్బంది ఇద్దరు విజయలక్ష్మీ వద్ద రూ. 10 వేలు లంచం తీసుకుంటుండగా లోకాయుక్త అధికారులు దాడి చేసి అరెస్ట్ చేశారు.

## బార్‌లో పరిచయం, టెక్కీకి శఠగోపం

- సిమ్‌కార్డు దొంగిలించి రూ.8.84 లక్షలు కాజేసిన కేటుగాడు



**బనశంకరి:** గుర్తు తెలియని వ్యక్తిని నమ్మి ఇంట్లో ఆశ్రయమిచ్చిన ఓ టెక్కీ రూ. లక్షల్లో వంచనకు గురయ్యాడు. ఈఘటన బెళ్లందూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. వివరాలు... సర్జాపురలో నివాసం ఉంటున్న ఆశీశ్ ఐటీ ఇంజినీర్. గతనె 15న ఇతను బార్‌కు వెళ్లాడు. ఓ గుర్తు తెలియని వ్యక్తి కలిశాడు. తన పేరు తుషార్ అలియాస్ డిటోసర్కార్ అని, ఢిల్లీకి చెందిన వాడినని, బంధువులు ఇంటికి వచ్చినట్లు నమ్మించాడు.

**ఒక్కరోజు తలదాచుకుంటానని..**

బంధువులు నగరంలో లేరని, మరో ప్రాంతానికి వెళ్లారని, దీంతో తనకు ఇక్కడ తెలిసిన వారు ఎవరూ లేరని మాటలు కలిపాడు. ఒకరోజు ఆశ్రయం ఇవ్వాలని తన కష్టం చెప్పుకున్నాడు. అతని మాటలను నమ్మిన ఆశీశ్ అమాయకంగా ఫ్లాట్‌కు తీసుకెళ్లాడు. రాత్రి ఫ్లాట్‌లోనే నిద్రించిన తుషార్ మరుసటిరోజు ఉదయం అక్కడి నుంచి ఉడాయించాడు. ఆశీశ్ ఉదయం నిద్ర లేవగానే తుషార్ కనబడకపోగా ఫోన్‌లో సిమ్ కార్డు కూడా లేదు. అదేరోజు మధ్యాహ్నం ఆశీశ్ అకౌంట్ నుంచి రూ.1.64 లక్షల నగదు వేరే అకౌంట్‌కు జమ అయినట్లు మెసేజ్ వచ్చింది. ఇదే తరహాలో అతడి బ్యాంకు అకౌంట్ నుంచి దశల వారీగా పదిరోజుల్లో ఆన్‌లైన్‌లో షాపింగ్ చేసినట్లు సుమారు రూ.7.20 లక్షలు కట్ అయింది. మొత్తం రూ.8.84 లక్షలు పోయింది. తన సిమ్ కార్డు దొంగిలించిన తుషార్ వేరే మొబైల్‌కు అమర్చుకుని అందులో డిజిటల్ బ్యాంక్ అకౌంట్ ద్వారా నగదు జమ చేసుకున్నట్లు తెలిసింది. బాధితుడు బెళ్లందూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు.

## విమానాశ్రయంలో రచ్చ, యువతికి కటకటాలు

**బనశంకరి:** విమానం ఎక్కడానికి ఆలస్యమైందని భద్రతా సిబ్బందితో గొడవపడి దాడి చేయడంతో పాటు బాంబు పెట్టానని బెదిరించి రచ్చ చేసిన యువతి కటకటాలు లెక్కిస్తోంది. వివరాలు... 3వ తేదీన బెంగళూరు నుంచి కోల్‌కతాకు వెళ్లడానికి కేరళ కు చెందిన మానసిసతీ బైను (31) కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లింది. ఇండిగో విమానంలో యువతి టికెట్ బుక్ చేసుకుంది. బోర్డింగ్ గేట్- 6లో లోపలికి వెళ్లబోగా భద్రతా సిబ్బంది అనుమతించలేదు, క్యూలో ఎక్కువమంది ప్రయాణికులు ఉండడంతో ఆలస్యమౌతుందని, వెళ్లనివ్వాలని డిమాండ్ చేసింది. సమ్మతించని భద్రతా సిబ్బంది తనిఖీలు పూర్తయ్యాకే పంపిస్తామని చెప్పారు. దీంతో సిబ్బందితో గొడవకు దిగింది, తనను పంపకపోతే విమానాశ్రయంలో బాంబు పెట్టి పేల్చేస్తానని, ఇక్కడ బాంబు పెట్టానని, ప్రయాణికులు విమానాశ్రయం నుంచి వెళ్లిపోవాలని గట్టిగా కేకలు వేస్తూ రభస సృష్టించింది. సందీప్‌సింగ్ అనే జవాన్ చొక్కాపట్టుకుని ముఖం పై దాడిచేసింది. దీంతో సీఐఎస్‌ఎఫ్ భద్రతా సిబ్బంది ఆమెను అదుపులోకి తీసుకుని కెంపేగౌడ విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలీసులు ఆమెను కోర్టులో హాజరు పరచగా ఫిబ్రవరి 17 వరకు రిమాండ్ విధించారు.

# నలు చెరగులా తేరు వైభవాలు

**సిరుగుప్ప:** మాఘమాసం కావడంతో రాష్ట్రమంతటా రథోత్సవాల సీజన్ ఆరంభమైంది. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా తేరు సంబరాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. బళ్లారి జిల్లా సిరుగుప్పలో దేశనూరు రోడ్డులో గాంధమ్మ దేవత, రారావి గ్రామంలోని చారిత్రాత్మక హుత్తిన యల్లమ్మ దేవి రథోత్సవం వైభవంగా జరిగింది. ఆలయాలను, వీధులను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచే దేవతామూర్తులకు వివిధ పూజలు, హోమాలు ఆచరించారు. సాయంకాలం 6.30 కు తేరు ఉత్సవం ఘనంగా జరిగింది. పరిసర గ్రామాల నుంచి వేలాది మంది పాల్గొన్నారు.



సిరుగుప్పలో గాంధమ్మదేవి, యల్లమ్మదేవి రథోత్సవం

**ఘనంగా స్వతంత్ర రథోత్సవం**

**మండ్య:** మండ్య జిల్లాలోని కృష్ణరాజపేటె తాలూకాలోని చరిత్ర ప్రసిద్ధి చెందిన కాపనహళ్లి గవిమఠంలో స్వతంత్ర సిద్ధలింగేశ్వర మహారథోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మంత్రి నారాయణగౌడ, కెంగేరి బండెమఠం స్వామీజీ, గవిమటం పీఠాధిపతి స్వతంత్ర చన్నవీరయ్య స్వామి పూజలు చేసి ప్రారంభించారు.

**లక్ష్మీనారాయణ రథోత్సవం**

**తుమకూరు:** తుమకూరు జిల్లాలోని శిరా పట్టణంలో ప్రఖ్యాత శ్రీ లక్ష్మి నారాయణస్వామి బ్రహ్మ రథోత్సవం భక్తజనం మధ్య కనులపండువగా జరిగింది. స్వామి మూలవిరాట్‌తో పాటు ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. విగ్రహాలను ఉంచి తేరును ఆనందోత్సాహాలతో లాగారు. ఉత్తర కన్నడ జిల్లా జోయ్‌డా తాలూకా ఉళవిలో చెన్నబసవేశ్వర జోడు రథోత్సవం ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు.





మండ్య కాపనహళ్లి గవిమఠం స్వతంత్ర రథోత్సవం, శిర లక్ష్మినారాయణస్వామి తేరు వేడుక



ఉత్తర కన్నడ జిల్లా జోయ్‌డా తాలూకా ఉళవిలో చెన్నబసవేశ్వర జోడు రథోత్సవ సంరంభం

## క్లుప్తంగా

### ఇంటింటా పట్టాల పంపిణీ



అందజేస్తున్న ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి

**బళ్లారి అర్బన్:** నగరంలోని 34, 35వ వార్డుల్లో అర్హులైన వారికి ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి పట్టాలను పంపిణీ చేశారు. సోమవారం ఆయన కర్ణాటక మురికి వాడల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో పేదలకు పంపిణీ చేసే పట్టాలను ప్రభుత్వం నుంచి అర్హులకు పంపిణీ చేసిన అనంతరం మాట్లాడారు. నగరంలో పేదలకు ఇళ్ల స్థలాలకు పట్టాలను పంపిణీ చేస్తామని, ఇళ్లు లేని వారికి ప్రభుత్వం నుంచి ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రలోభాలను అరికట్టండి

**రాయచూరు రూరల్:** రాష్ట్రంలో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లకు గాలం వేసి మభ్య పెట్టే పార్టీ నేతలపై చర్యలు చేపట్టాలని కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆయన సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి మాట్లాడారు. ఎన్నికల్లో ఓటర్లకు మద్యం, బిరియానీ, డబ్బులు, చీరలు తదితర ప్రలోభాలకు గురి చేసే నాయకులకు, పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

### ఉత్సవం లోగో విడుదల



విడుదల చేస్తున్న మంత్రి శ్రీరాములు, ఎమ్మెల్యే గణేష్, అధికారులు

**కంప్లి:** కంప్లి కలారతి ఉత్సవాన్ని భావితరాలకు గుర్తుండేలా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీ.శ్రీరాములు తెలిపారు. ఈ నెల 12న జరగనున్న ఉత్సవ లోగోను సోమవారం మంత్రి ఎమ్మెల్యే గణేష్, జిల్లాధికారి పవన్‌కుమార్‌ల చేతుల మీదుగా విడుదల చేశారు.

### నేత్రవైద్య శిబిరం

**గౌరిబిదనూరు:** వృద్ధాప్యంలో నేత్రాల రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, చత్వారం ఆపరేషన్లు చేయించుకొని మంచి దృష్టిని పొందాలని కంటివైద్యులు డా శశిధర్ తెలిపారు. సోమవారం ఇక్కడ కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి కంటి అద్దాలు, ఔషధాలను అందజేశారు.

### క్రికెట్ పోటీలకు శ్రీకారం



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి

**గంగావతి:** వడ్డరహట్టిలో రెండో దశ బీపీఎల్ క్రీడా పోటీలను సోమవారం ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి క్రికెట్ బ్యాట్ చేత పట్టి బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపు ఓటములను లెక్కించకుండా క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. శారీరక సామర్థ్యం, మానసిక వికాసాన్ని క్రీడలతో పొందవచ్చన్నారు. కాగా ఈ పోటీల్లో 8 క్రికెట్ జట్లు పాల్గొన్నాయి.


### నివేదిక అమలుకు 14న ర్యాలీ

**బళ్లారిఅర్బన్:** సామాజిక న్యాయం కోసం ఎస్సీ అంతర్గత రిజర్వేషన్ ఐక్య పోరాట సమితి నేతృత్వంలో సదాశివ నివేదికపై కేంద్రానికి సిఫార్సు చేయాలని ఒత్తిడి చేస్తూ ఈనెల 14న ర్యాలీ చేపడుతున్నట్లు ఆ సమితి ప్రముఖులు కరియప్ప గుడిమని తెలిపారు. సోమవారం పత్రికా భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. జస్టిస్ ఏజే.సదాశివ నివేదిక అమలు కోసం గత కొన్నేళ్లుగా చేపట్టిన పోరాటాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ సందర్భంగా రామణ్ణ, శివకుమార్, శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### సైనికుల్లా పని చేయాలి

**రాయచూరు రూరల్ :** కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బార్ పిలుపు ఇచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. త్వరలో జరిగే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో సీఎం బొమ్మై ఆధ్వర్యంలోని బీజేపీ సర్కార్ అవినీతి, అక్రమాలకు పాల్పడిందన్నారు.

### కారు ఢీకొని యువకుడి మృతి



మంజునాథ్(ఫైల్)

**రాయచూరు రూరల్:** నగరంలో కారు ఢీకొని ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. చెల్లెలి పెళ్లి కోసం ఆర్టీఓ సర్కిల్‌లో మామిడి తోరణాలు తేవడానికి వెళ్లిన మంజునాథ్(30)ను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. స్నేహితుడికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. మంజునాథ్ మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా సోమవారం పెళ్లి పందిరి వేసి పెళ్లి కూతురిని చేయాల్సిన సమయంలో ఈ దుర్ఘటనతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## నేత్రపర్వం..వెంకావధూత రథోత్సవం



అశేష భక్తజనవాహిని మధ్య రథోత్సవం



పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు

**కంప్లి:** దమ్మూరులో సోమవారం జరిగిన వెంకావధూత రథోత్సవం సందర్భంగా కోళూరు గ్రామం నుంచి దమ్మూరు వెంకావధూత మఠం వరకు భక్తులు పాదయాత్ర చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు, భక్తులు, గ్రామస్తులతో కలిసి పాల్గొని వెంకావధూతను దర్శించుకున్నారు. రథోత్సవంలో చుట్టు పక్కల గ్రామస్తులు, సురేష్‌బాబు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వైభవంగా ఊరేగింపు :** వివిధ రంగాల్లో వెనుకబడి గంగామతస్తులను ఎస్టీల్లో చేర్చాలని ఉభయ ప్రభుత్వాలు చొరవ చూపాలని నిజశరణ అంబిగర చౌడయ్య యువక సంఘం అధ్యక్షులు ఫకీరప్ప తెలిపారు. సోమవారం ఇటిగి గ్రామంలో చౌడయ్య 903వ జయంతి అంగరంగ వైభవంగా జరిగింది. చౌడయ్య చిత్రపటంతో మహిళలు కలశాలు, పూర్ణకుంభాలు, వివిధ వాయిద్యాలతో ఊరేగింపు జరిపారు. సంఘం ఉపాధ్యక్షులు మణ్ణూరు వెంకటేష్, ప్రముఖులు ఎం.అంజినప్ప, లక్ష్మణ, కంప్లి ఈరణ్ణ పాల్గొన్నారు.

### 11న తాలూకా కసాప సమ్మేళనం



మాట్లాడుతున్న కసాప అధ్యక్షులు నిష్ఠిరుద్రప్ప

**బళ్లారిఅర్బన్:** తాలూకా కన్నడ సాహిత్య పరిషత్ 6వ సమ్మేళనాన్ని ఈ నెల 11న నిర్వహిస్తున్నట్లు కసాప జిల్లా అధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప, తాలూకా అధ్యక్షుడు నాగిరెడ్డి తెలిపారు. సోమవారం పత్రికా భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల మృతి చెందిన విద్యా రంగనిపుణుడు జీఎం వీరభద్రయ్య, నాడోజ సుభద్రమ్మ మన్సూర్ వేదికను ఏర్పాటు చేసి సమ్మేళనాన్ని రాఘవ కళా మందిరంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమ్మేళనాన్ని మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు ధ్వజారోహణ చేసి ప్రారంభిస్తారన్నారు. సిటీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి కమ్మ భవనం వద్ద సమ్మేళన కళా బృందాల ర్యాలీని, వేదికపై సమ్మేళనాన్ని మంత్రి శ్రీరాములు ప్రారంభిస్తారన్నారు. సమ్మేళన అధ్యక్షతను కళాకారుడు రమేష్‌గౌడ పాటిల్ వహిస్తారని, కసాప రాష్ట్ర అధ్యక్షులు, నాడోజ డాక్టర్ మహేష్ జోషి ప్రసంగిస్తారన్నారు. రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర పుస్తకాన్ని విడుదల చేస్తారన్నారు. కవిగోష్ఠితో పాటు వివిధ రంగాల్లో సేవలు అందించిన 30 మందిని ఘనంగా సన్మానిస్తారన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 12న సమ్మేళన ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. ఈసందర్భంగా కార్తీక్, రామచంద్ర, నాసిర్ బాషా, సంగమేశ్వర్, చాంద్‌బాషా, కొళగల్లు అంజిని పాల్గొన్నారు.


### పరలోకం కంటే ఇహలోకమే మేలు

**కంప్లి:** పరలోకం కంటే ఇహలోకానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సాహిత్య సిరి ప్రతిష్ఠాన మాజీ ఉపాధ్యక్షులు బంగి దొడ్డ మంజునాథ తెలిపారు. సోమవారం ఒడ్సే కరిబసయ్య శివానందాశ్రమ గురుమఠంలో దివంగత మిఠాయి చెన్నబసయ్య స్మరణార్థం ఏర్పాటు చేసిన 222వ శివానుభవ ప్రవచనంలో ఆయన మాట్లాడారు. జీవిత పరమార్థ సాధన కోసం సంసార త్యాగం సరికాదని దాసమయ్య వచనాల్లో తెలిపారన్నారు. భువనేశ్వరి పాఠశాల ఉపాధ్యాయులు, సాహితీవేత్త మంజునాథ, వ్యవస్థాపకులు జగదీష్, ప్రముఖులు కేసీ.సిద్ధరామేశ్వర శాస్త్రి, యోగరాజ సిద్ధరామస్వామి, శాబాది మృత్యుంజయ, మహిళా మండలి విద్యార్థులు పాల్గొన్నారు.

### దోపిడీ దొంగల అరెస్ట్

**గంగావతి:** కొప్పళ నగరంలో ముగ్గురు దోపిడీ దొంగలను పోలీసులు బంధించి వారి నుంచి చోరీ సొత్తును రికవరీ చేశారు. నగరంలోని గణేష్ నగర్, కళ్యాణ నగర్‌లో నాలుగు ఇళ్లల్లో జనవరి నెలలో దోపిడీలు జరిగాయి. వీటిపై నగర పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేసుకొని నిందితులు విజయ్ మాలి, రవికుమార్, పురుషోత్తం అనే దోపిడీ దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.7.90 లక్షల విలువ చేసే 150 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.5 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు.

### చిత్రకారుడు వర్మ ఇక లేరు



బీకేఎస్ వర్మ (ఫైల్)

**యశవంతపుర:** ప్రముఖ చిత్ర కళాకారుడు డాక్టర్ బీకేఎస్ వర్మ (74) సోమవారం ఉదయం బెంగళూరు బాణసవాడిలోని తన నివాసంలో కన్నుమూశారు. కొద్ది రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. భౌతికకాయాన్ని ప్రజల అంతిమ దర్శనం కోసం మధ్యాహ్నం వరకు నివాసంలో, తరువాత రవీంద్ర కళా క్షేత్రంలో ఉంచారు. ఆయనకు భార్య శాంతమ్మ, కుతుర్లు చైత్ర, లావణ్య, కొడుకు ప్రదీప్‌వర్మ ఉన్నారు. సాయంత్రం టీఆర్ మిల్ సమీపంలో శ్మశాన వాటికలో అంత్యక్రియలు జరిగాయి.

### కొబ్బరి చెట్టుపై కూలీ మృతి

**యశవంతపుర:** టెంకాయలు తెంపడానికి చెట్టు ఎక్కిన వ్యక్తి గుండెపోటు వచ్చి అక్కడే మృతి చెందిన ఘటన బెంగళూరు కెంగేరి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం ఉదయం 7:30 గంటలకు మైలసంద్ర విజయశ్రీ లేఔట్‌లోని వెంకటరమణస్వామి దేవస్థానంలో 40 అడుగుల ఎత్తైన కొబ్బరి చెట్టుపై కాయలను కోయడానికి నారాయణప్ప (60) అనే కూలీ ఎక్కాడు. కాయలు పీకుతుండగా చెట్టుపైనే గుండెపోటు వచ్చింది. ఎంతసేపటికీ ఆయన దిగి రాకపోవటంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి చెట్టుపై అచేతనంగా ఉన్న నారాయణప్పను కిందికి దించి చూడగా చనిపోయి ఉన్నాడు. కెంగేరి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

### పాలసీదారుల పెట్టుబడులు భద్రం

- ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ

**బళ్లారి రూరల్ :** ప్రభుత్వరంగ సంస్థ భారతీయ జీవిత బీమా(ఎల్ఐసీ)లో పాలసీదారుల పెట్టుబడులు భద్రంగా ఉన్నట్లు రాయచూరు విభాగం బీమా ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు డి.వి.సూర్యనారాయణ తెలిపారు. యూఎస్ఏకు చెందిన హిండెన్ బర్గ్ పరిశోధన సంస్థ అదానీ గ్రూపు కంపెనీలపై వెల్లడించిన నివేదికతో రాజకీయ దుమారం చెలరేగింది. అదానీ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులకు నష్టం వాటిల్లిందని దుష్ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది 2023 జనవరి 30న ఎల్ఐసీ అదానీ గ్రూపు కంపెనీలో రూ.36,474.78 కోట్లను పెట్టుబడులుగా పెట్టగా ఇప్పుడు వీటి విలువ రూ.56,142 కోట్లు. ఎల్ఐసీ జాతీయ లాభం రూ.20,000 కోట్లను పొందింది. ప్రతి ఏడాది ఎల్ఐసీ రూ.4.5 లక్షల నుంచి రూ.5 లక్షల కోట్ల వరకు బ్లూచిప్ కంపెనీలో పెట్టుబడుల సంచారం జరుగుతుంటుంది. ఇందులో వచ్చిన లాభాల మొత్తాన్ని పాలసీదారులకు పంపిణీ చేస్తోందని తెలిపారు. ఎల్ఐసీ ప్రభుత్వరంగ సంస్థలకు, ఓఎన్‌జీసీ, ఐడీబీఐ తదితర సంస్థల్లో దీర్ఘకాలిక పెట్టుబడులు పెడుతూ లాభాలను గడిస్తోందని తెలిపారు. అదానీ కంపెనీల్లో కేవలం 7 శాతం ఈక్విటీ షేర్లను పెట్టినట్లు తెలిపారు. ఇంతకంటే అధికంగా టాటా, రిలయన్స్ కంపెనీల్లో ఎల్ఐసీకి ఈక్విటీ షేర్లు ఉన్నట్లు తెలిపారు. బీమా రంగంలో అగ్రగామిగా ఉన్న ఎల్ఐసీపై రాజకీయ దుష్ప్రచారం చేస్తూ పాలసీదారుల నమ్మకాన్ని దెబ్బ తీయరాదని తెలిపారు.

### మౌలిక సౌకర్యాలేవీ?



ఆందోళనలో పాల్గొన్న మురికివాడల వాసులు

**రాయచూరు రూరల్ :** మురికి వాడల వాసులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని స్లం క్రియా వేదిక డిమాండ్ చేసింది. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి సంచాలకుడు జనార్దన్ మాట్లాడారు. మురికి వాడల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.రెండు వేల కోట్లు కేటాయించాలన్నారు. జనాభా ఆధారంగా నిధులు విడుదల చేయాలని, సబ్సిడీల రూపంలో వెసులుబాటు, నరేగ పథకంలో వంద రోజుల పని కల్పించాలని ఒత్తిడి చేశారు.

### రెండు బైక్‌లు ఢీ : యువకుడు మృతి



మృతి చెందిన సాయిచరణ్

**బళ్లారిఅర్బన్:** తాలూకాలోని పీడీహళ్లి పోలీస్ స్టేషన్‌లో పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు సీఐ ఉమేష్ తెలిపారు. ఆయన సోమవారం తెలిపిన వివరాల మేరకు చేళ్లగుర్కి సమీపంలో ఉరవకొండ నుంచి బళ్లారి వైపునకు వస్తున్న రెండు బైక్‌ల్లో ఓ బైక్‌లో సాయిచరణ్, కంప్లి తాలూకా సిద్మల్ కొట్టాల్‌కు చెందిన రమేష్ బళ్లారికి వెళుతుండగా, మరో బైక్‌లో బళ్లారికి చెందిన ఉమేష్ వేగంగా వస్తుండగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. బళ్లారిలోని శ్రీరామపురం కాలనీకి చెందిన సాయిచరణ్(28) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన రమేష్‌ను విమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలిసిన పీడీహళ్లి పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఉమేష్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సాయిచరణ్ మృతికి అతని స్నేహితులు సంతాపం తెలిపి నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

### నగరసభ సమావేశం వాయిదా

**గంగావతి:** నగరసభ సమావేశాన్ని కమిషనర్ విరుపాక్షప్పమూర్తి వాయిదా వేశారు. సామాన్య సభకు కమిషనర్ ఒక్కడే వచ్చి కూర్చోగా ఒక్క కౌన్సిలర్ మాత్రమే హాజరయ్యారు. నగరసభ అధ్యక్షుడితో సహా సభ్యులందరూ గైర్హాజరు కావడంతో అనివార్య పరిస్థితిలో సమావేశాన్ని వాయిదా వేశారు. కాగా సభ్యుల గైర్హాజరుకు కారణాలు తెలియరాలేదు.

### గడ్డివామి దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివామి

**గంగావతి రూరల్:** కొప్పళ జిల్లా కుష్టిగి తాలూకా కొడతగేరిలో గడ్డివామి అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన ఘటన జరిగింది. గడ్డివామి దగ్ధంతో రైతు నీలప్ప కన్నీరుమున్నీరయ్యారు. గడ్డి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు రూ.25 వేలకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన చెందారు. కాగా పరిహారం ప్రకటించాలని గ్రామస్తులు ప్రభుత్వానికి విన్నవించారు.

## 21న అమిత్‌షా బళ్లారి రాక

- మేం మళ్లీ గెలిస్తే సీఎంగా బొమ్మై
- రవాణా శాఖా మంత్రి జీ.శ్రీరాములు



భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు

**బళ్లారి అర్బన్:** కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా ఈనెల 21న బళ్లారికి విచ్చేస్తున్నట్లు రాష్ట్ర రవాణా శాఖా మంత్రి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలో బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌ను ప్రారంభించేందుకు విచ్చేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు రాష్ట్రానికి పలు మార్లు విచ్చేసి మళ్లీ బీజేపీని గెలిపించేందుకు శ్రమిస్తారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని సీఎం చేస్తారని వ్యాఖ్యానించడం అర్థరహితమన్నారు. ప్రజలను దారి తప్పించేందుకు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్నారు. సీఎం బసవరాజు బొమ్మై నేతృత్వంలోనే ఎన్నికలు జరుగుతాయని, బీజేపీ అధికారంలోకి వస్తే మళ్లీ బొమ్మై సీఎం అవుతారన్నారు. ఇటీవల సండూరు తాలూకాలో జాతర మహోత్సవంలో మాజీ మంత్రి సంతోష్‌లాడ్ తనను స్నేహపూర్వకంగానే కలిసి పలకరించారని, రాజకీయాలకు ఆపాదించవద్దన్నారు. బాబూ జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గాలి సోమశేఖర్‌రెడ్డి, అధికారులు, పాలకులు పాల్గొన్నారు.

**బాబూజీ భవన్‌ను వినియోగించుకోండి**

**బళ్లారిటౌన్:** జిల్లాలో సముదాయ భవనాలను కేవలం కార్యక్రమాల కోసమే కాకుండా విద్యార్థుల నైపుణ్యతను పెంపొందించే శిక్షణా కార్యక్రమాలకు వినియోగించుకోవాలని మంత్రి శ్రీరాములు పేర్కొన్నారు. నల్లచెరువులో నిర్మించిన బాబూ జగ్జీవన్‌రామ్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఒక ఎకరా ప్రదేశంలో రూ.4.3 కోట్ల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, సఫాయి కర్మచారి మండలిఅధ్యక్షులు హనుమంతప్ప, మాజీ ఎంపీ శాంత పాల్గొన్నారు.

**రంజాన్‌సాబ్ విగ్రహావిష్కరణ**

నగరంలోని రాజ్‌కుమార్ రోడ్డులోని సెంట్రల్ లైబ్రరీ ఆవరణలో నూతనంగా నిర్మించిన కర్ణాటక ఏకీకరణ యోధుడు కప్పగల్ పింజార్ రంజాన్‌సాబ్ విగ్రహాన్ని సోమవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీరాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఏకీకరణ కోసం పోరాడిన విధానాన్ని వివరించారు. కార్పొరేటర్లు ఇబ్రాహిం బాబు, రంజాన్ పాల్గొన్నారు.

## బదిలీని రద్దు చేయాలని ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజల నిరసన

**సిరుగుప్ప:** తాలూకా ఆరోగ్య కేంద్రం ముఖ్య వైద్యాధికారి డా.దేవరాజ్ బదిలీని వెంటనే రద్దు చేయాలని ప్రజలు ఆందోళన చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సామాజిక సేవకుడు అడివప్ప మాట్లాడుతూ పేద గర్భిణులకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కాన్పుకు అయ్యే రూ.35-40 వేలకు పైగా ఖర్చును తప్పించి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోనే కాన్పులు జరిపించి ప్రజల మెప్పు పొందిన డా.దేవరాజ్‌ను రాత్రికి రాత్రి బదిలీ చేయడం సరికాదన్నారు. బదిలీని వెంటనే రద్దు చేయించాలన్నారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం యువ నాయకుడు ధరప్పనాయక్ మాట్లాడుతూ నగరంలో ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా ఆరోగ్య కేంద్రాన్ని నడుపుతూ నిస్వార్థంగా పని చేసే డాక్టర్ దేవరాజ్ బదిలీని రద్దు చేయాలని కోరారు. మాజీ జెడ్పీ మెంబర్ రాధ ధరప్పనాయక్, తాలూకా క్రిస్టియన్ సంఘం అధ్యక్షులు నాగప్ప, మహిళలు పాల్గొన్నారు.

### ఘనంగా మాచిదేవ జయంతి



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తదితరులు

**గంగావతి రూరల్:** మాచిదేవ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాచిదేవ చిత్రపటానికి ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి పుష్పనివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాచిదేవ ఆదర్శాలను యువత అలవరచుకోవాలన్నారు. నగర యోజన ప్రాధికార అధ్యక్షులు రాఘవేంద్ర శెట్టి, నగర స్థాయి సమితి సభ్యులు రాచప్ప సిద్దాపుర, బసవరాజ్ హేరూరు, మంజునాథ, ఈరణ్ణ, శివకుమార్, సముదాయ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### నాసిరకంగా మరమ్మతులు



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

**రాయచూరు రూరల్:** రాజోలిబండ కాలువ మరమ్మతు పనులు నాసిరకంగా చేపడుతున్నారని స్వరాజ్ పార్టీ నేత చామరస మాలిపాటిల్ ఆరోపించారు. ఆయన సోమవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని మాన్వి, రాయచూరు తాలూకాల్లో రాజోలిబండ కాలువ పనుల్లో నాణ్యత కొరవడిందన్నారు. పనులను కాంట్రాక్టర్లు నాసిరకంగా చేసి చేతులు దులుపుకున్నారన్నారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

## కోలారు వార్తలు...

## సిద్దరామయ్య ఆఖరు పోరాటం



మాట్లాడుతున్న ఎంపీ ఎస్ మునిస్వామి

**కోలారు :** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ సీఎం సిద్ధరామయ్య తన రాజకీయ జీవితంలో కోలారు నుంచి ఆఖరు పోరాటానికి దిగుతున్నారని, సిద్ధరామయ్యకు ఇవే చివరి ఎన్నికలని ఎంపీ ఎస్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం తాలూకాలోని నరసాపురం ఫిర్కా జోడికృష్ణాపురలో బీజేపీ సభ్యత్వ అభియాన్‌ను ప్రారంభించి ఆయన మాట్లాడారు. వయసు మళ్లిన సిద్ధరామయ్య ఇంట్లో మనవళ్లతో ఆడుకోవాల్సిన సమయంలో అధికారం కోసం ఆరాటపడుతున్నారన్నారు. ఆఖరు ప్రయత్నంగా కోలారుకు వస్తున్న సిద్ధరామయ్యకు నిరాశ ఎదురవుతుందన్నారు. సిద్దరామయ్య దళిత నాయకులను మాత్రమే కాదు అనేక మంది హిందూ నాయకులను కూడా అణగదొక్కారని, ఆయనకు తగిన గుణపాఠం తప్పదన్నారు. రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు సందీప్, కేయూడీఏ మాజీ అధ్యక్షుడు ఓం శక్తి చలపతి, నటుడు ప్రథమ్ తదితరులు పాల్గొన్నారు.

### ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



మునిరాజు

**కోలారు :** తాలూకాలోని ఐతరాసనహళ్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న సి.మునిరాజు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. రాష్ట్రంలో ఏక కాలంలో అత్యధిక కౌశల్య ఆధారిత శిక్షణా కార్యక్రమాలను రాష్ట్రంలోని వివిధ విభాగాల్లో ఒకేసారి నిర్వహించినందుకు ఈయనకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. రాష్ట్రంలోని 253 పాఠశాలల్లో 13 నుంచి 18 ఏళ్ల వయసు లోపు పిల్లలకు జీవితంలో నిర్ణయాలు తీసుకోవడంపై శిక్షణనిచ్చారు. ఈ శిక్షణ పిల్లల్లో కౌశల్య, వ్యక్తిత్వ వికాసానికి ఎంతో ఉపయోగపడింది. తుమకూరులో జరిగిన కార్యక్రమంలో సి.మునిరాజుకు ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్-2023ని ప్రదానం చేశారు. ఈసందర్భంగా సి మునిరాజును పలువురు అభినందించారు.

### ఎన్నిక

**కోలారు :** తాలూకా చేపల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడిగా అబ్బణి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్ల అవధికి పాలక మండలి అధ్యక్ష స్థానానికి సోమవారం జరిగిన ఎన్నికల్లో అబ్బణి శంకర్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎన్నికల అధికారిణిగా సహకార సంఘాల సూపరింటెండెంట్ ఎంఆర్ గీతా వ్యవహరించారు. నూతన అధ్యక్షుడిని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా చేపల పెంపకందారుల సహకార సంఘం డైరెక్టర్ దేవరాజ్, మునియప్ప, గంగమ్మ, లోకేష్, ఎస్.బాబు, శ్రీరామ, యల్లప్ప, శేఖర్, వెంకటరమణప్ప తదితరులు పాల్గొన్నారు.

### సిద్దరామయ్యపై ఆరోపణలు తగదు

**కోలారు :** కోలారు నుంచి పోటీ చేస్తున్న సిద్దరామయ్యపై దళిత వ్యతిరేకి అని పలు దళిత సంఘాలు అకారణంగా ఆరోపణలు చేస్తున్నాయని దళిత నాయకుడు కదంబ సోమశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. సీఎంగా సిద్దరామయ్య ఆదర్శ పాలన అందించి దళితుల అభివృద్ధి కోసం ఎంతో చేశారన్నారు. అలాంటిది కొందరు దళిత నాయకులు తమ స్వార్థం కోసం సిద్దరామయ్య దళిత వ్యతిరేకి అని కరపత్రాలు పంచుతూ దళిత సముదాయాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలోని నాయకులందరూ దళిత సంక్షేమం కోరేవారేనన్నారు. నియోజకవర్గంలోని దళిత సముదాయం ఈ అప ప్రచారాన్ని నమ్మవద్దని, సిద్దరామయ్యకు మద్దతునిచ్చి అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ సందర్భంగా యువ కాంగ్రెస్ అధ్యక్షుడు దింబదామనహళ్లి అంబరీష్, న్యాయవాది కృష్ణప్ప తదితరులు పాల్గొన్నారు.

### చురుకుగా సభ్యత్వ నమోదు

**కోలారు :** కర్ణాటక ప్రాంత రైతు సంఘం(కేపీఆర్ఎస్) ఆధ్వర్యంలో సోమవారం తాలూకాలోని పలు గ్రామాల్లో సభ్యత్వ నమోదును నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎం వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రభుత్వ సౌలభ్యాలను పొందడానికి సంఘటిత పోరాటం చేయాలన్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు రెండు కోట్ల మందికి పైగా రైతులు సంఘం సభ్యత్వాన్ని పొందారన్నారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వాల విధానాలపై గ్రామస్తులకు తగిన సమాచారం అందిస్తామన్నారు. తాలూకా అధ్యక్షుడు ఆలహళ్లి వెంకటేష్, నాయకులు నారాయణరెడ్డి, యల్లప్ప, దేవరాజ్, రామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### జోషీపై కుమార వ్యాఖ్యలు తగదు



మాట్లాడుతున్న రాజీవ్‌ప్రతాప్ రూడి

**హుబ్లీ:** కేంద్రమంత్రి ప్రహ్లాదజోషిని తదుపరి కర్ణాటక సీఎం అభ్యర్థిగా ఆర్ఎస్ఎస్ నిర్ధారించిందంటూ కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై తగదని బీజేపీ జాతీయ ప్రతినిధి రాజీవ్‌ప్రతాప్ రూడి తెలిపారు. హుబ్లీ ఆయన విలేకరులతో మాట్లాడుతూ భావి సీఎం అభ్యర్థి ప్రహ్లాద్ జోషి అని కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై కర్ణాటకలో ఎటువంటి రాజకీయ పరిణామాలు జరుగుతున్నాయో తనకు తెలియదన్నారు. ప్రహ్లాద్ జోషి ఒక మంచి నేత. అలాగే మాజీ సీఎం యడియూరప్ప, సీఎం బసవరాజు బొమ్మైమ్ ఉత్తమ నాయకులన్నారు. కేంద్రంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రోత్సాహకరంగా ఉందన్నారు. మధ్య తరగతి వారికి గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదాయ పన్ను రాయతీలు లభించాయన్నారు.

### అక్కడ గెలుపు మాదే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేంద్ర

**బళ్లారి అర్బన్:** బళ్లారి గ్రామీణ, సండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పటిష్టంగా ఉందని, అక్కడ తమదే గెలుపు అని ఎమ్మెల్యే బీ.నాగేంద్ర పేర్కొన్నారు. ఆయన సోమవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రి శ్రీరాములు బళ్లారి గ్రామీణ లేదా సండూరు నియోజకవర్గాల్లో ఎక్కడి నుంచైనా పోటీ చేసే అవకాశం ఉందా? అన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ ఈ రెండు చోట్ల కాంగ్రెస్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి జనం తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఖచ్చితంగా 150 స్థానాల్లో కాంగ్రెస్ గెలిచి అధికారంలోకి వస్తుందన్నారు. 2008లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడానికి మాజీ మంత్రి గాలి జనార్దన్‌రెడ్డి ప్రధాన కారణమని, అలాంటి వ్యక్తికి ఆ పార్టీ అన్యాయం చేసిందన్నారు. అందువల్లే ప్రత్యేక పార్టీని ఏర్పాటు చేసుకొన్నారని, దాంతో బీజేపీకే నష్టం వాటిల్లుతుందన్నారు.

### పార్టీ బలోపేతానికి కృషి

- సీఎం ఇబ్రహీం

**హుబ్లీ:** కళ్యాణ కర్ణాటక, ముంబై కర్ణాటకల్లో తాను ఎక్కువగా పర్యటించి చీలికలు, పీలికలైన జేడీఎస్‌ను కలిపి బలోపేతం చేసేందుకు ప్రయత్నిస్తున్నానని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సీఎం ఇబ్రహీం తెలిపారు. హుబ్లీలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వివిధ పార్టీల నుంచి ఎంతో మంది తమ పార్టీలో చేరుతున్నారన్నారు. బీజేపీ నుంచి ఏ.మంజు జేడీఎస్‌లో చేరారని, ఆయనే తమ పార్టీ అభ్యర్థి అని, తొలి జాబితాలో కొన్ని మార్పులు చేస్తున్నామన్నారు. త్వరలోనే రెండో జాబితాను విడుదల చేస్తామన్నారు. పల్లెపల్లెకు కుమారస్వామి చేరుకున్నారన్నారు. బెళగావిలో కూడా ఎంతో మంది పార్టీలో చేరుతున్నారన్నారు. అభ్యర్థులు లేరని ఎద్దేవా చేసిన శెట్టర్ క్షేత్రంలో ఆరుగురు టికెట్‌ను అడుగుతున్నారన్నారు. బీజేపీది దొడ్డిదారి రాజకీయమని, నళిన్‌కుమార్ కటీల్ పిడేల్ వాయిస్తున్నారన్నారు. రోడ్లు, అభివృద్ధి వద్దు కానీ లవ్ జిహాద్ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

### కాంగ్రెస్‌తోనే కార్మికుల రక్షణ



సన్మానం స్వీకరించిన లక్ష్మీనారాయణ

**కోలారు :** కార్మికుల రక్షణ కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన కార్మిక సంఘం నుంచి సన్మానం అందుకుని మాట్లాడారు. కార్మికులుగా పని చేస్తున్న సుమారు 28 విభాగాల మైనార్టీ కార్మికులకు తగిన మౌలిక సౌకర్యాలను కల్పించాలన్నారు. ప్రభుత్వ లేదా ప్రైవేటు కట్టడాల నిర్మాణానికి కార్మికులు అవసరం ఉందన్నారు. నిత్యం ఎంతో కష్టపడి పని చేస్తున్న కార్మికుల రక్షణ బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత యూపీఏ అవధిలో ప్రధాని మన్‌మోహన్ సింగ్ కార్మికుల రక్షణకు అనేక పథకాలను తెచ్చారన్నారు. కార్మిక విభాగం కార్యాధ్యక్షుడు శ్యామణ్ణరెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హొన్నేనహళ్లి యల్లప్ప, కట్టడ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హెచ్ వై మురళి పాల్గొన్నారు.

### కుక్కల దాడిలో 8 గొర్రెల మృతి

**కోలారు :** వీధి కుక్కల దాడిలో 8 గొర్రెలు మరణించిన ఘటన తాలూకాలోని ముదువాడి పంచాయతీ వానరాశిలో జరిగింది. గ్రామానికి చెందిన రుక్మిణియమ్మ తన గొర్రెల దొడ్డిలో 50 గొర్రెలను మేపుతూ జీవిస్తోంది. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో గొర్రెల దొడ్డిలోకి చొరబడిన కుక్కలమంద గొర్రెలపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. దాడిలో 8 గొర్రెలు మరణించగా, పలు గొర్రెలు గాయపడ్డాయి. సమాచారం అందుకుని సోమవారం గ్రామానికి వెళ్లి పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. గొర్రెల యజమానికి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు.

### ఉద్యోగాల కల్పనకు వినతి

**రాయచూరు రూరల్ :** వ్యవసాయ వర్సిటీలో చదివిన వ్యవసాయ ఇంజినీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగాలు కల్పించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం వర్సిటీ వద్ద చేపట్టిన ఆందోళననుద్దేశించి పట్టభద్రులు మాట్లాడారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో తమకు 15 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు.

## క్లుప్తంగా

### తల్వార్‌తో హల్‌చల్ వ్యక్తిపై పోలీసు కాల్పులు



పట్టుకోవటానికి యత్నిస్తున్న పోలీసులు

**యశవంతపుర:** మారణాయుధాలను పట్టుకొని తిరుగుతున్న వ్యక్తిపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్ట్ చేసిన ఘటన కలబురిగిలో జరిగింది. ఆదివారం రాత్రి అబ్దుల్ జాఫర్ అనే వ్యక్తి రెండు చేతుల్లో తల్వార్లు పట్టుకుని హల్‌చల్ చేశాడు. అతని ప్రవర్తనతో ప్రజలు హడలిపోయారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వాహిద్ కోత్వాల్ సిబ్బందితో అక్కడికి చేరుకుని లొంగిపోవాలని హెచ్చరించాడు. మాట వినకపోవడంతో ఎస్ఐ అతని కాలిపై కాల్పులు జరిపాడు. దీంతో అతను కుప్పకూలిపోయాడు. హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. కలబురిగి చౌక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

### ట్రాక్ నవీకరణ, రైళ్లు రద్దు

**యశవంతపుర:** దక్షిణ మధ్య రైల్వే మంగళూరు జోకట్టె, పడీల్ స్టేషన్ల మధ్య ట్రాక్ నవీకరణ పనులు జరుగుతున్నాయి. దీంతో రైళ్ల రాకపోకల మధ్య అలస్యంతో పాటు కొన్ని రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు. 7, 8 కబక పుత్తూరు సెంట్రల్ డైలీ ఎక్స్‌ప్రెస్, మంగళూరు సెంట్రల్–సుబ్రమణ్య రోడ్డు–మంగళూరు సెంట్రల్ డైలీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. పనులు ముగిసిన తరువాత యథాప్రకారం రైళ్లు తిరగనున్నాయి.

### ట్రాక్టర్ల నిషేధంపై ఆగ్రహం

**యశవంతపుర:** బెంగళూరు నగరంలోకి ట్రాక్టర్లు రాకుండా పోలీసులు నిషేధించారు. దీనిని వివిధ కన్నడ పర సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ నెల 9న బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో ఆందోళన చేయాలని నిర్ణయించినట్లు పోరాట సమితి నాయకులు తెలిపారు. ఉత్తర కర్ణాటక, కల్యాణ కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో కార్మికులు వచ్చి పనులు చేస్తూ జీవిస్తున్నారు. ట్రాక్టర్లను నగరంలోకి రాకుండా బెంగళూరు పోలీసులు కమిషనర్ ఇచ్చిన ఆదేశాలను తక్షణం వెనక్కి తీసుకోవాలని కర్ణాటక సేనె రాష్ట్ర అధ్యక్షుడు ఎం బసవరాజ్ పడుకోటె డిమాండ్ చేశారు.

### రగ్గుల పంపిణీ



**కృష్ణరాజపురం:** హోసకోటె పరిధిలోని ముత్సంద్ర గ్రామ పంచాయతీలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ పాల్గొని వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. అనంతరం మహిళలకు రగ్గులు పంపిణీ చేశారు.

### భారీగా నగలు, నగదు చోరీ

**యశవంతపుర:** ఇంటి తలుపులు బద్దలు భారీగా నగలు, నగదు దోచుకెళ్లిన ఘటన బెంగళూరు రామమూర్తి నగర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. నందనం కాలనీ మూడో మెయిన్ రోడ్డులోని నివాసం ఉంటున్న అశ్వత్థ రామన్ ప్రైవేట్ సంస్థలో హెచ్‌ఆర్‌గా పని చేస్తున్నారు. వారం క్రితం కుటుంబం తమిళనాడుకు వెళ్లింది. గుర్తించి దొంగలు ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో ఉన్న 15 లక్షల విలువగల బంగారం, 15 కేజీల వెండి, ఐదు లక్షలు నగదును దోచుకెళ్లారు. ఆదివారం సాయంత్రం అశ్వత్థ ఇంటికి వచ్చి చూడగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

**నకిలీ తాళంతో...**

నకిలీ తాళాలతో బైక్‌లను అపహరిస్తున్న మురళీ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రూ.22 లక్షల విలువగల 26 బైక్‌లను జయనగర పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

### ఆటో డ్రైవర్‌పై ఏనుగు దాడి

**మైసూరు:** ఆటో డ్రైవర్‌పై ఏనుగు దాడి చేసిన ఘటన మైసూరు జిల్లా పోన్నంపేటె తాలూకా కళ్లల్లి అనే గ్రామంలో చోటుచేసుకుంది. కిరణ్ ఏనుగు దాడిలో గాయపడిన బాధితుడు. సోమవారం ఉదయం 10.30 గంటల సమయంలో కిరణ్ ఆటోలో వెళ్తుండగా అడవి ఏనుగు ఒక్కసారిగా దాడి చేసింది. ఆటోలో కిరణ్ ఒక్కడే ఉండటంతో గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. ఆటోను ఏనుగు నుజ్జు నుజ్జు చేసింది. అటవీ అధికారి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

### విచారణ ఖైదీ మృతి

**మైసూరు:** మైసూరు నగరంలోని జిల్లా సెంట్రల్ జైలులో విచారణ ఖైదీ అనారోగ్యంతో మృతి చెందాడు. నగరంలోని కుంబారకొప్పలిలో నివాసం ఉంటున్న నరసింహ (40) మృతి చెందిన వ్యక్తి. చెక్‌బౌన్స్ కేసులో నరసింహ జనవరి 4న మైసూరు సెంట్రల్ జైలుకు వచ్చాడు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని మండి పోలీసులు తెలిపారు.

# ఆర్టీసీ డ్రైవర్‌పై ఆర్మీ జవాన్ల దాడి

- తమ వాహనాలకు సైడ్ ఇవ్వలేదని ఆగ్రహం
- రోడ్డుపై బైఠాయించిన డ్రైవర్



జాతీయ రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ తమిళరసన్

**క్రిష్ణగిరి:** జాతీయ రహదారిపై తరచూ ఏదో ఒక గొడవ వల్ల ధర్నాలు చేయడంతో వాహనాల రాకపోకలు స్తంభించి ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కొన్నిరోజుల కిందట జల్లికట్టు గొడవ మరువకముందే సోమవారం మరో రగడ జరిగింది. వివరాలు.. క్రిష్ణగిరి నుంచి బెంగళూరు వైపు సోమవారం మధ్యాహ్నం ప్రభుత్వ ఆర్టీసీ బస్సు బయలుదేరింది. అదే సమయంలో క్రిష్ణగిరి నుంచి బెంగళూరువైపు ఆర్మీ వాహనాలు వెళ్తున్నాయి.

**డ్రైవర్ ధర్నా.. ట్రాఫిక్ ఇబ్బందులు..**

కురుబరపల్లి వద్ద ప్రభుత్వ ఆర్టీసీ డ్రైవర్ దారి వదలకపోవడంతో ఆవేశం చెందిన సైనిక సిబ్బంది బస్సును అడ్డగించి డ్రైవర్ తమిళరసన్‌ను కొట్టి వెళ్లిపోయారు. ఆవేదనకు గురైన ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సు నిలిపేసి రోడ్డుపై బైఠాయించాడు. క్రిష్ణగిరి, కురుబరపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని డ్రైవర్‌తో చర్చించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దీంతో క్రిష్ణగిరి–హోసూరు జాతీయ రహదారిపై అరగంటపాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జాతీయ రహదారిపై తరచూ ఆందోళనలు చేపట్టడంతో ప్రయాణికులు సకాలంలో గమ్యానికి చేరుకోవడం లేదని, అధికారులు పరిష్కారం కల్పించాలని ప్రయాణికులు డిమాండ్ చేశారు.

# ప్రజల ఆశీర్వాదంతోనే అభివృద్ధి



సతీశ్ రెడ్డిని సన్మానించిన దృశ్యం

**బొమ్మనహళ్లి:** బొమ్మనహళ్లి ప్రజల ఆశీర్వాదంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి అన్నారు. నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ పరంగిపాళ్యలో సముదాయం భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకోవడంతో పాటు పేదలకు ఇంటి పత్రాలు అందజేసిన ఎమ్మెల్యేకు సమాజ సేవకుడు సునందప్ప ఆధ్వర్యంలో ధన్యవాదాలు, సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...తనను బొమ్మనహళ్లి ప్రజలు మూడు పర్యాయాలు గెలిపించి సేవ చేసుకోవడానికి అవకాశం ఇచ్చారని, వారికి ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉంటానన్నారు. బొమ్మనహళ్లి పరిధిలో కావేరి నీరు ఇచ్చిన ఘటన బీజేపీ ప్రభుత్వానిదేనన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గురుమూర్తి రెడ్డి, శ్రీసాయిరామ్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నగరసభ మాజీ ఉపాధ్యక్షుడు మునిరాజు తదితరులు పాల్గొన్నారు.

### నేడు పావగడకు జీ-20 దేశాల ప్రతినిధులు

**పావగడ:** తాలూకాలోని తిరుమణి సోలార్ పార్క్‌ను సందర్శించడానికి జీ 20 దేశాల వివిధ సాంకేతిక, శాస్త్రజ్ఞాన రంగాలకు చెందిన 38 మంది ప్రతినిధులు మంగళవారం తిరుమణికి రానున్నారు. ఇందులో భాగంగా తిరుమణి సోలార్ పార్క్ పరిసర ప్రాంతాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సోలార్ పార్క్‌లో అత్యాధునికంగా సుమారు రూ. 11 కోట్లతో నిర్మించిన నూతన సోలార్ భవనాన్ని ప్రారంభించనున్నారు. అదే విధంగా సోలార్ పార్క్‌లోని బ్లాక్ 40కు వెళ్లి వివిధ కంపెనీలు నిర్వహిస్తున్న సోలార్ ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తారు. ప్రతినిధుల పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు స్థానిక తహసీల్దార్ వరదరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా రెండు జిల్లా పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు.

# లక్ష్య సాధనతో ముందుకు సాగాలి



భరతనాట్యం చేస్తున్న కుమారి హారిక

**గౌరిబిదనూరు:** విద్యార్థులు ఇష్టపడి, కష్టపడి చదివినపుడే లక్ష్యాలను సాధించగలరని జేడీఎస్ నాయకుడు, జెడ్పీ మాజీ అధ్యక్షుడు సిఆర్ నరసింహమూర్తి తెలిపారు. ఆదివారం రాత్రి హిందూ సాదర సంఘం ఆధ్వర్యంలో సమతా ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు వితరణ చేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదివేలా తల్లితండ్రులు, గురువులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో దిక్సూచి నాట్యాలయ విద్యార్థిని హారిక భరతనాట్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో దేవరాజయ్య, సాదర సంఘం అధ్యక్షుడు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అది చట్టవిరుద్ధమైన ఎఫ్ఐఆర్

**యశవంతపుర:** అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి తాబేళ్లను చంపిన కేసుకు సంబంధించి మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా ఎఫ్ఐఆర్ వేయటం చట్ట విరుద్ధమని హైకోర్టు అభిప్రాయపడింది. చిక్కమగళూరు జిల్లా మల్లందూరు పోలీసుస్టేషన్ పరిధిలో 2017లో దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ అత్తర్ అహ్మద్, రఫీక్ అమ్మద్‌తో పాటు హాసన జిల్లా సకలేశపురకు చెందిన 15 మంది దాఖలు చేసిన క్రిమినల్ కేసును న్యాయమూర్తి హేమంత్ చందన్ గౌడర్ ధర్మాసనం విచారణ చేసి నిందితులపై దాఖలు చేసిన కేసును రద్దు చేయాలని తీర్పు చెప్పారు. ఇలాంటి కేసును నమోదు చేయాలంటే తప్పని సరిగా మొదట మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోవాలని హైకోర్టు అభిప్రాయపడింది.

### కాంట్రాక్ట్ ఉద్యోగుల ఆందోళన

**యశవంతపుర:** వివిధ డిమాండ్లను పరిష్కరించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, వైద్యశాఖ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం బెంగళూరులో ఆందోళన చేశారు. ఏళ్ల తరబడి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తూ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న ఫలితం లేకుండా పోయిందని సంఘం అధ్యక్షుడు విశ్వనాథ్ హెచ్ యమోజీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఆయనూరు మంజునాథ్ సీఎంతో పాటు పలువురు దృష్టికి తెచ్చినా పరిష్కారం కాలేదని ఆరోపించారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం స్పందించి డిమాండ్ల పరిష్కారంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

### కన్నడనాడు కోసం మైసూరు మహారాజుల కృషి ఎనలేనిది



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**మండ్య:** కన్నడ నాడు, కర్ణాటక అభివృద్ధికి అరసు సముదాయం చేసిన సేవలకు వెలకట్టలేమని, దానిని దృష్టిలో పెట్టుకొని సముదాయం అభివృద్ధికి కృషి చేయాలని మైసూరు ఒడెయార్ కుటుంబానికి చెందిన యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడెయార్ అన్నారు. మండ్య నగరంలోని కళామందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అరసు సంఘం జిల్లా విభాగాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ... ప్రాచీన కాలం నుంచి కూడా మా పూర్వీకులు కన్నడ నాడు కోసం అనేక పథకాలు అమలు చేసి ప్రజా సంక్షేమం కోసం కృషి చేశారని, నేటికీ ఒడెయార్ వంశస్తులంటే ప్రజలకు ఎనలేని గౌరవమన్నారు.

### అగ్ని ప్రమాదంలో ఆవు, దూడ మృతి..

**మండ్య:** మండ్య తాలూకా తండసనహళ్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో ఆవు, దూడ, ఆరు కోళ్లు కాలి బూడిదయ్యాయి. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ఘటన జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత ఓ ఇంటిలో మంటలు చెలరేగాయి. అవి పక్కనే ఉన్న గుడిసెకు వ్యాపించాయి. గుడిసెలో ఉన్న ఆవు, దూడ ప్రాణాలు కోల్పోయాయి. గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

**మండ్య:** టాటా ఎస్ వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండ్య జిల్లా మళవళ్లి తాలూకా బంసూరు గ్రామం వద్ద సోమవారం చోటు చేసుకుంది. మృతుడిని బండూరు గ్రామానికి చెమదిన బసవరాజు (34)గా గుర్తించారు. ఇతను సైకిల్‌పై గడ్డి తీసుకుని హిట్టెనహళ్లి వైపు వస్తుండగా వాయు వేగంగా వచ్చిన టాటాఏస్ వాహనం ఢీకొంది. దీంతో అతను అక్కడకక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### కళలను కాపాడుకోవాలి



కళాకారులను సన్మానించిన దృశ్యం

**మైసూరు:** ప్రపంచంలో అన్ని దేశాలు, సంస్కృతి, సాంప్రదాయాలు, ఆయా భాషలకు ఎలా గౌరవం ఇస్తాయో భారతీయ కళలకు కూడా అంతే గౌరవం ఉందని, అటువంటి కళలను కాపాడుకోవాలని కళా దర్శకుడు, కన్నడ నటుడు అరుణ్ సాగర్ అన్నారు. మైసూరు నగరంలోని జేఎల్‌బీ రోడ్డులో ఉన్న నాదబ్రహ్మ సంగీత సమావేశం హాల్లో నిర్వహించిన ప్రసాద్ స్కూల్ ఆఫ్ రిథమ్స్ తాళవాద్య సంస్థ, ట్రస్టు 16వ వార్షికోత్సవంలో పాల్గొని కళారత్న అవార్డును స్వీకరించి మాట్లాడుతూ...సాంస్కృతిక రాజధానిగా పేరుపొందిన మైసూరు కళాకారులకు పుట్టినిల్లు అన్నారు.

### కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్వాగతం

**కృష్ణరాజపురం:** తుమకూరు జిల్లాలో హెచ్‌ఏఎల్ కొత్త యూనిట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనడానికి విమానాశ్రయానికి వచ్చిన కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు స్థానిక ఎమ్మెల్యే అరవింద లింబావళి ఘన స్వాగతం పలికారు.

### భూతరాయస్వామికి జలధి ఉత్సవం

**అమరాపురం:** మండలంలోని వలస గ్రామంలో వెలసిన శ్రీ భూతరాయస్వామికి భక్తులు జలధి ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు బాలన్న ఆధ్వర్యంలో స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని సమీప వంక వద్దకు తీసుకెళ్లి అక్కడ స్వామి వారికి ప్రత్యేకంగా గంగా జలంతో పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా పూలతో అలంకరించి మహ మంగల హారతి ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తదితరులు

**గౌరిబిదనూరు:** విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే శివశంకరరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆంజనేయస్వామి సభా భవనంలో కర్ణాటక రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం తాలూకా శాఖ 75 ఏళ్లు నిండిన ఉద్యోగులను సన్మానించి మాట్లాడారు. ఆధ్యాత్మిక జీవనం, యోగా, వ్యాయామాలను అలవరచుకోవాలన్నారు. సంఘం అధ్యక్షుడు దస్తగిరిసాబ్ మాట్లాడుతూ... పెన్షనర్ల సమస్యలపై పోరాడుతున్నామని అన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ సహాయ డైరెక్టర్ అశ్వత్థరెడ్డి, తాలూకు ట్రజరీ అధికారి చైత్ర, జిల్లాధ్యక్షుడు బివి కృష్ణ, గౌరవాధ్యక్షులు ఆవులప్ప, ఉపాధ్యక్షులు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరాయప్ప, కోశాధికారి గంగాధరయ్య, మీర్‌ముసరజా, చిక్క నారాయణప్ప, వెంకటప్ప, కృష్ణకుమారి, శ్రీనివాసరావ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నిరసన ప్రదర్శన



మైసూరు బ్యాంకు సర్కిల్ వద్ద ఆందోళన

**బనశంకరి:** ఎల్ఐసీ, ఎస్‌బీఐ బ్యాంక్‌ల నిధులను అదాని సంస్థల్లో పెట్టుబడి పెట్టించిన కేంద్ర ప్రభుత్వం ప్రజలను సంకటస్థితిలోకి తెచ్చిందని కాంగ్రెస్ నాయకులు సోమవారం మైసూరుబ్యాంకు సర్కిల్ వద్ద ధర్నా చేశారు. మాజీ మంత్రి కేపీసీసీ కార్యాధ్యక్షుడు రామలింగారెడ్డి మాట్లాడుతూ అదాని సంస్థల్లో ఎల్ఐసీ రూ.36 వేలకోట్లు పెట్టుబడి పెట్టగా, ఎస్‌బీఐ రూ.80 వేల కోట్లు రుణం ఇచ్చిందని, దీనిపై ప్రధానమంత్రి మోదీ నోరు విప్పడం లేదన్నారు. అదానీకి మోదీ మద్దతుగా నిలిచారని, లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశారని, ఈ డబ్బు ఎవరిదని ప్రశ్నించారు. ప్రజలు కూడబెట్టిన డబ్బును మోదీ ప్రభుత్వం ధనవంతుల పాలు చేస్తోందని దుయ్యబట్టారు. ఈ ధర్నాలో నాయకులు జీ.శేఖర్, జీ.కృష్ణప్ప, రాజ్‌కుమార్, మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వచ్చే సంక్రాంతి లోపు రామ మందిరం



భక్తులతో మాట్లాడుతున్న స్వామీజీ

**మండ్య:** అయోధ్యలో నిర్మాణంలో ఉన్న రామ మందిరం వచ్చే ఏడాది సంక్రాంతి లోపు పూర్తి అవుతుందని శ్రీరామ జన్మభూమి ట్రస్టీ, శ్రీ విశ్వ ప్రసన్న తీర్థ స్వామీజీ అన్నారు. మండ్య జిల్లా మద్దూరు పట్టణంలోని చరిత్ర ప్రసిద్ధి చెందిన హోళె ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులను ఆశీర్వదించి మాట్లాడుతూ...అయోధ్య రామమందిరం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వేడుకలకు రూ. 3 వేల కోట్లు వ్యయం చేయడానికి కమిటీ తీర్మానం చేసిందన్నారు.





**దద్దరిల్లిన ధర్నాలు** బెంగళూరు ఫ్రీడంపార్క్ ధర్నాలతో దద్దరిల్లింది. పంచాయతీ ఉద్యోగులు ఆందోళన చేసిన దృశ్యం. సీ, డీ గ్రూపు ఉద్యోగులకు పదోన్నతుల వ్యవహారంపై ఆందోళనకు దిగారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయంటూ, వాటిని తక్షణం నిలిపివేయాలని మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో ఫ్రీడంపార్క్ వద్ద కార్మికులు, ఉద్యోగుల ఆందోళన

## హోసూరు వార్తలు..

### బాలిక కిడ్నాప్‌పై ఫిర్యాదు

**క్రిష్ణగిరి:** కుమార్తె కిడ్నాప్‌పై తండ్రి వేపనపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు... వేపనపల్లి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రులు ఆందోళనతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. స్థానికుల సమాచారం మేరకు ఆంధ్రప్రదేశ్ కుప్పం సమీపంలోని మల్లేనూరు గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ కిడ్నాప్ చేసినట్లు తెలిసింది. బాలిక తండ్రి క్రిష్ణగిరి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### రెండు ఇసుక లారీలు స్వాధీనం

**హోసూరు:** హోసూరు సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు లారీలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... హోసూరు తహసీల్దార్ గవాస్కర్, అధికారులు ఆదివారం రాత్రి హోసూరు –క్రిష్ణగిరి జాతీయ రహదారి సీతారామ్ మేడు వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న డ్రైవర్లు, యాజమానుల కోసం గాలిస్తున్నారు.

### యువతి ఆత్మహత్య

**హోసూరు:** యువతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన సోమవారం ఉదయం హోసూరు సమీపంలో చోటు చేసుకొంది. రాజన్ తిరుచ్చి (24) బేళగొండపల్లిలో నివాసముంటూ హోసూరు సమీపంలోని ప్రైవేట్ పరిశ్రమలో కార్మికురాలిగా పనిచేస్తోంది. సోమవారం ఉదయం రాజన్‌తిరుచ్చి ఇంట్లో ఉరి వేసుకొన్న స్థితిలో కనిపించింది. స్థానికుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### మోసకారి కంపెనీలకు కేంద్రం అండ



ఆందోళన నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు

**హోసూరు:** ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రుణాలు పొంది మోసగించిన కంపెనీలకు కేంద్రం మద్దతుగా ఉందని ఆరోపిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేశారు. పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంకు వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుడు మురళీధన్ అధ్యక్షతన జరిగిన ఈ ఆందోళన కార్యక్రమంలో ఎల్‌ఐసి, ఎస్‌బీఐ తదితర ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రుణాలు పొంది మోసగించిన అదానీకి బీజేపీ ప్రభుత్వం అండగా ఉందని ఆరోపించారు. ఈ ధర్నాలో పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నూతన కలెక్టర్ బాధ్యతల స్వీకారం





దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలందజేస్తున్న కలెక్టర్, కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న స్నేహ

**హోసూరు:** క్రిష్ణగిరి జిల్లా 12వ కలెక్టర్‌గా దీపక్ జేకబ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 266 అందజేశారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ ద్వారా ముగ్గురు దివ్యాంగులకు తలా రూ. 9050 ఖర్చుతో మొత్తం రూ. 27150 విలువ చేసే ఉపకరణాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో రాజేశ్వరి, అధికార్లు వేడియప్పన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**కమిషనర్‌గా స్నేహ..**

హోసూరు కార్పొరేషన్ కమిషనర్‌గా ఐఏఎస్ స్నేహ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆమె స్వస్థలం కర్ణాటక రాష్ట్రం కోలారు ప్రాంతం. గతంలో చెన్నై మహానగర డెప్యూటీ కమిషనర్‌గా పనిచేశారు.

# కారును ఢీకొన్న బస్సు, ఒకరి దుర్మరణం



ఘటనా స్థలంలో రామమూర్తి మృతదేహం

**హోసూరు:** కారును బస్సు ఢీకొనడంతో వృద్ధుడు మృతి చెందగా ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన మత్తిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు...డెంకణీకోట సమీపంలోని దళసూరు గ్రామానికి చెందిన వెంకటేశాచారి (69) ఆదివారం క్రిష్ణగిరిలో జరిగిన జరిగిన ఓ కార్యక్రమానికి కుటుంబ సభ్యులతో కలిసి కారులో వెళ్లాడు. కార్యక్రమాన్ని ముగించుకొని సాయంత్రం తిరిగి స్వగ్రామానికి వస్తుండగా హోసూరు– డెంకణీకోట రోడ్డు నాగొండపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో వెంకటేశాచారి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. భార్య చిన్నబిడ్డమ్మ, కూతురు ఆర్తి (28)లు తీవ్రంగా గాయపడ్డారు. కారు డ్రైవర్ మురుగన్, ఆరేళ్ల బాలిక స్వల్పగాయాలతో బయటపడ్డారు. మత్తిగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించి, కేసు విచారణ చేపట్టారు.

**ఇద్దరు యువకుల దుర్మరణం**

**హోసూరు:** ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ప్లస్‌టూ విద్యార్థితో పాటు ఇద్దరు మృతి చెందిన ఘటన హోసూరు హడ్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు పట్టణంలోని జనపర్‌వీధికి చెందిన సుబేర్ కొడుకు సులేమన్ (17), అదే ప్రాంతంలోని ప్రభుత్వ ఉర్దూ పాఠశాలలో ప్లస్‌టూ చదువుతున్నాడు. ఆదివారం సాయంత్రం బిస్మిల్లా నగర్‌కు చెందిన ఉస్మాన్(19)తో కలిసి ద్విచక్ర వాహనంలో హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారి సీతారామ్‌మేడు వద్ద వెళ్తుండగా ఏదో వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన సులేమన్, ఉస్మాన్‌లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. విషయం తెలుసుకొన్న హడ్కో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను స్వాధీనపరుచుకొని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నారు.

**బైకిస్టు ప్రాణాలు తీసిన బస్సు**

**హోసూరు:** ద్విచక్రవాహనాన్ని ప్రభుత్వ ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన హోసూరు పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం చోటు చేసుకొంది. వివరాల మేరకు ఉద్దనపల్లి సమీపంలోని కర్నపల్లి గ్రామానికి చెందిన రామమూర్తి బైక్‌పై హోసూరు వైపు వెళ్లుతుండగా హోసూరు– రాయకోట రోడ్డు కారుపల్లి వద్ద వెనుక నుంచి వేగంగా వెళ్లుతున్న ప్రభుత్వ ఆర్టీసీ బస్సు ఢీకొనింది. తలకు తీవ్ర గాయాలేర్పడిన రామమూర్తి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశారు.

**కారు ఢీకొని కార్మికుడు...**

**హోసూరు:** ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనడంతో కార్మికుడు మృతి చెందిన ఘటన బాగలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... బాగలూరు ప్రాంతానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గణేష్ (19) ఆదివారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో బాగళూరు సమీపంలోని కాళేశ్వరం వద్ద వెళ్తుండగా అదే మార్గంలో వచ్చిన కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన గణేశ్‌ను బాగలూరులో ప్రథమ చికిత్స అనంతరం ధర్మపురి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## క్లుప్తంగా...

### ఎన్జీరంగా వర్సిటీలో పీజీ కోర్సులకు దరఖాస్తులు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 2022–23 సంవత్సరానికి గానూ పీజీ కోర్సుల్లో చేరగోరు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ అగ్రికల్చర్, ఎంటెక్, ఎంఎస్సీ సామాజిక శాస్త్రం, ఎంబీఏ(ఏబీఎం)లలో ప్రవేశాల వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో చూడవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు తమ అర్హత పత్రాలతో వ్యక్తిగతంగా గుంటూరు నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ విశ్వవిద్యాలయం నందున్న ఆడిటోరియానికి రావాలని తెలిపారు. ఈ నెల 13వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంబీఏ(ఏబీఎం) రెగ్యులర్, సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా అభ్యర్థులకు బృంద చర్చ, ఇంటర్వ్యూలు నిర్వహించి సీట్ల కేటాయింపు చేస్తామని పేర్కొన్నారు. 14వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంబీఏ (ఏబీఎం) ఫిజికల్ సైన్సెస్, వృక్ష బయోటెక్నాలజీ, వ్యవసాయ ఇంజినీరింగ్, సామాజిక శాస్త్రం, స్టాటిస్టికల్ సైన్సెస్ కోర్సులకు పీజీ కౌన్సెలింగ్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు. 15వ తేదీ ఉదయం 9 గంటలకు అగ్రానమీ ప్లాంట్ సైన్సెస్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ సోషల్ సైన్సెస్ కోర్సులకు పీజీ కౌన్సెలింగ్ ఆధారంగా సీట్లను కేటాయిస్తారని పేర్కొన్నారు.

### వైవీయూలో దూరవిద్య కోర్సులు



వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయంలో దూరవిద్య కోర్సులు ప్రారంభిస్తున్నట్లు వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగజనార్ధన తెలిపారు. డిస్టెన్స్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పి.ఎస్. షావల్లీఖాన్ అధ్యక్షతన రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డితో కలిసి బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, డీన్‌లతో కలిసి దూరవిద్యపై సమీక్ష సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మూడు దశల్లో 22 కోర్సులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జూన్ నుంచి తొలి విడతగా ఏడు డిగ్రీ కోర్సులు, ఏడు పీజీ కోర్సులు జూన్‌లోపు యూజీసీ అనుమతి పొంది ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో డీడీఈ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.



# జేఈఈ మెయిన్ తొలి సెషన్ ఫలితాలు నేడు!

## పేపర్-1కి 8.6 లక్షల మంది, పేపర్-2కి 46 వేలమంది హాజరు

సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ తొలివిడత పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యే అవకాశముంది. జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1వ తేదీవరకు జరిగిన ఈ పరీక్షలకు 9 లక్షల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వారిలో పేపర్–1 (బీఈ, బీటెక్) పరీక్షకు 8.6 లక్షల మంది, పేపర్–2 (బీఆర్క్, బీప్లానింగ్) పరీక్షకు 46 వేల మంది హాజరయ్యారని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ప్రకటించింది. దాదాపు 95.8 శాతం మంది పరీక్షకు హాజరవడం ఇదే తొలిసారని చెబుతున్నారు. జేఈఈ మెయిన్ సెకండ్ సెషన్ పరీక్షలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నందున తొలిసెషన్ పరీక్ష ఫలితాలు విడుదలయ్యే అవకాశముందని ఆయా కాలేజీల ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. జేఈఈ తొలిసెషన్ పరీక్షల ప్రాథమిక కీని ఎన్‌టీఏ ఫిబ్రవరి 1వ తేదీనే విడుదల చేసింది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీవరకు అభ్యర్థుల అభ్యంతరాలను స్వీకరించింది. వీటిని నిపుణులతో విశ్లేషించి ఫైనల్ ఆన్సర్‌కీని, మార్కులు, స్కోర్ పాయింట్లు, టాపర్ల పేర్లతో ఫలితాలను విడుదల చేయనుంది. సోమవారం అర్ధరాత్రి దాటాక లేదా మంగళవారం ఈ ఫలితాలు వెల్లడయ్యే అవకాశముందని పేర్కొంటున్నారు.

### ఏప్రిల్ 6 నుంచి జేఈఈ మెయిన్ రెండో సెషన్ పరీక్షలు

ఎన్‌టీఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 6 నుంచి 12వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండోవిడత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మంగళవారం ప్రారంభం కానుంది. మార్చి 7వ తేదీవరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. సెకండ్ సెషన్‌కు సంబంధించిన అప్లికేషన్ ఫారం 'https:// jeemain. nta. nic. in' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఎన్‌టీఏ తెలిపింది. జేఈఈ మెయిన్ ఏప్రిల్ సెషన్ పరీక్షల సిటీ స్లిప్‌లను మార్చి 3వ వారంలో విడుదల చేయనున్నారు. మార్చి చివరి వారంలో రెండోసెషన్ పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఎన్‌టీఏ విడుదల చేయనుంది.

# సామర్థ్యం స్పష్టంగా తెలిసేలా...

- నేటి నుంచి 10వ తేదీ వరకు సీబీఏ–2, ఫార్మేటివ్–3 పరీక్షలు
- విద్యార్థుల వారీగా సామర్థ్యాలు సీబీఏ విధానంలో అంచనా
- ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో 1 నుంచి 8వ తరగతి వరకు ఓఎమ్మార్‌లతో సీబీఏ పరీక్షలు
- 8, 9, 10 తరగతులకు పాత విధానంలోనే ఎఫ్ఏ–3 పరీక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలు, ప్రతిభాపాటవాలను సమగ్రంగా అంచనా వేసేందుకు ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసింది. రాష్ట్రస్థాయిలో విద్యార్థులందరి సామర్థ్యాలను సరైన రీతిలో అంచనా వేసేందుకు తరగతులు, సబ్జెక్టుల వారీగా శాస్త్రీయ పద్ధతిలో రూపొందించిన ప్రశ్నావళితో ఒకే రకమైన ప్రశ్నపత్రాలను వినియోగించి కొత్త విధానంలో సీబీఏ–2, ఫార్మేటివ్–3 పరీక్షలను నిర్వహించనుంది. ఈ పరీక్షలు మంగళవారం నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తారు. మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పరీక్షల షెడ్యూల్‌ను, పరీక్షల నిర్వహణలో అనుసరించాల్సిన విధివిధానాలను రాష్ట్ర పాఠశాల విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) ప్రకటించింది. జిల్లాల్లోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ఒకటి నుంచి పదో తరగతి వరకు, ప్రయివేటు పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ జారీచేసే ప్రశ్నపత్రాలతో మాత్రమే పరీక్షలు నిర్వహించాలని స్పష్టంచేసింది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు విద్యార్థులకు క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ (సీబీఏ)–2 పరీక్షలు నిర్వహించనున్నారు. తొమ్మిది, పదో తరగతుల వారికి గతంలో మాదిరిగానే ఫార్మేటివ్–3 పరీక్షలు ఉంటాయి. క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ పరీక్షకు ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు ప్రశ్నపత్రంతోపాటు ఓఎమ్మార్ షీట్లు కూడా అందిస్తారు. ప్రయివేటు యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు కేవలం ప్రశ్నపత్రాలు మాత్రమే ఇస్తారు. ఓఎమ్మార్ షీట్లు అందించరని ఎస్సీఈఆర్టీ పేర్కొంది. సీబీఏ విధానంలోని పరీక్షలలో 0.25 (సూక్ష్మ) 0.5 (అతిస్వల్ప), 1 (స్వల్ప) ప్రశ్నలతోపాటు 2, 3, 4, 5, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఆయా సబ్జెక్టుల్లో గరిష్ఠంగా 20 మార్కులతో ఈ సీబీఏ పరీక్షలను గంట వ్యవధితో నిర్వహిస్తారు.

**సరి చూసుకోవాలి**

ఎస్సీఈఆర్టీ అందిస్తున్న ప్రశ్నపత్రాలను, విద్యార్థుల వారీగా చైల్డ్ ఐడీలు, పేర్లతో కూడిన ఓఎమ్మార్ పత్రాలను జిల్లాల ఉమ్మడి పరీక్ష విభాగాల నుంచి ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు సరిచూసుకుని తీసుకువెళ్లి విద్యార్థులకు అందించనున్నారు. ఎవరికైనా ఓఎమ్మార్ పత్రం రాకపోతే వారికోసం బఫర్‌స్టాక్ నుంచి అందిస్తారు. పరీక్షల అనంతరం ఆయా ఓఎమ్మార్ పత్రాలను సమగ్ర మూల్యాంకనానికి వీలుగా జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగాలకు తరలిస్తారు. పరీక్ష సమయంలో ఓఎమ్మార్ పత్రాలపై చైల్డ్ ఐడీలు, పేర్లు సరిగా ఉన్నాయో, లేదో సరిచూసుకోవాలి.

**సమగ్ర మూల్యాంకనంతో లోపాల సవరణకు వీలుగా చర్యలు**

విద్యార్థుల సామర్థ్యాలను సమగ్రంగా విశ్లేషించేందుకు ఈ సీబీఏ పరీక్షలను శాస్త్రీయంగా రూపొందించిన ప్రశ్నలతో ఓఎమ్మార్ పత్రాలతో నిర్వహిస్తున్నామని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఈ ఓఎమ్మార్ పత్రాలను జిల్లా స్థాయిలో స్కాన్ చేయిస్తారని చెప్పారు. మార్కులను పాఠశాలలకు అందిచరని, కేవలం విద్యార్థుల స్థాయిని అంచనా వేసి భవిష్యత్‌లో టీచర్లకు, విద్యార్థులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను చేపట్టేందుకు ఉపయోగిస్తామని వివరించారు. సీబీఏ పరీక్షల అనంతరం తరగతుల వారీగా సబ్జెక్టులకు 'కీ' విడుదల చేస్తామని, దాని ప్రకారం టీచర్లు ప్రశ్నపత్రాలను దిద్దాల్సి ఉంటుందన్నారు. ఆ మార్కులను రిజిస్టర్లలో, పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాల్సి ఉందన్నారు. విద్యార్థుల మార్కులను ప్రోగ్రెస్ కార్డుల్లో నమోదు చేసి తల్లిదండ్రులకు అందిస్తామని, తక్కువ ప్రతిభ చూపిన పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు.

తెలంగాణ

# రూ.2.90 లక్షల కోట్లతో తెలంగాణ బడ్జెట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రూ.2,90,396 కోట్లతో 2023–24 వార్షిక బడ్జెట్‌ను ప్రతిపాదించింది. ఈ మేరకు బడ్జెట్‌ను తెలంగాణ ఆర్థిక మంత్రి హరీశ్‌రావు సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఏడాదికి రూ.5 కోట్ల అభివృద్ధి నిధులను కేటాయిస్తూనే సీఎం విచక్షణ మేరకు నిధులు మంజూరు చేసేందుకు రూ.10 వేల కోట్లకు పైగా నిధులను ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద చూపడం గమనార్హం. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.31,426 కోట్లు ప్రతిపాదించారు. వ్యవసాయ, సహకార రంగాలకు రూ.26,831 కోట్లు కేటాయించారు. రైతుబంధు కింద రూ.15,075 కోట్లు ప్రతిపాదించారు. రైతు రుణమాఫీ కింద 6,380 కోట్లు కేటాయించారు. రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేసేందుకు రూ.20 వేల కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేసినప్పటికీ రూ.90 వేల లోపు రుణాలు మాఫీ చేయడమే లక్ష్యంగా నిధులు కేటాయించారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లకు రూ.3,210 కోట్లు ప్రతిపాదించారు. దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించింది. ఆసరా పింఛన్లకు రూ.12 వేల కోట్లు ప్రతిపాదించారు. గృహ నిర్మాణ పథకానికి రూ.12 వేల కోట్లు కేటాయించగా సొంత జాగాల ఇళ్లకు రూ.7,890 కోట్లు ప్రతిపాదించారు. కొత్త పథకాల ఊసు లేకపోగా.. నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.3,016 ఇచ్చే పథకాన్ని ఈసారి కూడా ప్రతిపాదించకపోవడం గమనార్హం.

**విద్య, వైద్యం**

విద్యాశాఖకు రూ.19 వేల కోట్లు, వైద్య శాఖకు రూ.12,161 కోట్లు ప్రతిపాదించారు. పురపాలక శాఖకు రూ.11,372 కోట్లు, ప్రణాళిక శాఖకు రూ.11,495 కోట్లు, రోడ్లు, భవనాల శాఖకు రూ.22,260 కోట్లు ప్రతిపాదించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు కలిపి రూ.31 వేల కోట్ల వరకు ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.1,500 కోట్లు, మిషన్ భగీరథ నిర్వహణకు రూ.1,000 కోట్లు, ఆర్థిక శాఖకు రూ.49,749 కోట్లు కేటాయించగా, కొత్త నియామకాల వేతనాల కోసం రూ.100 కోట్లు ప్రతిపాదించారు.


# ఎర కేసు సీబీఐకే..

## ఎమ్మెల్యేలకు ఎర కేసులో తెలంగాణ సర్కార్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ

సాక్షి, హైదరాబాద్: 'ఎమ్మెల్యేలకు ఎర'కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసును సీబీఐకి అప్పగించే అంశంలో ప్రభుత్వం, సిట్, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఇతరులు చేసుకున్న అప్పీళ్లను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీల ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. ఇది సాధారణ కేసే అయినా విచారణ, తీర్పు వెల్లడి అంతా క్రిమినల్ అంశాల ప్రకారమే సాగినందున.. అప్పీళ్లను అనుమతించలేమని, దీనిపై సుప్రీంకోర్టునే ఆశ్రయించాలని స్పష్టం చేసింది. ''సింగిల్ జడ్జి ఉత్తర్వులపై రిలీఫ్ కోరుతూ సమర్పించిన రాతపూర్వక వాదనలను ఉమ్మడిగా పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. సింగిల్ జడ్జి అన్ని అంశాలను పరిశీలించాకే తీర్పునిచ్చారు. విచారణ అంతా క్రిమినల్ చట్ట ప్రకారమే సాగింది. అందువల్ల అప్పీలును అనుమతించలేం. గతంలో రామ్ కృష్ణణ్ ఫాజి కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకుంటున్నాం. చార్జిషీట్ దాఖలు చేయడానికి ముందే నిందితులను దోషులుగా చిత్రీకరించే ప్రయత్నం జరిగిందని సింగిల్ జడ్జి అభిప్రాయపడ్డారు. అందుకే సింగిల్ జడ్జి పోలీస్ దర్యాప్తును రద్దు చేసి, సీబీఐకి అప్పగించారు'' అని తీర్పులో వెల్లడించింది. తమకు సుప్రీంకోర్టుకు అప్పీల్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని, అప్పటివరకు సీబీఐ దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అడ్వొకేట్ జనరల్ ప్రసాద్ కోరగా.. ధర్మాసనం నిరాకరించింది. కేసును తమ పరిధిలోకి తీసుకునేందుకు సీబీఐకి అనుమతిచ్చింది. హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

# భద్రాద్రి సీతారాముల కల్యాణానికి ముహూర్తం

- మార్చి 30 శ్రీరామనవమి, 31న పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం



భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో శ్రీ సీతారాముల కళ్యాణం, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకానికి ముహూర్తం ఖరారైంది. మార్చి 30వ తేదీ ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శ్రీ సీతారాముల తిరుకళ్యాణోత్సవం నిర్వహణకు ముహూర్తం నిశ్చయించారు. 12 ఏళ్లకు ఒకసారి జరిగే పుష్కర పట్టాభిషేకం మార్చి 31న జరగనుంది. మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు వసంతపక్ష ప్రయుక్త శ్రీరామ నవమి తిరుకళ్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు, మార్చి 22 నుంచి మార్చి 31 వరకు పుష్కర పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామాయణ మహాక్రతువు ఉత్సవాలను జరపనున్నట్లు ఆలయ ఈవో శివాజీ ప్రకటించారు.

# ఆరోగ్యానికి 'వైఎస్సార్'




- పట్టణ పేదలకు వరంగా వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు
- విస్తృతంగా సేవలు
- ప్రైవేటుకు దీటుగా వైద్యం
- కొత్తగా అందుబాటులోకి 23

కాకినాడ సిటీ: చిన్న జబ్బు చేసి, ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే రోజుకు కనీసం రూ.500 నుంచి రూ.1,000 ఖర్చు చేయాల్సిందే. బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారికి తరచూ రక్త పరీక్ష, మందుల ఖర్చు సరేసరి. ఇటువంటి పరిస్థితుల్లో జబ్బు చేసిందంటే పేదవారు ఆర్థికంగా ఇబ్బందులు పడక తప్పేది కాదు. ఈ దుస్థితి నుంచి వారిని బయట పడేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంపై ఫోకస్ పెట్టారు. పక్కా భవనాలు, నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది, అన్ని సౌకర్యాలతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు (యూహెచ్‌సీ) ఏర్పాటు చేశారు. ఇవి పేదల ఆరోగ్యానికి ఎంతో భరోసా ఇస్తున్నాయి. కాకినాడ, పెద్దాపురం, తుని, సామర్లకోట, పిఠాపురం వంటి పట్టణాల్లో శివారు ప్రాంతాల నుంచి సైతం 10 నిమిషాల్లో కాలినడకన చేరుకునేలా యూహెచ్‌సీలు ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (యూపీహెచ్‌సీ) ఉండగా, వీటితో పాటు జిల్లాలో కొత్తగా 23 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో యూహెచ్‌సీకి రూ.80 లక్షల చొప్పున వెచ్చించారు.

### డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ల వివరాలు

| | |
|---|---|
| కాకినాడ : | 13 |
| సామర్లకోట : | 2 |
| పెద్దాపురం : | 2 |
| తుని : | 2 |
| పిఠాపురం : | 2 |
| గొల్లప్రోలు : | 1 |
| ఏలేశ్వరం : | 1 |
| మొత్తం : | 23 |



ఇవి కాకుండా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పర్యవేక్షణలో 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 840 ఆరోగ్య ఉప కేంద్రాలు, 23 డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి.

### ఇవీ సౌకర్యాలు

- ఒక్కో అర్బన్ హెల్త్ సెంటర్‌ను 10 గదులతో నిర్మించారు.
- ప్రతి భవనంలో 10 పడకలు, ఓపీ–1, ఓపీ–2, లేబర్ రూము, మైనర్ ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, యోగా గది, ఫార్మా గది, మినీ వార్డులు ఉన్నాయి.
- ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఒక వైద్యాధికారి వైద్య సేవలు అందిస్తారు. వీరితో పాటు ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, అటెండర్ అందుబాటులో ఉంటారు.
- ప్రతి సోమవారం ఒక స్పెషలైజేషన్ వైద్యుడి సేవలు అందిస్తున్నారు.
- బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక రోగులు ప్రైవేటు



ఆసుపత్రుల చుట్టూ తిరగనవసరం లేకుండా అర్బన్ హెల్త్ సెంటర్‌లోనే రక్త పరీక్షలు చేస్తారు.
- అనంతరం వైద్యులు ఆ రిపోర్టులు చెక్ చేసి, ఉచితంగా మందులు అందజేస్తారు.
- ల్యాబ్‌లో అన్ని రకాల వైద్య పరీక్షలూ ఉచితంగా చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
- ఎవరికైన రోగ తీవ్రత ఎక్కువగా ఉంటే ఈ–సంజీవని యాప్ ఆయా స్పెషలైజ్‌డ్ డాక్టర్ల సలహా తీసుకుని, చికిత్స చేసి, మందులు అందజేస్తారు.

### ప్రభుత్వ సాయం మరువలేం



పిల్లలు, వృద్ధులకు చిన్నపాటి జబ్బు చేస్తే.. ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్తే పెద్ద మొత్తంలో డబ్బులు ఖర్చయ్యేవి. చాలా దూరం కావడంతో ప్రభుత్వాసుపత్రికి వెళ్లడానికి ఎంతో సమయం పట్టేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్బన్ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి సత్వరమే ఉచిత వైద్యం అందిస్తోంది. ప్రభుత్వ సాయాన్ని పేద ప్రజలు ఎప్పటికీ మరువలేరు.

– డి.జితేంద్రసింగ్, స్వర్ణాంధ్ర కాలనీ, కాకినాడ

### అన్ని రకాల చికిత్సలూ అందిస్తున్నాం



వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పేదలకు అన్ని రకాల వైద్య చికిత్సలూ అందిస్తున్నాం. ముఖ్యంగా ల్యాబ్ ద్వారా రక్త పరీక్షలు నిర్వహించి, దీర్ఘకాలిక రోగులకు ఎప్పటికప్పుడు ఉచితంగా మందులు అందజేస్తున్నాం. కొంత ఇబ్బందికరంగా ఉన్న రోగులను పర్యవేక్షణలో ఉంచుకుని, వైద్యం అందించేందుకు 10 పడకలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడిప్పుడే వీటికి అవసరమైన పరికరాలు వస్తున్నాయి. రోగులకు అవసరమైన స్థాయిలో సిబ్బంది ఉండటంతో సత్వరం వైద్య సేవలందిస్తున్నాం. వారంలో ఒక రోజు ఇద్దరు, ముగ్గురు స్పెషలైజేషన్ చేసిన వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు.

– డాక్టర్ వి.మహేష్, పర్లోవపేట, వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్, కాకినాడ

**శివారు ప్రాంతాలకు ఎంతో మేలు**

డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు పట్టణాల్లోని శివారు ప్రాంత ప్రజలకు వరంలా ఉన్నాయి. కాకినాడ నగరంలోని దుమ్ములపేట, పర్లోవపేట, సంజయ్‌నగర్, సాంబమూర్తినగర్, రేచర్లపేట కొత్త కాకినాడ, జగన్నాథపురం, నరసింహా రోడ్డు, పప్పుల మిల్లు, పద్మనాభ నగర్, ఏటిమొగ, ముత్తానగర్, మహాలక్ష్మి నగర్, రణదీప్ నగర్, నాయకర్ నగర్, జె.రామారావుపేట, ఏసువారి వీధి, చినమార్కెట్ తదితర శివారు ప్రాంతాలకు అర్బన్ హెల్త్ సెంటర్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ శివారు కాలనీల్లోని ప్రజలు గతంలో ఏదైనా చిన్నపాటి జబ్బు చేస్తే ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి(జీజీహెచ్)కి వెళ్లడానికి చాలా వ్యయప్రయాసలు పడేవారు. ఇప్పుడు కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లతో చేరువలోనే సత్వర వైద్య సేవలు అందుతున్నాయని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# భూ వివాదాలకు చెక్

**రీ సర్వేతో శాశ్వత పరిష్కారం**

- తూర్పు గోదావరి జిల్లాలో విజయవంతంగా తొలి దశ పూర్తి.. శాశ్వత హక్కు పత్రాల అందజేత
- రెండో విడత 17 గ్రామాల్లో ప్రారంభమైన ప్రక్రియ
- సర్వే లక్ష్యం 47,189 ఎకరాలు
- ఇప్పటికే 22,223 ఎకరాల్లో పూర్తి
- మార్చి 10 నాటికి పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు



రీసర్వే ప్రక్రియలో సలహాలు ఇస్తున్న జేసీ తేజ్‌భరత్

సాక్షి, రాజమహేంద్రవరం

భూ వివాదాల శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష' పథకం కింద మూడు దశల్లో భూముల సమగ్ర సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. తద్వారా భూ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించింది. ఇందుకు అనుగుణంగా తొలి దశ సర్వే ప్రక్రియను అధికార యంత్రాంగం చేపట్టింది. అప్పట్లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించి, శాశ్వత భూహక్కు పత్రాలు సైతం పంపిణీ చేసింది. ప్రస్తుతం రెండో దశ సర్వే జిల్లాలో యుద్ధప్రాతిపదికన జరుగుతోంది.

**రెండో దశ 50 శాతం పూర్తి**

తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 272 గ్రామాల పరిధిలోని 16,52,706 ఎకరాల్లో వివిధ దశల్లో రీసర్వే చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. తొలి దశలో 44 గ్రామాల్లోని 64,336 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. రెండో దశలో జిల్లా వ్యాప్తంగా 17 గ్రామాలను ఎంపిక చేశారు. మొత్తం 47,189.2 ఎకరాల రీసర్వేకు ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే 10 గ్రామాల్లోని 22,223.91 ఎకరాల్లో సర్వే పూర్తి చేసి, సుమారు 50 శాతం లక్ష్యాన్ని చేరుకున్నారు. మిగిలిన 7 గ్రామాల పరిధిలోని 24,965.78 ఎకరాల్లో సైతం త్వరితగతిన పూర్తి చేయనున్నారు. ఈ నెలాఖరుకు లక్ష్యాన్ని అధిగమించాల్సి ఉండగా.. కొన్ని సమస్యల కారణంగా మార్చి 10వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు.

**పకడ్బందీగా..**

రెండో దశ రీసర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ భూములు, నివాస గృహాలు, వీధులు, ప్రైవేటు భూములు, పరిశ్రమలు.. ఇలా గ్రామానికి చెందిన మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేస్తున్నారు. తొలుత గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్ పూర్తి చేస్తున్నారు. సర్వే చేస్తున్న గ్రామానికి పొరుగున ఉన్న వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్ల సేవలను వినియోగించుకుంటున్నారు. ప్రతి గట్టూ తిరిగి సరిహద్దులు నిర్ధారిస్తున్నారు. ఫలితంగా సమయం ఆవుతోంది.

**అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం**

రీసర్వేలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాయంతో ఈ ప్రక్రియ సాగుతోంది. చిన్న వాటి నుంచి పెద్ద పెద్ద కమతాల వరకూ ప్రతీది నమోదు చేస్తున్నారు. డ్రోన్లను రంగంలోకి దింపి సర్వేలో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. మొదటి రెండు దశల్లో ఇప్పటి వరకూ 1,474.629 చదరపు కిలోమీటర్ల మేర డ్రోన్లతో సర్వే నిర్వహించారు.

**హద్దు రాళ్లు**

సర్వే పూర్తయిన రెవెన్యూ గ్రామాల పరిధిలో ఫ్రీజోన్ యాక్టివిటీస్ కింద భూముల హద్దులకు సంప్రదాయ పద్ధతిలో సున్నం మార్కింగ్ చేపట్టారు. రాళ్లను ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించారు. రెండో దశలో 15,113 రాళ్లు పాతాల్సి ఉండగా.. ఇప్పటి వరకూ 5,522 రాళ్లు పాతారు.

### కొలిక్కి వస్తున్న వివాదాలు

ఈ సర్వే పుణ్యమా అని దశాబ్ద కాలం నాటి భూ వివాదాలు ఓ కొలిక్కి వస్తున్నాయి. దశాబ్దం క్రితం నిర్వహించిన సర్వేలో 5 శాతం అలవెన్సు అమలు చేశారు. అప్పట్లో చైన్లతో కొలతలు వేయడంతో అటూ ఇటూ భూ విస్తీర్ణంలో 5 % సరిహద్దులు నిర్ణయించారు. ఈ క్రమంలో రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు రావడంతో కొందరు రైతులు వాగ్వాదాలకు దిగుతున్నారు. 1906లో నిర్వహించిన సర్వే ఆధారంగా ప్రస్తుతం భూ సంబంధిత లావాదేవీలు కొనసాగిస్తున్నారు. ఒకే సర్వే నంబరుపై పలుమార్లు లావాదేవీలు జరిగాయి. వారసులు పంచుకోవడం, బహుమతిగా ఇవ్వడం, క్రయ విక్రయాలు జరిగినా అందుకు అనుగుణంగా భూమి మీద సబ్ డివిజన్ జరగకపోవడంతో తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. పత్రాల మీద లావాదేవీలు జరిగినా క్షేత్ర స్థాయిలో సర్వే చేయకుండానే నోషనల్ ఖాతాల వల్ల అనేక సమస్యలు మొదలయ్యాయి. తప్పుడు సర్వే నంబర్లతో భూములు రిజిస్ట్రేషన్ కావడం, రిజిస్ట్రేషన్ అయిన భూమికి, వాస్తవంగా భూమి మీద ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండటం, నిషేధిత భూములు రిజిస్ట్రేషన్ చేయడం వంటి కారణాలతో రెవెన్యూ సమస్యలు నిత్యకృతమయ్యాయి.

### ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం

రీసర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాం. ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాం. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. క్షేత్ర స్థాయిలో స్వయంగా పర్యటించి, ప్రక్రియ పర్యవేక్షిస్తున్నా. ఎలాంటి లోటుపాట్లకూ తావు లేకుండా పకడ్బందీగా సర్వే చేస్తున్నాం. రెండో దశలో ఇప్పటికే 50 శాతం లక్ష్యాలను అధిగమించాం. మిగిలిన వాటిని సైతం త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నాం. నిజమైన హక్కుదారుకు న్యాయం చేయాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నాం.

– ఎస్.తేజ్‌భరత్, జాయింట్ కలెక్టర్

### లక్ష్యాలను అధిగమిస్తాం



రెండో దశ రీసర్వే ప్రక్రియ వేగంగా చేపడుతున్నాం. వివాదాల పరిష్కారానికి సలహాలు ఇస్తున్నాం. ఇప్పటికే జిల్లాలోని 22,223.91 ఎకరాల్లో పూర్తి చేశాం. మిగిలినది సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– వి.లక్ష్మణరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జిల్లా అధికారి

# మహిళల భద్రత దిశగా ఆశా యాత్ర

మనదేశంలో మహిళల భద్రత, మహిళాసాధికారత సాధన కోసం ఆశా మాలవీయ దేశపర్యటనకు సిద్ధమయ్యారు. విజయవంతంగా సాగుతున్న ఆమె యాత్ర తెలుగు రాష్ట్రంలో ప్రవేశించింది. మహిళల భద్రత విషయంలో ఆంధ్రప్రదేశ్ ఆదర్శవంతంగా ఉందని చెప్పారామె.





ఆశా మాలవీయది మధ్యప్రదేశ్ రాష్ట్రం, రాజ్‌ఘర్ జిల్లా సతారామ్ గ్రామం. ఆమె క్రీడాకారిణి, పర్వతారోహణలో అభిరుచి మెండు. మహిళాభ్యుదయం లక్ష్యంగా సాగుతున్న ఆమె సైకిల్ పర్యటనలో స్త్రీ సాధికారత, భద్రత గురించి సమాజాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఆమె పర్యటన ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశించింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం నాడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఆమె తన లక్ష్యాన్ని వివరించారు.

### అపోహను తొలగిస్తాను!

''నేను స్పోర్ట్స్‌లో నేషనల్ ప్లేయర్‌ని. పర్వతారోహణలో రికార్డు హోల్డర్‌ని. ప్రస్తుతం 25వేల కిలోమీటర్ల సంపూర్ణ భారత యాత్ర చేస్తున్నాను. నవంబర్ ఒకటిన భోపాల్‌లో ప్రారంభమైన నా సైకిల్ యాత్రలో ఎనిమిది వేల కిలోమీటర్లు పూర్తయ్యాయి, విజయవాడ చేరుకున్నాను. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో యాత్ర నిర్వహించాలనేది లక్ష్యం. ఇప్పటికే ఏడు రాష్ట్రాల్లో యాత్ర పూర్తయింది. భారతదేశం మహిళలకు అంత సురక్షితమైన దేశం కాదని విదేశాల్లో తప్పుడు అభిప్రాయం ఉంది. మహిళలకు భారతదేశంలో పూర్తి భద్రత ఉందని నేను ప్రపంచానికి చాటి చెప్పాలనుకుంటున్నాను.

### 'దిశ' బాగుంది

సీఎం జగన్ గారిని కలవడం ఎంతో ఉద్వేగంగా, గర్వంగా ఉంది. దేశం అభివృద్ధితో పాటు మహిళల భద్రతలాంటి విషయాలపై ముఖ్యమంత్రి గారి అభిప్రాయాలు ఎంతో గొప్పగా ఉన్నాయి. మహిళల భద్రత కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎన్నో కార్యక్రమాలను చేపట్టింది. ఏపీలో మహిళల భద్రత కోసం ప్రవేశపెట్టిన దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాను. ఈ యాప్ చాలా బాగా పనిచేస్తోంది. ఏపీలో మహిళలే కాదు, ప్రజలంతా సురక్షితంగా ఉన్నారు. ముఖ్యమంత్రిగారు నన్ను ప్రశంసలతో ముంచెత్తడంతోపాటు నా ఆశయం కోసం 10లక్షల రూపాయల ప్రోత్సాహకం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. తిరుపతి వద్ద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటి నుంచి నాకు ప్రత్యేక రక్షణ అందించారు. స్కూల్స్, కాలేజీల్లో అమ్మాయిల కోసం ముఖ్యమంత్రి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఎంతో మంచివి. దేశానికే ఆదర్శంగా నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డి లాంటి ముఖ్యమంత్రిని కలవడం సంతోషంగా ఉంది'' అన్నారు ఆశా మాలవీయ. మహిళల భద్రత, సాధికారతతోపాటు ప్రపంచదేశాల ముందు మన దేశం గౌరవాన్ని ఇనుమడింపచేయాలనే ఆమె ఆశయం ఉన్నతమైనది. ఈ యాత్ర నిర్విఘ్నంగా కొనసాగాలని ఆమెను ఆశీర్వదిద్దాం.



● ఆశా మాలవీయ (ఫైల్ ఫొటో)

– సాక్షి, ఏపీ బ్యూరో

## సందర్భం

# నవరాగాల తేజం

### ముచ్చటగా మూడోసారి గ్రామీ గెలుచుకున్న రిక్కీ కేజ్

గత సంవత్సరం గ్రామీ గెలుచుకున్న తరువాత లాస్ వేగాస్‌లోని ఎంజీఎం గ్రాండ్ మార్క్యూ బాల్‌రూమ్‌లో భారతీయత ఉట్టిపడేలా 'నమస్తే' అంటూ ప్రేక్షకులకు అభివాదం చేశాడు మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్.

భారతీయత అతడి బలం. తనను ముందుకు నడిపించే ఇంధనం.

లాస్ ఏంజెల్స్(యూఎస్) మైక్రోసాఫ్ట్ థియేటర్‌లో భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం జరిగిన 65 వ గ్రామీ పురస్కార ప్రదానోత్సవంలో రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి 'గ్రామీ' అవార్డ్‌ను అందుకున్నాడు రిక్కీ కేజ్. స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కు బెస్ట్ ఇమాసివ్ ఆడియో ఆల్బమ్ విభాగంలో గ్రామీ దక్కింది. రిక్కీకి కెరీర్‌లో ఇది మూడో గ్రామీ...

సంగీతరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రామీ అవార్డ్‌ను ముచ్చటగా మూడోసారి సొంతం చేసుకున్నాడు బెంగళూరుకు చెందిన మ్యూజిక్ కంపోజర్ రిక్కీ కేజ్. 2015లో అమెరికన్ రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'విండ్స్ ఆఫ్ సంసార' ఆల్బమ్‌కు తొలిసారిగా గ్రామీ అవార్డ్ దక్కింది.

స్టీవర్ట్ కోప్లాండ్‌తో కలిసి చేసిన 'డివైన్ టైడ్స్' ఆల్బమ్‌కు మూడోసారి గ్రామీ అవార్డ్ (బెస్ట్ ఇమాసివ్ ఆడియో ఆల్బమ్ విభాగం)లో అందుకున్నాడు రిక్కీ. గత సంవత్సరం ఇదే ఆల్బమ్ 'బెస్ట్ న్యూ ఏజ్ ఆల్బమ్' విభాగంలో రెండోసారి గ్రామీ దక్కింది.

డివైన్ టైడ్స్... ప్రకృతి ప్రపంచానికి నివాళి.

ఈ ఆల్బమ్‌లో తొమ్మిది పాటలు ఉన్నాయి. మన హిమాలయాల అందాల నుంచి స్పెయిన్ అరణ్యాల అందాల వరకు మ్యూజిక్ వీడియోల్లో కనువిందు చేస్తాయి.

'నా సంగీతంలో భిన్న సంస్కృతుల ప్రభావం కనిపించినప్పటికీ నా మూలాలు మాత్రం భారత్‌లోనే ఉన్నాయి' అంటాడు రిక్కీ కేజ్.

మూడోసారి 'గ్రామీ' వరించిన సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో కోప్లాండ్‌తో ఉన్న ఫోటో పోస్ట్ చేసి 'సూపర్ గ్రేట్‌ఫుల్, మై థర్డ్ గ్రామీ అవార్డ్' అని తన ఆనందాన్ని పంచుకున్నాడు రిక్కీ కేజ్.

నార్త్ కరోలినా (యూఎస్)లో జన్మించాడు రిక్కీ. ఎనిమిది సంవత్సరాల వయసు నుంచి తల్లిదండ్రులతో పాటు బెంగళూరులో ఉంటున్నాడు. స్థానిక బిషప్ కాటన్ స్కూల్‌లో చదువుకున్నాడు. ఆక్స్‌ఫర్డ్ డెంటల్ కాలేజీలో చదువుకునే రోజుల్లో సంగీతంలోనే కెరీర్ వెదుక్కుంటానని తల్లిదండ్రులతో చెప్పాడు. ఇలా చెప్పడం తండ్రికి నచ్చలేదు.

ఆ తరువాత మాత్రం ఆయన కాస్త మెత్తబడ్డాడు. డెంటల్ సర్జరీలో డిగ్రీలో పూర్తి చేసిన తరువాత, పట్టా తండ్రి చేతికి ఇచ్చి తనకు ఇష్టమైన సంగీతపు దారిలో ప్రయాణం ప్రారంభించాడు.

టీవీలోని మ్యూజిక్ షోల ద్వారా చిన్నప్పుడే రిక్కీకి సంగీతంపై ఆసక్తి మొదలైంది. ఇంట్లో పెద్ద మ్యూజిక్ కలెక్షన్ ఉండేది.

రాక్ బాండ్ 'ఏంజెల్ డస్ట్'లో గిటార్ ప్లేయర్‌గా సంగీత ప్రపంచంలోకి అడుగు పెట్టిన రిక్కీ ఆ తరువాత ఫుల్‌టైమ్ కంపోజర్‌గా మారాడు. నస్రత్ ఫతే అలీఖాన్, పండిట్ రవిశంకర్, పీటర్ గాబ్రియెల్ తనకు ఇష్టమైన సంగీతకారులు.

జింగిల్స్ చేయడం అంటే రిక్కీకి చాలా ఇష్టం. జింగిల్స్ చేయడం అంటే తన దృష్టిలో రోజూ వ్యాయామం చేయడం లాంటిది. సృజనాత్మక పరిధిని పెంచుకోవడంలాంటిది. ఎన్నో భాషల్లో, ఎన్నో జానర్స్‌లో జింగిల్స్ చేస్తున్నప్పుడల్లా తనలో అదనపు శక్తి వచ్చినట్లుగా భావిస్తాడు. ఇప్పటివరకు మూడువేలకు పైగా జింగిల్స్ చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా వంద మ్యూజిక్ అవార్డ్‌లు గెలుచుకున్నాడు. రిక్కీకి నచ్చిన పుస్తకం రిచర్డ్ డాకిన్స్ ది గాడ్ డిలూజన్. నిజానికి రిక్కీ తండ్రి, తాతతో సహా బంధువుల్లో చాలామంది వైద్యులుగా పనిచేశారు.

'రిక్కీలో ఆర్టిస్టిక్ జీన్స్ తాత నుంచి వచ్చాయి' అని మురిసిపోతుంది తల్లి పమ్మి.

తాత జానకిదాస్ నటుడు, భావుకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు.

2014లో తన గర్ల్‌ఫ్రెండ్ వర్షను వివాహం చేసుకున్నాడు రిక్కీ కేజ్.





● సోమవారం గ్రామీ అవార్డుల ప్రదానోత్సవంలో రిక్కీ కేజ్, హెర్బర్ట్ వాల్ట్ (ప్రొడ్యూసర్), రాక్ లెజెండ్ స్టీవర్ట్ కోప్లాండ్

### నవ రత్నాలు

'డివైన్ టైడ్స్' విడుదల అయిన కొత్తలో ఈ ఆల్బమ్‌కు గ్రామీ అవార్డ్ గెలుచుకునే సంపూర్ణ అర్హతలు ఉన్నాయని కితాబు ఇచ్చారు సంగీత విశ్లేషకులు. వారి మాట నిజమైంది. 'డివైన్ టైడ్స్' లోని వండర్స్ ఆఫ్ లైఫ్, హిమాలయాస్, అవర్‌హోమ్, ఆర్ట్ ఆఫ్ డివోషన్, పాస్టోరల్ ఇండియా, ఐయామ్ ఛేంజ్, ఏ ప్రేయర్, గాంధీ, మదర్ ఎర్త్... తొమ్మిది ట్రాక్స్ నవరత్నాలుగా పేరు తెచ్చుకున్నాయి. ఈ ఆల్బమ్‌లో మూల సూత్రం ఏమిటి?

మనతో మనం... అంటే ఎవరికి వారు తమ వ్యక్తిగత ప్రంచంలోకి వెళ్లి తమను తాము కొత్తగా పరిచయం చేసుకోవడం. తమను తాము విశ్లేషించుకోవడం, విశ్లేషణ ఫలితాలను ఆచరణలోకి తీసుకురావడం.

కాలంతో పాటు మనం... కాలంపై మనదైన సంతకం ఉండాలి. కాలం చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలి. కాలం విసిరే ప్రశ్నలకు జవాబు వెదుక్కోవాలి. కాలం విసిరే సవాళ్లకు పరిష్కారాలు ఆలోచించాలి.

మన గ్రహంతో మనం... భూమికి మనం ఎంతో రుణపడి ఉన్నాం. ఆ రుణం తీరేది కాదు. మనం చేయాల్సిందల్లా చెట్టును కాపాడుకోవాలి. చెట్టుపైన పిట్టను కాపాడుకోవాలి. పర్యావరణ పరిరక్షణ నినాదం మన శ్వాసలో భాగం కావాలి.

### వ్యక్తిత్వ నిర్మాణంలో నేస్తం

ఆసక్తిగా మొదలై, అభిరుచిగా మారి రిక్కీ జీవితంలోకి వచ్చిన సంగీతం 'సంగీతమే నా వ్యక్తిత్వం' అనే స్థాయికి చేరుకుంది. అదే శ్వాస అయింది. చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు సంగీతంలో కెరీర్‌ను వెదుక్కోవడానికి ఇష్టంగా లేరు. దీని గురించి ప్రస్తావిస్తూ 'మన దేశంలో తల్లిదండ్రులు పిల్లల కెరీర్‌కు సంబంధించిన నిర్ణయాలను పాషన్‌పై కాకుండా భయంపై తీసుకుంటారు. ఈ ధోరణిలో మార్పు రావాల్సిన అవసరం ఉంది. ఆర్థికకోణాన్ని దృష్టిలో పెట్టుకొని కెరీర్‌ను ఎంచుకోవడం కాకుండా ఆనందాన్ని దృష్టిలో పెట్టుకొని ఎంచుకోవాలి. సంప్రదాయ వృత్తులకు దూరంగా తాము ఎంచుకున్న మార్గం ద్వారా మీ పిల్లలు పెద్దగా డబ్బు సంపాదించలేకపోవచ్చు. అయితే డబ్బు కంటే విలువైన ఆనందాన్ని సొంతం చేసుకుంటారు' అంటాడు రిక్కీ కేజ్. గ్రామీ అవార్డ్ అందుకున్న యంగెస్ట్ ఇండియన్, మూడు గ్రామీలు అందుకున్న 'వోన్లీ ఇండియన్'గా తనదైన ప్రత్యేకత సంపాదించుకున్న రిక్కీ కేజ్ (41)...

'సంగీతం అనేది హాయిగా విని ఆస్వాదించడానికి మాత్రమే కాదు మన వ్యక్తిత్వ నిర్మాణంలో సహాయపడుతుంది. మన పాటలలో ఎక్కువగా ప్రేమ, శాంతి, మంచితనం చుట్టూ అల్లుకున్నవే' అంటాడు.

---

## సాగుబడి

ధనిష్ట కార్తె: ఫిబ్రవరి 18 వరకు

# బ్రహ్మీ, వస సాగు.. భలే బాగు!

● వరి సాగుకు ప్రత్యామ్నాయం.. నీటి వసతి ఉన్న నల్లరేగడి పొలాల్లో బ్రహ్మీ, వస సాగు

● బ్రహ్మీ ఏడాదికి 3 సార్లు కోత.. వస 9 నెలలకోసారి కోత ● ఏడాదికి ఎకరానికి రూ.50 వేల-లక్ష వరకు నికరాదాయం

మాగాణి రేగడి భూముల్లో వరి, పెసర, మినుము మాత్రమేనా? ఇంకే ఇతర పంటలూ సాగు చేసుకోలేమా? ఉన్నాయి. ఔషధ పంటలున్నాయి. ఎకరానికి ఏటా రూ. లక్షకు తగ్గకుండా నికరాదాయం ఇచ్చే బ్రహ్మీ, వస వంటి దీర్ఘకాలిక ఔషధ పంటలు ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో కొందరు రైతులు ఈ పంటలను నీటి వసతి ఉన్న మాగాణి నల్లరేగడి భూముల్లో సాగు చేస్తూ చక్కని ఆదాయం పొందుతున్నారు. ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు వీరిని ప్రోత్సహిస్తోంది. ఆయుర్వేద ఔషధ పరిశ్రమదారులతో కొనుగోలు ఒప్పందాలు చేయించి సాగు చేయిస్తుండటం విశేషం. బ్రహ్మీ, వస పంటల సాగులో అక్కడి ముగ్గురు రైతుల అనుభవాలను పరిశీలిద్దాం..



### బ్రహ్మీ.. 4 నెలలకో కోత

బ్రహ్మీ (Bacopa monneiri) నేల మీద పాకే తీగజాతి దీర్ఘకాలిక పంట. బ్రహ్మీ పంటను వరి పంటకు మాదిరిగానే దమ్ము చేసి, 2-3 అంగుళాల మొక్క కటింగ్‌ను నాటాలి. ఒకసారి నాటితే చాలు. 5 ఏళ్ల పాటు మళ్లీ నాటక్కర లేదు. 4 నెలలకోసారి పంట కోతకు వస్తుంది. అయితే, ఏడాది పాడవునా పంట పొలాన్ని కాపాడుకోవాల్సి ఉంటుంది. పొలం అంతా బ్రహ్మీ మొక్కలు అల్లుకుపోతాయి కాబట్టి కలుపు సమస్య ఉండదు. అయితే, పంట కోతకు వచ్చినప్పుడు అవసరాన్ని బట్టి కలుపు తీసి, తర్వాత కొడవళ్లతో నేల మట్టానికి బ్రహ్మీ మొక్కలను కోస్తారు. ఆ తర్వాత కొంచెం ఎరువు చల్లి నీటి తడి ఇస్తే చాలు.. పంట మళ్లీ ఏపుగా పెరుగుతుంది. ప్రతి కోతకు ఎకరానికి 3,000-6,000 కిలోల పచ్చి బ్రహ్మీ మొక్కల దిగుబడి వస్తుంది. ఆరుబయట గచ్చు మీద ఎండబెడితే.. కొద్ది రోజుల్లో 600-700 కిలోల ఎండు బ్రహ్మీ సిద్ధమవుతుంది. దీని ధర మార్కెట్‌లో రూ. 40-50 వరకు ఉంటుంది. అంటే కోతకు రూ. 30 వేల చొప్పున.. ఏడాదిలో 3 కోతలకు.. రూ. 90 వేల వరకు రైతుకు ఆదాయం వస్తుంది. ప్లాంటింగ్ మెటీరియల్‌ను రైతులకు మొదటిసారి ఔషధ మొక్కల బోర్డు ఇస్తుంది. పెరిగిన పంట నుంచి తీసి 2-3 అంగుళాల ముక్కలను నాటుకుంటున్నారు. మొక్కలను ఎలా నాటుకోవాలో రైతులకు శిక్షణ ఇస్తారు. బ్రహ్మీ మొండి మొక్క. నిర్వహణ పెద్దగా అవసరం లేదు. ఒకటి, రెండు సార్లు కలుపు తీస్తే చాలు. ఎరువులు వాడాలని లేదు. జీవామృతం వాడినా సరిపోతుంది.



### వస.. 9 నెలల పంట

పసుపు పంట మాదిరిగా వస (Bach-Acorus calamus) 2-3 అడుగుల ఎత్తున పెరుగుతుంది. 9 నెలల పంట. కొమ్ములను నాటుకోవాలి. మొక్కలు పెంచైనా నాటుకోవచ్చు. 9 నెలలకు కొమ్ములు తవ్వి తీసి, ఎండ బెట్టి, పాలిషింగ్ చేసి ఔషధ కంపెనీలకు విక్రయించాలి. 20-30 ఎకరాలకు ఒకటి చొప్పున పాలిషింగ్ మిషన్ అవసరం. ఎకరానికి 10-20 క్వింటాళ్ల వస కొమ్ముల దిగుబడి వస్తుంది. ఎకరానికి ఖర్చు రూ.20 వేలు పోను, రూ. 60 వేలు-లక్ష వరకు నికరాదాయం వస్తుంది.

### రూ. 50-60 వేల నికరాదాయం



● ఎండిన బ్రహ్మీని చూపుతూ...

సుగత్‌సింగ్ (66) జాంజ్‌గిర్ ఛాంప జిల్లా ఖటోల గ్రామానికి చెందిన సింగ్ వందెకరాల్లో సేద్యం చేసే రైతు. వరి, గోధుమ, పప్పుధాన్యాలు పండిస్తారు. 2021 జూలైలో ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు సూచన మేరకు నల్లరేగడి భూమి 3 ఎకరాల్లో బ్రహ్మీ, 2 ఎకరాల్లో వస నాటారు. ఎకరానికి 4 క్వింటాళ్ల సిటీ కంపోస్టు దుక్కిలో వేసి, అవసరం మేరకు నీటి తడులు ఇస్తున్నారు. బ్రహ్మీ పంటను కోసి గచ్చుపై ఎండబెడుతున్నారు. వరిలో ఎకరానికి రూ. 30-35 వేలు నికరాదాయం వస్తుంటే.. బ్రహ్మీ, వసలో రూ. 50-60 వేల వరకు వస్తోందని సింగ్(83055 61057) తెలిపారు. మామిడి చెట్ల నీడలో సర్పగంధ మొక్కలను 16 నెలల క్రితం వేశారు. మరో 2 నెలల్లో కోతకు రానుంది.

### ప్రకృతి సేద్యంలో ఏపుగా బ్రహ్మీ



దోమన్‌లాల్ సాహు.. బలోదబజార్ జిల్లా గైత్ర గ్రామంలో 25 ఎకరాల సొంత భూమిలో వరి, కంది, శనగ తదితర పంటలను 4 ఏళ్లుగా ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగు చేస్తూ రసాయనిక ఎరువులు వాడే రైతులతో సమానంగా దిగుబడులు తీస్తున్నారు. 6 నెలల క్రితం బోర్డు ద్వారా మొక్కలు తెప్పించి 2 ఎకరాల నల్లరేగడిలో నాటారు. పంట కోతకు సిద్ధంగా ఉంది. ఎకరానికి వర్మీకంపోస్టు 2 క్వింటాళ్లు, 100 కిలోల ఘనజీవామృతం చల్లి దమ్ము చేసి, బ్రహ్మీ మొక్కలు నాటారు. వర్మీవాష్, వేస్ట్‌డీకంపోజర్, ద్రవ జీవామృతం 15 రోజులకోసారి పిచికారీ చేస్తున్నారు. పంట ఆరోగ్యంగా పెరిగింది. ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు ద్వారా విక్రయిస్తానని సాహు (62651 71801) తెలిపారు.

### మార్కెటింగ్ సమస్య లేదు!



ఔషధ మొక్కల సాగు ద్వారా రైతులు సాధారణ పంటలతో పోల్చితే అధిక నికరాదాయం పొందే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వరి సాగు చేసే నల్ల రేగడి, లోతట్టు ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఔషధ పంటలైన బ్రహ్మీ, వసను సాగు చేసుకోవచ్చు. ఎకరానికి రూ. లక్ష వరకు నికరాదాయం పొందే వీలుంది. విత్తనాలు, మొక్కలను బోర్డు ద్వారా అందించి రైతులను ప్రోత్సహిస్తున్నాం. ఔషధాల తయారీదారులు, వ్యాపారులతో ముందే టైఅప్ చేసుకొని తగిన జాగ్రత్తలతో అవగాహన ఒప్పందం చేసుకొని మార్కెటింగ్ సమస్య లేకుండా చేస్తున్నాం. రైతుల ఉత్పత్తులకు మంచి ఆదాయం వచ్చేలా చేస్తున్నాం. ఎకరానికి ఏడాదికి రూ. పది లక్షల వరకు ఆదాయం వచ్చే ఔషధ పంటలు కూడా ఉన్నాయి. ఏ రాష్ట్రంలోని రైతులకైనా, సంస్థలకైనా కన్సల్టెన్సీ సేవలు అందించేందుకు మా బోర్డు సిద్ధంగా ఉంది.

– జె.ఎ.సి.ఎస్.రావు (96769 95404), సీఈఓ, ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు, పూర్వ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్, రాయపూర్. cgsmpb.ceo@gmail.com

### ఎకరానికి ఏటా రూ. 70 వేల నికరాదాయం



అశ్వని శబారియా.. గౌరెల్లా పెండ్ర మర్వాహి జిల్లా పెండ్ర పట్టణ శివారులో ఈ యువ రైతు 10 నెలల క్రితం 9 ఎకరాల్లో బ్రహ్మీ, 2.5 ఎకరాల్లో వస సాగు ప్రారంభించారు. బీకాం చదువుకున్న అశ్వని ఒక స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నారు. తిపాన్ నది ఒడ్డున దేవుడి మాన్యం నల్ల రేగడి భూమిని కౌలుకు తీసుకొని, బోర్ల ద్వారా నీటిని తోడుకుంటూ సాగు చేస్తున్నారు. బ్రహ్మీ నాటు మొక్కలు, వస విత్తన కొమ్ములను ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు ద్వారా తీసుకున్నారు. వర్మీ కంపోస్టు, వేపపిండి చల్లి దుక్కి చేసిన తర్వాత మొక్కలు నాటారు. తర్వాత ఎరువులేమీ వేయటేదు. వారానికి రెండు సార్లు తగుమాత్రంగా నీటి తడి ఇస్తున్నారు. ఈ రెండు పంటలకూ నీరు నిల్వ ఉండక్కరలేదు. మట్టిలో తేమ బాగా ఉంటే చాలు. బ్రహ్మీ పంటను అశ్వని 10 నెలల్లో 3 సార్లు కోసి, ఎండబెట్టి విక్రయించారు. బ్రహ్మీ సాగు ద్వారా ఎకరానికి ఏడాదికి 3 కోతల్లో రూ. 90 వేల ఆదాయం. అన్నీ కలిపి రూ. 20 వేల ఖర్చవుతోంది. రూ. 70 వేలు నికరాదాయమని అశ్వని తెలిపారు. బ్రహ్మీలో వరి కన్నా ఎక్కువ ఆదాయం వస్తున్నదన్నారు. బ్రహ్మీ కొనుగోలుదారులను ఛత్తీస్‌గఢ్ ఔషధ మొక్కల బోర్డు పరిచయం చేసిందన్నారు. ఆన్‌లైన్‌లో నేరుగా విక్రయించడానికి ఇండియామార్ట్. కామ్ వెబ్‌సైట్‌లో కూడా తాను రిజిస్టర్ చేసుకున్నారు. మార్కెటింగ్ సమస్య లేదంటున్నారు రైతు అశ్వని శబారియా (81203 57007).

### 15 నుంచి ఆకాశ్ చౌరాసియా శిక్షణా శిబిరం




గో ఆధారిత బహుళ అంచెల ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ప్రసిద్ధ యువ ప్రకృతి వ్యవసాయ నిపుణుడు ఆకాశ్ చౌసియా 5 రోజుల పాటు తెలుగు రైతులకు శిక్షణ ఇవ్వనున్నారు. రసాయన రహిత ఆరోగ్య భారతాన్ని నిర్మించే కృషిలో భాగంగా గ్రామభారతి, శ్రీ వేణుగోపాల స్వామి మందిరా గోశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి 19 వరకు హైదరాబాద్ గండిపేట దగ్గర గంగుర్తిలోని వేణుగోపాల స్వామి మందిర గోశాలలో ఈ రెసిడెన్షియల్ శిబిరం జరుగుతుంది. ఏకకాలంలో అనేక ఉద్యాన పంటలు సాగు చేసే బహుళ అంతస్తుల ప్రకృతి సేద్యం, విలువ జోడింపుపై ఆకాశ్ శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ, ఆహార వసతి సదుపాయాలు కల్పిస్తారు. ప్రవేశ రుసుం రూ. 2,500. ఇతర వివరాలకు.. 74161 60182.

### 12న గుంటూరులో చిరుధాన్యాల మేళా

రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో గుంటూరులోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో చిరుధాన్యాలపై అవగాహన కార్యక్రమంతో పాటు చిరుధాన్యాల వంటకాలపై ఈ నెల 12(ఆదివారం)న ఉ. 10 గం. నుంచి సా 4 గం. వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు తెలిపారు. సిరిధాన్యాల వాడకంతో ఆధునిక రోగాల నియంత్రణ, నిర్మూలనపై స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన డా. ఖాదర్ వలి అవగాహన కల్పిస్తారు. చిరుధాన్యాలతో లడ్లు, మురుకులు, పాయసం, కుడుములు, బూందీ, బిర్యానీ లాంటి వివిధ రకాల వంటకాల తయారీ పద్ధతులను చిరుధాన్య వంటల నిపుణులు మిల్లెట్స్ రాంబాబు తెలియజేస్తారు. ప్రవేశం ఉచితం. వివరాలకు 97053 83666, 70939 73999

### 13న హైదరాబాద్‌లో డా. ఖాదర్‌వలి సభ



మిల్లెట్ మాన్ ఆఫ్ ఇండియా డా. ఖాదర్ వలి ఈ నెల 13(సోమవారం)న సా. 5. గంటలకు హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆడిటోరియంలో అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా జరిగే సభలో ప్రసంగిస్తారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో తెలంగాణ విశ్రాంత ఇంజనీర్ల సంఘం, రైతునేస్తం ఫౌండేషన్ ఈ సందర్భంగా డా. ఖాదర్‌ను ఘనంగా సన్మానించనున్నాయి.

### 'మేనేజ్' అగ్రి ఫిల్మ్ ఫెస్టివల్

జాతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (మేనేజ్) వ్యవసాయ సంబంధమైన అంశలపై ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వహించనుంది. ఈ నెల 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకొని ఫిల్మ్స్‌ను పంపాలి.
మార్చి 10న అవార్డుల ప్రదానం ఉంటుంది.
జాతీయ, రాష్ట్ర, సంస్థాగత స్థాయిలో 50 బహుమతులు ఇస్తారు.
వివరాలకు... శరత్‌కుమార్–
99510 23410

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



## ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీకి జ్యోతి

ఈనెల 10 నుంచి 12 వరకు కజకిస్తాన్ రాజధాని అస్తానాలో జరిగే ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 25 మందితో కూడిన భారత జట్టులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన స్టార్ స్ప్రింటర్ జ్యోతి యర్రాజీకి చోటు లభించింది. విశాఖపట్టణానికి చెందిన జ్యోతి 60 మీటర్లు, 60 మీటర్ల హర్డిల్స్ ఈవెంట్స్‌లో పోటీపడుతుంది. ఇటీవల ఫ్రాన్స్‌లో జరిగిన మిరామస్ ఎలైట్ ఇండోర్ ట్రాక్ అథ్లెటిక్స్ మీట్‌లో జ్యోతి 60 మీటర్ల హర్డిల్స్‌లో జాతీయ రికార్డు నెలకొల్పడంతోపాటు రజత పతకం సాధించింది.



## తొలి రౌండ్‌లోనే సానియా జోడీ ఓటమి

అబుదాబి ఓపెన్ టెన్నిస్ టోర్నీలో సానియా మీర్జా (భారత్)–బెథానీ మాటెక్ (అమెరికా) జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. సోమవారం జరిగిన మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సానియా–బెథానీ ద్వయం 3–6, 4–6తో ఫ్లిప్‌కెన్స్ (బెల్జియం)–లౌరా సిగెముండ్ (జర్మనీ) జోడీ చేతిలో ఓడింది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సానియా జోడీ తమ సర్వీస్‌ను ఆరుసార్లు కోల్పోయింది. సానియా–బెథానీలకు 4,350 డాలర్లు (రూ. 3 లక్షల 60 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

## 'పసిడి' నెగ్గిన గురునాయుడు



సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. అండర్–18 బాలుర వెయిట్‌లిఫ్టింగ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఎస్.గురు నాయుడు పసిడి పతకం సాధించాడు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ వేదికగా జరుగుతున్న ఈ క్రీడల్లో సోమవారం 55 కేజీల విభాగంలో గురు నాయుడు మొత్తం 227 కేజీల బరువెత్తి అగ్ర స్థానంలో నిలిచాడు. టామ్బా మీటీ (మణిపూర్) రజతం, విజయ్ ప్రజాపతి (మధ్యప్రదేశ్) కాంస్య పతకం గెలుపొందారు. ప్రస్తుతం పతకాల పట్టికలో ఆంధ్రప్రదేశ్ 2 స్వర్ణాలు, ఒక రజతం, మూడు కాంస్యాలతో కలిపి మొత్తం ఆరు పతకాలతో 15వ స్థానంలో ఉంది.

## విజేత సామ్యూల్ స్టీఫెన్

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ ఓపెన్ 'ఫిడే' రేటెడ్ బిలో–1600 చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 11 ఏళ్ల కుర్రాడు సామ్యూల్ స్టీఫెన్ నోబెల్ విజేతగా నిలిచాడు. వీ4 చెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో సామ్యూల్ స్టీఫెన్ తొమ్మిది రౌండ్లకుగాను 8.5 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. సామ్యూల్ ఎనిమిది గేముల్లో గెలిచి, మరో గేమ్‌ను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. విజేతగా నిలిచిన సామ్యూల్‌కు భారీ ట్రోఫీతోపాటు రూ. 1 లక్ష ప్రైజ్‌మనీగా లభించింది. హర్షల్ పాటిల్ (మహారాష్ట్ర; 8 పాయింట్లు) రెండో స్థానంలో నిలిచి రూ. 60 వేలు... కె.సమర్‌తేజ (తెలంగాణ; 8 పాయింట్లు) మూడో స్థానంలో నిలిచి రూ. 40 వేలు ప్రైజ్‌మనీ గెల్చుకున్నారు. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ విజేతలకు ట్రోఫీలు అందజేశారు.



# ఇదీ ఇ-ఫార్ములా...

**దాదాపు పుష్కరకాలం క్రితం భారత్‌లో ప్రతిష్టాత్మక ఫార్ములావన్ (ఎఫ్1) రేసింగ్ వచ్చింది. మూడేళ్లు ఢిల్లీ బుద్ధ్ సర్క్యూట్‌లో కార్లు దూసుకుపోయిన తర్వాత వేర్వేరు కారణాలతో ఎఫ్1 నిర్వాహకులు భారత్ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు సరిగ్గా పదేళ్ల క్రితం అదే అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) మన దేశంలో మరో రేసింగ్ ఈవెంట్‌కు అనుమతి ఇచ్చింది. అయితే దేశంలోనే ఇతర ప్రధాన నగరాలను కాదని ఫార్ములా–ఇ రేసింగ్‌కు వేదికగా మన హైదరాబాద్‌ను ఎంచుకోవడం విశేషం. భారత్‌లో జరగబోతున్న ఈ తొలి రేస్ గత కొంత కాలంగా అన్ని వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. హుస్సేన్ సాగర్ తీరాన ఈ వారాంతంలో అలా జుమ్మంటూ రేసింగ్ కార్లు సందడి చేయనున్న నేపథ్యంలో ఇ-ఫార్ములా విశేషాలు...**

**రేసింగ్ పోటీలకు సిద్ధమైన హైదరాబాద్ • ఈ నెల 11న ప్రధాన రేసు**



సాక్షి, హైదరాబాద్: రేసింగ్ ప్రపంచంలో ఫార్ములా వన్ అన్నింటికంటే పెద్ద ఈవెంట్. ఎఫ్1 కార్లు పెట్రోల్‌తో పని చేస్తాయి. అయితే మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఇదే తరహాలో ఎలక్ట్రిక్ కార్లతో కూడా రేస్‌లు నిర్వహించేందుకు అంతర్జాతీయ ఆటోమొబైల్ సమాఖ్య (ఎఫ్ఐఏ) అధికారికంగా ముందుకొచ్చింది. కాలుష్య నివారణకు ప్రచారం కల్పించడంలో భాగంగా ఇలాంటి కార్లను ప్రోత్సహించాలనే ఉద్దేశం కూడా వీటి ప్రారంభానికి కారణం. దాంతో 2014లో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. ఇప్పుడు జరగబోతున్న ఫార్ములా–ఇ సింగిల్ సీటర్ ఎలక్ట్రిక్ కార్ రేసింగ్‌లో అన్నింటికంటే అత్యుత్తమ స్థాయి ఈవెంట్. పర్యావరణహితం అంటూ 'గో గ్రీన్' పేరుతో ఈ రేసింగ్‌లను ఆయా దేశాలు ప్రోత్సహిస్తున్నాయి.

• ఇప్పటి వరకు ఎనిమిది సీజన్లు ఫార్ములా–ఇ పోటీలను నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్నది 9వ సీజన్. ఈ సీజన్‌లో మొత్తం 16 రేస్‌లు జరగనుండగా... హైదరాబాద్‌లో నాలుగోది నిర్వహిస్తున్నారు. తొలి మూడింటికి మెక్సికో సిటీ, దిరియా (సౌదీ అరేబియా–2 రేస్‌లు) ఆతిథ్యమిచ్చాయి. కేప్‌టౌన్, సావోపాలో, బెర్లిన్, మొనాకో, జకార్తా, పోర్ట్‌లాండ్, రోమ్, లండన్‌లలో తర్వాత రేస్‌లు జరుగుతాయి.

• ఎఫ్1లో ఉండే ప్రత్యేక సర్క్యూట్‌లతో పోలిస్తే ఫార్ములా–ఇ పోటీలు అన్నింటికీ దాదాపుగా జనావాసం మధ్యలో ఉండే 'స్ట్రీట్ సర్క్యూట్'లలో నే జరుగుతాయి. హైదరాబాద్‌లో కూడా నగరం మధ్యలో హుస్సేన్‌సాగర్ తీరాన నెక్లెస్ రోడ్ వద్ద నిర్వహించేందుకు ఇదే ప్రధాన కారణం. 'గ్రీన్‌కో' సంస్థ ఈ ఈవెంట్‌కు ప్రమోటర్‌గా వ్యవహరిస్తోంది.

• ఫార్ములా–ఇ కార్ల గరిష్ట వేగం గంటకు 320 కిలోమీటర్లు. గత ఎనిమిది సీజన్లతో పోలిస్తే ఈసారి కొత్తగా జెన్3 (జనరేషన్ 3) కార్లను ఉపయోగిస్తున్నారు. జెన్ 3 బ్యాటరీలు, ఎలక్ట్రిక్ మోటార్ ఇందులో ఉంటాయి. పనితీరు, సామర్థ్యంలో ప్రస్తుత ఎలక్ట్రిక్ కార్లలో ఇవే అత్యుత్తమం. ఇందులో 40 శాతం వరకు ఎనర్జీ కేవలం బ్రేక్‌లు వాడటం ద్వారానే 'రీజనరేటివ్'తో ఉత్పత్తి అవుతుంది. రబ్బర్, రీసైకిల్డ్ ఫైబర్‌లనే టైర్ల తయారీలో వాడతారు. కాలుష్యరహితంగా, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకొనే ఈ కార్లను తయారు చేసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. చెవులు చిల్లులు పడే ఎఫ్1 కార్ల శబ్దంతో పోలిస్తే తక్కువ డెసిబుల్స్‌తో ఈ కార్లు పరుగు తీస్తాయి.

• ఫార్ములా–ఇ జట్లలో ఎక్కువ భాగం టీమ్‌లు ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థలకు చెందినవే ఉన్నాయి. భారత్‌కు చెందిన మహీంద్ర మోటార్స్ కూడా అలాంటిదే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇ–రేసింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ఎఫ్1 దిగ్గజాలైన మెక్‌లారెన్, మసెరాటి వంటి సంస్థలు కూడా ఇందులోకి అడుగు పెట్టాయి. ప్రఖ్యాత బ్రిటిష్ కంపెనీ 'జాగ్వార్' కూడా పోటీల బరిలో ఉంది.

• సాధారణ రేసింగ్ ప్రేమికుల కోణంలో ఫార్ములా–ఇ పోటీలకు ఎఫ్1 రేస్‌లతో పోలిక వస్తుంది. అయితే వీటి మధ్య ప్రస్తుతానికి పోలిక అనవసరం. అత్యుత్తమ స్థాయి సాంకేతికత వాడినా సరే, ఎఫ్1 కంటే ఇ–కార్లలో ఇంకా చాలా మార్పులు రావాల్సి ఉంది. ఉదాహరణకు ఎఫ్1 కార్ హార్స్‌పవర్ (ఇంజన్ సామర్థ్యం) 1000 ఉంటే, 'ఇ' కార్లలో ఇది 350 మాత్రమే. 'ఇ' రేస్‌లలో ఎక్కువగా ఉండే మలుపుల వల్ల కూడా వేగం తగ్గుతుంది. అయినా సరే, అభిమానులను అలరించడంతో ఒక రకంగా అంచనాకు మించి ఫార్ములా 'ఇ' పోటీలు విజయవంతం అయ్యాయి. 45 నిమిషాల నిర్విరామ వినోదం అందించడంలో ఇవి అందరికీ చేరువయ్యాయి.



### హైదరాబాద్ రేస్ విశేషాలు

వచ్చే శుక్ర, శనివారాల్లో రేస్‌లు జరుగుతాయి. శుక్రవారం, శనివారం జరిగే రెండు ఫ్రీ ప్రాక్టీస్ సెషన్‌లలో అన్ని జట్లు సాధన చేస్తాయి. శనివారం ఉదయం 10.40 నుంచి క్వాలిఫయింగ్ రేస్ నిర్వహిస్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం 3 గంటల నుంచి ప్రధాన రేసు జరుగుతుంది. సర్క్యూట్‌లో మొత్తం 17 మలుపులు ఉన్నాయి. మొత్తం 11 జట్లకు చెందిన 22 మంది డ్రైవర్లు బరిలోకి దిగుతున్నారు. భారత్‌కు చెందిన 'మహీంద్ర' టీమ్ 2014 నుంచి కూడా పోటీ పడుతుంది. ఈసారి మహీంద్ర జట్టుకు ఒలివర్ రోలండ్, ల్యూకాస్ గ్రాసి డ్రైవర్లుగా వ్యవహరిస్తున్నారు.

# తేజ్‌నారాయణ్ డబుల్ సెంచరీ

**వెస్టిండీస్ 447/6 డిక్లేర్డ్**



బులవాయో: కెరీర్‌లో ఆడుతున్న మూడో టెస్టులోనే వెస్టిండీస్ యువ క్రికెటర్ తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (467 బంతుల్లో 207 నాటౌట్; 16 ఫోర్లు, 3 సిక్స్‌లు) 'డబుల్ సెంచరీ'తో అదరగొట్టాడు. జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో ఓవర్‌నైట్ స్కోరు 221/0తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ 6 వికెట్లకు 447 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే ఆట ముగిసే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 114 పరుగులు సాధించింది.

కెప్టెన్, మరో ఓపెనర్ క్రెయిగ్ బ్రాత్‌వైట్ (312 బంతుల్లో 182; 18 ఫోర్లు)తో కలిసి తేజ్‌నారాయణ్ తొలి వికెట్‌కు 336 పరుగులు జోడించారు. వీరిద్దరు ఏకంగా 685 బంతులు ఎదుర్కోవడం విశేషం. మరో రెండు బంతులు ఆడి ఉంటే టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక బంతులు ఆడిన ఓపెనింగ్ జోడీగా వీరిద్దరు ప్రపంచ రికార్డు సృష్టించేవారు. అత్యధిక బంతులు ఆడిన ఓపెనింగ్ జోడీగా అటపట్టు–సనత్ జయసూర్య (శ్రీలంక; పాకిస్తాన్‌పై 686 బంతులు; 2000లో) పేరిట రికార్డు ఉంది.

దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ కుమారుడైన తేజ్‌నారాయణ్ డబుల్ సెంచరీ చేసిన క్రమంలో అరుదైన ఘనతలో భాగమయ్యాడు. పాకిస్తాన్‌కు చెందిన తండ్రీ, కొడుకు క్రికెటర్లు హనీఫ్ మొహమ్మద్ (337; వెస్టిండీస్‌పై 1958లో; 203 నాటౌట్; న్యూజిలాండ్‌పై 1965లో), షోయబ్ మొహమ్మద్ (203 నాటౌట్; భారత్‌పై 1989లో; 203 నాటౌట్; న్యూజిలాండ్‌పై 1990లో) తర్వాత టెస్టు క్రికెట్ చరిత్రలో 'డబుల్ సెంచరీ'లు సాధించిన తండ్రీ, కొడుకులుగా శివనారాయణ్, తేజ్‌నారాయణ్ గుర్తింపు పొందారు. గతంలో శివనారాయణ్ (203 నాటౌట్; దక్షిణాఫ్రికాపై 2005లో; 203 నాటౌట్; బంగ్లాదేశ్‌పై 2012లో) రెండు డబుల్ సెంచరీలు సాధించాడు. హనీఫ్, షోయబ్ (రెండుసార్లు) యాదృచ్ఛికంగా 203 పరుగులు చేసి అజేయంగా నిలువగా... శివనారాయణ్ కూడా రెండుసార్లు 203 పరుగులు చేసి నాటౌట్‌గా నిలువడం విశేషం.

## ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత్ పరాజయం


హర్మన్

కేప్‌టౌన్: టి20 ప్రపంచ కప్‌కు సన్నాహాల్లో భాగంగా సోమవారం జరిగిన తొలి ప్రాక్టీస్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టుకు నిరాశ ఎదురైంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా బౌలింగ్‌లో అదరగొట్టినా... పేలవ బ్యాటింగ్‌తో మూల్యం చెల్లించుకొని 44 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. మొదట ఆసీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 129 పరుగులు చేసింది. వేర్‌హమ్ (17 బంతుల్లో 32 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్సర్లు), జొనాసెన్ (14 బంతుల్లో 22 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. భారత బౌలర్లలో శిఖా, పూజ, రాధా తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 15 ఓవర్లలో 85 పరుగులకే కుప్పకూలింది. దీప్తి శర్మ (19 నాటౌట్; 3 ఫోర్లు), హర్లీన్ (12), అంజలి శర్వాణి (11) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. మిగతా 8 మంది సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.

## హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ బోణీ



బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ జట్టుకు శుభారంభం లభించింది. గత ఏడాది రన్నరప్ అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ బ్లాక్‌హాక్స్ 13–15, 15–9, 15–14, 15–11, 10–15తో విజయం సాధించింది. తొలి సెట్ కోల్పోయిన హైదరాబాద్ ఆ వెంటనే తేరుకొని వరుసగా మూడు సెట్‌లు నెగ్గి విజయాన్ని ఖరారు చేసుకుంది. నామమాత్రమైన ఐదో సెట్‌ను అహ్మదాబాద్ గెల్చుకున్నా ఊరట చెందింది. మ్యాచ్‌లో అత్యధికంగా 16 పాయింట్లు స్కోరు చేసిన హైదరాబాద్ జట్టు ఆటగాడు గురుప్రశాంత్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు. నేడు జరిగే మ్యాచ్‌లో చెన్నై బ్లిట్జ్‌తో కొచ్చి బ్లూ స్పైకర్స్ ఆడతుంది.

# సినిమా


● అల్లు అర్జున్


● ఐశ్వర్యా రాయ్


● ప్రభాస్

**అన్ని సినిమాలకూ కథ ఉంటుంది. కొన్ని సినిమాలకు పెద్ద కథ ఉంటుంది. అయితే ఆ పెద్ద కథని రెండున్నర గంటల్లో చూపించలేరు. అందుకే రెండు మూడు భాగాలుగా చూపిస్తారు. అలా ఈ ఏడాది ఇటు సౌత్ అటు నార్త్‌లో 'పార్ట్ 2' సినిమాలు చాలానే రానున్నాయి. తొలి భాగం విడుదలై, ఘనవిజయం సాధించిన నేపథ్యంలో మలి భాగంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక కొన్ని చిత్రాలైతే తొలి, మలి భాగం రెండూ ఆన్ సెట్స్‌లో ఉన్నాయి. ఈ చిత్రాల గురించి తెలుసుకుందాం.**

# ఓ పెద్ద కథ

## • రెండు సినిమాలు

హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'పుష్ప'. ఈ చిత్రం తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరులో రిలీజై సూపర్‌హిట్ అయింది. దీంతో మలి భాగం 'పుష్ప: ది రైజ్'పై మరింత ఫోకస్ పెట్టింది ఈ టీమ్. ఈ సినిమా షూటింగ్ వైజాగ్‌లో జరుగుతోంది. 'పుష్ప: ది రూల్'ను ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. మరోవైపు మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన హిస్టారికల్ ఫిల్మ్ 'పొన్నియిన్ సెల్వన్'. విక్రమ్, 'జయం' రవి, కార్తీ, ఐశ్వర్యా రాయ్, త్రిష ఈ చిత్రంలో ప్రధాన పాత్రధారులు. ఈ చిత్రం తొలి భాగం గత ఏడాది సెప్టెంబరులో విడుదలై ఘనవిజయం సాధించింది. ఆల్రెడీ షూటింగ్ కూడా పూర్తి చేసుకున్న రెండో భాగం ఈ ఏడాది ఏప్రిల్ 28న విడుదల కానుంది. అలాగే తమిళంలో 'వడ చెన్నై', 'అసురన్' వంటి సూపర్ హిట్స్‌ను అందించిన దర్శకుడు వెట్రిమారన్ ప్రస్తుతం 'విడుదలై' అనే సినిమాను తీస్తున్నారు. విజయ్ సేతుపతి, సూరి హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. రెండు భాగాలకు సంబంధించిన మేజర్ షూటింగ్ పూర్తయింది. మొదటి భాగాన్ని ఈ ఏడాది వేసవిలో, రెండో భాగాన్ని ఈ ఏడాది చివర్లో విడుదల చేయాలనుకుంటున్నారు. అదే విధంగా మరో తమిళ దర్శకుడు గౌతమ్ మీనన్ తెరకెక్కించిన తమిళ చిత్రం 'వెందు తనిందదు కాడు' (తెలుగులో 'ది లైఫ్ ఆఫ్ ముత్తు) చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. తొలి భాగం గత ఏడాది సెప్టెంబరులో విడుదలైంది. మలి భాగం రిలీజ్‌పై త్వరలో ఓ స్పష్టత రానుంది. అదే విధంగా గౌతమ్ మీనన్ దర్శకత్వంలోనే విక్రమ్ హీరోగా 'ధ్రువనక్షత్రం' అనే సినిమా తెరకెక్కింది. ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. తొలి భాగాన్ని ఈ ఏడాదిలో రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట. అటు మలయాళంలో 'రామ్' రెండు భాగాలుగా రూపొందుతోంది. మోహన్‌లాల్‌కు 'దృశ్యం', 'దృశ్యం 2' వంటి హిట్స్‌ను అందించిన జీతూ జోసెఫ్ ఈ సినిమాకు దర్శకుడు. సౌత్‌లోనే కాదు నార్త్‌లోనూ ఈ ట్రెండ్ కనిపిస్తోంది. రణబీర్ కపూర్ హీరోగా అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్రహ్మాస్త్ర'. ట్రయాలజీగా ఈ సినిమాను తీస్తున్నారు. తొలి భాగం విడుదలైన విషయం తెలిసిందే. మలి భాగం త్వరలోనే సెట్స్‌కి వెళ్లనుంది. అలాగే జాన్ అబ్రహాం హీరోగా రూపొందిన 'ఎటాక్' తొలి భాగం గత ఏడాది ఏప్రిల్‌లో రిలీజైంది. మలి భాగం రెడీ అవుతోంది. ఇవే కాదు.. రెండు భాగాల చిత్రాలు కొన్ని సెట్స్‌లో, ఇంకొన్ని చర్చల దశల్లో ఉన్నాయి.

**ప్రస్తుతం నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె', ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'సలార్' చిత్రాలు చేస్తున్నారు ప్రభాస్. ఈ చిత్రాలు రెండు భాగాలుగా విడుదల కానున్నాయని టాక్. అలాగే హీరో ఎన్టీఆర్, దర్శకుడు వెట్రిమారన్ కాంబినేషన్‌లో ఓ సినిమా ఉందనే టాక్ తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. కాగా ఈ చిత్రం రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుందని, తొలి భాగంలో ఎన్టీఆర్ హీరోగా, రెండో భాగంలో ధనుష్ హీరోగా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక సూర్య హీరోగా శివ డైరెక్షన్‌లో రూపొందుతున్న చిత్రం కూడా రెండు భాగాలుగా వస్తుందని టాక్. ఇంకా బాలీవుడ్ నిర్మాతలతో కలిసి ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, రామాయణం ఆధారంగా ఓ భారీ చిత్రాన్ని ప్లాన్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది. ఈ సినిమా రెండు భాగాలు రానుందని టాక్.**


● ధనుష్


● ఎన్టీఆర్


రణ్‌బీర్, ఆలియా


● విక్రమ్ ● ధనుష్ ● మోహన్‌లాల్

## రావణా...


● సుశాంత్, దక్ష, రవితేజ

రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నాగర్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేస్తున్నారు. అభిషేక్ నామా, రవితేజ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం మ్యూజికల్ ప్రమోషన్స్ ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా 'రావణా..' అంటూ సాగే థీమ్ సాంగ్‌ని విడుదల చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ థీమ్ సాంగ్‌ని కంపోజ్ చేయగా, పాపులర్ మ్యూజిక్ వేదిక్ బ్యాండ్ శాంతి పీపుల్, నోలిక్ ఈ థీమ్ సాంగ్‌ని ఆలపించారు. ''హై ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'రావణాసుర'. రవితేజను లాయర్ పాత్రలో చూపిస్తున్నారు సుధీర్ వర్మ. కథలో ఊహించని మలుపులుంటాయి. ఏప్రిల్ 7న మా సినిమాని విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాతలు.

## మిస్టరీ వసంతకోకిల


● బాబీ సింహా, చిరంజీవి

కమల్‌హాసన్, శ్రీదేవి జంటగా బాలు మహేంద్ర దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వసంత కోకిల'. 1982లో ఈ చిత్రం రిలీజైంది. ఇప్పుడు అదే పేరుతో ఓ సినిమా రానుంది. బాబీ సింహా, కాశ్మీర జంటగా రమణన్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'వసంత కోకిల'. రేష్మి సింహా, రజనీ తాళ్లూరి, రామ్ తాళ్లూరి నిర్మించారు. తెలుగు, తమిళ్, కన్నడలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను హీరో చిరంజీవి విడుదల చేసి, చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. కన్నడ ట్రైలర్‌ను హీరో శివరాజ్ కుమార్ లాంచ్ చేశారు. ''మిస్టరీ థ్రిల్లర్‌గా ఈ మూవీ రూపొందింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

## నారాయణ మూర్తి ప్రజా దర్శకుడు - బ్రహ్మానందం


● బ్రహ్మానందం, నారాయణమూర్తి

''ఇండస్ట్రీలో కళా దర్శకులు, వ్యాపారాత్మక దర్శకులు ఉన్నారు. కానీ, ప్రజా దర్శకుడు అంటే ఆర్. నారాయణ మూర్తి ఒక్కరే. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పాటు పడే వ్యక్తి ఆయన'' అన్నారు ప్రముఖ నటుడు బ్రహ్మానందం. ఆర్. నారాయణ మూర్తి లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. ఈ సినిమా టైటిల్ లోగోని బ్రహ్మానందం రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''ఎడ్యుకేషన్ మాఫియా, విద్యా వ్యవస్థలోని లోపాలతో నారాయణ మూర్తిగారు తీసిన ఈ చిత్రాన్ని ఆదరించాలని ప్రేక్షకులను, నా ఫ్యాన్స్‌ని కోరుతున్నాను'' అన్నారు. ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''వైజాగ్ సత్యానంద్ గారి శిష్యులు ఈ సినిమాలో నటించారు. భారతదేశంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలతో 'యూనివర్సిటీ' తీశాను. విద్య, వైద్యం ప్రైవేట్ పరం కాకుండా ప్రభుత్వమే నిర్వహించాలి. విజయనగరం పార్లకిమిడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాను.. నాకు సహకరించిన మంత్రి బొత్స సత్యనారాయణగారికి, ఇతరులకు థ్యాంక్స్'' అన్నారు.

## కవలలు హీరోలుగా...

నిజ జీవితంలో కవలలు అయిన రామకృష్ణ, హరికృష్ణ హీరోలుగా పరిచయమవుతున్నారు. తిరుపతి శ్రీనివాసరావు ఈ చిత్రం నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి శ్రీనివాసరావు మాట్లాడుతూ– ''తెలుగు ఇండస్ట్రీలో మాకంటూ ఓ స్థానం కోసం టీఎస్ఆర్ మూవీ మేకర్స్‌ని ప్రారంభించి, తొలి చిత్రానికి శ్రీకారం చుట్టాం. మా పిల్లలు రామకృష్ణ, హరికృష్ణలను ఈ చిత్రంతో పరిచయం చేస్తున్నాం. డైరెక్టర్, ఇతర వివరాలను త్వరలో చెబుతాం'' అన్నారు. ''చిన్నప్పటి నుంచి యాక్టర్స్ కావాలనే కల ఇప్పుడు నెరవేరుతోంది'' అన్నారు రామకృష్ణ, హరికృష్ణ.


● రామకృష్ణ, హరికృష్ణ

## క్రికెట్ నేపథ్యంలో...


● విశ్వ, అవంతిక, నితిన్

విశ్వ కార్తికేయ, శరణ్, అవంతిక, అర్చన గౌతమ్ హీరో హీరోయిన్లుగా సురేష్ లంకలపల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐపీఎల్'. బీరం వరలక్ష్మి సమర్పణలో అంకిత మీడియా హౌస్ బ్యానర్‌పై బీరం శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో నిర్మాత బెక్కం వేణుగోపాల్ మాట్లాడుతూ– ''చిన్న చిత్రాలు హిట్ అయినప్పుడు సంతోషంగా ఉంటుంది. 'ఐపీఎల్' మూవీ కూడా పెద్ద హిట్ కావాలి'' అన్నారు. ''క్రికెట్, తీవ్రవాదం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. సినిమా బాగా వచ్చింది.. అందరూ చూడాలని కోరుకుంటున్నాను'' అన్నారు సురేష్ లంకలపల్లి. ''మాకు సహకరించిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్'' అన్నారు బీరం శ్రీనివాస్. ''ఈ సినిమాలో పాటలు హిట్ కావడానికి కారణం మ్యూజిక్ డైరెక్టర్ వేంగి సుధాకర్'' అన్నారు విశ్వ కార్తికేయ.

**స్టాక్ మార్కెట్లు**

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▽ | నిఫ్టీ ▽ |
|---|---|
| 335 | 89 |
| 60,507 | 17,765 |

**విదేశీ సూచీలు** (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

| | | | |
|---|---|---|---|
| ● నాస్‌డాక్ | 11,899 | ▽ | 109 |
| ● డోజోన్స్ | 33,807 | ▽ | 119 |
| ● ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,837 | ▽ | 65 |
| ● డాక్స్ | 15,346 | ▽ | 131 |
| ● షాంఘై | 3,239 | ▽ | 25 |
| ● నిక్కాయ్ | 26,397 | △ | 184 |

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

**బులియన్** (రూ.లలో)

| ముంబై | |
|---|---|
| బంగారం (99.9 స్వచ్ఛత) | 57,455 |
| బంగారం (99.5 స్వచ్ఛత) | 57,225 |
| వెండి (కేజీ) | 67,606 |

**ఫారెక్స్ రేట్లు** (రూ.లలో)

| | | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 81.41 | 83.08 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 88.03 | 91.16 |
| € | యూరో | ఒకటి | 98.78 | 102.13 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఒకటి | 62.98 | 65.05 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 56.94 | 59.33 |
| S$ | సింగపూర్ డాలర్ | ఒకటి | 61.69 | 63.75 |
| SAR | సౌదీ రియాల్ | పదింటికి | 20.24 | 22.01 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | పదింటికి | 21.31 | 23.07 |
| ¥ | చైనా యువాన్ | పదింటికి | 10.26 | 12.85 |

# ఈ దఫా రేటు పెంపు పావుశాతమే!

- ఆర్‌బీఐ 'పాలసీ' భేటీ ప్రారంభం
- బుధవారం కీలక నిర్ణయాల వెల్లడి




**ముంబై:** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆరుగురు సభ్యుల ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ) పాలసీ సమీక్షా సమావేశం సోమవారం ప్రారంభమైంది. గవర్నర్ శక్తికాంతదాస్ నేతృత్వంలో జరుగుతున్న ఈ మూడు రోజుల సమావేశ కీలక నిర్ణయాలు బుధవారం వెలువడతాయి. అయితే ఈ దఫా రేటు పెంపు స్పీడ్ తగ్గే అవకాశాలు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీ రేటు– రెపో 25 బేసిస్ పాయింట్ల (0.25 శాతం) మేర పెంచే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత జరుగుతున్న మొదటి పాలసీ సమీక్ష ఇది. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, అంతర్జాతీయంగా క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతానికి ఎగసింది. విశ్లేషకుల అంచనాలు నిజమైతే ఈ రేటు తాజా పాలసీ సమీక్ష సందర్భంగా 6.50 శాతానికి చేరే అవకాశం ఉంది. అక్టోబర్ వరకూ గడచిన 10 నెలల్లో రెపో రేటు నిర్ణయానికి ప్రాతిపదిక అయిన వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ఆరు శాతంపైబడి కొనసాగిన సంగతి గమనార్హం. నవంబర్, డిసెంబర్‌లలో ఇది 6 శాతం దిగువకు చేరడం విశ్లేషకుల తాజా అంచనాల నేపథ్యం.

## సెయిల్ లేదా ఎన్‌ఎండీసీలో వైజాగ్ స్టీల్ విలీన ప్రతిపాదనలు

కేంద్ర మంత్రి కులస్తే వెల్లడి

**న్యూఢిల్లీ:** వైజాగ్ స్టీల్‌ను (ఆర్‌ఐఎన్‌ఎల్) సెయిల్, ఎన్‌ఎండీసీలో విలీనం చేయాలంటూ కేంద్ర ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు వచ్చాయి. కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి ఫగన్ సింగ్ కులస్తే ఈ విషయం తెలిపారు. ప్రస్తుతం ఆర్‌ఐఎన్‌ఎల్‌లో 4,875 మంది ఎగ్జిక్యూటివ్‌లు, 10,005 మంది నాన్–ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులు ఉన్నారని రాజ్యసభకు రాతపూర్వక సమాధానంలో ఆయన వివరించారు. కంపెనీ ఆర్థిక పరిస్థితి అంతగా బాగా లేనందున రిక్రూట్‌మెంట్‌ను క్రమబద్ధీకరించినట్లు కులస్తే పేర్కొన్నారు. పబ్లిక్ ఇష్యూ లేదా బాండ్ల జారీ ద్వారా ఆర్‌ఐఎన్‌ఎల్ నిధులు సమీకరించే యోచనేదీ లేదని తెలిపారు.

## 1.1 బిలియన్ డాలర్లు ముందస్తు చెల్లింపు

తనఖాలోని షేర్లను విడిపించుకునేందుకు అదానీ గ్రూప్ నిర్ణయం




**న్యూఢిల్లీ:** తనఖాలో ఉన్న అదానీ గ్రూప్ సంస్థల షేర్లను విడిపించుకునేందుకు ప్రమోటర్లు 1.1 బిలియన్ డాలర్లను ముందస్తుగా చెల్లించనున్నారు. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్స్ (ఏపీ సెజ్) , అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ ట్రాన్స్‌మిషన్ (ఏటీఎల్) సంస్థల షేర్లు వీటిలో ఉన్నాయి. ఇవి వచ్చే ఏడాది సెప్టెంబర్‌లో మెచ్యూర్ కానున్నాయి. ఇటీవల మార్కెట్లో తీవ్ర ఒడిదుడుకులు ఏర్పడిన నేపథ్యంలో తాజా నిర్ణయం తీసుకున్నట్లు అదానీ గ్రూప్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూప్ సంస్థల ఖాతాల్లో అవకతవకలు జరుగుతున్నాయంటూ అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో కంపెనీల షేర్లు కుప్పకూలిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రకటన ప్రకారం తనఖా ఉంచిన షేర్లకు సంబంధించి ఏపీసెజ్‌లో 12 శాతం, అదానీ గ్రీన్ ఎనర్జీలో 3 శాతం, అదానీ ట్రాన్స్‌మిషన్‌లో 1.4 శాతం ప్రమోటర్ల వాటాలను విడిపించనున్నారు.

**అదానీ ట్రాన్స్‌మిషన్ లాభం 73 శాతం అప్..**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అదానీ ట్రాన్స్‌మిషన్ లాభం దాదాపు 73 శాతం పెరిగి రూ. 478 కోట్లకు చేరింది. అమ్మకాల వృద్ధి, వన్‌టైమ్ ఆదాయం నమోదు కావడం ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ త్రైమాసికంలో లాభం రూ. 277 కోట్లు. తాజాగా ఆదాయం రూ. 2,623 కోట్ల నుంచి రూ. 3,037 కోట్లకు చేరింది.




## రిలయన్స్ హైడ్రోజన్ ట్రక్

**బెం**గళూరులో జరుగుతున్న ఇండియా ఎనర్జీ వీక్‌లో హైడ్రోజన్‌తో నడిచే ట్రక్కును రిలయన్స్ ఇండస్ట్రీస్ ప్రదర్శించింది. అశోక్ లేల్యాండ్ దీన్ని తయారు చేసింది. ఇందులో రెండు భారీ హైడ్రోజన్ సిలిండర్లు ఉంటాయి.

# సెన్సెక్స్ ర్యాలీకి బ్రేక్

- నిఫ్టీకి 89 పాయింట్ల నష్టం
- ఐటీ, మెటల్, పవర్ అమ్మకాలు
- సెంటిమెంట్‌ను దెబ్బతీసిన ఫెడ్ వడ్డీరేట్ల భయాలు
- ఎఫ్‌ఐఐల వరుస విక్రయాలు

**ముంబై:** ఐటీ, మెటల్, పవర్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో సోమవారం స్టాక్ మార్కెట్ నష్టాలతో ముగిసింది. అమెరికాలో ఉద్యోగ కల్పన మెరుగైనట్లు గణాంకాలు వెలువడ్డాయి. దీంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపుపై కఠిన వైఖరి కొనసాగించవచ్చనే ఆందోళనలు తెరపైకి వచ్చాయి. దేశీయ మార్కెట్‌లో విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు కొనసాగాయి. అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు ఆగలేదు. అధిక వెయిటేజీ రిలయన్స్(1%), ఇన్ఫోసిస్, కోటక్ మహీంద్రా, ఐసీఐసీఐ బ్యాంక్(2%), ఎంఅండ్ఎం, టాటా మోటార్స్ (2.50%) షేర్ల పతనమయ్యాయి. ఈ పరిణామాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ ఉదయం ఆరు పాయింట్లు పెరిగి 60,847 వద్ద, నిఫ్టీ 35 పాయింట్ల నష్టంతో 17,819 వద్ద మొదలయ్యాయి. ప్రతికూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా బలహీనంగా కదలాడాయి. ఒక దశలో సెన్సెక్స్ 496 పాయింట్లు పతనమై 60,346 వద్ద, నిఫ్టీ 156 పాయింట్లు క్షీణించి 17,698 వద్ద ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. చివరికి సెన్సెక్స్ 335 పాయింట్లు నష్టపోయి 60,507 వద్ద, నిఫ్టీ 89 పాయింట్లు క్షీణించి 17,765 వద్ద స్థిరపడ్డాయి. దీంతో సెన్సెక్స్ అయిదురోజుల వరుస ర్యాలీకి విరామం పడినట్లైంది. ఎఫ్ఎంసీజీ, ఫార్మా, పీఎస్‌యూ బ్యాంక్స్, రియల్టీ రంగాలకు చెందిన చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. దీంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ 0.75 శాతం, స్మాల్ క్యాప్ సూచీ అరశాతం చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1218 కోట్ల షేర్లను అమ్మేయగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1203 కోట్ల షేర్లను కొన్నారు. యూఎస్ జాబ్ డేటా అంచనాలకు మించి నమోదవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.



### రూపాయి నాలుగు నెలల్లో అతిపెద్ద పతనం



దేశీయ కరెన్సీ రూపాయి నాలుగు నెలల్లో అతిపెద్ద పతనాన్ని చవిచూసింది. ఫారెక్స్ మార్కెట్లో ఉదయం 82.35 వద్ద మొదలైంది. ట్రేడింగ్ ఆద్యంతం అమ్మకాల ఒత్తిడికి లోనై చివరికి 68 పైసలు క్షీణించి నెల కనిష్టం స్థాయి 82.76 వద్ద ముగిసింది. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలపడటం రూపాయి కోతకు కారణమయ్యాయి.

**మార్కెట్లో మరిన్ని సంగతులు**

- అదానీ గ్రూప్ షేర్లలో అమ్మకాలు తగ్గలేదు. ఈ గ్రూప్‌నకు చెందిన మొత్తం పదింటిలో 6 కంపెనీల షేర్లు నష్టపోయాయి. అదానీ ట్రాన్స్‌మిషన్స్ 10%, అదానీ టోటల్ గ్యాస్, అదానీ పవర్, అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ విల్మర్ షేర్లు 5% చొప్పున క్షీణించాయి. అయితే అదానీ పోర్ట్స్ (9.50%), అంబుజా సిమెంట్స్ (1.54%), ఏసీసీ (2.24%), ఎన్‌డీటీవీ (1.37) చొప్పున లాభపడ్డాయి. హిండెన్‌బర్గ్ నివేదిక వెల్లడి (జనవరి 24) నుంచి ఫిబ్రవరి 6 వరకు మొత్తం 9 ట్రేడింగ్ సెషన్‌లో అదానీ గ్రూప్ మార్కెట్ విలువ రూ.9.5 లక్షల కోట్లకు పైగా పతనమైంది.
- వార్షిక ప్రాతిపదికన క్యూ3లో నికర నష్టాలు తగ్గడంతో పేటీఎం షేరుకు డిమాండ్ లభించింది. బీఎస్ఈలో ఆరుశాతానికిపైగా లాభపడి రూ.558 వద్ద స్థిరపడింది. ఒకదశలో ఎనిమిది శాతం బలపడి రూ.566 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.

## టాటా స్టీల్ రూ. 2,502 కోట్ల నష్టాలు




**న్యూఢిల్లీ:** టాటా స్టీల్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏకంగా రూ. 2,502 కోట్ల నష్టాన్ని (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. వ్యయాలు గణనీయంగా పెరగడమే ఇందుకు కారణం. గత ఆర్థిక సంవత్సరం క్యూ3లో కంపెనీ రూ. 9,598 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ఇక తాజాగా ఆదాయం రూ. 60,843 కోట్ల నుంచి రూ. 57,354 కోట్లకు తగ్గింది. వ్యయాలు రూ. 48,666 కోట్ల నుంచి రూ. 57,172 కోట్లకు పెరిగాయి. కంపెనీ రుణ భారం ప్రస్తుతం రూ. 71,706 కోట్లుగా ఉంది. సమీక్షా కాలంలో రూ. 3,632 కోట్ల మొత్తాన్ని కంపెనీ పెట్టుబడి వ్యయాలపై వెచ్చించింది. ఉక్కుఉత్పత్తి 7.76 మిలియన్ టన్నుల (ఎంటీ) నుంచి 7.56 ఎంటీకి తగ్గింది. ఒడిదుడుకుల పరిస్థితులు నెలకొన్నప్పటికీ దేశీయంగా అమ్మకాల్లో స్థిర వృద్ధి సాధించగలిగామని టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ తెలిపారు. వ్యయాల నియంత్రణ, నిర్వహణను మెరుగుపర్చుకోవడంపై మరింతగా దృష్టి పెట్టుకోనున్నట్లు పేర్కొన్నారు.

## ఏటా 40 శాతం వృద్ధి

ఎలక్ట్రిక్ బస్సుల విభాగంపై స్విచ్ మొబిలిటీ సీఈవో మహేశ్ బాబు



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** ఎలక్ట్రిక్ బస్సుల విభాగం వచ్చే పదేళ్లలో ఏటా సుమారు 40% మేర వృద్ధి చెందవచ్చని అంచనా వేస్తున్నట్లు స్విచ్ మొబిలిటీ సీఈవో మహేశ్ బాబు తెలిపారు. గతేడాది 1,200 ఎలక్ట్రిక్ బస్సులు రిజిస్టర్ కాగా, ఈసారి 2,000 దాటేయొచ్చని చెప్పారు. వచ్చే ఏడాది ఇది 6,000కు చేరవచ్చని సాక్షి బిజినెస్ బ్యూరోకు వివరించారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్ బస్సు తయారీ వ్యయం సగటున రూ. 1.5 కోట్ల స్థాయిలో ఉంటోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సానుకూల పాలసీలు ఇందుకు తోడ్పడగలవని ఆయన చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల వినియోగానికి అనుగుణంగా మౌలిక సదుపాయాలను కూడా మెరుగుపర్చుకోవడంపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంటుందని మహేష్ బాబు చెప్పారు. తమ సంస్థ విషయానికొస్తే.. ఇప్పటికే 500 పైచిలుకు బస్సులు సరఫరా చేశామని, వచ్చే 12–18 నెలల్లో సుమారు 2,600 బస్సులు అందించనున్నామన్నారు. తెలంగాణకు దాదాపు 1,000 బస్సులు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులను తయారు చేస్తున్నది తమ కంపెనీ మాత్రమేనని, హెచ్‌ఎండీఏకి 6 అందిస్తున్నామని తెలిపారు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

| 7-2-2023 | |
|---|---|
| విశాఖ | 460–00 |
| చిత్తూరు | 473–00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 445–00 |
| విజయవాడ | 445–00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| **6-2-2023 ఫామ్ ధర...** | |
| హైదరాబాద్ | 415–00 |
| వరంగల్ | 417–00 |
| రిటైల్ ధర | 4.75 |

**భవిత**

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్, సికింద్రాబాద్‌లో 1793 పోస్టులు

సికింద్రాబాద్‌లోని సెంట్రల్ రిక్రూట్‌మెంట్ సెల్, ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్ సెంటర్.. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ రీజియన్లలో ట్రేడ్స్‌మ్యాన్ మేట్, ఫైర్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1793
» **పోస్టుల వివరాలు:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్–1249, ఫైర్‌మ్యాన్–544.
» **రీజియన్లు:** ఈస్టర్న్, వెస్టర్న్, నార్తర్న్, సదరన్, సౌత్ వెస్టర్న్, సెంట్రల్ వెస్ట్, సెంట్రల్ ఈస్ట్.
» **అర్హత:** ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టులకు మెట్రిక్యులేషన్, ఐటీఐ, ఫైర్‌మ్యాన్ ఖాళీలకు మెట్రిక్యులేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ట్రేడ్స్‌మ్యాన్ పోస్టులకు రూ.18,000 నుంచి రూ.56,900, ఫైర్‌మ్యాన్ ఖాళీలకు రూ.19,900 నుంచి రూ.63,200 ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఫిజికల్ ఎండ్యూరెన్స్/స్కిల్ టెస్ట్, రాతపరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన ప్రచురితమైన తేదీ నుంచి 21 రోజుల్లోగా దరఖాస్తు చేయాలి.
» **వెబ్‌సైట్:** www.aocrecruitment.gov.in

### డీఎంహెచ్‌వో, విశాఖపట్నంలో 13 పారామెడికల్ పోస్టులు

విశాఖపట్నంలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. ప్రభుత్వాసుపత్రుల్లో తాత్కాలిక/ఒప్పంద ప్రాతిపదికన పారామెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 13
» **పోస్టుల వివరాలు:** క్యాథ్ ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2–2, ప్లంబర్–1, ఆడియో మెట్రీషియన్–1, రేడియోగ్రాఫర్–2, ఆప్తాల్మిక్ అసిస్టెంట్–1, స్పీచ్ థెరపిస్ట్–3, ఈసీజీ టెక్నీషియన్–1, డెంటల్ టెక్నీషియన్–1, ఫార్మసిస్ట్ గ్రేడ్2–1.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిప్లొమా, బీఎస్సీ, డీఫార్మసీ, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విశాఖపట్నం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 07.02.2023.
» **వెబ్‌సైట్:** https://visakhapatnam.ap.gov.in

# జేఈఈ కటాఫ్ అంచనా.. 85-90!

» ముగిసిన జేఈఈ-మెయిన్ 2023 జనవరి సెషన్
» 85-90 మధ్యలో కటాఫ్ అనే అంచనాలు
» ఏప్రిల్ సెషన్‌కు నేటి నుంచే దరఖాస్తు ప్రక్రియ

**జేఈఈ-మెయిన్.. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో బీటెక్, బీఆర్క్, బీ ప్లానింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష. అంతేకాకుండా ఐఐటీల్లో బీటెక్‌లో సీటు పొందేందుకు కూడా జేఈఈ-మెయిన్‌లో అర్హత తప్పనిసరి! ఇంతటి కీలకమైన జేఈఈ-మెయిన్ 2023 తొలి సెషన్ ముగిసింది. పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో.. కటాఫ్ అంచనాపై ఆందోళన వ్యక్తమవుతోంది!! ఏప్రిల్‌లో జరిగే రెండో సెషన్‌కు హాజరు కావాలా? వద్దా? అనే సందేహాలు. ఈ నేపథ్యంలో.. జేఈఈ-మెయిన్ -2023 జనవరి సెషన్ విశ్లేషణ.. కటాఫ్ మార్కుల అంచనా.. ఏప్రిల్ సెషన్‌లో రాణించడమెలాగో తెలుసుకుందాం..**

**జే**ఈఈ–మెయిన్ జనవరి సెషన్ పరీక్షలను జనవరి 24, 25, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో రోజుకు రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించారు. జనవరి 28న మాత్రం.. రెండో షిఫ్ట్‌ను బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్), బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ కోర్సులకు నిర్దేశించిన పేపర్ 2ఏ, పేపర్ 2బీ పరీక్షలు జరిగాయి. 'జేఈఈ–మెయిన్ జనవరి సెషన్ పేపర్లు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి. పలు షిఫ్ట్‌లలో నిర్వహించిన పరీక్షల్లో కొన్ని షిఫ్ట్‌లు క్లిష్టంగా.. మరికొన్ని షిఫ్ట్‌లు ఓ మాదిరిగా ఉన్నాయి. స్కోర్లు, మార్కుల కేటాయింపులో ఎన్‌టీఏ నార్మలైజేషన్ విధానాన్ని అనుసరిస్తుంది. కాబట్టి క్లిష్టంగా ఉన్న స్లాట్లకు హాజరైన అభ్యర్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని అంటున్నారు నిపుణులు.

**తొలి షిఫ్ట్ సులభం**

జనవరి 24న నిర్వహించిన తొలి షిఫ్ట్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. ప్రశ్నలన్నీ సీబీఎస్ఈ 11, 12 తరగతుల సిలబస్ నుంచే అడిగారు. మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ సాధారణ స్థాయిలో, ఫిజిక్స్ సబ్జెక్ట్ సులభంగా ఉంది. మొత్తంగా చూస్తే తొలి షిఫ్ట్ గతేడాది కంటే కొంత తేలికగా ఉందని విద్యార్థుల అభిప్రాయం.న్యూమరికల్ టైప్ ప్రశ్నలు మాత్రం సుదీర్ఘంగా, కాలిక్యులేషన్స్ ఎక్కువగా చేయాల్సిన విధంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులకు కొంత సమయాభావ సమస్య ఎదురైంది. రెండో షిఫ్ట్‌లో కెమిస్ట్రీ క్లిష్టంగా, మ్యాథమెటిక్స్, ఫిజిక్స్ ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నాయి.

**రెండో రోజు**

జనవరి 25న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ ఓ మోస్తరు క్లిష్టతతో, ఫిజిక్స్ సులభంగా ఉన్నాయని అంటున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీలలో అసెర్షన్స్ అండ్ రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడిగారు. అదే విధంగా ఫార్ములా బేస్డ్ కొశ్చన్స్‌కు, న్యూమరికల్ బేస్డ్ కొశ్చన్స్‌కు ప్రాధాన్యం కనిపించింది. రెండో షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఉండడమే కాకుండా.. ఇనార్గానిక్ కెమిస్ట్రీ నుంచి కొన్ని ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్ ఓ మోస్తరు క్లిష్టతతో ఉండగా.. న్యూమరికల్ టైప్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి.

**మూడో రోజు.. సుదీర్ఘం**

జనవరి 29న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో.. ప్రశ్నలు సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే విధంగా ఉన్నాయి. ముఖ్యంగా మ్యాథమెటిక్స్‌లో ప్రశ్నలు కాలిక్యులేషన్ ఆధారంగా సమాధానాలు ఇవ్వాల్సిన విధంగా అడిగారు. కెమిస్ట్రీ ప్రశ్నలు సులభంగా ఉండడమే కాకుండా.. ఆర్గానిక్ కెమిస్ట్రీకి ఎక్కువ వెయిటేజీ కనిపించింది. దాదాపు 12 ప్రశ్నలు ఈ విభాగం నుంచే అడిగారు. ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉండడం విద్యార్థులకు కలిసొచ్చిన అంశంగా పేర్కొనొచ్చు. రెండో షిఫ్ట్‌లో.. మ్యాథమెటిక్స్ క్లిష్టంగా, కెమిస్ట్రీ, ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి.

**నాలుగో రోజు**

జనవరి 30న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో..మ్యాథమెటిక్స్ ఓ మోస్తరు క్లిష్టతతో ఉంది. అల్జీబ్రా, కాలిక్యులస్, పారాబోలా, ఎలిప్స్, డెఫినిట్ ఇంటెగ్రల్స్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, మాత్రికలు చాప్టర్లకు వెయిటేజీ లభించింది. ప్రశ్నలు మాత్రం సుదీర్ఘ సమాధానాలు ఇచ్చేలా.. కాలిక్యులేషన్ అవసరమయ్యేలా ఉన్నాయి. ఫిజిక్స్‌లో కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, హీట్ అండ్ థర్మో డైనమిక్స్, రే ఆప్టిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఎలక్ట్రోస్టాటిక్స్, ఏసీ సర్క్యూట్స్, మోడ్రన్ ఫిజిక్స్, కమ్యూనికేషన్ సిస్టమ్స్, కెపాసిటర్స్ అంశాలకు వెయిటేజీ కనిపించింది. కెమిస్ట్రీలో ఫిజికల్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించింది. అదే విధంగా ఎన్విరాన్‌మెంటల్ కెమిస్ట్రీ నుంచి ఆరు ప్రశ్నల వరకు అడిగారు. రెండో షిఫ్ట్‌లో.. సీబీఎస్ఈ 11వ తరగతి చాప్టర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. మ్యాథమెటిక్స్‌లో.. కాలిక్యులస్, కోఆర్డినేట్ జామెట్రీ, వెక్టార్స్ అండ్ 3డీ, అల్జీబ్రాలకు ప్రాధాన్యం కనిపించింది. ఫిజిక్స్‌లో సీబీఎస్ఈ 12వ తరగతి అంశాలకు ప్రాధాన్యం కనిపించింది. ప్రశ్నల క్లిష్టత స్థాయి ఓ మోస్తరుగా ఉంది. కెమిస్ట్రీలో సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే ప్రశ్నలు ఎదురయ్యాయి.న్యూమరికల్ బేస్డ్ ప్రశ్నలలో అధిక శాతం ప్రశ్నలు ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి అడిగారు.

**అయిదో రోజు**

జనవరి 31న నిర్వహించిన తొలి షిఫ్ట్‌లో.. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కొంత తికమకకు గురిచేసేలా ఉన్నాయి. కాలిక్యులేషన్ ఆధారంగా సమాధానాలు ఇచ్చేలా ఉన్నాయి. ఫిజిక్స్ ప్రశ్నలు సులభంగా ఉన్నాయి. సెమీ కండక్టర్స్, మోడ్రన్ ఫిజిక్స్, ఈఎం వేవ్స్, మ్యాగ్నటిక్ ఫీల్డ్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఇండక్షన్‌కు ఎక్కువ వెయిటేజీ కనిపించింది. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించిందని విద్యార్థులు పేర్కొంటున్నారు. రెండో షిఫ్ట్‌లో..అన్ని సబ్జెక్ట్‌లలోనూ సుదీర్ఘ సమాధానాలు ఇవ్వాల్సిన ప్రశ్నలు ఎదురయ్యాయి. మ్యాథమెటిక్స్ ప్రశ్నలు కాలిక్యులేషన్ అవసరమైనవిగా ఉండడంతో సమయాభావ సమస్య ఎదురైంది. కెమిస్ట్రీలో ప్రశ్నలు కూడా ఓ మోస్తరు క్లిష్టతతో అడిగారు. ఫిజిక్స్ మాత్రం సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మెకానిక్స్, వేవ్స్, మోడ్రన్ ఫిజిక్స్‌లకు కొంత ఎక్కువ ప్రాధాన్యం కనిపించింది. ప్రశ్నలన్నీ ఫార్ములా బేస్డ్‌గా ఉండడంతో విద్యార్థులు సులభంగా సమాధానాలు ఇవ్వగలిగారని నిపుణులు అంటున్నారు.




**చివరి రోజు.. సులభంగా**

చివరి రోజు ఫిబ్రవరి 1న నిర్వహించిన మొదటి షిఫ్ట్ సులభంగా ఉందనే అభిప్రాయం వ్యక్తమైంది. మ్యాథమెటిక్స్‌లో మాత్రం కొంత సుదీర్ఘ సమాధానాలు ఇచ్చే ప్రశ్నలు కనిపించాయి. కెమిస్ట్రీలో ఇనార్గానిక్ కెమిస్ట్రీకి వెయిటేజీ లభించింది. ఫిజిక్స్‌లో మోడ్రన్స్ ఫిజిక్స్ నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. రెండో షిఫ్ట్‌లో.. ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో అడిగారు. మ్యాథమెటిక్స్‌లో ఫార్ములా బేస్డ్ ప్రశ్నలకు ప్రాధాన్యం కనిపించింది. అదే విధంగా సీబీఎస్ఈ 12వ తరగతి చాప్టర్ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారు. ఫిజిక్స్‌లో ఫార్ములా బేస్డ్, కాన్సెప్ట్ ఆధారిత కొశ్చన్స్ అడిగారు.

**ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే**

మొత్తంగా అన్ని షిఫ్ట్‌లను పరిగణనలోకి తీసుకుంటే..దాదాపు ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను ఆధారంగా చేసుకునే అడిగారు. దీంతో స్టేట్ బోర్డ్ విద్యార్థుల కంటే సీబీఎస్ఈ విద్యార్థులకు కొంత కలిసొచ్చే అవకాశం ఉందంటున్నారు.

**సమయాభావం సమస్యగా**

జేఈఈ–మెయిన్ జనవరి సెషన్‌లో.. అన్ని షిఫ్ట్‌ల విద్యార్థులు సమయాభావ సమస్యను ఎదుర్కొన్నట్లు చెబుతున్నారు. అన్ని షిఫ్ట్‌లలోనూ మ్యాథమెటిక్స్‌లో న్యూమరికల్ టైప్ ప్రశ్నలకు సమాధానం ఇచ్చేందుకు అభ్యర్థులకు కొంత ఎక్కువ సమయం పట్టింది. దీంతో ఇది మిగతా ప్రశ్నలకు సమాధానాలు గుర్తించడంపై ప్రభావం చూపిందంటున్నారు. ప్రశ్నలన్నీ గత రెండేళ్లలో ఆయా విభాగాల్లో అడిగిన కాన్సెప్ట్‌ల మాదిరిగానే ఉన్నాయని అంటున్నారు. ప్రీవియస్ పేపర్లను సాధన చేసిన వారు తేలిగ్గా సమాధానాలు ఇచ్చే ఆస్కారం లభించిందని పేర్కొంటున్నారు. కెమిస్ట్రీలో ఆర్గానిక్ కెమిస్ట్రీకి కొంత ఎక్కువ వెయిటేజీ కల్పించారనే భావన నెలకొంది.

**ఫార్ములా, అప్లికేషన్ బేస్డ్**

మొత్తంగా చూస్తే జేఈఈ–మెయిన్ తొలి సెషన్‌లోని అన్ని షిఫ్ట్‌లలోనూ ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించిన ప్రశ్నలన్నీ ఫార్ములా బేస్డ్‌గా, అప్లికేషన్ ఆధారితంగా ఉన్నాయని సబ్జెక్ట్ నిపుణులు అంటున్నారు. ప్రిపరేషన్ సమయంలో కాన్సెప్ట్స్‌ను ఆధారంగా చేసుకుంటూ ప్రశ్నలు సాధన చేసిన వారు సమాధానాలు గుర్తించే విధంగా ఉన్నాయని చెబుతున్నారు.

**కటాఫ్ పర్సంటైల్.. 85-90**

జేఈఈ–మెయిన్ తొలి సెషన్‌లో కటాఫ్ జనరల్ కేటగిరీకి 85 నుంచి 90; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కి 60–65; ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులకు 30–40గా ఉండొచ్చని పేర్కొంటున్నారు. గత ఏడాది కటాఫ్ జనరల్‌లో 88.4121, ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 63.1114, ఓబీసీ కేటగిరీలో 67.0090, ఎస్సీ కేటగిరీలో 43.0820, ఎస్టీ కేటగిరీలో 26.7771లుగా ఉన్న సంగతి తెలిసిందే.

**రెండో సెషన్‌కు హాజరు కావాలా?**

జేఈఈ–మెయిన్ 2023 తొలి సెషన్ ముగిసిన నేపథ్యంలో.. ఏప్రిల్‌లో నిర్వహించే రెండో సెషన్‌కు హాజరు కావాలా? వద్దా? అనే సందేహం విద్యార్థుల్లో వ్యక్తమవుతోంది. తొలి సెషన్‌లో ఆశించిన మేర మార్కులు వస్తాయనుకునే అభ్యర్థులు అడ్వాన్స్‌డ్‌పై దృష్టి పెట్టాలని.. అదే ప్రిపరేషన్‌తో ఏప్రిల్ సెషన్ జేఈఈ–మెయిన్‌కు కూడా హాజరు కావచ్చొని సూచిస్తున్నారు. అంతేకాకుండా.. జేఈఈ మెయిన్‌లోని మూడు సబ్జెక్ట్‌ల్లోని.. ప్రతి సబ్జెక్ట్‌లో గరిష్ఠంగా 18 నుంచి 20 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇచ్చి.. 85 పర్సంటైల్ వస్తుందనే ధీమా ఉన్న అభ్యర్థులు రెండో సెషన్ గురించి ఆలోచించకుండా.. అడ్వాన్స్‌డ్‌కు సన్నద్ధమవ్వాలని సూచిస్తున్నారు.

**రెండో సెషన్ కోసం**

- తొలి సెషన్‌లో ప్రదర్శనను స్వీయ విశ్లేషణ చేసుకుంటూ.. రెండో సెషన్‌కు సన్నద్ధం కావాలి.
- తాము చేసిన పొరపాట్లు, ఏ టాపిక్స్‌కు సంబంధించిన అంశాల్లో సమాధానాలు రాయలేదో.. వాటిపై దృష్టి పెట్టాలి.
- ఆయా అంశాల్లో పట్టు సాధించేందుకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను చదవాలి. అదే విధంగా ప్రతి రోజు పునశ్చరణకు తప్పనిసరిగా నిర్దిష్ట సమయం కేటాయించుకోవాలి.

**బోర్డ్ పరీక్షలకు తొలి ప్రాధాన్యం**

ఎన్‌టీఏ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం-జేఈఈ-మెయిన్ రెండో సెషన్.. ఏప్రిల్ ఆరు నుంచి 12వ తేదీ వరకు జరగనుంది. అంటే.. విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఇప్పటి నుంచి రెండు నెలల సమయం అందుబాటులో ఉంది. మరోవైపు మార్చిలో బోర్డ్ పరీక్షలు జరుగనున్నాయి. కాబట్టి ప్రస్తుతం విద్యార్థులు బోర్డ్ పరీక్షలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఆ తర్వాత సమయాన్ని ఏప్రిల్‌లో జరిగే మెయిన్ పరీక్షకు కేటాయించాలి.

**ఏప్రిల్ సెషన్.. ముఖ్యమైన టాపిక్స్**

- **మ్యాథమెటిక్స్:** 3–డి జామెట్రీ; కో ఆర్డినేట్ జామెట్రీ; వెక్టార్ అల్జీబ్రా; ఇంటిగ్రేషన్; కాంప్లెక్స్ నెంబర్స్; పారాబోలా; ట్రిగ్నోమెట్రిక్ రేషియోస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే విధంగా క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, థియరీ ఆఫ్ ఈక్వేషన్స్; పెర్ముటేషన్ అండ్ కాంబినేషన్, బైనామియల్ థీరమ్, లోకస్.
- **ఫిజిక్స్:** కైనమాటిక్స్, హార్మోనిక్ మోషన్స్, గ్రావిటేషన్, హీట్ అండ్ థర్మో డైనమిక్స్, వేవ్స్ అండ్ సౌండ్స్, మ్యాగ్నటిక్స్, ఎలక్ట్రో మ్యాగ్నటిక్ ఇండక్షన్, ఎలక్ట్రో స్టాటిక్స్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, ఆప్టిక్స్, మోడ్రన్ ఫిజిక్స్.
- **కెమిస్ట్రీ:** జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆల్కైల్స్, యాసిడ్స్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. అదే విధంగా కెమికల్ బాండింగ్, పీరియాడిక్ టేబుల్, బ్రేకింగ్‌ల మూలాలుగా ఉంటాయి. దీనికి అనుగుణంగా అభ్యర్థులు మోల్ కాన్సెప్ట్, కోఆర్డినేషన్ కెమిస్ట్రీ, ఆల్కహాల్, ఫినాల్స్, ఈథర్స్, పి–బ్లాక్ ఎలిమెంట్స్, అటామిక్ స్ట్రక్చర్, గ్యాసియస్ స్టేట్, ఆల్డిహైడ్స్ అండ్ కీటోన్స్, జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, డి అండ్ ఎఫ్ బ్లాక్ ఎలిమెంట్స్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి.

**ఏప్రిల్ సెషన్ ముఖ్య తేదీలు**

- **ఆన్‌లైన్ దరఖాస్తు తేదీలు:** ఫిబ్రవరి 7 – మార్చి 7, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్:** మార్చి చివరి వారంలో
- **రెండో సెషన్ పరీక్ష తేదీలు:** 2023 ఏప్రిల్ 6 నుంచి 12 వరకు (ప్రతి రోజు రెండు షిఫ్ట్‌లలో)
- **పూర్తి వివరాలకు, ఆన్‌లైన్ దరఖాస్తుకు వెబ్‌సైట్:** jeemain.nta.nic.in


బాపట్ల జిల్లా కొండుబొట్లపాలెంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి, ఎమ్మెల్యే కోన రఘుపతి


శ్రీకాకుళం జిల్లా గరుడఖండిలో ప్రజలకు పథకాలను వివరిస్తున్న మంత్రి అప్పలరాజు

గడప గడపకు మన ప్రభుత్వం


వైఎస్సార్ జిల్లా కడపలో వృద్ధుడితో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


ప్రకాశం జిల్లా పేర్నమిట్ట 43వ డివిజన్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌బాబు

## ఏపీ ఇన్ పార్లమెంట్

లోక్‌సభ

### ఏపీలో 14 జిల్లాల్లో జేఎన్‌వీల్లేవు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఏర్పాటైన, ఇప్పటివరకు కవర్ అవని 14 జిల్లాల్లో జవహర్ నవోదయ విద్యాలయాలు (జేఎన్‌వీలు) లేవని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. లోక్‌సభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు.

### 2020-21లో సీఎస్‌ఆర్ ఖర్చు రూ.715.81 కోట్లు

ఏపీలో 2020–21లో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) కింద రూ.715.81 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి రావు ఇందర్‌జిత్‌సింగ్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు భరత్‌రామ్, చంద్రశేఖర్, ఎం.వి.వి.సత్యనారాయణ ప్రశ్నకు సమాధానమిచ్చారు.

### రూ.689 కోట్లు విడుదల చేస్తాం

ఆంధ్రప్రదేశ్‌కు జీఎస్టీ పరిహారం నిమిత్తం ఏప్రిల్–జూన్ 2022 కాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.689 కోట్లు విడుదల చేస్తామని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. ఈ మొత్తం నెలవారీసెస్ వసూలు బదిలీ, క్రెడిట్ పరిహారనిధి నుంచి విడుదల చేస్తామని వైఎస్సార్ సీపీ ఎంపీ బాలశౌరి ప్రశ్నకు జవాబిచ్చారు.

### ఈ-శ్రమ్ పోర్టల్‌లో 79,07,981 మంది నమోదు

అసంఘటితరంగ కార్మికుల నిమిత్తం తీసుకొచ్చిన ఈ–శ్రమ్ పోర్టల్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 79,07,981మంది నమోదు చేసుకున్నట్లు కేంద్ర కార్మిక, ఉపాధిశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు సమాధానమిచ్చారు.

### ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయమంత్రి అశ్వినికుమార్ చౌబే తెలిపారు. ప్లాస్టిక్ ప్యాకింగ్ ఉపయోగిస్తున్న గుట్కా/పాన్‌మసాలా, సిగరెట్ ఉత్పత్తిదారులకు హెచ్చరిక ఆదేశాలు జారీచేశామని వైఎస్సార్‌సీపీ ఎంపీలు బి.వి.సత్యవతి, కోటగిరి శ్రీధర్, పోచ బ్రహ్మానందరెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

### షెల్ కంపెనీలపై చర్యలకు స్పెషల్ డ్రైవ్



కేంద్ర ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ చేపట్టిందని కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి చెప్పారు. వరుసగా రెండు ఆర్థిక సంవత్సరాలకు ఆర్థిక నివేదికలు లేదా వార్షిక రిటర్న్‌లను దాఖలు చేయని కంపెనీలను చట్టం ప్రకారం తొలగిస్తామని, అలా గత మూడేళ్లలో 1,27,952 కంపెనీలను తొలగించామని వైఎస్సార్‌సీపీ ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రశ్నకు జవాబిచ్చారు.

రాజ్యసభ

### 2026 నాటికి పోలవరం హైడ్రోపవర్ ప్రాజెక్ట్

- రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టులో భాగంగా రూ.5,338 కోట్లతో చేపట్టిన 960 మెగావాట్ల హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2026 జనవరి నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో) తెలిపిందని కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ తెలిపారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. ఏపీజెన్‌కో ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోందని చెప్పారు. ఏపీజెన్‌కో ఇచ్చిన సమాచారం ప్రకారం ప్రాజెక్టు పవర్‌హౌస్ పునాది నిర్మాణానికి తవ్వకాల పనులు పూర్తయ్యాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిగా ఏపీ ప్రభుత్వం సొంత నిధులతోనే అమలు చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం నిధులేమీ కేటాయించడం లేదని చెప్పారు.

**ఆ ప్రతిపాదనలు వచ్చాయి**

విశాఖ ఉక్కును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ లేదా నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని రాజకీయ పార్టీల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని కేంద్ర ఉక్కుశాఖ సహాయమంత్రి ఫగ్గన్ సింగ్ కులస్తే తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ప్రభుత్వ బాండ్ల జారీ, ఇనిషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా నిధుల సేకరణ వంటి ప్రణాళికలేమీ లేవని చెప్పారు.

**8 లింకు ప్రాజెక్టులకు డీపీఆర్ పూర్తి**

దేశంలో నదుల అనుసంధానం ప్రక్రియలో భాగంగా గుర్తించిన మొత్తం 30 లింకుల్లో 8 లింకు ప్రాజెక్టులకు సంబంధించి సవివర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) పూర్తయ్యాయని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయమంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. మరో 24 లింకు ప్రాజెక్టులకు సంబంధించి ఫిజిబిలిటీ (సాధ్యాసాధ్యాల) నివేదికలు కూడా పూర్తయినట్లు చెప్పారు.నదుల అనుసంధాన ప్రాజెక్టు అమలు కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్రాలు 40 శాతం భరించాల్సి ఉంటుందని, ఈ నిర్ణయంలో మార్పులేదని స్పష్టం చేశారు.

### ఏపీ ప్రభుత్వం కోరితే



నెల్లూరు జిల్లాలోని దగదర్తి ఎయిర్‌స్ట్రిప్ ఉడాన్ స్కీంలో లేదని కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి వి.కె.సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఏపీ ప్రభుత్వం కోరితే భవిష్యత్తులో ఎయిర్‌లైన్స్ బిడ్డింగ్ నిమిత్తం ఉడాన్‌లో చేర్చడానికి అవకాశం ఉందని తెలిపారు.

### వరదలతోనే పోలవరం ఆలస్యం

గోదావరి నదికి 2020, 2022 సంవత్సరాల్లో భారీ వరదలు రావడంతో పోలవరం ప్రాజెక్టు ఆలస్యం అవుతోందని కేంద్ర జల్‌శక్తి శాఖ సహాయ మంత్రి బిశ్వేశ్వర్ తుడు తెలిపారు. ప్రస్తుత లక్ష్యం ప్రకారం 2024 మార్చికల్లా ప్రాజెక్టు పూర్తికావాలని, మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని చెప్పారు. టీడీపీ సభ్యుడు రవీంద్రకుమార్ ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. మొత్తంగా ప్రాజెక్టు పనులు 78.99 శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఏప్రిల్ 2014 నుంచి డిసెంబరు 2022 వరకు పోలవరం ప్రాజెక్టుపై రూ.16,035.88 కోట్లు వ్యయం అయిందని రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందన్నారు. పీపీఏ కోసం కేటాయించిన మొత్తాన్ని మినహాయించి 2014 ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు అర్హత కలిగిన రూ.13,226.04 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. రూ.2,390.27 కోట్ల బిల్లులు పీపీఏ అర్హత పొందలేదని, రూ.548.38 కోట్ల బిల్లుల్ని పీపీఏ పరిశీలిస్తోందని వివరించారు.

## గీతదాటితే మోతే

### రహదారులపై నిబంధనలు ఇక కచ్చితంగా అమలు

- భారీ వాహనాలు ఎడమవైపు లైన్లోనే వెళ్లాలి
- తొలిసారి అతిక్రమిస్తే రూ.500 ఫైన్
- తరువాత ప్రతిసారికి రూ.వెయ్యి జరిమానా



సాక్షి, అమరావతి: 'లైనే కదా అని దాటితే.. జరిమానా మోత మోగుతుంది..' అంటోంది జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ). హైవేలపై నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణించే వాహనాలపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తోంది. హైవేలతోపాటు రాష్ట్ర ప్రధాన రహదారులపై కూడా ఈ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. మార్కింగ్ లైన్లు దాటి వాహనాలు ప్రయాణిస్తుండటంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని ఈ నిర్ణయం తీసుకుంది. 2022లో హైవేలపై భారీ వాహనాలు మార్కింగ్ లైన్లు దాటి ప్రయాణించడంతో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో 8,200 మంది దుర్మరణం చెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదాల నివారణపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ప్రధానంగా భారీ వాహనాలు మార్కింగ్ లైన్లు దాటి ప్రయాణిస్తుండటం ప్రమాదాలకు దారితీస్తోందని గుర్తించారు. మార్కింగ్ లైన్లు దాటి ప్రయాణించే వాహనాలపై ఎన్‌హెచ్‌ఏఐ భారీ జరిమానాలను ఖరారుచేసింది. భారీ వాహనాలు కచ్చితంగా హైవేలపై ఎడమలైన్‌లోనే ప్రయాణించాలి. ముందు నెమ్మదిగా వెళుతున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయాల్సి వస్తే తప్ప లైన్ దాటడానికి వీల్లేదు. అలా ఓవర్‌టేక్ చేసిన వెంటనే మళ్లీ ఎడమవైపు లైన్‌లోకి వచ్చేయాలి. అలాకాకుండా ఒక 200 మీటర్లకు మించి ఎడమవైపు లైన్‌ను దాటి ప్రయాంచే భారీ వాహనాలపై తొలిసారి రూ.500 జరిమానా విధిస్తారు. అదే వాహనం తరువాత లైన్ క్రాస్‌చేస్తే ప్రతిసారికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తారు.

### నిబంధనలు పాటించేలా..

భారీ వాహనాలు కచ్చితంగా నిబంధనలను పాటించేలా హైవే పెట్రోలింగ్ అధికారులు కన్నేసి ఉంచాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది గుర్తించిన వాహనాలతోపాటు హైవేలపై ఇప్పటికే ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, టోల్‌గేట్ల వద్ద సీసీ కెమెరాల ఫుటేజీలను తరచూ పరిశీలించి నిబంధనలను ఉల్లంఘించే వాహనాలపై జరిమానాలు విధిస్తారు. రాష్ట్ర రహదారులపైన కూడా ఈ నిబంధనలను కచ్చితంగా పాటించేలా చూడాలని కేంద్ర రవాణాశాఖ రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. అందుకుగాను రాష్ట్ర ప్రధాన రహదారులపై వాహనచోదకులకు మార్గనిర్దేశం చేసేలా సైన్ బోర్డులు, లైన్ మార్కింగులు కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి కొత్త జరిమానాల విధానం అమలు చేయాలని చెప్పింది. ఈ లోపు రాష్ట్ర ప్రధాన రహదారులపై సైన్ బోర్డులు, లైన్ మార్కింగ్‌లు పూర్తిచేయాలని సూచించింది.

## రాజధానిపై 23న విచారణ

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అంశంపై దాఖలైన పిటిషన్లను ఈ నెల 23న విచారిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ పిటిషన్లు త్వరగా విచారించాలని సోమవారం జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్నలతో కూడిన ధర్మాసనం ముందు ఏపీ ప్రభుత్వ సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ప్రస్తావించారు. కోర్టు నోటీసులు ఇటీవలే అందాయని కౌంటరు దాఖలుకు రెండు వారాల సమయం కావాలని రైతులు, ఇతర ప్రతివాదులు ధర్మాసనాన్ని కోరారు. అనంతరం విచారణ ఈ నెల 23న చేపడతామని, ఈలోగా ప్రతివాదులు కౌంటరు, ప్రభుత్వం రిజాయిండర్ దాఖలు చేయాలని ధర్మాసనం పేర్కొంది.

## ఏయూ విద్యార్థినికి భారీ ఆఫర్

- రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో 'అట్లాషియన్'కు ఎంపికైన ఈశ్వరీ ప్రియ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం(ఏయూ) ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని రేపాక ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో అట్లాషియన్ సంస్థలో ఉద్యోగం సాధించారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో మూడో సంవత్సరం చదువుతుండగానే భారీ వేతనంతో ఉద్యోగానికి ఎంపికైన ఈశ్వరీ ప్రియను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు. విశాఖ నగరానికి చెందిన ఈశ్వరీ ప్రియ తన ప్రతిభతో తొలుత మోర్గాన్‌స్టాన్లీ సంస్థలో ఇంటర్న్‌షిప్ సంపాదించింది. అక్కడ రూ.87 వేల స్టైపెండ్ అందుకుంది. అనంతరం అమెజాన్ సంస్థ నిర్వహించిన కోడింగ్ పరీక్షలోనూ ప్రతిభ చూపి.. ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యింది. అక్కడ నెలకు రూ.1.4 లక్షలు అందుకుంటోంది. తాజాగా రూ.84.5 లక్షల భారీ వార్షిక వేతనంతో అట్లాషియన్ సంస్థలో ఉద్యోగం సంపాదించింది. దీనిపై ఈశ్వరీ ప్రియతో పాటు ఆమె తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఏయూ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 1,040 మందికి పైగా ఉద్యోగాలు సంపాదించారని ప్లేస్‌మెంట్ అధికారి మూర్తి తెలిపారు. త్వరలో మరిన్ని సంస్థలు నియామకాలు చేపట్టనున్నాయని.. ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## దేశంలో బీజేపీ సంక్షేమ పథకాలే అధికం

- జనసేనతో కలిసే ఎన్నికలకు వెళ్తాం: సోము వీర్రాజు

ఆదోని అర్బన్ (కర్నూలు): దేశంలో బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే అధికమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు అన్నారు. సోమవారం అసెంబ్లీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి వచ్చిన ఆయన ఆదోనిలో విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల్లో ఏపీలో జనసేన పార్టీతో కలిసి పోటీ చేస్తామని సోమువీర్రాజు స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో రాజధాని నిర్మాణానికి ప్రత్యేకంగా రూ.6,500 కోట్లను కేంద్రం మంజూరు చేసిందన్నారు. అయితే గత టీడీపీ ప్రభుత్వం సకాలంలో వివిధ రకాల పనులను పూర్తి చేయలేదని చెప్పారు. కర్నూలులో హైకోర్టు ఏర్పాటుకు బీజేపీ సానుకూలమని ప్రకటించారు. బీజేపీ జాతీయ నాయకుడు పార్థసారథి, జిల్లా అధ్యక్షుడు రామస్వామి, రాష్ట్ర నాయకులు విట్టా రమేష్, కునిగిరి నీలకంఠ, రంగారెడ్డి పాల్గొన్నారు.

## వైద్య కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.756 కోట్లు

- పరిపాలన అనుమతులు జారీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 630 పీజీ సీట్ల పెంపునకు అనుగుణంగా రూ.756 కోట్లతో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూ.756 కోట్లలో 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. ఈ నిధులతో పీజీ వైద్యులకు హాస్టళ్లు, అదనపు తరగతి గదులు, వైద్య కళాశాలల్లో అవసరమైన ఇతర నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన చేపడతారు. కాగా 11 వైద్య కళాశాలల్లో 688 పీజీ సీట్ల పెంపునకు వైద్య శాఖ ప్రతిపాదించగా 630 సీట్లను పెంచడానికి కేంద్రం ఆమోదం తెలిపింది. అత్యధికంగా ఆంధ్రా వైద్య కళాశాలలో 128, ఒంగోలులో 79, తిరుపతిలో 75 చొప్పున పీజీ సీట్లు సమకూరనున్నాయి. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ వంటి వివిధ విభాగాల్లో క్లినికల్, నాన్ క్లినికల్ స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ పీజీ సీట్లు ఉంటాయి.

**1,177కి చేరిన పీజీ సీట్లు..**

రాష్ట్ర ప్రభుత్వం వైద్య విద్యలో విప్లవాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. నాడు-నేడు కింద దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తోంది. వీటిలో ఐదు వైద్య కళాశాలల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అడ్మిషన్లు ప్రారంభం కానున్నాయి. మరోవైపు ప్రస్తుతం ఉన్న వైద్య కళాశాలల బలోపేతానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో గత మూడున్నరేళ్లలో 207కు పైగా పీజీ సీట్లు సమకూరాయి. 2019కి ముందు వరకు రాష్ట్రంలో 970 పీజీ సీట్లే ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వైద్య విద్య విభాగంలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఖాళీలను భర్తీ చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 11 వైద్య కళాశాలల్లో పీజీ సీట్లు 1,177కు చేరాయి.


## రైల్వే ప్రాజెక్టులపై కేంద్రం సాకులు

- నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టుపై పాత ఒప్పందాన్ని మార్చాలి
- విభజన హామీలపై పార్లమెంటులో నిలదీస్తాం.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు శ్రీకృష్ణదేవరాయలు, గురుమూర్తి



సాక్షి, న్యూఢిల్లీ: రైల్వే ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు నిధులు ఇవ్వడం లేదని కేంద్రం సాకులు చెబుతోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, మద్దిళ్ల గురుమూర్తి విమర్శించారు. విభజనకు ముందుమంజూరైన వాటి గురించే కేంద్రం ప్రస్తావిస్తోందని, విభజన తర్వాత రాష్ట్ర ఆర్థికస్థితి దృష్టిలో ఉంచుకుని మాట్లాడడం లేదని చెప్పారు. ఢిల్లీలోని ఏపీభవన్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తామని ప్రకటించిన హామీలను నెరవేర్చాలని పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో గట్టిగా డిమాండ్ చేస్తామన్నారు. ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ రైల్వేపరంగా బడ్జెట్‌లో రాష్ట్రానికి ఈసారి కేటాయించామని చెబుతున్న రూ.8,500 కోట్లను ఏ విధంగా ఖర్చు చేస్తుందో రైల్వేశాఖ వివరంగా చెప్పాలని కోరారు. విభజన తర్వాత పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టులపై మళ్లీ చర్చించి రాష్ట్ర వాటా విషయంలో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. దీనిపై పార్లమెంటులో గట్టిగా ప్రశ్నిస్తామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జాతీయ రహదారిపైకి అరగంటలో చేరుకునేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని, దీనికనుగుణంగానే ఎక్కువ జాతీయ రహదారులను మంజూరు చేయించుకోగలిగామని పేర్కొన్నారు. ప్రాధాన్యమైన నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైనుపై కేంద్ర, రాష్ట్రాల మధ్య 2014కు ముందు కుదిరిన ఒప్పందాన్నే ఇప్పుడూ కొనసాగించాలనడం సరికాదని ఆయన చెప్పారు. ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మిక నగరమైన తిరుపతి బస్టాండును రూ.500 కోట్లతో మోడల్ బస్టాండులా రూపొందించే ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తిరుపతిలో రోప్‌వే సాధ్యాసాధ్యాలపై అధ్యయనానికి ప్రతిపాదించామని తెలిపారు. శ్రీకాళహస్తిలో రోప్‌వేకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. తిరుపతిలో కేంద్ర ఫోరెన్సిక్ విశ్వవిద్యాలయం సాకారమయ్యే అవకాశముందని చెప్పారు. శ్రీకాళహస్తి, కాణిపాకం బ్రహ్మోత్సవాల వివరాలనూ ఉత్సవ పోర్టల్‌లో చూపాలని కోరినట్లు తెలిపారు. తిరుపతిలో ప్లానిటోరియం ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆహార ప్రయోగశాల ఏర్పాటుకు రూ.10 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. మహిళా విశ్వవిద్యాలయంలో మరో ప్రాజెక్టు కోసం రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. శ్రీకాళహస్తి–నడికుడి రైల్వే పనులకు రూ.220 కోట్లు మాత్రమే మంజూరు చేశారని, ఎక్కువ నిధుల మంజూరు కోసం ఒత్తిడి చేస్తామని ఆయన చెప్పారు.

## నౌకాదళ చరిత్రలో మరో కీలక ముందడుగు







ఐఎన్‌ఎస్ విక్రాంత్‌పై ల్యాండింగ్ అవుతున్న మిగ్-29కే యుద్ధ విమానాలు, లైట్ కాంబోట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు

- స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ ఐఎన్ఎస్ విక్రాంత్‌పై పాటవ ప్రదర్శన

సాక్షి, విశాఖపట్నం : రక్షణ రంగంలో పాటవ ప్రదర్శనలో భారత నౌకాదళం మరో కీలక అడుగు వేసింది. స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన మొట్టమొదటి యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ ప్రదర్శనకు వేదికగా మారింది. భారత సముద్రజలాల్లో ఐఎన్ఎస్ విక్రాంత్‌పై తొలిసారిగా లైట్ కాంబోట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఎల్‌సీఏ)ని నేవీ పైలట్లు సోమవారం సురక్షితంగా ల్యాండింగ్ చేశారు. స్వదేశీ ఎయిర్ క్రాఫ్ట్ క్యారియర్‌పై స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన యుద్ధ విమానాలు ల్యాండ్ అవ్వడం శుభపరిణామమని రక్షణ మంత్రిత్వ శాఖ వర్గాలు అభినందనలు తెలిపాయి.

**విక్రాంత్‌పై మిగ్–29కే రయ్..రయ్**

స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన తొలి ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ షిప్ ఐఎన్ఎస్ విక్రాంత్‌పై తొలిసారిగా మిగ్–29కే యుద్ధ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. దీనికి సంబంధించిన పరీక్షల్ని సముద్ర జలాల్లో సోమవారం సాయంత్రం విజయవంతంగా నిర్వహించినట్లు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి.

## విదేశాల్లో నియామకాలు సులభతరం

- ఏపీఎన్‌ఆర్‌టీ, ఏపీఎస్ఎస్‌డీసీ సంయుక్తంగా 'తక్‌'తో ఒప్పందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు విదేశాల్లో నియామకాలను సులభతరం చేయడానికి ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్‌ఆర్‌టీఎస్), స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) సంయుక్తంగా సోమవారం అంతర్జాతీయంగా పేరొందిన తక్ ఇంటర్నేషనల్ అనే సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. విదేశాల్లో హెల్త్ కేర్, నర్సింగ్, నిర్మాణ, మాన్యుఫాక్చరింగ్ రంగాల్లో ఉద్యోగాల కోసం అభ్యర్థులను రాష్ట్ర ప్రభుత్వం సమీకరించనుంది. తక్ సంస్థ నర్సింగ్ అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ కోసం ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తుంది. ఎంపిక చేసిన వారిని ఆ సంస్థ ద్వారా జర్మనీకి పంపిస్తారు. వారికి జర్మన్ భాషను నేర్పించేందుకు మూడు నెలలపాటు శిక్షణ, ఇతర అవసరమైన మద్దతు ఇస్తారు. శిక్షణకాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తారు. శిక్షణ పూర్తయిన తర్వాత జర్మనీలో ఉపాధి కల్పిస్తారు. ఏపీఎస్ఎస్‌డీసీ కార్యాలయంలో జరిగిన ఈ ఒప్పంద కార్యక్రమానికి తక్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు రాజ్‌సింగ్, కరణ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. రాష్ట్రం నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో ఎస్.సత్యనారాయణ, ఈడీ (ఆపరేషన్స్) వి.శ్రీనివాసులు, ఫైనాన్స్ ఆఫీసర్ క్రాంతికుమారి, ఏపీఎన్‌ఆర్‌టీఎస్ అధ్యక్షుడు వెంకట్.ఎస్.మేడపాటి, ఆపరేషన్స్ డిప్యూటీ డైరెక్టర్ కరీముల్లా షేక్ పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కాలేజీల్లో కొత్త కోర్సుల కోసం వినతి

### ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహా 10 కోర్సులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



సాక్షి, అమరావతి: ప్రైవేట్ అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీల సమస్యలు పరిష్కారమయ్యేలా ఉన్నత విద్యామండలి తోడ్పాటు అందించాలని ఆ కాలేజీల కన్సార్టియం విన్నవించింది. యూజీసీ నుంచి వచ్చిన అటానసమ్ స్టాటస్ క్రియాశీలకంగా ఉన్నంత కాలం యూనివర్సిటీలు శాశ్వత గుర్తింపు ఇచ్చేలా చూడాలని కోరింది. విజయవాడలో సోమవారం కాకినాడ, అనంతపురం జేఎన్‌టీయూల పరిధిలోని ప్రైవేట్ అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీల ప్రతినిధులతో ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.హేమచంద్రారెడ్డి సమావేశమయ్యారు. కాలేజీల కన్సార్టియం అధ్యక్షుడు చొప్పా గంగిరెడ్డి, కార్యదర్శులు జీవీఎం మోహన్‌కుమార్, మిట్టపల్లి వి.కోటేశ్వరరావు, ఎన్.సతీష్‌రెడ్డి, ఇతర ప్రతినిధులు కాలేజీలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. శాశ్వత గుర్తింపుతోపాటు యూజీసీ నిబంధనలను అనుసరించి యూనివర్సిటీలు అకడమిక్ స్వయం ప్రతిపత్తి ఇచ్చేలా చూడాలన్నారు. నూతన విద్యా విధానం ప్రకారం 2035 నాటికి జీఈఆర్‌ను 50 శాతం మేర సాధించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నందున ప్రస్తుత అటానమస్ కాలేజీలను యూజీసీ, రాష్ట్ర యూనివర్సిటీ చట్టాల నిబంధనల మేరకు ప్రైవేట్ యూనివర్సిటీలుగా మారేందుకు ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అటానమస్ ఇంజనీరింగ్ కాలేజీల్లో అభివృద్ధి చెందుతున్న అంశాలకు సంబంధించిన డిగ్రీ కోర్సులను నిర్వహించేందుకు అవకాశమివ్వాలని కోరారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బ్లాక్ చైన్, రోబోటిక్స్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ, 3డీ ప్రింటింగ్, డిజైనింగ్, వర్చువల్ రియాలిటీలతో నాన్‌టెక్నికల్ యూజీ, పీజీ కోర్సులను నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943 